# సాంఘిక శాస్త్రం

## ఏడో తరగతి

తెలంగాణ ప్రభుత్వం

మహిళాభివృద్ధి మరియు శిశుసంక్షేమ శాఖ - చైల్డ్ లైన్ ఫౌండేషన్

బడిలోగానీ, బడి బయటగానీ వేధింపులకు గురవుతున్నా

ఆపదలో, కష్టాలలో ఉన్న పిల్లలను రక్షించడానికి


CHILD LINE 1098 NIGHT & DAY

24 HOUR NATIONAL HELPLINE

పిల్లలతో పనిచేయిస్తున్నా, వారిని బడికి పంపకుండా వేరే కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నా


కుటుంబ సభ్యులు గానీ, బంధువులు గానీ ఇబ్బందికరంగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నా

1098 (పది-తొమ్మిది-ఎనిమిది) ఉచిత టెలిఫోన్ సేవా సౌకర్యానికి ఫోన్ చేయండి










రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.



సాంఘిక శాస్త్రం ఏడో తరగతి

# సాంఘిక శాస్త్రం

J6Z5N3

## ఏడో తరగతి

Free



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు



తెలంగాణ ప్రభుత్వంచే ఉచిత పంపిణీ

SCERT, TELANGANA

**ఎనర్జైజ్డ్ టెక్స్ట్ బుక్ –** ఈ పాఠ్యపుస్తకంలోని భావనలను స్పష్టంగా, నిర్దిష్టంగా, ప్రభావవంతంగా అర్థం చేసుకోవడానికి **QR (Quick Response)** కోడ్‌లతో బలోపేతం చేయడం జరిగింది. **QR** కోడ్‌లో చేర్చబడిన అంశాలను స్మార్ట్ ఫోన్‌లో చూడవచ్చు లేదా **LCD** ప్రొజెక్టర్ / కె-యాన్ ప్రొజెక్టర్ ద్వారా తెరపై ప్రదర్శించవచ్చు. **QR** కోడ్‌లలో ఉన్న సమాచారం చాలా వరకు వీడియోలు, యానిమేషన్స్ మరియు స్లైడ్‌ల రూపంలో ఉంటుంది. అంతేకాకుండా ఈ సమాచారం, పుస్తకంలో ఉన్న సమాచారానికి అదనమైనది.

ఈ అదనపు సమాచారం ద్వారా విద్యార్థులు భావనలను స్పష్టంగా అర్థం చేసుకోవడానికి మరియు ఉపాధ్యాయులు తాము నిర్వహించే బోధనా కృత్యాలు అర్థవంతంగా జరగడానికి తోడ్పడతాయి.

ప్రతి అధ్యాయం చివరన ఒక అదనపు **QR** కోడ్‌లో ప్రశ్నలు ఇవ్వబడినాయి. ఇవి, విద్యార్థుల అభ్యసన ఫలితాలను ఏమేరకు సాధించారో మదింపుచేయడానికి తోడ్పడతాయి.

విద్యార్థులు, ఉపాధ్యాయులు **QR** కోడ్‌లలో ఇవ్వబడిన సమాచారాన్ని విరివిగా ఉపయోగించి తరగతిగదిలోని ప్రక్రియలను మరింత ఆనందదాయకంగా, విద్యావంతమైనవిగాను మలచుకుంటారని ఆశిస్తున్నాము.

**క్యూఆర్ (QR) కోడ్‌లను ఎలా వాడాలో తెలుసుకుందాం!**

ప్రస్తుత పాఠ్య పుస్తకంలో ఈ విధంగా ఉండే క్యూఆర్ కోడ్‌లను పొందుపరచబడినవి.

ఈ క్యూఆర్ కోడ్‌లను ఉపయోగించి ఆసక్తికరమైన పాఠాలను, వీడియోలను, డాక్యుమెంట్స్ మొదలగు వాటిని మీవద్దగల మొబైల్, ట్యాబ్లెట్ లేదా కంప్యూటర్ ద్వారా వీక్షించండి.

| దశ | వివరణ |
|---|---|
| **ఎ)** | **క్యూఆర్ కోడ్‌లో లింక్ చేయబడిన విషయాలను ఆండ్రాయిడ్ మొబైల్ లేదా ట్యాబ్లెట్‌లో వీక్షించుటకు :** |
| 1 | మీ యొక్క మొబైల్ / ట్యాబ్లెట్‌లోని **Play Store** పైన క్లిక్ చేయండి. |
| 2 | సెర్చ్‌బార్‌లో **DIKSHA** ను టైప్ చేయండి. |
| 3 |   తెరపైన ఇలా కనిపిస్తుంది. |
| 4 | **INSTALL** పైన క్లిక్ చేయండి. |
| 5 | విజయవంతంగా INSTALL చేసిన తరవాత యాప్‌ను తెరవడానికి **OPEN** పైన క్లిక్ చేయండి. |
| 6 | 'తెలుగు'ను ఎంపికచేసుకొని క్లిక్ చేయండి. |
| 7 | 'కొనసాగించడానికి' క్లిక్ చేయండి. |
| 8 | విద్యార్థి / ఉపాధ్యాయులు రెండింటిలో మీకు చెందిన దానిని ఎంపిక చేసుకోండి. |
| 9 | కుడివైపున ఉన్న క్యూఆర్ కోడ్ చిహ్నం స్కానర్‌ను క్లిక్ చేయండి. తరువాత మీ పాఠ్యపుస్తకములో ముద్రించబడిన క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయండి. (లేదా) సెర్చ్ బార్ నందు ( 🔍 ) క్యూఆర్ కోడ్ క్రింద ముద్రించబడిన కోడ్‌ను టైపు చేయండి. |
| 10 | క్యూఆర్ కోడ్‌లో జతచేయబడిన విషయాలు కనిపిస్తాయి. |
| 11 | కావలసిన విషయాలను వీక్షించుటకు లింక్‌పై క్లిక్ చేయండి. |
| **బి)** | **క్యూఆర్ కోడ్‌లో లింక్ చేయబడిన విషయాలను కంప్యూటర్ నుండి వీక్షించుటకు -** |
| 1 | **https://diksha.gov.in/telangana** అను లింక్‌ను ఓపెన్ చేయండి. |
| 2 | **Explore DIKSHA-TELANGANA** పైన క్లిక్ చేయండి. |
| 3 | పాఠ్యపుస్తకము నందు ముద్రించబడిన క్యూఆర్ కోడ్ క్రింద ఉన్న కోడ్‌ను టైపు చేయండి. |
| 4 | ఈ కోడ్‌కు జతచేయబడిన విషయాలు కనిపిస్తాయి. |
| 5 | కావలసిన విషయాలను వీక్షించుటకు లింక్‌పై క్లిక్ చేయండి. |

## బాలల హక్కుల బిల్లు

18 సంవత్సరాలు నిండని వారంతా బాలలే. బాలల పోషణ మరియు సమగ్రాభివృద్ధి తల్లిదండ్రుల కనీస బాధ్యత. రాజ్యం బాలల హక్కులను గౌరవించి పరిరక్షిస్తుంది.

- స్వేచ్ఛతో కూడిన భావవ్యక్తీకరణ నా హక్కు. ఆ భావాలను పరిగణనలోనికి తీసుకోవటానికై వినడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధనలు: 12,13)
- ఆరోగ్య పరిరక్షణ నా హక్కు. కనీస ఆరోగ్యం, త్రాగునీరు అందరికీ లభించడానికి సహకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 24)
- నాణ్యమైన విద్య పొందడం నా హక్కు. బాలలందరు బడికి వెళ్లేట్లు ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధనలు: 28,29,23)
- హాని మరియు దూషణలనుండి రక్షణ పొందుతూ ప్రేమించబడటం నా హక్కు. బాలలను ప్రేమించడం, రక్షించడం, ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 19)
- నా అర్హతలను పెంపొందించుకోవటం నా హక్కు. ఏ అర్హత ఉన్న వారినైనా గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 23)
- నా వారసత్వం, విశ్వాసాలపట్ల గర్వంగా ఉండడం నా హక్కు. ఇతరుల సంస్కృతిని విశ్వాసాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధనలు: 29,30)
- సురక్షిత, సౌకర్యవంతమైన గృహం నా హక్కు. బాలలందరూ అలాంటి గృహాలు కల్గి ఉండేట్లు చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 27)
- పొరపాట్లు చేయడం నా హక్కు. పొరపాట్ల ద్వారా అభ్యసనం జరుగుతుందనే విషయాన్ని అంగీకరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 28)
- పోషకాహారాన్ని పొందడం నా హక్కు. ఎవరూ ఆకలితో అలమటించకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 24)
- పరిశుభ్రమైన పరిసరాలు నా హక్కు. వాటిని కాలుష్యం కాకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధన: 29)
- హింస (మౌఖిక, శారీరక, భావోద్వేగ) లేకుండా జీవించడం నా హక్కు. ఇతరుల పట్ల హింసాత్మకంగా ఉండకపోవడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధనలు: 28,37)
- ఆర్థిక దోపిడి నుండి రక్షించబడటం నా హక్కు. బాలలు పనికి వెళ్లకుండా చూసి స్వేచ్ఛ మరియు భద్రతతో కూడిన రక్షిత పరిసరాలను కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత. (నిబంధనలు: 32,34)

పై బాలల హక్కులు, బాధ్యతలు ఐక్యరాజ్య సమితిచే 1989లో ప్రతిపాదించబడినవి. ఇవి ప్రపంచంలోని బాలల మరియు యువకుల హక్కులు. భారత ప్రభుత్వం ఈ పత్రాన్ని 1992లో ఆమోదించింది.

SCERT, TELANGANA

# సాంఘిక శాస్త్రం
## ఏడో తరగతి

### సంపాదకులు


**శ్రీ సి.ఎన్. సుబ్రహ్మణ్యం,**
ఏకలవ్య, మధ్యప్రదేశ్.

**ప్రొ॥ ఐ. లక్ష్మి,** చరిత్ర విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**ప్రొ॥ యం. కోదండరాం,** రాజనీతి శాస్త్ర విభాగం,
పి.జి.కళాశాల, సికింద్రాబాద్, హైదరాబాద్.

**ప్రొ॥ కె. విజయబాబు,** చరిత్ర విభాగం,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.

**డా॥ ఎం.వి. శ్రీనివాసన్,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
డి.ఇ.యస్.యస్.హెచ్. ఎన్‌సిఇఆర్‌టి, న్యూఢిల్లీ.

**డా॥ ఎం.వి.ఎస్.వి. ప్రసాద్,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
డి.ఇ.యస్.యస్.హెచ్. ఎన్‌సిఇఆర్‌టి న్యూఢిల్లీ.

**డా॥ సి. దయాకర్ రెడ్డి,** అసోసియేట్ ప్రొఫెసర్,
యూనివర్సిటీ కాలేజ్ ఫర్ ఉమెన్, కోఠి, హైదరాబాద్.

**శ్రీ కె. సురేష్,**
మంచిపుస్తకం, హైదరాబాద్.

**ప్రొ॥ జి. ఓంకార్‌నాథ్,** అర్థశాస్త్ర విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్.

**ప్రొ॥ ఎస్. పద్మజ,** భూగోళశాస్త్రం విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**ప్రొ॥ ఎ. సత్యనారాయణ** (రిటైర్డ్), చరిత్ర విభాగం,
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్.

**డా॥ కె.కె. కైలాష్,** రాజనీతిశాస్త్ర విభాగం,
హెచ్.సి.యు., హైదరాబాద్.

**శ్రీ అరవింద్ సర్దాన,**
డైరెక్టర్, ఏకలవ్య, మధ్యప్రదేశ్.

**డా॥ కె. నారాయణరెడ్డి,** అసిస్టెంట్ ప్రొఫెసర్,
భూగోళశాస్త్రం విభాగం, ఉస్మానియా యూనివర్సిటీ,
హైదరాబాద్.

**శ్రీ రామ్మూర్తి శర్మ,** విద్యా విభాగము, పంజాబ్.

**శ్రీ అలెక్స్ ఎం. జార్జ్,**
ఏకలవ్య, మధ్యప్రదేశ్.


### పాఠ్యపుస్తక అభివృద్ధి, ప్రచురణ సమితి


**శ్రీమతి బి. శేషుకుమారి** సంచాలకులు,
యస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ బి. సుధాకర్** సంచాలకులు,
ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయం, హైదరాబాద్.

**డా॥ఎన్. ఉపేందర్ రెడ్డి,** ప్రొఫెసర్, విద్యాప్రణాళిక-పాఠ్యపుస్తక విభాగం,
యస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైదరాబాద్.


క్యూఆర్ కోడ్ బృందము

F3H2C3


**తెలంగాణ ప్రభుత్వ ప్రచురణ, హైదరాబాదు**


విద్యవల్ల ఎదగాలి
వినయంతో మెలగాలి

చట్టాలను గౌరవించండి
హక్కులను పొందండి

SCERT, TELANGANA



తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2021-22

© Government of Telangana, Hyderabad.

*First Published 2012*
*New Impressions 2013, 2014, 2015, 2016, 2017, 2018, 2019, 2020, 2021*

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copyright - holder of this book is the Director of School Education, Hyderabad, Telangana. We have used some photographs which are under creative common licence. They are acknowledge at the end of the book.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

**తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2021-22**

*Printed in India*
at the Telangana Govt. Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

— o —



SCERT, TELANGANA

# సాంఘిక శాస్త్రం
# ఏడో తరగతి

## రచయితలు

**శ్రీ కె.లక్ష్మీనారాయణ,** లెక్చరర్, డైట్, అంగలూరు, కృష్ణా జిల్లా
**శ్రీ మడితాటి నరసింహారెడ్డి,** జి.హెచ్.ఎం., జి.ప.ఉ. పాఠశాల, పెద్దజంగంపల్లి, వైఎస్ఆర్ కడప
**శ్రీ కె. సుబ్రహ్మణ్యం,** లెక్చరర్, డైట్, కర్నూలు
**శ్రీ మల్యాల పాపయ్య,** లెక్చరర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., తెలంగాణ, హైదరాబాద్
**డా॥ బి.వి.ఎన్.స్వామి,** స్కూల్ అసిస్టెంట్, జి.హెచ్.ఎస్., హుజూరాబాద్, కరీంనగర్
**శ్రీ పి.శ్రీనివాసులు,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, బండపోసానిపల్లి, వెల్దుర్తి, మెదక్
**శ్రీ అయాచితుల లక్ష్మణరావు,** స్కూల్ అసిస్టెంట్, జి.హెచ్.ఎస్., ధన్‌గర్‌వాడి, కరీంనగర్
**శ్రీమతి ఎస్.సువర్ణదేవి,** ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నర్సాపూర్, మెదక్
**డా॥ రాచర్ల గణపతి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, లాదెల్ల, వరంగల్లు
**శ్రీ కొరివి శ్రీనివాసరావు,** ఎమ్.పి.యు.పి.ఎస్., పి.ఆర్.పల్లి, టెక్కలి, శ్రీకాకుళం
**శ్రీ సి.హెచ్. రాధాకృష్ణ,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, వెంకటాపురం, శ్రీకాకుళం
**శ్రీ టి.రామకృష్ణ,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, దేవ పెనుగొండ, పశ్చిమగోదావరి
**శ్రీ కె. కుమారస్వామి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, దొడేపల్లి, ఆదిలాబాద్
**శ్రీమతి బి.సరళ,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.బాలికల.ఉ. పాఠశాల, ఇందుకూరుపేట, నెల్లూరు
**శ్రీ పి.వి.కృష్ణారావు,** ఎల్.ఎఫ్.ఎల్. హెచ్.ఎమ్., ప్రా.పా., మోహల్లా నెం.16, ఇల్లందు, ఖమ్మం
**శ్రీ ఎ.ఆర్.రమేశ్‌రావు,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, రొద్దం, అనంతపురం
**శ్రీ గద్దమీది రథాంగపాణి రెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ.పాఠశాల, జానంపేట, మూసాపేట, మహబూబ్‌నగర్.
**శ్రీ వంగూరి గంగిరెడ్డి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ.పాఠశాల, కొందుర్గు, మహబూబ్‌నగర్.
**డా॥ చకినాల శ్రీనివాస్,** జి.హెచ్.ఎం., ప్ర.ఉ.పాఠశాల, దుర్గమ్మగడ్డ, కరీంనగర్.
**శ్రీ యు. ఆనంద్‌కుమార్,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, పాతపాల్వంచ, ఖమ్మం
**శ్రీ ఎన్.సి.జగన్నాథ్,** ప్ర.ఉ.పాఠశాల, కుల్సుంపుర, హైదరాబాద్.

## సమన్వయం

**ప్రొ॥ జె.రాఘవులు,** ఎస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైద్రాబాద్
**శ్రీ మల్యాల పాపయ్య,** లెక్చరర్, ఎస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైద్రాబాద్
**శ్రీ సువర్ణ వినాయక్,** ఎస్‌సిఇఆర్‌టి, సి&టి విభాగం, తెలంగాణ, హైద్రాబాద్
**డా॥ రాచర్ల గణపతి,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, లాదెల్ల, వరంగల్లు
**శ్రీ అయాచితుల లక్ష్మణరావు,** స్కూల్ అసిస్టెంట్, జి.హెచ్.ఎస్., ధన్‌గర్‌వాడి, కరీంనగర్
**శ్రీ పి.శ్రీనివాసులు,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, బండపోసానిపల్లి, మెదక్

## చిత్రకారులు

**శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్,** స్కూల్ అసిస్టెంట్, జి.ప.ఉ. పాఠశాల, పోచంపల్లి, నల్లగొండ
**శ్రీ బి. కిశోర్‌కుమార్,** మ.ప.ప్రాథమికోన్నత పాఠశాల, ఆల్వాల, అనుముల, నల్లగొండ
**శ్రీ పి. ఆంజనేయులు,** జియోమ్యాపర్, సెస్-డిసియస్, హైదరాబాద్

## డిజైనింగ్

**శ్రీ దార కన్నయ్య,** కంప్యూటర్ ఆపరేటర్, ఎస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైదరాబాదు.
**శ్రీ తాటోజు కిషన్,** కంప్యూటర్ ఆపరేటర్, ఎస్‌సిఇఆర్‌టి, తెలంగాణ, హైదరాబాదు.
**శ్రీమతి పావని,** గ్రాఫిక్ డిజైనర్, హైదరాబాదు.

SCERT, TELANGANA


తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2021-22

## విద్యార్థులకు ఉత్తరం

*రోజంతా పొలంలో, ఇంట్లో పని చేసి అలసిపోయిన అమ్మ చెంతనే కూర్చొన్న నాకు ఆడవారి జీవితంలో ఇంత కష్టమెందుకు అనే ఆలోచన కదలాడింది. నేను ఇంటి నుండి బయలు దేరిన వేళ వివిధ రకాల బాషలు మాట్లాడేవారు, ఆచారాలను పాటించేవారు తారసపడుతుంటే ఎవరు వీరు? ఎందుకు ఇన్ని రకాల ప్రజలు, అనే భావన నన్ను అలుముకుంటుంది.*

*కష్టపడి సేద్యం చేసే రైతులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారన్న వార్తలను వార్తా పత్రికలో చూసి కలవర పడుతుంటాను. పట్టణంలోని వీధులలో నేను వస్తున్నప్పుడు విశాలమైన రోడ్లను, సమున్నతమైన కట్టడాలను, గుడి, చర్చి, మసీదులను చూసినప్పుడు ఎవరు కట్టించారబ్బా! ఎంత వెచ్చించారబ్బా! అని ఆశ్చర్యానికి లోనౌతుంటాను. అందమైన హర్మ్యాలతో కూడిన ఈ పట్టణాలలో నివసించడానికి స్థలం లేక వేలకొద్ది మనుషులు దుర్భర పరిస్థితులలో నివసిస్తున్న తీరు నన్ను విస్మయ పరుస్తుంటుంది.*

*మంచి వాళ్లకు ఓటేసి ఎన్నుకోవాలని పెద్దవాళ్లు మాట్లాడుతుంటే విని, మనలను ఎవరు పరిపాలిస్తున్నారు? ఎలా పరిపాలిస్తున్నారనే ఆసక్తి కలిగింది.*

*గతంలో రాజులు, రాజ్యాలను పరిపాలించే వారిని, దేవుళ్లు, యోగులు మన మధ్య తిరిగారని అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతయ్యలు చెప్పగా విని నిజంగా అలా జరగడానికి అవకాశం ఉందా అనే భావన నాలో కలుగుతుంది. ఈ విధంగా నాలో రోజూ ఎన్నో ప్రశ్నలు, సందేహాలు ఉదయిస్తుంటాయి.*

*ఈ ప్రశ్నలకు, సమాధానం ఎక్కడదొరుకుతుందని ఆలోచిస్తుంటాను. బహుశ ఏ ఒక్కరో నా ప్రశ్నలన్నింటికి సమాధానం ఇవ్వలేరేమో, లేక నా ప్రశ్నల్లో కొన్నింటికి జవాబులు కొందరు చెప్పలేరని అనిపిస్తుంది. వీటికి సమాధానాలన్ని నేనే అన్వేషించుకోవాలి? అది ఎలా? నాకు సహాయపడేదెవరు?*

**ప్రియమైన స్నేహితులారా!**

మీ మస్తిష్కంలో కదలాడుతున్న ముఖ్యమైన పై ప్రశ్నలకు ప్రతి ఒక్కరు సమాధానాలన్నీ కనుగొనవలసిన అవసరం ఉంది. ఇవి సులభమైన ప్రశ్నలు కావు. ఈ ప్రశ్నలలో దేనికి కూడా నిర్దిష్టమైన సమాధానం లేదు. నిజానికి వివిధ వ్యక్తులు ఈ ప్రశ్నలకు వివిధ పరిష్కారాలను సూచిస్తారు. ఈ సమస్యలను క్షుణ్ణంగా, జాగ్రత్తగా చదివిన తరువాత మీరు కూడా స్వయంగా కొన్ని పరిష్కారాలను సూచించ గలుగుతారు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి కొన్ని ప్రశ్నలను వాటి పరిష్కారానికి కొన్ని పద్ధతులను మన ముందుంచాయి. పాఠశాలల్లో కంటే కళాశాలల్లో తక్కువ మంది ఆడపిల్లలు ఎందుకు చదువుతున్నారని ప్రశ్నిస్తే వివిధ రకాల ప్రజల నుండి వివిధ రకాల జవాబులు లభిస్తాయి. అలాగే ధనికులు నివసిస్తున్న కాలనీలు శుభ్రంగా ఊడ్చే విధంగా మురికి వాడలు ఎందుకు శుభ్రంగా ఊడ్చరని తర్కిస్తే ఎన్నో జవాబులు మీ ముందు ఉంటాయి. పై ప్రశ్నలన్నింటికి ప్రజలు వివిధ సమాధానాలు ఎందుకు ఇచ్చారు? ఈ సమస్యలను అర్థం చేసుకోవడానికి సాంఘిక శాస్త్రం ప్రయత్నిస్తుంది. ఒక సమస్యకు వచ్చే వివిధ జవాబులను క్రోడీకరించడమే సాంఘిక శాస్త్రపు పని కాదు. సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడానికి సమర్థవంతమైన పద్ధతిని రూపొందించి అధ్యయనం చేస్తుంది. సమస్య ఏ విధంగా మొదలైంది, ఎలా అభివృద్ధి చెందింది, ఎందుకు, ఎలాంటి మార్పులకు లోనైంది, ప్రపంచ వ్యాప్తంగా సమస్య స్వభావం ఒకే విధంగా ఉందా? మారుతూ ఉందా? వంటి విభిన్న కోణాలలో సమస్యను చూసే ప్రయత్నం చేస్తుంది. మన తొలి ప్రశ్ననే తీసుకుంటే కళాశాలల్లో గతంలో కూడా తక్కువ మంది ఆడపిల్లలే చదువుకునే వారా? ప్రపంచ వ్యాప్తంగా ఇదే బాణీ ఉండేదా? ఎందుకు? ఆడపిల్లలు కళాశాలకు వెళ్లకుండా నిరోధించిన అంశాలు ఏమిటి? కళాశాలల్లో ఎందుకు వీళ్ళు లేకుండా పోతున్నారు? కళాశాలలకు ఆడపిల్లలను పంపని, పంపించే తల్లిదండ్రులు ఏమంటున్నారు? ఆ పిల్లల సమాధానం ఏమిటి? అధ్యాపకులు ఏమంటున్నారు? సాంఘిక శాస్త్రవేత్తలు సమస్యకు సమాధానం చెప్పే ముందు వీటన్నింటిని సమగ్రంగా పరిశీలిస్తారు. అలాగని ఏ సాంఘిక శాస్త్రవేత్త ఇదే ఖచ్చితమైన పరిష్కారమని గాని, ఇదే తుది జవాబు అని గాని తెలియజేయలేదు. ఏ సమాధానాన్ని లేక పరిష్కారాన్ని ఆమోద యోగ్యమయినదిగా భావిస్తారో మీరే నిర్ణయించుకోవాలి.

– సంపాదకులు

SCERT, TELANGANA

**ఈ పుస్తకం గురించి......**

మీ చుట్టూ ఉన్న సమాజాన్ని అధ్యయనం చేసే ప్రక్రియలో భాగంగా, సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళికలో భాగంగా ఈ పుస్తకం రూపొందింది. ఇది ఆ విద్యా ప్రణాళికలో ఒక చిన్న భాగం మాత్రమే. సాంఘిక శాస్త్ర విద్యా ప్రణాళిక మీకు తెలిసిన అంశాలను తరగతి గదిలో నలుగురితో పంచుకోవడానికి, విశ్లేషించుకోవడానికి దోహదపడుతుంది. సమాజంలోని వివిధ అంశాలను అలా ఎందుకు ఉన్నాయని ప్రశ్నించడానికి, సమస్యలు ఇలా ఎందుకున్నాయి అని ఆలోచించడానికి సాంఘికశాస్త్రం ఉపయోగపడుతుంది. మీరు మీ స్నేహితులు తరగతి గది నుండి బాహ్య ప్రపంచంలోని బజారు, పంచాయితీ, మున్సిపాలిటీ, పల్లె సీమలోని పొలాలు, దేవాలయాలు, మసీదులు, వస్తు ప్రదర్శనశాలలు (మ్యూజియం), ఇంకా ఎన్నో అంశాలను తెలుసుకోవటానికి పురి కొల్పుతుంది. రైతులు, దుకాణదారులు, ఉద్యోగులు, దైవ కార్య నిర్వాహకులు మొదలైన వారందరితో కలిసి చర్చించే అవకాశాన్ని ఈ పుస్తకం కల్పిస్తుంది.

ఈ పుస్తకం మీముందు ఎన్నో సమస్యలను ఉంచి వాటిని అధ్యయనం చేసి అర్థం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. ఈ పుస్తకంలో అన్ని ప్రశ్నలకు జవాబులు ఉండవు. మీరు ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనాలి. నిజానికి ఇది సంపూర్ణమైన గ్రంథం కాదు. మీ స్నేహితుల, ఉపాధ్యాయుల అనుభవాలు, సందేహాలను విడమర్చి చర్చించి జోడించినప్పుడు పరిపూర్ణత్వం కలుగుతుంది. పుస్తకంలోని చాలా అంశాలతో మీరు విభేదించవచ్చు, సంకోచం లేకుండా కారణాలను తెలపవచ్చు, చివరగా స్వయంగా పరిష్కారాన్ని పొందవచ్చు. అలా పొందిన సమాధానాన్ని తరచి చూడాలనిపిస్తే ప్రశ్నలన్నింటిని జాగ్రత్తగా ఒక పట్టికగా తయారు చేసి స్నేహితుల, ఉపాధ్యాయుల, పెద్దవాళ్ళ సహాయాన్ని అర్థించి స్థిరమైన నిర్ణయాన్ని తీసుకొనండి.

సామాజిక జీవనంలో విభిన్న పార్శ్వాలను అధ్యయనం చేయడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది. భూస్వరూపాలు, ప్రజల భిన్నత్వం, ప్రజల జీవనాధారాలు, ప్రజల సామూహిక అవసరాలను, వాటి నిర్వహణను, అసమానత్వంతో కూడిన సమాజంలో సమానత్వ సాధన ఎలాగో, వివిధ దేవుళ్లను, వివిధ మార్గాలలో పూజించే విధానం చివరగా ఒకరితో ఒకరి సంబంధ బాంధవ్యాలను, ఫలితంగా పంచుకునే సంస్కృతిని ఆకళింపు చేసుకోవటానికి, సమాచారం పంచుకోవడానికి ఈ పుస్తకం కల్పిస్తుంది. పిల్లలు భద్రత, రక్షణ పొందుటకు సహకరిస్తుంది.

పై అంశాలలో కొన్నింటిని అవగాహన చేసుకోవడానికి గాను మనం భూమి, కొండలు, పీఠభూములు, మైదానాలు, నదులు, సముద్రాలు మొదలైన వాటి గురించి అధ్యయనం చేయవలసి ఉంటుంది. కొన్ని వేల సంవత్సరాల క్రితం ఏమి జరిగిందో, తరచి చూస్తే గాని మరికొన్ని విషయాలను అవగాహన చేసుకోలేం. మొత్తం మీద విభిన్న రకాల ప్రజల వద్దకు వెళ్లి వారితో సంభాషిస్తే కాని సామాజిక జీవనం అర్థం కాదు.

ఈ పుస్తకంలోని పాఠాలను త్వరితంగా పూర్తి చేయడం కంటే ఇచ్చిన ప్రశ్నలు, కృత్యాలను సమర్థవంతంగా నిర్వహించడం అవసరం. ఈ పాఠ్య పుస్తకాన్ని చదువుతున్నప్పుడు మీకు ఎన్నో ప్రశ్నలు, కృత్యాలు ఎదురవుతుంటాయి. ఈ ప్రశ్నలకు సమాధానాలకోసం ప్రయత్నించాలి. ఇచ్చిన కృత్యాలను, ప్రాజెక్టులను చేసిన తరువాతనే తదుపరి పాఠ్యాంశంలోకి వెళ్ళాలి.

చాలా పాఠాలలో ప్రాజెక్టు పనులు ఉన్నాయి. వాటిని నిర్వహించడానికి కొన్ని రోజులు పడుతుంది. ఇవి సాంఘిక శాస్త్రంలో విషయ సేకరణకు, విశ్లేషణకు, ప్రదర్శనకు కావలసిన నైపుణ్యాలను పెంపొందిస్తాయి. పాఠంలో ఉన్న దానిని బట్టీపట్టడం కాకుండా వాటిని గురించి ఆలోచించి స్వీయ అభిప్రాయాన్ని ఏర్పరుచుకోవాలి.

- సమాచార నైపుణ్యాలలో పట్టికలు, గ్రాఫ్‌లు, పటనైపుణ్యాలలో పటం చదవడం, పటం గుర్తించడం వంటివి కూడా పాఠ్యాంశాలకు అనుగుణంగా పుస్తకంలో లేనివి కూడా అభ్యాసం/మూల్యాంకనంలో ఇవ్వవచ్చు.
- చర్చించడం, ముఖాముఖి నిర్వహించడం, డిబేట్స్, ప్రాజెక్టులు వంటివి పాఠాల మధ్యలో, మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి తర్వాత ఇవ్వబడినవి. ఇవి పిల్లల్లో సామాజిక స్పృహను, సున్నితత్వాన్ని పెంపొందించి సమస్యల పట్ల సానుకూల వైఖరిని అలవర్చుటకు ఉద్దేశించబడినవి. కావున తప్పక నిర్వహించాలి.

– **సంచాలకులు,**
రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ, తెలంగాణ, హైదరాబాద్



**కృతజ్ఞతలు**

**ఈ పాఠ్య పుస్తకరచన ఉత్తమంగా తీర్చి దిద్దడానికి సహకరించిన డా॥ కె.ఎన్.ఆనందన్, భాషావేత్త, కేరళ, డా॥పి.దక్షిణామూర్తి, విశ్రాంత ఉపసంచాలకులు తెలుగుఅకాడమి, దీపా శ్రీనివాసన్, క్రితిక్ విశ్వనాథ్, కె.భాగ్యలక్ష్మి, ఆర్.వి.వ్యాస్, రామమూర్తి శర్మ, రాయ్‌సినోయ్ గార్లకు కృతజ్ఞతలు. లేఅవుట్ అందించిన వారికి, తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం, డా॥ ఉపిందర్ సింగ్, ఢిల్లీ విశ్వవిద్యాలయం వారికి ప్రత్యేక ధన్యవాదాలు. ఈ పుస్తకములోని కొన్ని చిత్రాలను ఫ్లిక్కర్, వికిపీడియా మరియు ఇతర అంతర్జాల వనరుల నుండి గ్రైకొనడమైనది, వారందరికి ప్రత్యేక ధన్యవాదాలు.**

**అనేక మంది పాఠశాల ఉపాధ్యాయులు, విద్యావేత్తలు మరియు ఇతరులు తమ సలహాలు, సూచనల ద్వారా పాఠ్యపుస్తకాలను నవీకరించుటలో దోహదపడినందులకు వారికి కృతజ్ఞతలు తెలుపుచున్నాము. పాఠ్యపుస్తకాలను పూర్తి స్థాయిలో సమీక్షించి మెరుగుపరుచుటలో సహకరించిన *Indian History Awareness & Research (IHAR)* హోస్టన్, టెక్సాస్, అమెరికా సంయుక్త రాష్ట్రాల వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుచున్నాము.**


SCERT, TELANGANA


తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2021-22




Subs. by the constitution [Forty-second Amendment] Act, 1976, Sec.2, for "Sovereign Democratic Republic" (w.e.f. 3.1.1977)

Subs. by the constitution [Forty-second Amendment] Act, 1976, Sec.2, for "Unity of the Nation" (w.e.f. 3.1.1977)

# విషయ సూచిక



| క్ర. సం. | విషయం | పేజీ.నం. | నెల |
|---|---|---|---|
| | **I భూమి – వైవిధ్యం** | | |
| 1. | వివిధ రకాల పటాలను అర్థంచేసుకోవడం | 1 – 6 | జూన్ |
| 2. | వర్షం – నదులు | 7 – 21 | జూన్ |
| 3. | చెరువులు, భూగర్భజలాలు | 22 – 32 | జూలై |
| 4. | మహాసముద్రాలు – చేపలు పట్టడం | 33 – 41 | జూలై |
| 5. | యూరప్ | 42 – 57 | జూలై |
| 6. | ఆఫ్రికా | 58 – 68 | ఆగస్ట్ |
| | **II ఉత్పత్తి, వినిమయం – జీవనాధారాలు** | | |
| 7. | చేతివృత్తులు – చేనేత వస్త్రాలు | 69 – 77 | ఆగస్ట్ |
| 8. | పారిశ్రామిక విప్లవం | 78 – 85 | ఆగస్ట్ |
| 9. | ఫ్యాక్టరీలో ఉత్పత్తి – కాగితపు పరిశ్రమ | 86 – 94 | సెప్టెంబర్ |
| 10. | రవాణావ్యవస్థ–ప్రాధాన్యత | 95 – 100 | సెప్టెంబర్ |
| | **III రాజకీయ వ్యవస్థలు – పరిపాలన** | | |
| 11. | కొత్త రాజ్యాలు – రాజులు | 101 – 109 | సెప్టెంబర్ |
| 12. | ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావం – కాకతీయులు | 110 – 116 | అక్టోబర్ |
| 13. | విజయనగర రాజులు | 117 – 125 | నవంబర్ |
| 14. | మొగల్ సామ్రాజ్యం | 126 – 134 | నవంబర్ |
| 15. | భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్యస్థాపన | 135 – 146 | నవంబర్ |
| 16. | రాష్ట్ర శాసనసభ – చట్టాల తయారీ | 147 – 157 | డిసెంబర్ |
| 17. | జిల్లాలో చట్టాల అమలు | 158 – 164 | డిసెంబర్ |
| | **IV సామాజిక వ్యవస్థీకరణ – అసమానతలు** | | |
| 18. | కుల వివక్ష – సమానత్వానికై పోరాటం | 165 – 171 | జనవరి |
| 19. | జీవనాధారం – పట్టణ కార్మికుల పోరాటాలు | 172 – 180 | జనవరి |
| | **V మతం – సమాజం** | | |
| 20. | జానపదులు – మతం | 181 – 187 | ఫిబ్రవరి |
| 21. | దైవ సంబంధ భక్తి మార్గాలు | 188 – 196 | ఫిబ్రవరి |
| | **VI సంస్కృతి – సమాచారం** | | |
| 22. | రాజులు – కట్టడాలు | 197 – 207 | ఫిబ్రవరి |
| | **పునశ్చరణ – వార్షిక పరీక్షలు** | | మార్చి |



SCERT TELANGANA



తెలంగాణ ప్రభుత్వం వారిచే ఉచిత పంపిణీ 2021-22

# జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధ్, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగ!
వింధ్య, హిమాచల, యమునా, గంగ!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

# ప్రతిజ్ఞ

– పైడిమర్రి వెంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకొంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను. వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

SCERT, TELANGANA

పాఠం 1

# వివిధ రకాల పటాలను అర్థంచేసుకోవడం

I2M9I2

మనం నివసించే ప్రపంచంలో అనేక భౌతిక అంశాలున్నాయి. పర్వతాలు, కొండలు, సముద్ర తీరాలు, ఎడారులు, అడవులు, మంచుతో కప్పి ఉన్న ప్రాంతాలు – ఇలా అనేక భేదాలు ఎందుకున్నాయి? ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవితాలను ఈ భేదాలు ఎలా ప్రభావితం చేస్తాయి? వివిధ రకాల పటాల సహాయంతో ఈ ప్రశ్నలను చదివి మనం అవగాహన చేసుకోగలం. కొన్ని పటాలు, ఆయా ప్రదేశాలు ఎంత ఎత్తో, ఎంత లోతో తెలుసుకోడానికి, కొన్ని ప్రాంతాల్లో వర్షం, వేడి, చలి ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి సహాయపడతాయి. ఆయా ప్రాంతాల్లో పండే పంటలను, పెరిగే వివిధ రకాల అడవులను ఇంకొన్ని రకాల పటాలు తెలుపుతాయి. ఇలా పటాలను అధ్యయనంచేయడం ద్వారా ప్రపంచం గురించి మనం చాలా విషయాలను తెలుసుకోవచ్చు.



*చిత్రం-1.1 కర్ణాటక పశ్చిమ కనుమల్లోని సతత హరితారణ్యాలు*



*చిత్రం-1.2 దక్షిణ అమెరికా-బ్రెజిల్ దేశంలోని కొకనా బీచ్*



*చిత్రం-1.3 ఆఫ్రికా ఖండం-లిబియా దేశంలోని సహారా ఎడారిలోని ఒయాసిస్*



*చిత్రం-1.4 అంటార్కిటికా – మంచుతో కప్పి ఉన్న ఖండం*

SCERT TELANGANA

పాఠశాల అట్లాసులను చూసి వాటిలో ఎన్ని రకాల పటాలున్నాయో పరిశీలించండి. మీరు చదివి అవగాహన చేసుకుని పటాల జాబితా తయారు చేయండి. గత సంవత్సరం కొన్ని సాధారణ పటాల గురించి నేర్చుకున్నాం. ఈ సంవత్సరం ఎత్తులను తెలిపే పటాల గురించి తెలుసుకుందాం. ముందుగా గత సంవత్సరం నేర్చుకున్న పటాలను పునశ్చరణ చేసుకుందాం.

- మీ తరగతి గదిలోని గోడకు భారతదేశ పటాన్ని తగిలించండి. ఆ పటాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఈ ప్రశ్నలకు జవాబులు చెప్పండి.
    1) మెహర్ హైదరాబాదునుండి భోపాల్ వెళ్ళాడు. అతను ఏ దిక్కుకు ప్రయాణం చేసాడు?
    2) అశోక్ లక్నోనుండి చెన్నై వెళ్లాడు. ఆయన ఏ దిక్కుకు వెళ్లాడు?
    3) రెజినా ముంబైనుండి భువనేశ్వర్ వెళ్లింది. ఆమె ఏ వైపుకు వెళ్లింది?
    4) వెప్రచు కోహిమానుండి జైపూర్ వెళ్లాడు. ఆయన ఏ దిక్కుకు ప్రయాణించాడు?
- ఇటువంటివే మరికొన్ని ప్రశ్నలు తయారుచేసి మీలో మీరు ఒకరినొకరు ప్రశ్నించుకోండి.
- పటంమీద చూపిన గుర్తులు చూడండి. తెలంగాణ రాష్ట్ర సరిహద్దును గుర్తించండి, వేలును ఆ సరిహద్దు గీతగుండా పోనివ్వండి.
- రాష్ట్ర సరిహద్దు, భారతదేశ సరిహద్దు (అంతర్జాతీయ సరిహద్దు) తెలిపే గుర్తును మీ నోటు పుస్తకంలో గీయండి.
- తెలంగాణకు ఉత్తరాన, దక్షిణాన, పడమరన మరియు తూర్పున ఉన్న రాష్ట్రాల జాబితా రాయగలరా?
- పటంలో ఇచ్చిన 'స్కేలు' సహాయంతో రెండు ప్రదేశాల మధ్య దూరాన్ని కొలిచే విధానాన్ని 6వ తరగతిలో నేర్చుకున్నారు. ఇప్పుడు హైదరాబాదునుండి జైపూర్, ఇంఫాల్, గాంధీనగర్, తిరువనంతపురం వంటి రాష్ట్ర రాజధానులకు గల దూరాన్ని కొలవండి.

**గుర్తులు :**

**బిందువు, రేఖ, ప్రదేశం :** ఏదైనా భౌతికపరమైన వాటిని పటంపై చూపడానికి గుర్తులను ఉపయోగిస్తాం. మీరు కొన్ని గుర్తులను గురించి 6వ తరగతిలో తెలుసుకున్నారు.


ఒకవేళ భారతదేశ పటంలో ఢిల్లీని చూపమంటే (●) చుక్క గుర్తుతో చూపించి ఢిల్లీ అని రాస్తాం. మంజీరా నదిని చూపమంటే దాని ప్రవాహమార్గంలో ఇలా (〰) రేఖను గీస్తాం. రైలు మార్గాన్ని చూపడానికి (┼┼┼┼┼┼) గుర్తుతో ట్రాక్‌ను గీస్తాం. తెలంగాణ పటంలో మెదక్ లేదా హైదరాబాద్ జిల్లాలను చూపాలంటే సరిహద్దును గీసి వేరువేరు రంగులతోగాని, డిజైన్లతోగాని చూపుతాం. అవి ఆ ప్రాంతాన్ని చూపే గుర్తులు. ఆ విధంగా అన్ని భౌతిక వస్తువులను బిందువు, రేఖ, ప్రాంతాల గుర్తుల ద్వారా పటంమీద చూపుతాం.

- ఈ పుస్తకంలోని మిగతా పాఠాలలో ఉన్న కొన్ని పటాలను పరిశీలించి క్రింది పట్టికను పూరించండి.

| బిందువు గుర్తు | రేఖ గుర్తు | ప్రాంత గుర్తు |
|---|---|---|
| 1. ఢిల్లీ | 1. నది | 1. ఆటస్థలం |
| 2. | 2. | 2. |
| 3. | 3. | 3. |




SCERT, TELANGANA





SCERT, TELANGANA

### భౌతిక పటాలు :

మీ అట్లాస్‌లో కొన్ని భౌతిక పటాలున్నాయి చూడండి. ఆకుపచ్చ, పసుపు, గోధుమ రంగులు వేసి వివిధ ప్రాంతాలను తెలిపే పటాలు వాటిలో ఉన్నాయి గమనించండి. ఆ పటాలు రక రకాల భూస్వరూపాలను (పీఠభూములు, మైదానాలు, పర్వతాలు మొదలయిన వాటిని) తెలుపుతాయి. వివిధ ప్రాంతాల ఎత్తులను కూడా అవి సూచిస్తాయి.

సమతలంగా ఉన్న కాగితంమీద ఎత్తైన ఒక ప్రాంతాన్ని ఎలా చూపించగలం? ఇదిగో ఇలా గీసి చూపించవచ్చు.



చిత్రం-1.5 "నింపూరు" గ్రామ చిత్రం

మీరు చూసేది బొమ్మ, ఇది పటంకాదు. బొమ్మలోని ఎత్తైన కొండలు వాటి వెనక ఉన్న ప్రదేశాన్ని కనిపించకుండా చేశాయి. కాని పటం అన్ని ప్రదేశాలూ కనపడేలా చూపుతుంది. ఈ ప్రదేశపు పటాన్ని ఎలా గీయవచ్చో ఆలోచించండి.


రంగు ఉపయోగించి ఎత్తు ప్రదేశాలను పటంలో చూపడం ఒక పద్ధతి. దీన్ని ఎలా చూపిస్తారో ఇప్పుడు మనం పరిశీలిద్దాం.

### భూమిమీద ఉండే ఎత్తులను కొలవడం :

భూమిమీద ఎత్తును సముద్రమట్టంనుండి కొలుస్తారు. ప్రపంచంలోని అన్ని ప్రాంతాల్లో సముద్రమట్టం దాదాపు సమానంగా ఉంటుంది. ఎందుకంటే, ప్రపంచంలోని సముద్రాలన్నీ ఒకదానితో ఒకటి కలిసిఉన్నాయి. ఈ విషయాన్ని అర్థంచేసుకోటానికి నింపూరు గ్రామ పటాన్ని పరిశీలించండి.

కింది పటంలో నింపూరు గ్రామం సముద్ర మట్టానికి 50 మీటర్ల ఎత్తులో ఉన్న విషయాన్ని గుర్తించండి.

- గుడి సముద్రమట్టానికి ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
- కొండ పైభాగం సముద్ర మట్టానికి ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?



చిత్రం-1.6 నింపూరు గ్రామం - ఎత్తు

SCERT, TELANGANA

## పటంలో ఎత్తులను చూపటం :

నింపూర్ గ్రామ పటం చూడండి (1.7).


పటంలో మూడు జోనులలో ఎత్తును చూపటాన్ని గమనించారా? మొదటి జోన్ '0' మీటర్ల ఎత్తునుండి 50 మీటర్ల ఎత్తువరకు, రెండోజోన్ 51 మీటర్ల ఎత్తునుండి 100 మీటర్ల ఎత్తువరకు, మూడోజోన్ 101 మీటర్ల ఎత్తు నుండి 150 మీటర్ల ఎత్తు వరకు ఉన్నాయి. అంటే 51 మీటర్ల ఎత్తునుండి 100 మీటర్ల ఎత్తు మధ్యలో ఉన్న ఏ ప్రాంతమైనా 50 మీటర్ల ఎత్తుకు పై భాగాన 100 మీటర్ల ఎత్తుకు దిగువన ఉన్నట్లుగా గ్రహించాలి. ఎత్తులను వివిధ రంగులలో చూపవచ్చు.

- ఎత్తులను చూపుతున్న నింపూరు గ్రామ పటాన్ని చూడండి. సముద్రం పక్కన ఉన్న ప్రదేశానికి ఏ రంగు వేశారో గమనించండి.
- పటంలోని అతి ఎత్తైన ప్రదేశానికి ఏ రంగు వేశారో కనుక్కోండి.

ఇప్పుడు మీ అట్లాసులో లేదా గోడకు వేలాడదీసిన పటంలో భారతదేశ లేదా తెలంగాణ భౌతికపటాన్ని చూడండి. ప్రదేశాల ఎత్తులను, రంగులను సూచికను చూసి తెలుసుకోండి.

## కాంటూరు లేదా సమతల రేఖలు(Contour Lines):

సమానమయిన ఎత్తుగల ప్రాంతాలను కలుపుతూ గీసే రేఖనే కాంటూరు లేదా సమతల రేఖ అంటారు. నింపూరు గ్రామ పటంలో ఆ గ్రామం గుండా పోతున్న ఒక గీతను గమనించే ఉంటారు. అది 50 మీటర్ల కాంటూరు రేఖ. ఆ గీత మీద ఉన్న అన్ని ప్రదేశాలు 50 మీటర్ల ఎత్తులోనే ఉంటాయి. భూస్వరూపాన్నిబట్టి ఈ కాంటూరు రేఖలు వంకర టింకరగా ఉండవచ్చు. ఇవి ఒక దాన్ని ఒకటి ఖండించుకోవు. రెండు కాంటూరు రేఖల మధ్య దూరం ఆ భూమి స్వరూపంపై ఆధారపడి ఉంటుంది. భూమివాలు ఎత్తుగా ఉంటే కాంటూరు రేఖలు ఒక దానికొకటి దగ్గరగా ఉంటాయి. భూమివాలు తీవ్రంగా లేకుండా తక్కువ వాలు వుంటే, కాంటూరు రేఖలు దూరం దూరంగా ఉంటాయి.





*చిత్రం– 1.7 నింపూరు గ్రామం – సముద్ర మట్టంనుంచి ఎత్తు*

## ఎత్తులను చూపే పటాలవల్ల ఉపయోగాలు :

ఈ పటాలు భూమి ఉపరితల స్వభావాలను తెలుసుకోడానికి ఉపయోగపడతాయి. పర్వతాలు, లోయలు ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవచ్చు. మీరు తెలంగాణ భౌతిక పటాన్ని గమనిస్తే గోదావరి నది తూర్పు వాలు దిక్కుగా ప్రవహిస్తున్నదని తెలుసుకుంటారు. ఈ వాలుగుండా పశ్చిమానికి ప్రయాణం చేస్తే నీవు పీఠభూమి ప్రాంతంలోని కొండలను చేరుకుంటావు. ఈ పీఠభూమి ప్రాంతాన్ని కృష్ణా, గోదావరి నదులు విభజిస్తూ ఉన్నాయి. అందువల్ల లోతైన, విశాలమైన లోయలు ఏర్పడ్డాయి.

రోడ్లు వేసేటప్పుడు, ఆనకట్టలు కట్టేటప్పుడు ఎత్తులను తెలిపే ఈ పటాలు బాగా ఉపయోగపడతాయి. హెచ్చు తగ్గులున్న ప్రాంతంలోని రెండు ప్రదేశాల మధ్య రోడ్లను నిర్మించేటప్పుడు ఏ మార్గాన రోడ్డు వేయాలో నిర్ణయించ దానికి ఈ పటాలు ఉపయోగపడతాయి. అలాగే ఆనకట్టలు కట్టేటప్పుడు, ఎంత ప్రదేశం నీటిలో మునుగుతుందో లెక్కవేయడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి.




*చిత్రం-1.8 ఎత్తు*

SCERT, TELANGANA

## సముద్ర మట్టం (Mean Sea Level) :

సముద్ర ఉపరితలంపైన పెద్ద, చిన్న అలలు నిరంతరం వస్తుంటాయి. అవి ఎప్పటికీ స్థిరంగా ఉండవు. ఈ ప్రక్రియవల్ల సముద్రం ఎత్తు నిరంతరం పెరుగుతూ, తగ్గుతూ ఉంటుంది. మరి ఈ ఎత్తులలో ఏ ఎత్తును మనం సముద్రపు నీటిమట్టం లేదా '0' మీటరు ఎత్తుగా గుర్తించాలి? ఈ సమస్యకు పరిష్కారంగా సముద్రపు ఎత్తును వివిధ సమయాల్లో కొలిచి వాటి సగటు ఆధారంగా సముద్రమట్టాన్ని లెక్కగట్టారు. శాస్త్రవేత్తలు అనేక సంవత్సరాలపాటు ఈ సగటు అలల ఎత్తులను పరిశీలించి, లెక్కించి వారొక అవగాహనకు వచ్చి సగటు సముద్రమట్టాన్ని (Mean Sea Level) నిర్ధారించారు.

- మీ నివాసం రైల్వే స్టేషన్‌కు దగ్గర అయితే అక్కడ పెట్టిన బోర్డు ఆధారంగా ఆ ప్రాంత ఎత్తును గుర్తించండి. ఆ ఎత్తును మీ నోటు పుస్తకంలో రాసుకోండి. ఆ ఎత్తు "____ M.S.L." గా రాసి ఉంటుంది.

- 1.6వ చిత్రం, 1.7వ చిత్రం ప్రకారం 30 మీటర్ల ఎత్తు వరకు వరదనీరు వస్తే నింపూరు గ్రామం మునుగుతుందా?


1.8వ చిత్రం చూసి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి:

- నది ప్రవహించే దిశ గుర్తించండి.
- అతి తక్కువ ఎత్తుగల భూమి ________ మీటర్లనుండి ________ మీటర్ల మధ్య ఉన్నది.
- ఈ పటంలో రెండు ఎత్తైన ప్రదేశాలున్నాయి. వాటి ఎత్తు ఎంత?

### మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) ప్రపంచంలోని సముద్ర మట్టాలన్నీ ఎందుకు సమానంగా ఉంటాయి?
2) సముద్రమట్టాన్ని ఎలా లెక్కగడతారు?
3) ఎత్తులను చూపే పటాలవల్ల ఉపయోగాలు ఏమిటి?
4) ఎత్తయిన ప్రాంతాలలోను, పల్లపు ప్రాంతాలలోను నివసించే ప్రజల జీవన విధానంలో ఏ వ్యత్యాసాలు గమనించారు?
5) ప్రజలకు పటాలు (మ్యాపులు) ఏవిధంగా ఉపయోగపడతాయి?
6) పేజి నెం. 5లోని 'కాంటూర్ రేఖలు' అంశాన్ని చదివి, వ్యాఖ్యానించండి.
7) తెలంగాణ రాష్ట్ర పటంను పరిశీలించి 150 MSL కంటే తక్కువ గల ప్రాంతాలు ఏఏ జిల్లాలలో ఉన్నాయో రాయండి.

Y1Y2E2




SCERT, TELANGANA

పాఠం 2

# వర్షం - నదులు

C8N8B7

భూమిపైన ప్రాణికోటి జీవించడానికి నీరు మూలాధారం. భూమి ఉపరితలంలో 71% పైగా నీరు ఆవరించి ఉన్నదని మీకు తెలుసు. పంటలు పండించడానికి మనం నీటిమీద ఆధారపడి ఉన్నాం. కాని సంవత్సర కాలమంతా మనం ఒకే విధమైన నీటిని పొందడంలేదు. అంతటా ఒకే నాణ్యత గల నీరు లేదు.



మీకు ఏ నెలల్లో వర్షాలు పడుతున్నాయి? మీ గ్రామంలో లేదా పట్టణంలో ఎక్కువ నీరు ఏ భాగంలో ఉంది? తక్కువ నీరు ఏ భాగంలో ఉంది? మీకు మంచి (తాగే) నీరు, ఉప్పునీరు లేదా కఠిన జలం ఎక్కడ లభ్యమవుతుంది? తరగతిలో చర్చించండి. తర్వాత అధ్యాయంలో నీటి లభ్యతలో వైవిధ్యం, దాని పర్యవసానాలు మొదలైన అంశాలను గురించి చదువుకుందాం.

## మొదటి భాగం

### సూర్యుడు, మేఘాలు, వర్షపాతం:

భరించలేని వేసవికాలమయిన ఏప్రిల్, మే, జూన్‌ల తర్వాత వర్షాకాలం వస్తుంది. కొన్ని నెలలపాటు ఉంటుంది. వర్షం ఎలా కురుస్తుంది? వర్షాన్నిచ్చే మేఘాలు ఎక్కడ నుండి వస్తాయి? మీకు తెలుసా? మీకు తెలిసిన అంశాలేవో ఆలోచించి వాటిని గురించి మీ తరగతి గదిలో చర్చించండి.

### నీరు ఆవిరి కావడం (బాష్పీభవనం):

సూర్యోదయానికి ముందే ప్రణవి నిద్ర లేచింది. వేడినీళ్లతో స్నానం చేయాలని పొయ్యివెలిగించి ఒక పాత్రలో నీటిని వేడిచేయసాగింది. నీరు వేడెక్కి నీటి ఆవిరి పొగరూపంలో పాత్రపైన గల మూతకు తగిలింది. మూత తీసినప్పుడు బయటి చల్లని గాలి ఆ ఆవిరిని తగలగానే నీటి ఆవిరి నీటిబిందువులుగామారి మళ్లీ నీటిపాత్రలోనే పడ్డాయి. ఇది గమనించిన ప్రణవి నీరు వేడెక్కి నీటి ఆవిరిగాను, నీటి ఆవిరి చల్లబడి నీరుగాను మారుతుందని తెలుసుకుంది.

ఈ వర్షపు కథ నీటి ఆవిరితో మొదలవుతుంది. నీటి ఆవిరి అంటే ఏమిటి? మీరు తడిసిన బట్టల్ని బయట ఆరవేస్తే కొంతసేపటికి అందులోని నీరు అదృశ్యమవుతుంది. బట్టలు ఆరిపోతాయి. ఆదేవిధంగా ఒక పళ్లెంలో కొద్దిగా నీరు పోసి ఎండలో ఉంచినట్లయితే రెండు రోజుల్లో ఆవిరైపోవచ్చు. బట్టలోని నీరు, పళ్లెంలోని నీరు ఆవిరై గాలిలో కలిసిపోతుంది. ఈ విధానాన్నే బాష్పీభవనం / ఆవిరవడం అంటాం. అంటే నీటిని వేడిచేయకపోయినా ఆవిరైపోతుంది.

SCERT, TELANGANA


భూమి ఉపరితలంమీద మహాసముద్రాలు, నదులు, సరస్సులు మొదలైన జలభాగాలున్నాయి. వీటినుండి నీరు ఎడతెగకుండా ఆవిరవుతూంటుంది. ఎక్కడ తేమ ఉంటే అక్కడ ఆవిరై గాలిలో కలుస్తుంది. ఈ బాష్పీభవనం మన శరీరం నుండి, చెట్లనుండి, నేలనుండి జరుగుతుంది. ఉష్ణోగ్రత పెరిగేకొద్దీ నీరు తొందరగా ఆవిరి అవుతుంది.

- ఏ కాలంలో ఎక్కువ బాష్పీభవనం ఉందో ఆలోచించండి. వేసవిలోనా, శీతాకాలంలోనా?
- నీరు ఆవిరవడం పగలు ఎక్కువగా ఉంటుందా రాత్రిపూటా?
- 2.1వ చిత్రం చూసి నీరు ఆవిరిగా ఎక్కెడెక్కడ నుండి మారుతుందో తెలిపే పట్టిక తయారుచేయండి.
- గరిష్ఠస్థాయిలో బాష్పీభవనం ఎక్కడినుండి జరుగుతుందని భావిస్తున్నారు? మొక్కలనుండా, నదులనుండా, మహాసముద్రాలనుండా, నేలనుండా?

**మేఘాలు ఏర్పడటం – వర్షం కురియటం:**

వేడిగాలికి నీరు ఎక్కువగా ఆవిరై ఆకాశంలో పైకి చేరినప్పుడు అది చల్లబడుతుంది. భూమి ఉపరితలం నుంచి పైకి వెళ్లేకొద్దీ చల్లగా ఉంటుంది. అలా నీటి ఆవిరి చల్లబడుతూ చిన్న చిన్న నీటిబిందువులుగా మారుతుంది. ఈ చిన్న నీటి బిందువులు, చుట్టూ ఉన్న సూక్ష్మమైన దుమ్ము (ధూళి రేణువులు)తో లేదా పొగతో కలిసి నిదానంగా వాటి పరిమాణం పెరుగుతుంది. ఇలా చిన్న నీటి బిందువులు కలిసి "మేఘాలు"గా ఏర్పడతాయి.

- నీటి ఆవిరి మేఘాలుగా ఎలా మారుతుందో వివరించే చిత్రాన్ని పై ఖాళీ బాక్సులో గీయండి. చిత్రంలో భూమి, ఆకాశం, నీటి ఆవిరి, ధూళికణాలు, నీటి బిందువులు, మేఘాలని గుర్తించండి.





*చిత్రం–2.1 నీరు ఆవిరవడం*

SCERT, TELANGANA

మేఘాలు పైకి పోయే కొద్దీ మరింత చల్లబడటం వల్ల ఎక్కువ నీటిబిందువులు ఏర్పడతాయి. ఈ చిన్న నీటిబిందువులు ఒకదానికొకటి కలిసి పెద్ద బిందువులుగా ఏర్పడతాయి. ఇవి బరువెక్కడంతో గాలిలో ఉండలేక వర్షరూపంలో కురుస్తాయి.

- వర్షం కురవడానికి మేఘాలు పైకి వెళ్లవలసిన అవసరం ఉందని భావిస్తున్నారా?
- మీరు ఎప్పుడైనా మంచు కురవడం చూశారా? ఇది ఎక్కడ రూపొందుతుంది?
- రోజులో ఏ సమయంలో పొగమంచు కురుస్తుంది?
- ఏ కాలంలో ఎక్కువ పొగమంచు కురిసిన రోజులున్నాయి?
- మీరు ఎప్పుడైనా మంచు కురవడం చూశారా? దీనికీ వర్షం కురవడానికి గల తేడా ఏమిటి?
- ఎప్పుడయినా వడగండ్లను చూశారా?



*చిత్రం-2.2 జలచక్రం*

**కొన్ని ముఖ్యపదాలు :**

**బాష్పీభవనం :** నీరు ఆవిరిగా మారటాన్ని 'బాష్పీభవనం' అంటాం. నీటి ఆవిరి తిరిగి నీరుగా మారటాన్ని 'ద్రవీభవనం' అంటాం. గాలిలో పై భాగాన వేలాడుతున్న చిన్న నీటి బిందువుల సమూహమే మేఘాలు .

**జలచక్రం:** సముద్రాలనుండి నీరు ఆవిరై ఆకాశంలో మేఘాలుగా తయారై వాటికి చల్లనిగాలి తగలగానే వర్షిస్తాయి. ఆ నీరు పల్లపు ప్రాంతాలలో ప్రవహిస్తూ నదులుగా ఏర్పడి తిరిగి సముద్రంలో కలుస్తుంది. ఇదే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంది.. దీన్నే "జలచక్రం" అంటారు.

**అవపాతం:** వివిధ రూపాలలో గాలిలోని తేమ భూమిమీద పడటాన్ని 'అవపాతం' (Precipitation) అంటాం. ఇది మంచుగా, వర్షంగా, పొగమంచు, తుషారం, వడగండ్లు మొదలైన అనేక రూపాలలో ఉంటుంది.

**ఆర్ద్రత:** వాతావరణంలో అదృశ్యంగా ఉన్న నీటి ఆవిరిని ఆర్ద్రత (తేమ) (humidity) అంటాం. ఉష్ణోగ్రతతో పాటు ఆర్ద్రత కూడా పెరిగినప్పుడు మనకు అసౌకర్యంగా ఉంటుంది. చెమట త్వరగా ఆవిరిగాక ఉక్కగాను, జిగటగాను ఉంటుంది.

**పవనాలు, మేఘాలు:**

భూమి ఉపరితలంమీద అన్ని ప్రాంతాలలో నీరు ఆవిరిగా మారి మేఘాలు ఏర్పడుతున్నాయి. మహాసముద్రాల ఉపరితలాల్లో నీరు అత్యధికంగా ఆవిరై మేఘాలు ఏర్పడతాయి. మొత్తంమీద, మహాసముద్రాలు నీటితో కొన్ని వేల కిలోమీటర్ల వరకు వ్యాపించి ఉన్నాయి. తత్ఫలితంగా


SCERT TELANGANA

వర్షాలు మహాసముద్రంలో అత్యధికంగా కురుస్తున్నాయి. మేఘాలు కూడా కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణించి మనకు వర్షాన్నిస్తున్నాయి. వాటిని ఏవి భూభాగంపైకి తీసుకువస్తున్నాయో మీకు తెలుసా?

- వర్షాకాలంలో గాలి ఏ దిశనుండి వీస్తుంది?

ఈ పవనాలు అరేబియా సముద్రంనుంచి బంగాళాఖాతంమీదుగా వీస్తున్నాయి. ఇవి వర్షాన్నిచ్చే మేఘాలను రవాణా చేస్తాయి. వీటినే 'ఋతుపవనాలు' అంటాం. ఇవి నైరుతి దిశనుండి వీస్తాయి. కాబట్టి వీటిని 'నైరుతి ఋతుపవనాలు' అని కూడా అంటాం. ఇవి వేసవికాలంలో మాత్రమే వీస్తాయి.

ఈ ఋతుపవనాలు రెండు శాఖలు : ఒకటి అరేబియా సముద్రం నుండి వీచే పవనాలు. రెండు, బంగాళాఖాతం మీదుగా వీచే పవనాలు. పటం-1 లోని బాణం గుర్తులు పవన దిశను సూచిస్తాయి.




SCERT, TELANGANA

- బంగాళాఖాతంలో ఏర్పడిన మేఘాలను పవనాలు దేశంలోని ఏ ప్రాంతానికి తీసుకొనిపోతాయి?
- అరేబియా సముద్రంలో ఏర్పడిన మేఘాలను పవనాలు దేశంలోని ఏ ప్రాంతానికి తీసుకొని-పోతాయి?
- పవనాలు పశ్చిమబెంగాల్‌కు, ఢిల్లీకి, లక్నోకు ఋతుపవనాలను ఏ దిశనుండి తీసుకు-పోతాయి?
- పవనాలు బొంబాయికి, హైదరాబాద్‌కు, బెంగళూరుకు ఋతుపవనాల్ని ఏ దిశ నుండి తీసుకొనిపోతాయి?

**తెలంగాణలో వర్షపాతం:**

- మీ ప్రాంతంలో ఏ నెలల్లో ఎక్కువ వర్షం కురుస్తుంది? అత్యధిక వర్షపాతం గల మూడు నెలలను పేర్కొనండి.
- మీరుండే ప్రాంతంలో ఏ నెలల్లో తక్కువ వర్షం కురుస్తుంది? అత్యల్ప వర్షపాతంగల మూడు నెలలను తెలపండి.
- మీ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం సాధారణ వర్షపాతం ఉంటుందా? లేదా సంవత్సరానికో విధంగా ఉంటుందా?
- తక్కువ వర్షం కురిసి కరవు వచ్చిన సంవత్సరాలు మీకేమైనా అనుభవమైనాయా?
- అధిక వర్షాలు కురిసి వరదలు వచ్చిన సంవత్సరాలు మీకేమైనా అనుభవమైనాయా?

తెలంగాణ రాష్ట్రంలో మార్చి నెలతో మొదలయ్యే ఉష్ణోగ్రతల పెరుగుదల జూన్ దాకా కొనసాగుతుంది. జూన్ మధ్య నాటికి నైఋతి ఋతుపవనాలు రాష్ట్రానికి చేరుకోవడంతో పాటు, వాటి ప్రభావంతో కురిసే వర్షాల వల్ల వారం రోజుల్లోనే ఉష్ణోగ్రతల్లో అకస్మాత్తుగ భారీ మార్పులు సంభవిస్తాయి. పటం-1 చూడండి.

నైఋతి ఋతుపవనాల వల్ల తెలంగాణ రాష్ట్రంలో సాధారణ వర్షపాతం మాత్రమే సంభవిస్తుంది. మొత్తం మీద ఉత్తర, తూర్పు ప్రాంతాలు అధిక వర్షపాతం పొందుతుండగా, తెలంగాణ పీఠభూమిలోని చాలా ప్రాంతాలు తక్కువ వర్షపాతాన్ని పొందుతున్నాయి. రాష్ట్రంలో మహబూబ్‌నగర్, జోగులాంబ జిల్లాలు అతి తక్కువ వర్షపాతాన్ని పొందుతున్నాయి. పటం 2 చూడండి.

సముద్రాల నుండి నీటి ఆవిరిని మోసుకొస్తున్న పవనాలకు పర్వతాలు అడ్డుగా ఉన్నప్పుడు, వాటిని తప్పించడానికి పైకి లేచే సందర్భంలో పైన చల్లగాలి తగిలి ద్రవీభవించి ఆపైన వర్షపాతం సంభవిస్తుంది. సాధారణంగా ఇలాంటి వర్షపాతం పశ్చిమ కనుమలు వంటి పర్వత ప్రాంతాలలో చూస్తాం.

మే నుండి అక్టోబర్ మధ్య బంగాళాఖాతంలో తుఫానులు సంభవిస్తాయి. ఈ తుఫానుల వల్ల మనకు వర్షాలు రావచ్చు, లేదా రాకపోవచ్చు, అది ఆ తుఫాన్లు తీరం దాటాక వెళ్ళే దిశ, వాటి విస్తృతిని బట్టి ఉంటుంది. కొన్నిసార్లు ఋతుపవనాలు, తుఫాన్లు కలిసి ఈ ప్రాంతానికి విస్తృతమైన వర్షాలను అందియ్యడంతో పాటు, పంట నష్టాన్ని కూడా కలిగిస్తాయి.

అక్టోబర్ తర్వాత పవనాలు బంగాళాఖాతం నుండి నైఋతి దిక్కునకు వీస్తాయి. వీటి వల్ల అక్టోబర్ మరియు నవంబర్ నెలల్లో తెలంగాణ ప్రాంతంలో చాలా తక్కువ వర్షపాతం సంభవిస్తుంది. ఈ పవనాలను ఈశాన్య ఋతుపవనాలు లేదా తిరోగమన ఋతుపవనాలు అంటారు.


**సిరిసిల్ల పట్టణ 10 సం॥రాల వర్షపాత వివరాలు:**

| సం॥ | వర్షపాతం మి.మీ.లలో | సం॥ | వర్షపాతం మి.మీ.లలో |
|---|---|---|---|
| 1996 | 933 | 2001 | 763 |
| 1997 | 695 | 2002 | 605 |
| 1998 | 926 | 2003 | 819 |
| 1999 | 823 | 2004 | 619 |
| 2000 | 895 | 2005 | 891 |

సేకరణ : తహసిల్దార్ కార్యాలయం, సిరిసిల్ల

- సిరిసిల్ల పట్టణం సరాసరి వర్షపాతం ఎంత?
- పై సమాచారం ఆధారంగా ఏ సంవత్సరం అత్యధిక, ఏ సంవత్సరం అత్యల్ప వర్షపాతం నమోదయింది?

SCERT, TELANGANA




- ఏ రెండు సంవత్సరాలు అత్యధిక వర్షపాతాన్ని పొందాయి?
- పై తెలంగాణ పటంలో చూపించబడిన వివిధ ప్రాంతాలు పొందే వర్షపాత వివరాలను గమనించండి.
  - i) మీ జిల్లాలో ఎటువంటి వర్షపాతం (అధిక, అల్ప, అత్యల్ప వర్షపాతం) ఉంది?
  - ii) నల్గొండ, జోగులాంబ, కొమరంభీం, యాదాద్రి, హైదరాబాద్ పట్టణాలలో ఏ పట్టణంలో తక్కువ వర్షపాతం, ఏ పట్టణంలో ఎక్కువ వర్షపాతం ఉన్నాయి?
  - iii) ఇలాంటి మరిన్ని ప్రశ్నలను ఒకరినొకరు అడగండి.
- మీ అట్లాసులోని భారతదేశ భౌతిక పటంలో పశ్చిమ కనుమలను, తూర్పు కనుమలను గుర్తించండి.

క్రింది ఖాళీలు పూరించండి.

- పశ్చిమ కనుమలు వ్యాపించిన రాష్ట్రాలు ____________.
- తూర్పు కనుమలు వ్యాపించిన రాష్ట్రాలు ____________.
- పశ్చిమ కనుమలు, తూర్పు కనుమలు ఏ ప్రాంతంలో కలుస్తాయి ?
- భారతదేశ పటం గీసి అందులో తూర్పు, పశ్చిమ కనుమలను గీయండి. తెలంగాణ ప్రాంతాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో ఏ నెలలలో వర్షం కురుస్తుందో చూపించండి.

SCERT, TELANGANA

**వర్షమాపకం:**

వర్షపాతాన్ని కొలిచే పరికరాన్ని 'వర్షమాపకం' అంటాం. ఒక ప్రామాణిక ప్రదేశంలో కురిసిన వర్షపాతాన్ని సెంటీమీటర్లలో కొలుస్తారు. ఎంత వర్షం పడిందో ఎలా కొలుస్తాం? ఎక్కడ ఎక్కువ వర్షం కురిసిందో, ఎక్కడ తక్కువ వర్షం కురిసిందో మనం ఎలా చెప్పగలం? నిజామాబాద్‌లో ఎక్కువ వర్షం పడుతుందా? లేక రంగారెడ్డిలో అనేది ఎలా తెలుసుకుంటాం?

**సొంతంగా వర్షమాపకాన్ని తయారుచేయండి.**




వర్షమాపకాన్ని తయారుచేయడానికి పైన సూచించిన వస్తువులు సేకరించండి. (చిత్రం-1)



సీసాపై భాగాన్ని ఇలా కత్తిరించండి. కింది భాగం పై చుట్టుకొలత, కత్తిరించిన భాగం అడుగు చుట్టు కొలత సమానంగా ఉండాలి. (చిత్రం-2)



సీసా పై భాగాన్ని తలకిందులు చేసి సీసాలో అమర్చండి. (చిత్రం-3)




మీరు సూచించిన సున్నా గుర్తు వరకు సీసాను ఇసుకతోను, నీటితోను నింపండి. (చిత్రం-4)

SCERT , TEALANGANA

ఇప్పుడు బయట ఖాళీస్థలంలో సీసాను ఉంచండి. సీసాలోకి వర్షం పడుతున్నప్పుడు ఏవీ అడ్డుపడకుండా చూసుకోవాలి. తర్వాత స్కేలుతో నీటి పరిమాణాన్ని కొలవాలి. కొన్ని రోజులు అలా సీసాను ఖాళీ స్థలంలో ఉంచినట్లయితే, ఒక వారంలో లేదా నెలలో ఎన్ని సెంటీ మీటర్ల వర్షం పడిందో తెలుసుకోవచ్చు.

వర్షం పడుతున్నప్పుడు సీసాలోని నీటిమట్టం పెరుగుతుంది. స్కేలు సహాయంతో నీటి ఎత్తును కొలిస్తే మీ ప్రాంతంలో ఎన్ని సెంటిమీటర్ల వర్షం పడిందో తెలుస్తుంది.

# రెండవభాగం

**నదుల ప్రవాహం:**

వర్షంగా కురిసిన నీరు భూమిపైకి చేరిన తరువాత ఏమవుతుంది? ఈ నీరు కొంతభాగం నేలలోకి ఇంకుతుంది. కొంత భాగం నేల ఉపరితలంమీద ప్రవహిస్తుంది. కొంత నీరు ఆవిరై గాలిలో కలిసిపోతుంది. నేలలో ఇంకిన నీరు గురించి రాబోయే అధ్యాయంలో తెలుసుకుందాం. ఈ అధ్యాయంలో భూమి ఉపరితలం మీద ప్రవహించే నీటిని గురించి తెలుసుకుందాం.

**నదులు:**

భూమిపై పల్లపు ప్రాంతంలోను, వాగులలోను వర్షపు నీరు ప్రవహించడం మీరు చూశారా? వర్షాకాలంలో పర్వతాల వాలుతలాలనుండి వర్షపునీరు ప్రవహిస్తుంది. ఈ జలప్రవాహాలు కొంతకాలానికి ఎండిపోతాయి. ఎత్తైన ప్రాంతాల నుంచి ప్రవహించే నీటివల్ల వాగులు ఏర్పడతాయి.

వర్షాలు తిరిగి (మళ్ళీ) ప్రారంభమైతే నీరు అదే కాలువల గుండా ప్రవహిస్తుంది. ఈ విధంగా నదీ మార్గాలు, నదీలోయలు ఏర్పడతాయి. ఈ విధానాన్ని కింది పటంలో చూడండి (పటం-2.3).


చిత్రాన్ని పరిశీలించి ప్రశ్నలకు జవాబులు చెప్పండి:

- బాణంగుర్తులతో నదీప్రవాహ దిశలను చూపండి.
- నేల పల్లపుప్రాంతాన్ని బాణంగుర్తుతో సూచించండి.
- నేల పల్లం, నదీ ప్రవాహం ఒకే దిశలో ఉంటాయా?

**సెలయేరు వెడల్పయిన నదిగా రూపాంతరం చెందడం:**

చిన్న సెలయేర్లు / వాగులు ప్రవహించి పెద్ద నదుల్లో కలుస్తాయి. ఇలా నదుల్లో కలిసే సెలయేర్లను లేదా చిన్న వాగులను ఉపనదులు అంటాం. ఇలా ప్రధాన నదులలో నీరు పెరుగుతుంది. నది పెద్దదిగాను, వెడల్పుగాను (విశాలంగా) ఏర్పడుతుంది.

నది పెద్దదిగా, విశాలంగా ఏర్పడిన తర్వాత నీటి ప్రవాహం నెమ్మదిగా సాగుతుంది. కొట్టుకొని వచ్చిన చెత్త, ఒండ్రుమట్టి మొదలైనవి నది అడుగు భాగానికి, అంచులకు చేరుతుంది. ఇది మైదానాలు ఏర్పడడానికి కారణమవుతుంది.




చిత్రం- 2.3 వాలు, నదులు ఏర్పడటం

SCERT, TELANGANA

సముద్రానికి చేరువగా సమీపిస్తున్నప్పుడు నది మరింత నెమ్మదిగా ప్రవహిస్తూ, ఇసుకను, ఒండ్రు మట్టిని తనతో తీసుకుపోలేదు. ఇవన్నీ ఆ ప్రాంతంలో మేటవేస్తాయి. అయితే వరదలు వచ్చినప్పుడు నది కొత్త మార్గాల్ని ఏర్పరుచుకొని సముద్రంలో కలుస్తుంది. ఈ రకంగా నదులు సముద్రంలో కలిసేచోట 'డెల్టా'లు ఏర్పడతాయి. తూర్పు కోస్తాలో రెండు విశాలమైన డెల్టాలు గోదావరి, కృష్ణా నదులకు ఉన్నాయి. కృష్ణా, గోదావరి నదులు సంవత్సరమంతా నీటిని కలిగి ఉంటాయి. వర్షాకాలంలో మాత్రమే ప్రవహించే చాలా చిన్న నదులు కూడా ఉన్నాయి. ఎందుకిలా జరుగుతుంది?

కృష్ణా, గోదావరి నదులు పుట్టే పడమర కనుమలు అధిక వర్షాలు పొందుతున్నాయి. వర్షపునీరు నెమ్మదిగా భూమిలోకి ఇంకి, అది సంవత్సరమంతా నదుల్లోకి ప్రవహిస్తుంది. దిండి, మంజీర, మూసి వంటి నదులు వర్షాభావపరిస్థితులు ఉండే ప్రాంతాలలో ప్రారంభమవుతాయి. తూర్పు కనుమలలో సాధారణ వర్షపాతం ఉంటుంది. అందుకే తూర్పుకనుమలలో పుట్టే నదులు వర్షాకాలం అయిపోవటంతో ఎండిపోతాయి.

**పటం-3 - తెలంగాణ నదులు**




SCERT, TELANGANA

- పటం-3 రాష్ట్రంలోని ప్రధానమైన నదులను చూపిస్తుంది. వీటిలో కృష్ణానదిలో కొంత భాగం తెలంగాణకు దక్షిణ సరిహద్దుగా మరియు గోదావరి నది తెలంగాణకు ఈశాన్య సరిహద్దుగా ఉంది.
- మీ జిల్లాలోని ముఖ్యమైన ప్రవాహాలను గుర్తించి అవి ఏ నదిలో కలుస్తాయో జాబితా తయారు చేయండి?
- మీ జిల్లాలోని ప్రవాహాలు సంవత్సరమంతా ప్రవహిస్తాయా లేక వర్షాకాలంలో మాత్రమే ప్రవహిస్తాయా: గుర్తించండి?

| జిల్లా | ప్రవాహం పేరు (వాగు/వంక) | కలిసే నది పేరు |
|---|---|---|
| | | |

- తెలంగాణ పటంలో వాలుదిశలలో ఏమి గమనించారు? ఉత్తరం నుండి దక్షిణమా? తూర్పు నుండి పడమరా? లేదా పడమర నుండి తూర్పువైపా?

**వరద మైదానాలు, వరదలు:**

ఏ నదిలోనూ సంవత్సరం పొడుగునా ఒకే విధమైన నీటి ప్రవాహం ఉండదు. వర్షాకాలంలో నది నిండుగా ప్రవహిస్తే, ఎండాకాలంలో నీరు తగ్గుతుంది. చిత్రం-2.4, 2.5 చూడండి. పటాన్ని గమనిస్తే నది మొత్తం చాలా వెడల్పుగా, ఎత్తైన ఒడ్లతో ఉంది. దీని లోపల ఇసుక, రాళ్లతో నిండి ఉంటుంది. వీటి మధ్య నది సన్నని కాలువలాగ ప్రవహిస్తుంది. అందువల్ల చెట్లు పెరిగే అవకాశంలేదు. అధిక వర్షాలవల్ల చిన్న చెట్లు నాటడానికి, పెద్ద చెట్లు పెరగడానికి ఆస్కారముండదు. ఈ చెట్లు లేని భాగాన్ని నది తాలూకు 'వరదమైదానం' అంటాం. అన్ని పెద్ద నదులకు ఇలాంటి వరదమైదానాలు ఉంటాయి.


దేశంలో అధిక వర్షాలవల్ల వర్షాకాలంలో వరదలు వస్తాయని మీరు తెలుసుకున్నారు. కృష్ణా, గోదావరి, బ్రహ్మపుత్ర, గంగ వంటి నదులలో దీని ప్రభావం కనిపిస్తుంది.

2.5 చిత్రం జాగ్రత్తగా చూసి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి:


- నదీజలం వరదమైదానాన్ని అంతటిని ఆవరించి ఉందా, వర్షాభావ కాలంలో ప్రవహించే సన్నని కాలువగా మాత్రమే ప్రవహిస్తోందా?
- నదీజలం వరదమైదానానికే పరిమితమా, నది ఒడ్డున కూడా ప్రవహిస్తోందా?
- గ్రామాలను, వ్యవసాయ భూములను, చెట్లను వరదలు ఏ విధంగా ప్రభావితం చేస్తాయి?
- వరదలుకూడా వ్యవసాయ భూములకు లాభదాయకమని ఎలా చెప్పగలరు?

మన దేశంలో ఇటీవలి కాలంలో వరదలు పెద్ద సమస్యగా తయారైనాయి. దేశంలో కొంత భాగం ప్రతీ సంవత్సరం వర్షాకాలంలో వరద బారిన పడుతోంది. ఇలాంటి వాటివల్ల ప్రజలకు, పంటలకు, జీవకోటికి హాని కలుగుతోంది. వరదనివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలుసుకొని మనవంతు సహాయ చర్యలు అందించాలి.

SCERT TELANGANA



*చిత్రం-2.4 వరదమైదానాలు*



*చిత్రం-2.5 వరద*

పరివాహక ప్రాంతంలో మొక్కలను పెంచడంవల్ల (చెట్లు, మొక్కలు, గడ్డి) వర్షపు నీటి ప్రవాహ వేగాన్ని తగ్గించగలం. ప్రవాహవేగాన్ని తగ్గిస్తే నీరు భూమిలోకి ఇంకడానికి అవకాశముంటుంది. నదిలోకి ఒక్కసారిగా ఎక్కువ నీళ్లు చేరడంవల్ల సాధారణంగా వరదలు వస్తాయి. చెట్లవల్ల నదికి నీరు నిదానంగా చేరుతుంది. వీటివల్ల అకస్మాత్తుగా వచ్చే వరదలను తగ్గించవచ్చు. అంతేగాక వర్షపు నీటివల్ల సంభవించే నేలకోతను తగ్గించగలం.

చెట్లు పెంచడంవల్ల మరోరకంగా కూడా వరదలు రాకుండా రక్షించుకోవచ్చు. చెట్లవల్ల వర్షపు నీటి ద్వారా భూమి కోతను నివారించగలం. ఒకవేళ చెట్లు లేనట్లయితే భూమిపైపొర వర్షపు నీటికి కొట్టుకొని పోతుంది. ఇదంతా నదులలో చేరి నది లోతులను తగ్గిస్తుంది. తత్ఫలితంగా, నది తీసుకువెళ్లే నీరు తగ్గుతుంది. అప్పుడు తక్కువ వర్షం కురిసినా, వరదలు వచ్చి నష్టం జరుగుతుంది, భూమి ఉపరితలం చెట్లు, మొక్కలతో కప్పిఉంటే మట్టి కొట్టుకుపోవడాన్ని ఎంతగానో నిరోధించవచ్చు.

## బృహత్తర మొక్కల పెంపకం

ఈ అంశమే ప్రధాన కారకంగా అధిక శాతం ప్రభుత్వాలు పచ్చదనం పేరుతో అటవీ విస్తీర్ణాన్ని పెంచే కార్యక్రమాలను ప్రారంభించాయి. తెలంగాణ రాష్ట్రం చెట్ల పెంపకం అనే భారీ కార్యక్రమంలో ముందంజంలో ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా 230 కోట్ల మొక్కల పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ప్రతి గ్రామంలో 40,000 మొక్కలను, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 40 లక్షల మొక్కలను ప్రతి సంవత్సరం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజా ప్రతినిధులందరు, అధికారులు, గ్రామస్థులు మరియు అన్ని వర్గాల ప్రజలు అన్ని రోడ్లకు ఇరువైపుల, చెట్లు లేని కొండప్రాంతాల్లో, చెరువు కట్టలపై, ప్రజల ఆవాస ప్రాంతాల్లో చెట్ల పెంపకం ద్వారా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయుటానికి ప్రయత్నిస్తున్నారు.

## భూమికోతను అరికట్టడం

అటవీ విస్తీర్ణం వరదలు మరియు నేల కోతను నియంత్రిస్తుంది. నేలను తమతో పట్టియుంచే సామర్థ్యంతో ఉన్న చెట్ల వేర్లు, నేల కోతను తగ్గించడమే కాకుండా ఉపరితల నీటిప్రవాహాన్ని తగ్గించి, ఇది వరదలు రాకుండా చేస్తుంది. రోడ్ల నిర్మాణానికై యాభై ఏళ్ళకు పైబడి వయసున్న పెద్ద చెట్లు కూడా నరికివేయ బడుతున్నాయి. అందువల్ల చెట్ల పెంపకం తప్పనిసరి అయింది.

ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడం కోసం, మొక్కల సంరక్షణ చేసి వాటిని కాపాడటం కోసస, కార్యక్రమాన్ని పర్యవేక్షించడం కోసం గ్రామస్థాయి హరిత రక్షక కమిటీలు సర్పంచ్ అధ్యక్షతన ఏర్పడినవి. అదే విధంగా జిల్లా మరియు రాష్ట్ర స్థాయి కమిటీలు కూడా ఏర్పడ్డాయి.

SCERT TELANGANA

- మీ పాఠశాలలో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో మీరు ఎలా పాల్గొన్నారు?
- భారీ ఎత్తున ఈ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్ట వలసిన అవసరం ఏమి వచ్చింది?

గంగానదిని ఉదాహరణగా తీసుకుంటే పూర్వ కాలంలో గంగానది, దాని ఉపనదులకూ జన్మస్థలమైన హిమాలయాలలో అడవులు పుష్కలంగా ఉండేవి. ఇటీవలికాలంలో హిమాలయాలలో అడవుల్ని అధికంగా నరికివేయడం వల్ల అక్కడ అడవుల విస్తీర్ణం తగ్గిపోతున్నది. దానిఫలితంగా అధిక వర్షం పడినప్పుడల్లా వర్షపునీరు వేగంగా కిందికి ప్రవహించి వరదవై దానాలు నిండిపోతున్నాయి. నీటి ద్వారా ఒండ్రు కూడా ఎక్కువగా కొట్టుకు వచ్చి నదులు మేట వేస్తున్నాయి. ఫలితంగా తరుచు వరదలు వస్తూ నదీ తీరం వెంట ఆస్తి, ప్రాణ నష్టాన్ని కలిగిస్తున్నాయి.

దీనివల్ల అడవుల రక్షణకున్న ప్రాముఖ్యత, భూమిపైన మొక్కలను పెంచవలసిన అవసరం తెలుపుతుంది.

- వరదల నివారణలో వృక్షసంపద, అడవులు ఎలా సహకరిస్తాయో వివరించండి.
- కరువు (అత్యల్ప వర్షపాతం) ప్రభావాన్ని తగ్గించడంలో అడవులు, వృక్షసంపద, సహాయపడతాయా ఎలా?

**తుఫానులు, వరదల సమయాల్లో ఎదురయ్యే ఇబ్బందులు:**

భారతదేశానికి పొడవైన తీరరేఖ ఉండడంవల్ల వినాశకరమైన తుఫానులు ఎక్కువగా బంగళాఖాతం నుంచి సంభవిస్తాయి. సముద్రం నుండి వీచే గాలులు కొన్ని సందర్భాలలో భూప్రాంతాలకు నష్టం చేస్తాయి. ఎత్తైన సముద్రపు అలలు సముద్రతీర ప్రాంతాలకు భారీ నష్టాన్ని కలిగిస్తాయి. ఈ పరిస్థితులు జూన్-డిసెంబర్ నెలల మధ్యకాలంలో సంభవిస్తాయి. తూర్పు కోస్తాలో భయంకర తుఫాను 1977 నవంబర్‌లో సంభవించినది. 6మీటర్ల ఎత్తున్న సముద్రపు అలలు కోస్తాతీరంలోని కనీసం 100 గ్రామాలను సర్వనాశనం చేసి 9941 మంది ప్రాణాలను బలిగొన్నది. ఆకాశంనుండి చూస్తే ఈ ప్రాంతాలు వరదనీటిలో తేలిఆడుతున్నట్లు కనిపించింది.


తుఫానులు ప్రకృతి సిద్ధమని, వీటిపై మానవ నియంత్రణ లేదని అనిపిస్తుంది. మన సామాజిక నిర్మాణాన్నిబట్టి, సంసిద్ధతను బట్టి ఇటువంటి వైపరీత్యాల ప్రభావం ఎక్కువగానో, తక్కువగానో ఉండవచ్చు. ఉదాహరణకు, తుఫానులు ఎక్కువగా సంభవించే తీరప్రాంతాల్లో నివసించే పేదప్రజలకు వీటిని ఎదుర్కొనే సాధనాలు, సామర్థ్యం తక్కువ. తీరప్రాంతాలలో పేద మత్స్యకారుల గుడిసెలు ఉంటాయి. అలాగే పట్టణాల్లో ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంతాలలో పేద ప్రజల మురికి వాడలు ఉంటాయి. కాంక్రీటు బిల్డింగ్‌లలో నివసించే ప్రజలు అవసరమైన ఆహారం, నీరు కొన్ని రోజులకు సరిపడా నిలవచేసుకోగలుగుతారు. అంటే ఈ వైపరీత్యాలవల్ల పేద ప్రజలు ఎక్కువగా ఇబ్బందులకు గురిఅవుతారు.

వరద తగ్గుముఖం పట్టిన తర్వాత, తాగేనీటి వనరులన్నీ కలుషితమై నీరు తాగడానికి పనికిరాకుండా పోతుంది. కానీ పేదప్రజానీకం తప్పనిసరి పరిస్థితుల్లో ఈ కలుషితనీరు తాగడంతో కలరా, కామెర్లు వంటి అంటురోగాల బారిన పడతారు. కొంతమందికి మాత్రమే శుద్ధిచేసిన మంచినీరు తాగే అవకాశం ఉంటుంది. అధికవర్షాల వల్ల పాడైన రోడ్లను పునరుద్ధరించడం అంత తేలికైన పని కాదు. ఇటువంటి ప్రాంతాలలో ప్రజలు తమను తాము రక్షించుకోడానికి సొంత వనరులపైనే ఆధారపడతారు.

జననష్టం, పంటనష్టం, ఆస్తినష్టం మొదలైనవి తుఫానులవల్ల కలిగే తక్షణ దుష్ఫలితాలు. వీటివల్ల

SCERT TELANGANA

దీర్ఘకాలంలో కలిగే నష్టాలు కూడా ఉన్నాయి. పేదప్రజలు తమ అవసరాల నిమిత్తం గృహాలలో నిలవచేసుకున్న ఆహారపదార్థాలు, వస్తువులు, పశువులు, వాహనాలు, చిన్న చిన్న షాపులు, పడవలు, వలలు మొదలైనవి నాశనం అవుతాయి. వీరు మళ్ళా పనికి వెళ్ళడానికి ఈ పాడైన వస్తువులన్నింటిని కొనుగోలు చేసుకోవాలి. చాలా కుటుంబాలవారు తమ కుటుంబ సభ్యులను కూడా కోల్పోతారు. దినసరి వేతన కార్మికులు వైపరీత్యాలు ఏర్పడిన తరవాత మామూలు వాతావరణం ఏర్పడే వరకు కొన్ని వారాలపాటు ఉపాధిని కోల్పోతారు. రైతులు తమ పంటను కోల్పోవడమేగాకుండా పంటభూమికి ఏర్పడిన నష్టాన్ని కూడా భరించాలి.



చిత్రం-2.6 బంగాళాఖాతంలోని తుపాను

### తుఫానులు, వరదలులాంటి వైపరీత్యాలను ప్రజలు ఏవిధంగా ఎదుర్కోవాలి?

ప్రభుత్వాలు తయారుచేసే దీర్ఘకాలిక ప్రణాళికలతో, ప్రజలు-ప్రభుత్వసంస్థలు కలిసి ఈ వైపరీత్యాలను ఎదుర్కోవాలి. ఈ రోజులలో తుఫానులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలను గురించి ముందుగా ఊహించి చెప్పడం కష్టమేమీ కాదు. వైపరీత్యాలు సంభవించే అవకాశమున్న ప్రాంతాలలో అవసరమైన సంరక్షణాచర్యలు తీసుకోవాలి. ప్రకృతివైపరీత్యాలకు సంబంధించిన విషయాలను, సంరక్షణచర్యలు మొదలయిన అంశాలన్నింటిని ప్రజలకు ప్రభుత్వం ముందుగా తెలియచేస్తోంది.

ప్రజలందరికీ దీర్ఘకాలం రక్షణ ఉండే విధంగా పక్కా ఇళ్ళు నిర్మించాలి. ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుని నిలబడే రోడ్ల నిర్మాణం, ప్రత్యేకించి తీరప్రాంతప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించాలి. ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ఆహార, వైద్య సదుపాయాలు, మంచినీటి సదుపాయాలు, రక్షణ దళాలు సిద్ధంగా ఉంచుకోవాలి.

- **వైపరీత్యాల కోసం ప్రజలను ఏ విధంగా సంసిద్ధపరచాలి?**

1. తుఫానులు, వరదలు కాలానుగుణంగా (seasonal) సంభవిస్తాయి. ఈ కాలంలో టి.వి., రేడియోలు మొదలైన ప్రసారమాధ్యమాలద్వారా లేదా ఇంటింటికి తిరిగి చెప్పి ప్రజలను అప్రమత్తులను చేయాలి.
2. ప్రతీ ఇంట్లో అత్యవసర కిట్ (Emergency Kit) సిద్ధంగా ఉండేటట్లు చూడాలి. ఈ కిట్‌లో కొన్ని ముఖ్యమైన కాగితాలు, ఆహార పదార్థాలు, డబ్బు, అత్యవసర సమయంలో సంప్రదించడానికి ఉపయోగపడే ఫోన్ నెంబర్లు ఉండాలి.
3. తుఫాను సంభవిస్తే వెళ్లడానికి దగ్గరలోని పునరావాస కేంద్రం ఏదో ముందుగానే తెలుసుకోవాలి.
4. అవసరమయితే ఇంటిగోడలు, పైకప్పు, తలుపులు, కిటికీలను దృఢంగా నిర్మించుకోవాలి.
5. తుఫాను హెచ్చరిక తెలిసిన వెంటనే తడవని బ్యాగులో (Water Proof bag) మంచినీరు, ఆహారపదార్థాలు సిద్ధం చేసుకోవాలి.
6. హెచ్చరికలు విన్న తరవాత బయటకు ముఖ్యంగా సముద్రతీర ప్రాంతాలకు వెళ్ళగూడదు.

SCERT, TELANGANA

7. తలుపులు, కిటికీలు మూసేసి ఇంటిలోపలే ఉండాలి.
8. మీ ఇల్లు సురక్షితంకాదని భావిస్తే, దగ్గరలోని పక్కా భవనంలోకి వెళ్లాలి.
9. మీరు వాహనం మీద ఉండగా తుఫాను సంభవిస్తే, వాహనాన్ని ఆపి సముద్రతీరం, చెట్లు, ఎలక్ట్రిక్ స్తంభాలకు దూరంగా ఉండాలి. ప్రచండమయిన గాలికి అవి మీద పడతాయి.
10. తుఫాన్‌గాలి హఠాత్తుగా ఆగిపోయినట్లయితే, అధికార యంత్రాంగం ప్రకటించే వరకు బయటికి రాగూడదు.
11. రేడియో ద్వారా ప్రసారమయ్యే సలహాలను పాటించాలి.
12. తుఫాను ప్రమాదం లేదని తెలిశాక, తిరిగి ఇంటికి వెళ్ళేటప్పుడు దారిలో రోడ్లపైన పడిన చెట్లు, స్తంభాలు వంటి వాటిని జాగ్రత్తగా గమనించుకుంటూ వెళ్ళాలి.
13. కలుగుల నుంచి పాములు బయటకు వచ్చి ఉంటాయి కాబట్టి అప్రమత్తంగా ఉండాలి.
14. వరదనీటిలోకి వెళ్ళగూడదు. అవి బాగా లోతుగా ఉండవచ్చు.
15. విద్యార్థులుగా మీరందరూ పైన పేర్కొన్న ముందు జాగ్రత్త చర్యలను వ్యాప్తి చేయడంలో, వీటిపట్ల ప్రజలను చైతన్యపరచడంలో ముఖ్యపాత్ర వహించాలి.

◆ **ప్రకృతి వైపరీత్యాలు – ఇంటిని ఖాళీ చేయాల్సి వస్తే:**

1. బట్టలు, అవసరమైన మందులు, విలువైన వస్తువులు, పత్రాలు మొదలైనవి తడికి తట్టుకునే బ్యాగులో (waterproof) ఉంచి సురక్షిత ప్రాంతానికి వెళ్ళాలి.
2. వంటసామగ్రి, స్టీలు, ఇత్తడి వస్తువులు, వస్త్రాలు, ఫర్నిచర్ మొదలైనవాటిని మంచంపైన ఉంచాలి.
3. విద్యుత్తు సరఫరాను నిలుపుదలచేయాలి (Turn off power).
4. మీరు ఇంటిలో ఉన్నా, బయటకు వెళ్ళినా టాయిలెట్ పైభాగాన్ని ఇసుకబస్తాలతో మూయాలి. మురుగునీరు వెనుకకు రాకుండా డ్రైనేజి రంధ్రాలను మూసివేయాలి.
5. ఇంటికి తాళం వేయాలి. సురక్షిత ప్రదేశానికి వెళ్ళే మార్గాన్ని కనుక్కోవాలి.
6. లోతు, వేగం తెలియని ప్రవాహాలలోకి దిగకూడదు.

◆ **వరద సమయంలో:**

1. మరిగించిన (Boiled) నీటిని తాగాలి.
2. ఆహార పదార్థాలపైన మూతలు ఉంచాలి. భోజనం మితంగా చేయాలి.
3. డయేరియా ప్రబలినప్పుడు టీ–డికాషను (raw-tea), గంజి, లేతకొబ్బరి నీరు మొదలైనవి తీసుకోవడం మంచిది.
4. పిల్లలను ఖాళీకడుపుతో ఉండనివ్వగూడదు.
5. వ్యాధులు వ్యాప్తిచెందకుండా చుట్టుపక్కల బ్లీచింగ్ పౌడర్ మరియు సున్నంను చల్లాలి.
6. వరదనీటిలోకి వెళ్ళగూడదు. ఒకవేళ వెళ్ళదలిస్తే లోతు ఎంతుందో ఒక కర్రతో అంచనావేసి మోకాళ్ళలోతువరకు మాత్రమే వెళ్ళాలి.
7. వరదనీటిలో తడిచిన ఆహార పదార్థాలను తీసుకోగూడదు.
8. గ్రామీణ ప్రాంతాలలో నీటిని మరిగించి తాగాలి. నీటిని శుద్ధిచేయడానికి హాలోజెన్ బిళ్ళలు (Halogen Tablets) ఉపయోగించాలి (వీటి గురించి మీ గ్రామ ఆరోగ్య కార్యకర్తను అడగండి).
9. వరదల సమయంలో పాముకాట్లు సాధారణం. కాబట్టి పాముల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

**కీలకపదాలు :**

నదులు, ఉపనదులు    ద్రవీభవనం    వార్షిక వర్షపాతం    వరదమైదానాలు

SCERT, TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) నీరు, నీటి ఆవిరిగా ఎలా మారుతుంది? నీటి ఆవిరినుండి మేఘాలెలా ఏర్పడతాయో తెలపండి.

2) బాష్పీభవనం, మేఘాలు ఏర్పడటం ఎక్కువగా ఎక్కడ జరుగుతాయి?

3) మేఘాలు సముద్రం నుంచి దూరంగా ఉన్న భూభాగాన్ని ఎలా చేరతాయి?

4) ఎక్కడ అధిక వర్షాలు కురుస్తాయి? సరియైనదాన్ని ఎన్నుకోండి :

   ఎ) పవన దిశలో ఉన్న సముద్ర తీరప్రాంతం.

   బి) పవన దిశలో ఉన్న పర్వత ప్రాంతం.

   సి) సముద్రానికి దూరంగా ఉన్న భూభాగం.

P6P4X8

5) గోదావరి నది పడమటి నుండి తూర్పుకు ప్రవహిస్తుంది. ఎందుకు?

6) జలచక్రం ప్రధాన దశలను వివరించండి.

7) మీ గ్రామం లేదా పట్టణం సమీపంలో సెలయేర్లు లేదా నదులు ఉండి ఉంటాయి. వాటిని గురించి తెలుసుకొని ఈ కింది పట్టికను నింపండి.

| క్రమ సంఖ్య | పేరు | నదుల జన్మస్థానం | కలుస్తున్న నదిపేరు | కలిసే సముద్రం |
|---|---|---|---|---|
| | | | | |

8) మీ ప్రాంతంలోని నదులలో/వాగులలో సంవత్సరమంతటా నీరు ఉంటుందా? వాటిలో గతంలో ఎక్కువ నీరు ఉండేదా? మీ పెద్దలను అడిగి తెలుసుకోండి.

9) వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు ప్రజలను ఏవిధంగా సంసిద్ధపరచాలి?

10) తుఫాను, వరదల చిత్రాలను సేకరించి, ఆల్బం తయారు చేయండి.

11) వరద బీభత్సాన్ని చూపే పోస్టరు తయారు చేయండి.

### ప్రాజెక్ట్ పని :

మీ గ్రామంలో/ప్రాంతంలో నీరు వృథా చేయబడుతున్న ప్రాంతాలను పరిశీలించి, వివరాలను పట్టికలో పొందుపరచి, కారణాలను చర్చించి, నీటిని ఎలా పొదుపు చేయవచ్చో మార్గాలను సూచించండి.

| క్రమ. సంఖ్య | నీరు వృథా అవుతున్న ప్రాంతం | కారణం | అరికట్టే/పొదుపు చేసే మార్గాలు |
|---|---|---|---|
| | | | |

SCERT TELANGANA

పాఠం 3

# చెరువులు, భూగర్భజలాలు

Y3D4B7

## మొదటిభాగం


### చెరువులు:

వేల సంవత్సరాలనుండి మన పూర్వీకులు భూమిమీద ప్రవహించే నీటిని నిలువ చేయడానికి చెరువులను తవ్వించారు. బృహత్ *శిలా యుగం* లోనే చెరువులను నిర్మించి, నిల్వచేసిన నీటిని వ్యవసాయానికి ఉపయోగించారనే ఆధారాలు మనకు అనేకం ఉన్నాయి. తెలంగాణలో వేలాది చెరువులను కాకతీయులు నిర్మించిన విషయాన్ని మీరు చదివే ఉంటారు. వ్యవసాయాన్ని ఈ ప్రాంతంలో విస్తరింపజేయటానికి ఈ చెరువుల నిర్మాణం దోహదపడింది. ఈ నాటికీ ఈ ప్రాంతాలలోని అనేక గ్రామాలలో కనీసం ఒకటో, రెండో పెద్ద చెరువులున్నాయి.

### చెరువులను ఎలా నిర్మించారు?

చెరువులను సాధారణంగా వాలుగా ప్రవహిస్తున్న వాగులకు అడ్డంగా రాళ్లు, మట్టితో గోడ కట్టి నిర్మిస్తారు. గట్టిగా కట్టిన ఆ గోడకు ఒకవైపున నీరు నిలవ ఉండి, చెరువులు, కుంటలు ఏర్పడతాయి. కిందిపటాన్ని చూడండి.

ఈ చెరువులను ఒక్కొక్కప్పుడు రాజులుగాని, సైన్యాధ్యక్షులుగాని, నాయకులుగాని నిర్మించేవారు. కాని ఎక్కువ సందర్భాలలో ఆ గ్రామప్రజలే స్వయంగా నిర్మించుకున్నారు. అలా చెరువుల నిర్మాణం చేసినవారిని, కథలద్వారాగాని, దేవాలయాలవద్దగాని, పండగల సందర్భంలోగాని ఆ గ్రామప్రజలు నిత్యం స్మరిస్తూ ఉంటారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ శ్రమచేసి, ఖర్చులను భరించి చెరువు కట్టలకు అవసరమైన మరమ్మతులు చేస్తూ అందరూ కలిసి ఆ చెరువులను కాపాడుకుంటారు. చెరువులో పూడికను తొలగించుకుంటారు. చెరువులోకి వచ్చే నీటిని ఎవరూ పక్కకు మళ్ళించకుండా, నిలుపుదల చేయకుండా, మలినం చేయకుండా జాగ్రత్తపడతారు. చెరువులోని నీరు సక్రమ వినియోగానికి 'నీరు కట్టే మనిషి' అని ఒక మనిషిని ప్రత్యేకంగా నియమించుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో ఇతన్ని 'నీరటి' అని అంటారు.



*చిత్రం-3.1ఎ చెరువు నిర్మాణం- సాగుభూములు*

SCERT, TELANGANA

**చెరువులు ఎలా అవసరమవుతాయి?**

చెరువులు ప్రజల నీటి అవసరాలను తీర్చడం, పశువుల దాహాన్ని తీర్చటమేకాక తీవ్రమయిన కరువు పరిస్థితులలో కూడా ఏదో ఒక పంటను కొంతమేరకు పండించుకోడానికి సహాయపడతాయి. దగ్గరిలోని బావులలో నీటిమట్టం పెరగడానికి ఉపయోగపడతాయి.

వానలు తగ్గి చెరువులు ఎండినప్పుడు ఆ చెరువు లోతట్టు భూమిలో కొన్ని పంటలు పండిస్తారు.

చెరువుల వల్ల చాలా ముఖ్యమైన ఉపయోగం నీటి ప్రవాహాన్ని అదుపు చేయటం, భూమికోతను నివారించటం. ప్రతి సంవత్సరం చెరువులోని పూడిక మట్టిని పంటపొలాలకు ఎరువుగా వేస్తారు. ఆ విధంగా భూమిని సారవంతమైనదిగా చేస్తారు.

చెరువు ఏ ఒక్కరి సొంతంకాదనీ, అది గ్రామస్థులందరి ఉమ్మడి ఆస్తి అని గుర్తించాలి. చెరువులు ఏ ఒక్కరికో, ఇద్దరికో కాకుండా గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడతాయి.

**ఈ రోజుల్లో కనుమరుగవుతున్న చెరువులు:**

గత ఇరవై, ముప్పై సంవత్సరాల నుండి చెరువులను నిర్లక్ష్యం చేయడంవల్ల అవి ఎక్కడికక్కడ తెగిపోతున్నాయి. చెరువులలో పూడిక తీయడంలేదు, మరమ్మతులు సక్రమంగా జరగడంలేదు. ప్రజలుకూడా క్రమేణా చెరువుభూమిని ఇండ్ల నిర్మాణానికో, వ్యవసాయానికో ఉపయోగించడం ప్రారంభించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలల్లోని చెరువులూ ఎండిపోయి వాటిని పట్టించుకొనేవారే కరువైయ్యారు. చెరువులను కాపాడుకోటానికి బదులు కొందరు లక్షలాదిరూపాయలు ఖర్చుచేసి, చాలా లోతైన బోరుబావులను తవ్వుతున్నారు. కానీ ఆ బోరు బావులు కొంతమందికే ఉపయోగ-పడుతున్నాయి. అవి రానున్న రోజులలో నీటి కొరతకు కారణమవుతాయి. చెరువులైతే నీటి వనరులుగా నిలుస్తాయి. ఇప్పుడు చెరువుల మీద ఆధారపడిన మత్స్యకారుల జీవన విధానం గురించి తెలుసుకుందామా!

**ప్రాజెక్టు పని:**

మీ ప్రాంతంలోని చెరువును పరిశీలించి దాన్ని గురించి ఒక నివేదిక తయారుచేయండి:

- చెరువు, దాని పరిసరాల నమూనా పటం తయారుచేయండి.
- ఆ చెరువుకు నీరు ఎక్కడినుంచి వస్తుందో, ఎక్కువైన నీరు ఎక్కడికి పోతుందో కనుక్కోండి.
- ఆ చెరువును ఏ వాగు దగ్గర, నది దగ్గర నిర్మించారో, అది ఏ కొండ సమీపంలో ఉందో వాటి పేర్లను తెలుసుకోండి.
- ఆ చెరువు కట్టను దేనితో కట్టారో, ఇప్పుడు దాన్ని ఎవరు సంరక్షిస్తున్నారో కనుక్కోండి.
- ఆ చెరువును ఎవరు, ఎప్పుడు తవ్వించారో కనుక్కోండి.
- ఆ చెరువును గురించి ఏమైనా కథలు ఉంటే రాయండి.
- చెరువు ఫోటోలను సేకరించండి, ఆ చెరువుకు సంబంధించిన ఇతర విషయాలను, వివరణలను సేకరించండి.
- ఆ చెరువు నీటితో ఏ పంటలు పండిస్తారో, ఆ నీటియాజమాన్యం ఎవరి అధీనంలో ఉందో, ఆ నీటిని ఎలా సక్రమంగా ఉపయోగిస్తున్నారో తెలుసుకొని నమోదు చేయండి.

*చిత్రం-3.1బి రామప్ప చెరువు, జయశంకర్ జిల్లా*



SCERT, TELANGANA

**మిషన్ కాకతీయ (మన ఊరు-మన చెరువు)**

తెలంగాణ నూతన రాష్ట్రంగా ఆవిర్భవించిన అనంతరం, రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని చిన్న నీటి పారుదల చెరువుల అభివృద్ధి కోసం ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమం పేరే "మిషన్ కాకతీయ : మన ఊరు-మనచెరువు". రాష్ట్రంలోని 47,000 చెరువులలో పూడిక తీయడం, మరమ్మత్తులు చేపట్టడం మరియు చెరువు కట్టల నిర్మాణాలను చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలు.

ఈ కార్యక్రమం అమలు మీ ప్రాంతంలో ఏవిధంగా ఉందో తెలుసుకోండి. ఎన్ని చెరువుల అభివృద్ధి జరిగింది? ప్రజలకేమైనా లబ్ధి చేకూరిందా?

## చెరువులు-చేపలు పట్టడం

చెరువులు మనకు త్రాగునీరు మరియు సాగునీరును అందివ్వడమే కాకుండా ఎంతో మంది మత్స్యకారులకు జీవనాధారంగా కూడా ఉపయోగపడుతున్నాయి. సాంప్రదాయ బద్ధంగా చేపలను పట్టే కుటుంబాలైన బెస్త (గంగపుత్ర), గూండ్ల మరియు ముదిరాజ్ (తెనుగు) తెగలకు చెందిన ప్రజలు తమ జీవనాధారానికై ఈ చెరువులు మరియు నదులపైననే ఆధారపడి జీవిస్తున్నారు. వారి జీవితాలకు చెందిన మరిన్ని విషయాలను తెలుసుకో-వడానికి సూర్యాపేట జిల్లాలోని ఒక గ్రామానికి వెళ్దాం పదండి!

**బేతవోలు గ్రామం**

ఈ గ్రామం సూర్యాపేటకు దగ్గరలో ఉన్న కోదాడకు 16 కిలోమీటర్ల దూరంలో ఉంది.



*చిత్రం-3.1(సి) వీరళదేవి చెరువు*



*చిత్రం-3.1 (డి) కట్టమైసమ్మ దేవత*

గ్రామ పెద్దల కథనం ప్రకారం కాకతీయుల సామంత రాజైన బేతాళరెడ్డి పేరు మీదుగా ఈ గ్రామానికి బేతవోలు అనే పేరు వచ్చింది. ఇతడు తన భార్య "వీరళదేవి" పేరు మీదుగా ఈ గ్రామంలో ఒక పెద్ద చెరువును తవ్వించాడు. అందుకే గ్రామస్తులు ఈ చెరువును వీరళదేవి చెరువు లేదా ఈర్లదేవి చెరువు అని పిలుస్తారు. దీనిని 3000 ఎకరాల భూమికి సాగు నీరు అందివ్వడానికి త్రవ్వించినప్పటికీ, నేడు 1900 ఎకరాల భూమికి మాత్రమే సాగునీరును అందిస్తుంది. చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురికావడం, చెరువులో పూడిక పేరుకొని పోవడం వల్ల ఆయకట్టు ప్రాంతం చాలా తగ్గిపోయింది. చెరువు కట్టమీద కట్టమైసమ్మ, గంగమ్మ దేవతల గుడులున్నాయి. ఈ దేవతలు చెరువుకు రక్షణగా ఉంటారని గ్రామస్తుల నమ్మకం. చేపల వేటకు వెళ్లేముందు చేపలు పట్టేవారు మరియు ఇతర గ్రామస్తులు ఈ దేవతలకు పూజలను

SCERT, TELANGANA



చిత్రం-3.1(ఇ) విసిరేవల



చిత్రం-3.1 (ఎఫ్) కచ్చువలతో చేపలు పట్టడం

నిర్వహిస్తారు. ప్రతీ సంవత్సరం పెద్ద పండుగను కూడా నిర్వహిస్తారు.

బేతవోలు గ్రామంలో బెస్త (గంగపుత్ర) మరియు ముదిరాజ్ తెగలకు చెందిన 600 కుటుంబాలు నివాసముంటున్నాయి. వీరిలో కేవలం 60 నుండి 70 కుటుంబాలు మాత్రమే చేపలుపట్టడాన్ని జీవనాధారంగా చేసుకున్నాయి. సాధారణంగా వీరు మార్చి, ఏప్రిల్ నెలల్లోనే చేపలు పడతారు. మిగతా నెలల్లో సన్నకారు రైతులుగా లేదా కూలీలుగా పనులు చేస్తారు.

## చెరువులు - చేపలు

గతంలో ఈ చెరువులో వివిధ రకాలైన చేపలు బుడ్డపరకలు, జెల్లలు, కొడిపెలు, చందమామలు, కుంటుముక్కలు, పులిశలు, ఇసుకదొందులు, పాపెరలు, గండ్రపరకలు, గురియపిల్లలు, కొరమీనులు, వాలుగలు మొదలైనవి లభించేవి. కానీ, ఈ మధ్యకాలంలో ఈ రకమైన చేపలు అంతరించిపోతున్నాయి. వ్యవసాయ భూముల్లో అధికంగా వాడుతున్న క్రిమిసంహారక మందులు మరియు రసాయనిక ఎరువుల కారణంగా ఈ చేపలు కనుమరుగవుతున్నాయి. నేడు కృత్రిమ చేపల పెంపకం కేంద్రాలలో చేప పిల్లల సీడ్స్‌ను ఉత్పత్తి చేసి, చెరువుల్లో వదిలి పెంచుతున్నారు. పెద్దవైన తరువాత వాటిని పట్టి అమ్ముతున్నారు. ఇలాంటి చేపల్లో ముఖ్యమైనవి మెరిగె, రవ్వు, బొచ్చె(కట్ల) మరియు బంగారుతీగ రకాలుగా చెప్పుకోవచ్చు. ఈ రకం చేపలే నేడు మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి. ప్రతీ చేప ఒక ప్రత్యేక రుచిని కలిగి ఉంటుంది. మీరు ఎప్పుడైనా ఇలాంటి చేపల రుచిని చూశారా?

- కొన్ని రకాల చేపలనే మనం ఎందుకు తింటున్నాం?
- క్యాట్ ఫిష్‌ని ఎందుకు నిషేధించారు?

**వలలు - రకాలు**

చెరువులోని చేపల పరిమాణాన్ని (సైజ్) బట్టి వలలు ఉపయోగిస్తారు. చిన్న పరిషకు (సన్నపువల) 30కన్నులు ఉంటాయి. పెద్ద పరిషకు (దొడ్డువల) 60 కన్నులుంటాయి. వీటినే సన్నపువల, దొడ్డువలలని కూడా కొన్ని ప్రాంతాలలో పిలుస్తారు. వలలకు ఇనుము లేదా సీసంతో చేసిన పూసలు ఉంటాయి. సన్నపు వల బరువు తక్కువగా ఉంటుంది. సన్నవలతో చిన్న చిన్న చేపలు రొయ్యలు పడుతారు. 100 గ్రా. నుండి 5 కిలోల వరకు బరువు ఉన్న చేపలను పట్టడానికి దొడ్డువల వాడుతారు. దొడ్డువల బరువు ఎక్కువగా ఉంటుంది. ఎందుకో ఆలోచించండి. సన్నపువల, దొడ్డువలల తయారికి వాడే దారం (నూలు) వేరు వేరుగా ఉంటుంది. ఎందుకో ఆలోచించండి....

- మీ ప్రాంతంలోని మత్స్యకారుల ఇండ్లను సందర్శించి, చేపలు పట్టే విధానం గురించి తెలుసుకొండి.
- మీ ప్రాంతంలో ఎలాంటి వలలు వాడుతున్నారో గుర్తించండి. తరగతి గదిలో చర్చించండి.

చేపలు పట్టేవారు చేపలు పట్టడానికి రెండు రకాల పద్ధతులను వాడుతారు. నీళ్ళు తక్కువగా ఉన్నప్పుడు ఒక రకం, నీటిలోతు ఎక్కువగా ఉన్నప్పుడు మరొక రకం. చెరువులో నీళ్ళు తక్కువగా ఉన్నప్పుడు విసిరే వలలను వాడతారు. కచ్చువల చాల తేలికగా ఉండి చాలా దూరం

SCERT, TELANGANA

వరకు నిలకడగా ఉండే నీటిలో తెప్పలపై వెళ్ళి పరచి వస్తారు. లోతైన ప్రాంతాలలో చేతి వలను విసిరి పట్టుకోలేని సంధర్భాలలో ఎక్కువగా వీటిని ఉపయోగిస్తారు.

- నీటి లోతును బట్టి వలలను ఎందుకు ఎంచుకుంటారో చర్చించండి.

## చేపలు పట్టడం

చేపలు పట్టడాన్ని ఉదయాన్నే ప్రారంభిస్తారు. కొంత మంది తక్కువ లోతు గల నీళ్లలో విసిరే వలతో చేపలు పడతారు. మరి కొంత మంది థర్మాకోల్‌తో తయారు చేసిన తెప్పలపై నీటిలో ప్రయాణిస్తు బాగా లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్ళి కచ్చువల(బెండ్లు ఉండే వలను) వేసి చేపలు పడతారు. రోజుకు రెండు సార్లు చేపల వేటకు వెళ్తారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుండి ఎనిమిది గంటల వరకు చేపలు పట్టి మార్కెటుకు తీసుకుపోతారు. తిరిగి మధ్యాహ్నం ఒంటిగంట నుండి నాలుగు గంటల వరకు చేపలు పట్టి మార్కెటుకు తీసుకొని వెళతారు. వీరు చలి, వాన ఎండలను లెక్క చేయకుండ వేటకు దిగుతారు. మార్కెటులో అమ్మగా మిగిలిన చేపలను శుభ్రంగా కడిగి ఎండబెట్టి ఎండుచేపలు తయారు చేస్తారు. చేపలు తక్కువగా లభించినపుడు కొదాడ, సూర్యాపేట పట్టణాలకు తీసుకుపోతారు. చేపలు ఎక్కువగా లభించినపుడు హైదరాబాదు లాంటి పట్టణాలకు తీసుకొనిపోతారు. సాధారణంగా మగవాళ్ళు చేపలు పడితే, ఆడవాళ్ళు మార్కెట్‌లో అమ్ముతారు చిత్రం 3.1 (జి).

## మత్స్యకారుల సహకార పరపతి సంఘం

చెరువులలో చేపలు పట్టడానికి పరపతి సంఘంలో సభ్యత్వం ఉండాలి. దీనిలో సభ్యత్వం చెరువు కింద ఉన్న అయకట్టు విస్తీర్ణం ఆధారంగా నిర్ణయిస్తారు. ఒక హెక్టారు (రెండున్నర ఎకరాలు)కు ఒకరు సభ్యులుగా ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ పరపతి సంఘంలో 339 మంది సభ్యులున్నారు. ఈ సంఘం చెరువులను ఉపయోగించు-కున్నందుకు మత్స్యశాఖ వారికి 2,35,000 రూపాయలు చెల్లించడం జరుగుతుంది. సంఘమే చేప పిల్లలను కొని చెరువుల్లో వదులుతుంది. వీటి సంరక్షణను కూడా సంఘమే



*చిత్రం-3.1 (జి) చేపలు అమ్మడం*

చూసుకొని వచ్చిన లాభాలను సభ్యులందరికి సమానంగా పంచుతుంది.

- మీ గ్రామంలోని పరపతి సంఘాల సభ్యులను కలిసి వాటి పనితీరును తెలుసుకోండి.
- చేపలు పట్టేవారు మత్స్యశాఖకు పన్నులు ఎందుకు చెల్లిస్తారని మీరు భావిస్తున్నారు?

ఇటీవల కాలంలో చాలా చేపల చెరువుల్లో ఒక కొత్త విధానం అమలౌతుంది. చేపలు పట్టేవారు చాలా పేదవారైనందున వారి కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తుంది. చేపల కేంద్రం నుండి చేప పిల్లల సీడ్స్‌ను కొనే ఆర్థిక స్తోమత వారికి లేనందువల్ల వ్యాపారస్తుల నుండి ఋణాలు తీసుకుంటున్నారు. ఈ వ్యాపారస్తులే చేప పిల్లల సీడ్స్‌ను చెరువుల్లో వదిలి అవి పెరిగిన తరువాత వారే కొంటున్నారు. ఇక్కడ చేపల ధరలను వ్యాపారస్తుడే నిర్ణయిస్తారు. అది అసలు ధరలో 10 నుండి 20 శాతం మాత్రమే ఉంటుంది. ఈ విధంగా వ్యాపారస్తులు అత్యధిక లాభాలను ఆర్జిస్తున్నారు. మత్స్యకారుల సహకార సంఘాలకు బ్యాంకులు ఋణాలను మంజూరు చేసి ఆదుకో గలిగితే చేపలు పట్టేవారు వ్యాపార కాంట్రాక్టర్ల నుండి స్వతంత్రులవుతారు.

- చేపలు పట్టేవారికి ఋణాలు అందివ్వడంలో బ్యాంకులు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మీరు భావిస్తున్నారా? ఎందుకు?

SCERT, TELANGANA

## రెండవభాగం


**భూగర్భజలాలు:**

వాననీరు వాగులు, వంకలలోకి, నదులలోకి ప్రవహించటమే కాకుండా, మట్టిలోకి కూడా క్రమేణా ఇంకిపోతుంది. ఇలా ఇంకిపోయిన నీరు భూమిలోని ఇసుక, రాళ్లు, రాతిపొరల మధ్యకు చేరుతుంది. ఈ నీటినే భూగర్భజలాలు అంటారు. ఈ నీటినే మనం బావులు, గొట్టపు బావుల ద్వారా వెలికి తీస్తున్నాం.

పగుళ్లు, సన్నని రంధ్రాలు ఉండి నీటితో కూడి ఉన్న రాతిపొరను మృదువైన రాతిపొర అంటారు. ఈ పొరలోకి నీరు చేరుతుంది. ఇలాంటి ఇసుక రాతిపొరలు తెలంగాణలో కొన్ని ప్రాంతాలలో ఉన్నాయి. కొన్ని గ్రానైట్, కడప సున్నపు రాతిపొరలు వంటివి రంధ్రాలు లేక గట్టిగా ఉంటాయి. వీటిలోకి నీరు చేరదు. భూగర్భజలాలు అటువంటి రాయిపైభాగాన నిలిచి ఉంటాయి. ఎందుకంటే ఆ రాయి అడుగున నీరు చేరదు. వీటిని నీరు చేరని గట్టిరాతిపొర అంటారు. తెలంగాణ రాష్ట్రంలో ఎక్కువ భాగం ఇలాంటి గట్టిరాతి పొరలే ఉన్నాయి. రాష్ట్రంలోని నదుల పక్కనగల కొన్ని ప్రాంతాల్లో ఇసుక, రాళ్లు, మట్టితో కూడిన భూమి పొరలు వున్నాయి. ఈ భూమి పొరలలో కూడా నీరు చేరుతుంది.

భూమిలోని రాతిపొరల మధ్య చేరిన నీటి పొరను జలస్తరం (aquifer) అంటారు. ఈ నీటిపొర మందం ఆ ప్రాంతంలో లభించే భూగర్భజలాల లభ్యతను నిర్ధారిస్తుంది.

మీ ప్రాంతంలోని బావులను పరిశీలించి ఎన్ని అడుగుల లోతులో భూగర్భజలాలు వున్నాయో తెలుసుకోండి. అడుగున ఏమైనా రాతి పొర ఉందా? వుంటే అది ఏరకమైన రాతి పొరనో తెలుసుకోండి. ఆ బావి యజమాని ఎవరు? దాన్ని ఎప్పుడు తవ్వారు? దాన్ని తవ్వి, ఉపయోగించడానికి ఎంత ఖర్చుయింది, మొదలైన విషయాలను కూడా తెలుసుకోండి. ఈ సమగ్ర సమాచారంతో "మా గ్రామంలో / పట్టణంలో బావి" అనే ఒక నివేదిక తయారుచేయండి.




*చిత్రం-3.2 భూమి మట్టానికి దిగువన రాళ్లు, నీరు*

- నీరు ఇంకిపోవడానికి వీలులేని శిలలు లేకపోతే భూగర్భజలాలు ఉంటాయని భావిస్తున్నారా?
- ఈ నీరు ఇంకిపోవడానికి వీలులేని శిలల అడుగున రంధ్రాలు గల మృదువైన శిలలు ఉంటే ఏమౌతుంది? భూగర్భజలాలు ఎక్కడికి చేరతాయి?

SCERT, TELANGANA

## నీటిమట్టం లేదా భూగర్భజల మట్టం:

3.3వ చిత్రంలోని బావులు అన్నింటిలో భూగర్భజలాలు ఒకే మట్టంలో ఉన్న విషయాన్ని పరిశీలించండి. ఇది వానలు కురిసిన తరవాత నీటి మట్టం. ఈ బావులన్నింటిలో 5 మీటర్ల లోతులో నీరున్న విషయాన్ని గమనించండి. అంటే అదే ప్రాంతంలో కొత్త బావిని తవ్వితే ఆ 5 మీటర్ల లోతులోనే నీరు పడే వీలుఉంటుంది. దీన్నే భూగర్భజల మట్టం లేదా వాటర్ టేబుల్ అంటారు.


భూగర్భజలాల మట్టాలు వానాకాలంలో పైకి, వర్షాలులేని ఎండాకాలంలో అడుగుకు పోతాయి, స్థిరంగా ఉండవు.

3.3వ చిత్రం చూసి కింది ప్రశ్నలకు సమాధానం చెప్పండి:

i. భూమిమట్టానికంటే భూగర్భజలాల మట్టం _______ మీటర్ల కిందికి ఉంది.

ii. వేసవికాలంలో భూమిమట్టానికంటే 10 మీటర్ల కిందికి భూగర్భజలాలు పోతే ఈ నాలుగింటిలో ఏ బావులు ఎండిపోతాయి?

iii. ఏ బావిలో ఎక్కువ నీరు లభిస్తుంది?




*చిత్రం-3.3 భూగర్భజల మట్టం*


## తెలంగాణలోని శిలలు - భూగర్భజలాలు:

తెలంగాణలోని భూమిలోపల పొరలలో ఎక్కువ భాగం గట్టిగా, నీరు పీల్చని గ్రానైట్ పొరలతో ఉంది. కాని ఈ పొరల పైభాగంలో (సుమారు 20 మీటర్లు) పగుళ్లు ఉండి అక్కడ నీరు చేరి ఉంది. వీటిలో చాలా రాతిపొరలు 50 నుండి 100 మీటర్ల వరకు పగుళ్లు ఉంటాయి. ఈ పగుళ్లలో కూడా నీరు చేరి ఉంటుంది. సాధారణంగా మనం తవ్వే బావులు పై పొరలలోని నీటిని పొందటానికే ఉపయోగపడతాయి. కాని యంత్రాల సహాయంతో తవ్వే గొట్టపు బావులు లోతైన పగుళ్ల వరకూ పోయి అక్కడ చేరిన నీటిని వెలికి తీయటానికి సహాయపడతాయి.

చిత్రం-3.4 ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలివ్వండి:

- కఠినమైన రాతిపొర అడుగునగల రాతి పగుళ్ళలోకి నీరు ఎలా చేరిందో కనుక్కోండి.
- వేసవికాలంలో ఏ బావి ముందుగా ఎండిపోతుంది? కారణాలు తెలపండి.
- రాతిలో పగుళ్లు లేకపోయినా ఆ రాతిపొరలో తవ్విన బావిలో నీరు ఉంటుందా?

SCERT, TELANGANA




*చిత్రం-3.4 భూమి మట్టం దిగువన రాళ్ళు, నీరు*

తెలంగాణలోని చాలా మండలాల్లో రాతిపొరలు ఎక్కువగా గ్రానైట్ పొరలు కావు. ఇలాంటి శిలల క్రింద భూగర్భ జలాలు తక్కువగా ఉంటాయి. కాని కడప రకానికి చెందిన సున్నపురాతి పొరలు కొన్ని చోట్ల ఉన్నాయి. ఇవి కూడా కఠినమైనవే కాని వాటికి పగుళ్ళు ఉంటాయి. కాబట్టి వాటిలో నీరు నిలువ ఉండేందుకు వీలుంది. ఈ పగుళ్ళలో కొన్ని ప్రాంతాలలో భూగర్భ జలాలు లభిస్తున్నాయి.

కృష్ణా, గోదావరి వంటి మహానదుల పరీవాహక ప్రాంతంలో మందమైన ఇసుక, ఒండ్రుమట్టి పొరలు ఉన్నాయి. ఇక్కడ నీటి మట్టం నదిలోని నీటిపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రాంతంలో సాధారణంగా భూమట్టానికి 5 నుండి 7 మీటర్ల లోతులో పుష్కలంగా నీరు లభిస్తుంది. అందుకే ఇక్కడ బావులు తవ్వటం చాలా సులభం.

- మీరు 6వ తరగతిలో చదివిన పెనమకూరు, డోకూర్, పెనుగోలు గ్రామాల్లోని బావులను, బోరుబావులను గుర్తుకు తెచ్చుకోండి.

**భూగర్భజలాలను తిరిగి నింపడం:**

రాళ్ళు, చెట్లు, గడ్డిలేని భూమిపై నీరు వేగంగా ప్రవహించి వాగులలో, వంకలలో కలుస్తుంది. అక్కడి నుండి నదులకు చేరుతుంది. కాని వాననీటి ప్రవాహాన్ని మొక్కలపెంపకం ద్వారానో, ఆనకట్టల ద్వారానో నిలుపుచేస్తే, ఆ నీరు భూమిలోకి ఇంకిపోయి భూగర్భజలాల్లో కలిసే అవకాశం ఉంది. కొండవాలులమీద గడ్డి పెంచి కట్టలు కట్టి, ఎక్కువ కాలంపెంచి నీటిని నిలవచేస్తారు. ఈ విధంగా చేయడంవల్ల భూగర్భజలాలను తిరిగి పొందడానికి వీలుంటుంది.

కాని మన రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భూమిలో చేరుతున్న నీటికంటే ఎక్కువ నీటిని తోడుతున్నాం. అంటే మనం భూగర్భ జలాలను అక్కడ చేరుతున్న నీటికంటే ఎక్కువగా వాడుతున్నాం. అడవులను నరకడంవల్ల కూడా భూమిలోకి ఇంకే నీటి పరిమాణం తగ్గుతుంది. అందువల్ల నీటిమట్టం వేగంగా పడిపోయి ప్రతి సంవత్సరం అరమీటరునుండి రెండు మీటర్ల వరకు నీటిమట్టాలు దిగువకు పడిపోతున్నాయి.

SCERT TELANGANA

ఇలా మనం ప్రతిసారీ భూమిలో చేరే నీటికంటే ఎక్కువ నీటిని తోడుతుంటే కొంతకాలానికి మొత్తం భూగర్భజలాలు తగ్గిపోతాయి, చివరకు భూగర్భజలాలు అడుగంటి, పూర్తిగా లేకుండాపోతాయి. గత కొన్ని సంవత్సరాలుగా జరుగుతున్నదిదే.

- భూగర్భజలాలు వృథాకాకుండా తక్కువ వాడడానికి గల మార్గాలను గురించి ఆలోచించండి.

దేశంలోని మన ప్రాంతంలో కేవలం మూడు నాలుగు నెలలు మాత్రమే వానలు కురుస్తున్నాయి. మిగతానెలల్లో మనం భూగర్భ జలాలపైనే ఆధార పడుతున్నాం. నదులు, బావులు, కుంటలు అన్నీ కూడా ఈ భూగర్భ జలాలకు దోహదపడుతున్నాయి.

భూగర్భజలాలు పెరగడానికి మనం సహాయ-పడగలమా? భూమిపై చెట్లు, చేమ, రాయి రప్ప లేకుంటే వాననీరు వేగంగా ప్రవహించటాన్ని మీరు గమనించే ఉంటారు. అడ్డంకులేమీ లేనందువల్ల నీరు సరాసరిగా వాగులు, వంకల ద్వారా ప్రవహించి నదులలో కలుస్తుంది. మొక్కల పెంపకంతో, చెట్లతో, ఆనకట్టలతో, గడ్డిని పెంచటంతో నీటివేగాన్ని తగ్గిస్తే నీరు భూమిలోకి ఇంకి, భూగర్భజలాలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల భూగర్భజలాలను పెంచుకోవడానికి గడ్డి, చెట్లను పెంచడం మరియు ఆనకట్టల నిర్మాణాన్ని చేపట్టడం చేస్తున్నారు.

ఈ పద్ధతులద్వారా నీటి నిలవను పెంచే ప్రయత్నాలు గతకొన్ని సంవత్సరాల నుండి కొనసాగుతున్నాయి. ఈ ప్రయత్నాలను "వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాలు" అంటారు. ఈ పథకాల కింద వాగులు ప్రారంభమయ్యే ప్రాంతాలైన కొండవాలులలో చెట్లు నాటడం, గడ్డిపెంచడం, చిన్న కట్టలు (చెక్‌డ్యామ్‌లు) కట్టడం ద్వారా నీటి ప్రయాణ వేగాన్ని తగ్గించి, ఎక్కువనీటిని భూగర్భజలాలుగా మార్చవచ్చు. వాగులపై కట్టే చిన్న చిన్న ఆనకట్టలు కూడా నీటిని ఎక్కువ కాలం నిలవచేయడానికి ఉపయోగపడతాయి. ఈ ప్రయత్నాలన్నీ భూగర్భజలాలు పెరగడానికి లేదా భూగర్భజలాలను 'తిరిగి నింపడానికి' సహాయపడతాయి.

- మీ ప్రాంతంలో వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాలు ఏమైనా ఉన్నాయా? ఆ ప్రాంతాన్ని సందర్శించి వాటిని ఎలా అమలు చేశారో అధ్యయనం చేయండి. ఆ పథకం ఉన్న ప్రాంతం 'స్కెచ్‌పటం' గీసే ప్రయత్నం చేయండి.

**భూగర్భజలాల నాణ్యత:**

భూగర్భజలాలు సాధారణంగా అనేక ఖనిజాలతో కలిసి ఉంటాయి. ఈ నీరు ఒక్కొక్కప్పుడు ఉప్పగాను, మరొకప్పుడు తియ్యగానూ ఉంటుంది.

- చెరువు, కుంట, బావి, గొట్టపు బావుల నుండి నీటిని సేకరించండి. కొన్ని బావుల నీరు తియ్యగాను, మరికొన్ని బావుల నీరు ఉప్పగాను ఉంటుంది. ఇలా నీటి రుచులలో తేడాలు ఎందుకుంటాయో వివరించగలరా?

ఈ తేడాకు కారణం భూగర్భజలాల్లో కలిసిన ఖనిజాలే. ఈ ఖనిజాలు భూమి అడుగున ఉన్న రాతిపొరలు, మట్టిపొరల నుంచి వస్తాయి. కాబట్టి నీటిరుచి, స్వభావం ఆ నీటిలో కలిసే ఖనిజలవణాలమీద ఆధారపడి ఉంటుంది. మన రాష్ట్రంలోని అనేక మండలాల్లోని నీటిలో ఉప్పు, ఫ్లోరైడ్, క్లోరైడ్, ఇనుము, నైట్రేట్ మొదలయిన ఖనిజలవణాలు చాలా ఎక్కువ మోతాదులో ఉన్నాయి. అటువంటి నీరు తాగితే ఎముకల, దంతాల వ్యాధులు వస్తాయి (చిత్రం 3.5). అది ఆరోగ్యానికి ఏ మాత్రం మంచిది కాదు. ఈ పరిస్థితులలో శుద్ధిచేసిన మంచినీరునే అందించాలి. విచ్చలవిడిగా ఉపయోగించే క్రిమిసంహారకాలు, ఎరువులు, మురికినీరు కలయికతో నీరు కలుషితం అవుతుంది. మనదేశంలో ఈ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. దీని నివారణా చర్యలు చేపట్టకపోతే, చాలా బావులు, నదులలోని నీరు తాగటానికి పనికిరాక- పోవటమేకాక, చివరకు స్నానానికి కూడా పనికి- రాకుండాపోతాయి.

**భూగర్భజలాల వినియోగం:**

నదులలోని నీటిలాగ భూగర్భజలాలు కూడా ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. అంతే తప్ప అది ఆ భూమిపై

SCERT, TELANGANA



*చిత్రం-3.5 ఫ్లోరైడ్ వ్యాధి సోకిన వ్యక్తి*

హక్కుగల కొద్దిమంది ఆస్తి కాదు. కాని ఇప్పుడు భూగర్భజలాలను భూమిపై హక్కుగల కొద్దిమందే ఉపయోగించుకుంటున్నారు.

భూగర్భజలాలున్న ప్రాంతంలో భూమి యజమాని ఎక్కువ నీటిని వాడుకొని, పక్కవారికి నీరు మిగలకుండా చేస్తున్నాడు. కొంతమంది లోతైన గొట్టపు బావులను తవ్వి నీటిని మొత్తాన్ని లాగి, నీటిమట్టం పడిపోయేటట్లు చేయడంవల్ల సమీపంలోని బావులు ఎండిపోతున్నాయి. భూగర్భజలాలను ఉమ్మడి సొత్తుగా భావించి, వాటిని జాగ్రత్తగా వాడుకుంటే తప్పించి అందరూ వాటివల్ల ప్రయోజనం పొందలేరు. ఇంకా చెప్పాలంటే ఇలా ఇంకొంత కాలం కొనసాగితే బోరుబావులు ఉన్నవాళ్లు కూడా తోడుకోడానికి అసలు భూగర్భజలాలే ఉండకుండా పోతాయి.

- భూమిలేనివారు కూడా సమానంగా నీటిని వినియోగించుకునే అవకాశాలు మీ ప్రాంతంలో ఏమైనా ఉన్నాయేమో ఆలోచించండి. అటువంటి ప్రణాళికను రూపొందించి మీ తరగతిలో, ఇతరులతో చర్చించండి.

ఈ తరంవారు నీటిని పాతతరంవారినుండి పవిత్రమైన ఆస్తిగా పొందారు. మనం పొందినట్లే మన రాబోయే తరాలవారికి ఈ ఆస్తిని అందించాలి. నీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులను అభివృద్ధిపరచాలి. లేకపోతే భవిష్యత్ తరాలవారు నీటికోసం వినాశకరమైన యుద్ధాలకు పాల్పడవచ్చు. అందుకు ఈ తరంవారమైన మనమే బాధ్యత వహించాలి.

**కీలకపదాలు :**

1) నీరు చేరడానికి వీలైన రాళ్లు (Pervious rocks)

2) నీరు చేరడానికి వీలులేని రాళ్లు (Impervious rocks)

3) సహజ వృక్షజాలం (Natural Vegetation)

4) జలస్తరాలు (aquifers)

5) బృహత్ శిలాయుగం (Megalithic age)

SCERT, TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) తప్పుగా ఉన్న వాక్యాలను సరిచేయండి:

ఎ) నీరు మైదానాలనుండి పీఠభూములకు ప్రవహిస్తుంది.


బి) పీఠభూములలో మందమైన ఇసుక, కంకర పొరలుంటాయి.

సి) భూగర్భజాలాలు ఎప్పుడూ ఎండిపోవు.


డి) మహబూబ్‌నగర్‌లో బావులను తవ్వటం సులభం.

H1U4D6

2) చిత్రంలో చూపిన బావులు గోదావరి వాలు ప్రాంతంలోనివి. కాని పటంలో ఏదో తప్పున్నట్లు అనిపిస్తున్నది. ఆ తప్పును మీరు సరిచేయండి.




3) కింది బొమ్మలలో ఏ ప్రాంతంలో నీరు బాగా ఇంకుతుంది?




4) పల్లెర్ల గ్రామంలోని కొన్ని బావుల యజమానులు ఎక్కువ శక్తిమంతమైన మోటార్లనుపయోగించి నీటిని తోడటం ప్రారంభించారు. దీనివల్ల ఇతర బావులు ఎండిపోతున్నాయని వాటి యజమానులు గుర్తించారు. ఈ సమస్యకు గల పరిష్కారం గురించి చర్చించండి.

5) భూగర్భజలాల కొరత ఉన్న ప్రాంతాలలో గొట్టపు బావులు తవ్వటంపైన ఏమైనా నియంత్రణ ఉందా? ఎందుకు?

6) మీ ప్రాంతంలో భూగర్భజలాలను తిరిగి నింపటానికి గల మార్గాలను గురించి ఆలోచించండి.

7) పాఠంలోని 3.1ఎ. చిత్రం చూసి మీ ప్రాంతంతో పోల్చండి.

8) మీ గ్రామం పటం గీసి, అందులో మీ గ్రామంలోని నీటి వనరులను గుర్తించండి.

9) పేజి నెం. 30లోని 'భూగర్భ జలాల నాణ్యత' అనే శీర్షిక కింద ఉన్న 3వ పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

**ప్రాజెక్ట్ పని :**

మీ గ్రామంలోని చెరువులు మరియు కుంటలకు సంబంధించిన ఈ క్రింది వివరాలను సేకరించండి.

| క్రమ సంఖ్య | చెరువు/కుంట పేరు | ఆయకట్టు (ఎకరాలలో) | | చెరువు యొక్క ఇతర ఉపయోగాలు | బాగు చేయకపోవడానికి గల కారణాలు | బాగుచేస్తే కలిగే లాభాలు |
|---|---|---|---|---|---|---|
| | | గతంలో | ప్రస్తుతం | | | |
| | | | | | | |

SCERT, TELANGANA

పాఠం 4

D3G2C7

# మహాసముద్రాలు - చేపలు పట్టడం

## మొదటిభాగం


గ్రహాలన్నింటిలో నీటిని కలిగియున్న ఒకే ఒక్క గ్రహం భూమి. కాబట్టి, భూమి జలయుత గ్రహం. భూమి ఉపరితలంలో 71 శాతం మహాసముద్రాలు, సముద్రాలతో నిండి ఉంది. మహాసముద్రాలను లేదా సముద్రాలను గురించి మీరు ఏమని భావిస్తున్నారు? మహాసముద్రాలు లేదా సముద్రాలను గురించి మీరు చూసిన లేదా విన్న అంశాలేమిటి? భూమిపైన ఉప్పునీటితో విస్తరించిఉన్న భాగమే సముద్రం. విశాలమైన సముద్రప్రాంతాలే మహాసముద్రాలు. మహాసముద్రాలనేవి సాధారణంగా ఖండాలతో విభజించిఉన్న పెద్ద పెద్ద జలభాగాలు.

- మీ గ్రామం/పట్టణంలోని నీరు మంచి నీరా, ఉప్పునీరా? వివిధ ప్రాంతాలలో నీరు వివిధ రకాలుగా ఉందా?
- మీరు ఉపయోగించే వివిధ జలాశయాల పేర్లు తెలపండి. పెద్ద, చిన్న జలభాగాలకు వేరువేరు పేర్లు ఉన్నాయా?
- గ్లోబుమీద లేదా మ్యాపుమీద ఐదు సముద్రాల, మహాసముద్రాల పేర్లను కనుక్కోండి. ఈ ప్రాంతాలను మీ చేతితో తాకండి.

నీటికింద ఏముంటాయో తెలుసుకోడం ఆసక్తికరంగా ఉంటుంది. నీటి అడుగున గలవాటిని నీటి ఉపరితలం ద్వారా తెలుసుకోలేం. నది, సెలయేరు, చెరువుల అడుగుభాగం ఎలా ఉంటుందో మీరు తాకి తెలుసుకొనే అవకాశం ఉంది.

- నీటి ఉపరితలం కింద మీరు గమనించిన వాటిని గురించి తెలపండి, చర్చించండి.
- మీరు చూసిన జలవనరులలో లోతైనది ఏది? దానిలోతు ఎంత?

**మహాసముద్ర నిమ్నోన్నత స్వరూపం:**




చిత్రం-4.1 మహాసముద్రపు ఎత్తుపల్లాలను చూపే చిత్రం

మహాసముద్రాల అడుగు భాగం భూమి ఉపరితలం లాగే ఉంటుంది. సముద్రపు అడుగు భాగం సమతలంగా ఉండదు. ఇది కొండలతో, పర్వతాలతో, పీఠభూములతో, అగాధాలతో కూడా నిండి ఉంటుంది. చాలా అగాధాలు ఎక్కువ లోతుగా ఉంటాయి. ఎవరెస్ట్ పర్వతాన్ని దీంట్లోకి

SCERT, TELANGANA

ముంచితే పూర్తిగా మునిగిపోతుంది. మహా సముద్రాల్లో ఎక్కువ భాగం, సముద్రమట్టానికి 3 నుండి 6 కి.మీ. లోతులో ఉంటుంది.

ఇటువంటి సముద్రపు అడుగుభాగపు నేల స్వరూపాలను తెలిపే స్కెచ్ (4.1) పరిశీలించండి. మనదేశం చుట్టూ ఉన్న మహా సముద్రంలోపల వాటిని చూపే చిత్రం (4.2) కూడా పరిశీలించండి.



**చిత్రం-4.2. హిందూ మహాసముద్రం నిమ్నోన్నతాలను చూపే చిత్రం**

ఈ చిత్రంలో (4.2) భారత భూభాగాన్ని గుర్తించి బంగాళాఖాతం, అరేబియా సముద్రం, హిందూ మహా సముద్రాలలో అడుగు భాగాల నేలలపైన పర్వతాలు, మైదానాలు, అగాధాలను గుర్తించడానికి ప్రయత్నించండి.

మహాసముద్రాలలోని నీరు ఎప్పుడూ నిశ్చలంగా ఉండదు. వాటిలో వివిధ రకాల కదలికలుంటాయి.

- నదినీటిలో ఏర్పడే రకరకాల కదలికలను ఎప్పుడైనా గమనించారా? మీరు తరంగాలు, ప్రవాహాలు, వరదలు రావడం, తగ్గడం గమనించే ఉంటారు. మీ అనుభవాలను తరగతి గదిలో చర్చించండి.

సముద్ర చలనాలు 3 రకాలు.

**1. తరంగాలు (Waves) :** సముద్ర ఉపరితలపు నీటిమట్టం హెచ్చు, తగ్గులను తరంగాలు అంటాం. సముద్రపు ఉపరితలంపైన వీచే సున్నితమయిన గాలులవల్ల తరంగాలు ఏర్పడతాయి. ఈ గాలులు ఎంత వేగంగా వీస్తే తరంగాలు అంత పెద్దవిగా ఉంటాయి.

**2. ప్రవాహాలు (Currents):** సముద్ర జలం ఒక ప్రాంతంనుండి మరో ప్రాంతానికి పెద్ద ప్రవాహాలుగా ప్రవహిస్తుంది. ఈ ప్రవాహాలు ఒక నిర్దిష్ట దిక్కునకు నిరంతరమూ సముద్ర ఉపరితలంపైన ప్రవహిస్తూంటాయి. వీటిని సముద్రప్రవాహాలు అంటాం. సముద్ర ప్రవాహాలు రెండు రకాలు. ఉష్ణప్రవాహాలు, శీతలప్రవాహాలు. ఉష్ణ ప్రవాహాలు భూమధ్యరేఖాప్రాంతం నుండి ధ్రువాలవైపు ప్రవహిస్తాయి. శీతల ప్రవాహాలు ధ్రువాలవైపునుండి భూమధ్యరేఖాప్రాంతంవైపు ప్రవహిస్తాయి. సముద్ర ప్రవాహాలు ప్రధానంగా పవనాలు, సముద్ర జలపు ఉష్ణోగ్రత, లవణీయతల వ్యత్యాసం వల్ల ఏర్పడతాయి.

**3. పోటుపాటులు (Tides):** సముద్రంలో ప్రతి దినం నీటిమట్టం లయబద్ధంగా పెరగడాన్ని, తగ్గడాన్ని పోటుపాట్లు అంటారు. సముద్రతీర ప్రాంతాలన్నిటిలో కొన్ని గంటలపాటు పోటు (పర్వవేలా తరంగాలు), మరికొంతసేపు పాటు (లఘువేలా తరంగాలు) వస్తూంటాయి. ఇవి ప్రతిరోజు ఒకే ఎత్తులో ఉండవు. పర్వవేలా తరంగాలు వచ్చినపుడు సముద్ర తీరానికి కొంత ముందు వరకు నీరు వస్తుంది. పాటు వచ్చినప్పుడు సముద్ర తీరం నుండి నీరు కొంత లోపలికి పోతుంది. పోటుపాట్లు చేపలు పట్టడానికి అనుకూలం. ఇవి కొన్ని ప్రాంతాల్లో నదులు తెచ్చే బురదమట్టిని సముద్రంలోకి తీసుకొనిపోయి ఇసుక మేట వేయకుండా చూస్తాయి.

SCERT TELANGANA

## రెండవభాగం



### తీరమైదానంలో మత్స్యకారుల గ్రామం:

సముద్రజలం ఎల్లప్పుడూ ఉప్పగా ఉంటుంది. దీనిలో అనేక ఖనిజ లవణాలు ఉంటాయి. వర్షాలు కురవడానికి సముద్రాలే ముఖ్య వనరులు. సముద్రాలు మత్స్యసంపదకు, సముద్ర సంబంధమయిన ఇతర ఆహారపదార్థాలకు నిలయాలు. లవణాలకు సముద్రాలు ముఖ్య వనరులు. అంతర్జాతీయ వాణిజ్యానికి సముద్రాలే సహజ మార్గాలు. ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలోని ఒక గ్రామాన్ని సందర్శించి అక్కడి ప్రజల జీవన విధానాన్ని అధ్యయనం చేద్దాం. అదే ఆంధ్రప్రదేశ్ తీరమైదానంలోని మత్స్యకారుల గ్రామం 'భావనపాడు'.

- ఆంధ్రప్రదేశ్ పటంలో తీరరేఖను గమనించి తీరరేఖ వెంబడి ఉన్న జిల్లాలను గుర్తించండి.
- భావనపాడు ఏ జిల్లాలో ఉందో కనుక్కోండి.
- భావనపాడు గ్రామ పటాన్ని (చిత్రం 4.4) పరిశీలించి కింది అంశాలను తెలపండి.


i) పటంలో జలభాగాలను గుర్తించండి.

ii) గ్రామంలో వ్యవసాయేతర కార్యక్రమాలకు ఉపయోగించే భూమి ఉందా? ఉంటే ఆ భూమిని దేనికోసం ఉపయోగిస్తున్నారు?

### చేపలు పట్టడం :

తెల్లవారు జామున 4 గంటలకు అప్పలకొండ భార్య ధనమ్మ పెట్టిన చద్దెన్నం తిని 5 గంటలకు సముద్రంలోకి చేపల వేటకు బయలుదేరాడు. ఇతని మిత్రులు సముద్ర తీరంలో ఎదురుచూస్తున్నారు. వీళ్ళంతా బీదవాళ్ళు కావటంవల్ల సొంత పడవ, వలలు లేకపోవటంవల్ల తాతారావు 'మరపడవ'మీద పనిచేస్తున్నారు. తాతారావు కూడా వీళ్ళతో వేటకు వెళ్ళాడు. మొత్తం 20 మంది మత్స్యకారులు మరపడవపై చేపల వేటకు బయలుదేరారు. వేటకు వెళ్ళడానికి ఈ మరపడవను కావలసిన సామగ్రితో ముందురోజునే సిద్ధం చేశారు.

*చిత్రం–4.3 భావనపాడు గ్రామం*



SCERT, TELANGANA



*చిత్రం-4.4 పై నుంచి కనబడే భావనపాడు గ్రామం*

పడవ సముద్రంలోకి వెళ్లేముందు వీరు ఇంజన్, తాడులాగి వదిలే యంత్రాలను పరీక్షించుకున్నారు. అదనపు డీజిల్, ఆహారపు పొట్లాలను ఉంచుకొని తాము గాఢంగా విశ్వసించే దేవతను పూజించారు.

తాతారావు ఈ మరపడవను ఒడిషాలోని మార్కొండలో కొన్నాడు. దీని ఖరీదు సుమారు 6 లక్షల రూపాయలు. ఈ డబ్బును వడ్డీవ్యాపారి దగ్గరనుంచి అధిక వడ్డీకి తెచ్చాడు. స్థిరాస్తులు లేనందువల్ల బ్యాంకు నుండి రుణం పొందలేకపోయాడు. ప్రతి దినం చేపల వేటకు వెళ్లడానికి కూడా మధ్యవర్తులనుండి చేబదులు తేవలసిందే. ఒకసారి చేపల వేటకు వెళ్లిరావడానికి డీజిల్, కూలీ, ఇతర ఖర్చులకు 5వేల రూపాయిలు ఖర్చవుతుంది. మధ్యవర్తుల నుండి అప్పుతెచ్చిన తాతారావు ఆ రోజు వేటాడిన చేపలను మధ్యవర్తికి అతను నిర్ణయించిన ధరకు మాత్రమే అమ్మాలి. 20 మంది మత్స్యకారులు బోటెక్కారు. వాళ్ళు సముద్రంలో 15-20 కి.మీ. వరకు వెళతారు.

అప్పలకొండ భార్య ధనమ్మ ఇంటిపనిని 9 గంటలకు ముగించుకొని పనికోసం ఉప్పుమళ్ళకు వెళుతుంది. ఒక్కొక్కప్పుడు ఈమె వ్యవసాయపుపనికి కూడా వెళుతుంది. వీరికి వ్యవసాయ భూమిగానీ, ఉప్పుమళ్ళు గానీ లేనందువల్ల వీరి కుటుంబం రోజుకూలీపై ఆధారపడింది. ఉప్పుమళ్ళలో పనిచేస్తున్నప్పుడు కూడా ధనమ్మ తన భర్త ఫోనుకోసం ఎదురుచూస్తూంటుంది. వేటకు వెళ్లిన భర్త సురక్షితంగా రావాలని, వేటలో ఎక్కువ చేపలు పడాలని ఎదురుచూస్తుంది. వేటలో ఎక్కువ చేపలు పడితే వీరికి అధిక మొత్తంలో వాటా వచ్చి ఇంటిని చక్కగా నడపవచ్చని ఆశిస్తుంది.


మత్స్యకారులు సాధారణంగా మధ్యాహ్నం ఒంటిగంట, రాత్రి 8 గంటల మధ్య వెనుదిరుగుతారు. కొన్నిసార్లు రాత్రి బాగా ఆలస్యంకావచ్చు. కానీ ఆ రోజు 'పార' అనే రకం చేపలు ఎక్కువ పట్టడంతో మధ్యాహ్నం 3 గంటలకే ఒడ్డుకు చేరారు. పడవనుంచి దించిన చేపలను వేలం చోటికి తెచ్చి చేపలను గదిలో వేశారు. అప్పటికే మధ్యవర్తులు అక్కడికి చేరుకున్నారు.

కొందరు మధ్యవర్తులు చేపలను వేరుపరచి వాటిని శీతలీకరణ పెట్టెలలో పెట్టి కోల్‌కత్తా, బెంగుళూరు, చెన్నై,

SCERT, TELANGANA




చిత్రం-4.5 వేటకు సిద్ధంగా ఉన్న పడవ




చిత్రం- 4.6 బోటు ఇంజన్, భోజన క్యారేజీలు, డీజిల్ కాన్, దుర్గమ్మ ఫోటో

హైదరాబాదు, కేరళ వంటి దూరప్రాంతాలకు పంపుతారు. చేపలు పట్టేవారికంటే వీరికి 4 రెట్లు అధిక మొత్తంలో ఆదాయం వస్తుంది. స్థానిక మధ్యవర్తి అడ్డా బొమ్మ (4.9)ను పరిశీలించండి.

- మత్స్యకారులకంటే మధ్యవర్తులకు ఎక్కువ ఆదాయం రావడానికి కారణమేమిటి?
- మధ్యవర్తుల అడ్డాలో థర్మాకోల్ పెట్టెలను చిత్రంలో చూడవచ్చు. అవి ఎందుకు?

ఇంతవరకు పెద్ద చేపల వ్యాపారం గురించి చర్చించాం. గ్రామాలలో చిన్న వ్యాపారాలు కూడా జరుగుతాయి. స్థానికంగా తయారుచేసిన కర్రతెప్పలపైన సముద్రంలో 5 కి.మీ. వరకు పోయి కొద్దిపాటి చేపలను వేటాడతారు. వీటిని మత్స్యకారుల భార్యలు సమీపంలోని పట్టణాలైన నౌపడ, టెక్కలి, పూండి, పలాసాలలో అమ్ముతారు. వీరిని బేరకత్తెలంటారు.

కర్ర తెప్పలతో పోల్చుకుంటే మరపడవలలో వేటచేయటం ప్రమాదకరం. మరపడవలలో సముద్రంలో చాలా దూరం వరకు వెళ్లవలసి ఉంటుంది – అక్కడ ప్రమాదం జరిగితే ఈదుకుంటూ ఒడ్డుకు చేరటం కష్టం. పెద్ద పడవలలో కూడా ప్రథమచికిత్స పెట్టె, లైఫ్ జాకెట్లు గానీ లేకపోవడం బాధాకరం. చేపల వేట సాహసోపేతమైనది, ఇది ప్రమాదాలతో కూడిన వృత్తి.



చిత్రం-4.7 వేలంవేసే హాలుకు చేపలు తీసికెళ్లడం



చిత్రం-4.8 వేలంవేసే హాలులో సిద్ధంచేసిన చేపలు – అక్కడ వేచిఉన్న మధ్యవర్తులు

SCERT, TELANGANA



చిత్రం-4.9 మధ్యవర్తుల అడ్డా, బరువు తూకం వేసే యంత్రాలు, శీతలీకరణ పెట్టెలు



చిత్రం-4.10 మధ్యవర్తుల అడ్డాలో నగరాలలో అమ్మేందుకు వాహనాలలోకి లోడ్‌చేస్తున్న దృశ్యం

**వలలు:**

ఇంటికిచేరిన అప్పలకొండ మధ్యాహ్న భోజనం ముగించుకొని చిరిగిన వలలను తీసుకొని తుఫాను షెల్టర్‌కు వెళ్లి మరమ్మతు చేయడం ప్రారంభించాడు. భావనపాడు గ్రామంలో అనేక ప్రాంతాల్లో ఇది సాధారణంగా జరిగే కార్యక్రమం. నూలుకర్రలు, నూలుకండె, కర్రబద్దె వంటి పరికరాలతోకూడిన 'టూల్ కిట్' వలల మరమ్మతుకోసం ప్రతి మత్స్యకారుని దగ్గర ఉంటుంది (చిత్రం-4.12).

పొరలనుబట్టి, కన్ను (Rings) లను బట్టి వలలు అనేక రకాలు. ఇటీవల కొత్తగా వచ్చిన రింగ్‌వలను చేపలవేటకు మత్స్యకారులు ఎక్కువగా వినియోగిస్తున్నారు.

వాటిమూలంగా గ్రామంలో వలసలు తగ్గాయి. గతంలో నూలుతో తయారైన వలలుండేవి. ప్రస్తుతం వీటి స్థానంలో ప్లాస్టిక్, నైలాన్, ఇతర సింథటిక్ దారాలతో తయారైన వలలు వచ్చాయి. ఒక్క వల 4, 5 సం॥లు ఉంటుంది. వలల రింగుల రకాలనుబట్టి తూకానికి కొంటారు. వల కిలో 250-300 రూపాయిల మధ్య ఉంటుంది. రింగువల బరువు 500 కిలోలు ఉంటుంది. ఈ ప్రాంతపు మత్స్యకారులు ఒడిషాలోని బరంపూర్ నుండి వలలను కొనుగోలు చేస్తారు.



చిత్రం-4.11 పట్టణాలలో అమ్మడానికిగాను చేపలను తట్టలలో వేసుకోటానికి తమ వంతుకోసం ఎదురుచూస్తున్న బేరకత్తెలు




*చిత్రం-4.12 (A) వల మరమ్మతులు, (B)మత్స్యకారుడు వలను కుట్టడం, (C) నూలు కర్రలు, (D) నీటిపై తేలిఆడే బెండ్లు (సీసం), (E) నీటిపై తేలిఆడే ప్లాస్టిక్ బెండ్లు.*

**వ్యవసాయం - పశుపోషణ:**

భావనపాడు గ్రామంలో చేపలుపట్టటం మాత్రమే వృత్తికాదు. వీరు వ్యవసాయం చేసి పంటలను పండించడం, పశువులు, పక్షుల పెంపకం వంటి పనులు కూడా చేస్తుంటారు.

ఈ గ్రామంలోని నేలలు ప్రధానంగా బంకమన్ను (ఇసుకతో కూడిన ఒండ్రుమట్టి) భూములు. వరి ముఖ్యమైన పంట. కొద్ది ఎకరాల భూమికి మాత్రమే సాగునీటి సదుపాయం ఉంది. వంశధార నదికాలువ చివరి వైపు భావనపాడు గ్రామం ఉంది. ఈ గ్రామానికి సమీపంలోని మర్రిపాడు గ్రామపు సాగునీటి అవసరాలు తీరాక మాత్రమే భావనపాడు గ్రామానికి నీరు వస్తుంది. అందుకని భావనపాడులో ఎక్కువభాగం వ్యవసాయం వర్షాధారమే.

ఈ గ్రామంలో భూస్వాములు లేరు. భావనపాడు గ్రామంలోని ఎక్కువమంది వ్యవసాయదారులు సన్నకారు రైతులు. వారు వాణిజ్య పంటలు పండించరు. కాని కొందరు ఆవులు, గేదెలను పెంచుతున్నారు. ఈ గ్రామంలో రెండు కోళ్లఫారాలు లాభాలతో నడుస్తున్నాయి. వీరు పండించిన వరి వీరి అవసరాలకు చాలనందువల్ల తెల్లరేషన్ కార్డుమీద చౌకధరల దుకాణం నుండి గానీ బజారులోగానీ బియ్యం కొనుగోలుచేస్తారు.

**లవణీయత, త్రాగే(మంచి)నీరు:**

గ్రామంలో లవణీయత సమస్య (ఉప్పతనం) ఉంది. సముద్రతీరంలో 8 నుండి 10 అడుగుల లోతు తవ్వితే మంచినీరు వస్తుంది. వేసవికాలంలో బావులలో నీరు అడుగంటుతుంది. ఈ బావులు మళ్లీ నిండటానికి చాలా సమయం పడుతుంది. ఒక గంట సేపు వేచి ఉంటే ఒక కుండ నీళ్ళు లభ్యమవుతాయి. మంచినీటి కోసం మహిళలు చాలా సేపు వేచి చూడాలి లేక 2 కి.మీ. దూరం నడిచివెళ్లవలసి వస్తుంది.

ప్రభుత్వం ఈ గ్రామానికి ఒక రక్షిత మంచినీటి పథకం మంజూరు చేసింది. ఈ పథకానికి సమీపంలోని గ్రామమైన సూర్యమణిపురంనుండి పైపుల ద్వారా నీటిని తరలిస్తారు. ఈ పథకం కొంతకాలం ఊరటనిచ్చింది.

SCERT, TELANGANA



చిత్రం-4.13, 4.14 ఉప్పు పొలాలను చదునుగా చేసి నీరు ఇంకని నేలగా మార్చడం



చిత్రం 4.14



చిత్రం-4.15 సుదూర ప్రాంతంనుండి ఓ వృద్ధమహిళ నీటిని తెస్తున్న దృశ్యం

కానీ ప్రధాన నీటి ట్యాంక్ అపరిశుభ్రత, తరచుగా మోటారు మరమ్మతులు చేయవలసిరావడం ప్రధాన అవరోధంగా మారింది. కొంతకాలం యువజన సంఘాలు ఈ పథకం పనిచేయడానికి సహకరించాయి. కాని ఇప్పుడు అది ఆగిపోయింది.

**సామాజిక జీవనం:**

భావనపాడు ప్రజలలో ఎక్కువమంది గంగమ్మను, గౌరిని, శివుణ్ణి పూజిస్తారు. వీరు తమ పడవలకు, వలలకు పూజచేస్తారు. వీరి ప్రధానమయిన పండుగ గౌరీపూర్ణిమ. వీరు గ్రామ సాధారణనిధి (ఉమ్మడి సొత్తు) నుండి ఈ పండుగలకు ఖర్చుచేస్తారు. చిత్రం 4. 16 గమనించండి. అప్పలకొండలాగ చాలామంది పచ్చబొట్లు వేయించుకుంటారు.




చిత్రం-4.16 ప్రజలు పచ్చబొట్లు ఎందుకు వేయించుకుంటారని భావిస్తున్నారు? అప్పలకొండ చేతిమీద గల గుర్తేమిటి? ఇది దేన్ని సూచిస్తుంది?

ఈ గ్రామంలో ఒక బహిరంగవేదిక ఉంది. దీనిమీద నాటికలు, బుర్రకథలు, హరికథలు, రికార్డు డాన్సులు ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమాలన్నింటినీ అందరూ **'పిల్లాస్'** అని పిలిచే కులపెద్ద నిర్వహిస్తారు. వీరు ప్రజల ఆచార, వ్యవహారాలను నిర్ణయిస్తారు. వీరు వివాదాలను పరిష్కరిస్తారు, జరిమానాలు విధిస్తారు. ఈ రకంగా వసూలైన ధనం గ్రామసాధారణనిధికి జమచేస్తారు.

SCERT, TELANGANA

**కీలకపదాలు:**

1) టూల్ కిట్ 2) కన్నులు 3) బుర్రకథ 4) మరపడవ

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) భావనపాడు మీ గ్రామంలాగో, మీ పట్టణానికి సమీపంలోని గ్రామంలాగో కనిపిస్తోందా? ఆలోచించి పోలికలను, తేడాలను, దిగువ అంశాలను దృష్టిలో ఉంచుకొని రాయండి:

   ఎ) జీవన ఆధారానికి మూలమైనవి. బి) ఉపాధి రకాలు.


   సి) నీటివనరులు. డి) వ్యవసాయ విధానాలు.


G2L9I6


2) సముద్ర చలనాలు ఎన్ని రకాలు? వీటిలో ఏ చలనం మత్స్యకారులకు ఉపయోగకరం?
3) మరపడవపైన చేపల వేటకు, కర్రతెప్పపైన చేపల వేటకు తేడాలు చెప్పండి.
4) మరపడవను చేపల వేటకు సిద్ధంచేసే విధానాన్ని తెలపండి.
5) మత్స్యకారుల 'టూల్ కిట్' లో ఏమేమి ఉంటాయి?
6) భూమి ఉపరితలానికీ, సముద్రపు అడుగు భాగానికీ మధ్యగల పోలికలేమిటి?
7) మీ గ్రామ/పట్టణ సమీపంలోని వివిధ జలభాగాల వివరాలను కింది పట్టికలో సేకరించి వాటి లాభాలను విశ్లేషించండి.

| వరుస సంఖ్య | జలభాగం పేరు | ఉపయోగాలు | పరిమితులు |
|---|---|---|---|
| | | | |

8) మత్స్యకారుల జీవన విధానంమీద చిత్రాలను సేకరించి ఆల్బం తయారుచెయ్యండి.
9) మత్స్యకారులు డబ్బుకోసం మధ్యవర్తులపైన ఆధారపడకుండా ఉండాలంటే మీరే పరిష్కారమార్గాలు సూచిస్తారు?
10) గత 4 పాఠాలలో నీటికి సంబంధించిన వివిధ అంశాలను చదివారు. భూమిపై నీటి లభ్యత గురించి మరింత సమాచారం ఉంది. జాగ్రత్తగా పరిశీలించి భూమిపైన నీటిలభ్యత గురించి వ్యాఖ్యానించండి.
11) చేపలు పట్టే వారి జీవనం సముద్రాలతో ముడిపడి ఉంది. దీనిని నీవు ఎలా సమర్థిస్తావు?
12) పేజి నెం. 35లోని 'తీరమైదానంలోని మత్స్యకారుల గ్రామం' పేరాను చదివి, వ్యాఖ్యానించండి.




SCERT, TELANGANA

పాఠం 5

U4Z2A8

# యూరప్

ఐరోపావారు, తమ విశేష సహజ సంపదను, పరిసరాలను ఎలా ఉపయోగించుకున్నారో ఈ పాఠ్యాంశం ద్వారా తెలుసుకుందాం.

## యూరప్ ఉనికి:

యూరప్ ఉనికిని, భారతదేశం నుండి యూరప్‌కు గల దూరాన్ని తెలుసుకోవడానికి మీకు గ్లోబు లేదా అట్లాస్ అవసరం. పటం-1లో యూరప్ ఎరుపు రంగులో ఉంది. ఖండం సరిహద్దులను గుర్తించండి. యూరప్‌కు ఉత్తరాన సముద్రం ఉంది. పటంలో దాన్ని గుర్తించండి. ఈ సముద్రం దాదాపు సంవత్సరమంతా గడ్డకట్టి ఉంటుంది.

- యూరప్ ఖండంలో పశ్చిమాన ఉన్న సముద్రం పేరేమిటి?


ఈ మహాసముద్రం యూరప్‌ను, ఉత్తర అమెరికా ఖండాన్ని వేరు చేస్తోంది. 500 సంవత్సరాల క్రితం యూరప్ నుండి అమెరికాకు సముద్ర మార్గాన్ని కనిపెట్టారు. లక్షలకొద్దీ ఐరోపా ప్రజలు అమెరికాకు వలస వెళ్ళి స్థిరపడ్డారు.

- యూరప్‌కు దక్షిణాన ఉన్న సముద్రం పేరును అట్లాస్‌లో చూసి గుర్తించండి.

ఈ సముద్రానికి ఉత్తరాన యూరప్, దక్షిణాన ఆఫ్రికా ఉన్నాయి. ఈ సముద్రానికి మధ్యధరా సముద్రం అనే పేరు ఎందుకు వచ్చిందో తెలుసా? దీని అర్థం 'ప్రపంచ మధ్య భాగం' అని.

ప్రాచీన కాలంలో ఐరోపా వాసులకు అమెరికా, ఆస్ట్రేలియా లాంటి ఇతర ఖండాల గురించి తెలియదు. కేవలం యూరప్, ఆసియా, ఆఫ్రికా ఉత్తర ప్రాంతాలు మాత్రమే వారికి తెలుసు. ఈ ప్రాంతాలన్నీ మధ్యధరా సముద్రం చుట్టూ విస్తరించి ఉన్నాయి. అందుకే ఐరోపావారు ప్రపంచం మధ్యలో సముద్రం ఉందని భావించారు. ఇప్పటికీ కూడ అదే పేరు కొనసాగుతోంది.

- యూరప్‌నకు తూర్పునఉన్న పర్వతాల పేర్లను తెలపండి.




*పటం-1 యూరప్ ఖండం ఉనికి*

SCERT, TELANGANA

యూరప్‌కు తూర్పు సరిహద్దుగా యూరల్ పర్వతాలు ఉన్నాయి. ఇవి చాలా ఎత్తైన పర్వతాలు కావు. ఈ పర్వతాలకు తూర్పున ఆసియా, పశ్చిమాన యూరప్ ఉన్నాయి. వాస్తవంగా ఆసియా, యూరప్ కలిసే ఉన్నాయి. కాబట్టి ఈ ప్రాంతాన్ని యురేషియా అని పిలుస్తారు.

- ఇపుడు యూరప్ ఉనికి మీకు బాగా తెలుసు. యూరప్‌లోని దేశాల పేర్లను పటం 2 చూసి రాయండి. మీరు ఎప్పుడైనా అలాంటి దేశాల పేర్లు విన్నారా?
- మీరు ఉపయోగించడానికి పటం 3ని ఖాళీగా ఇచ్చారు. అందులో ఐరోపాదేశాలను గుర్తించి వాటికి వివిధ రంగులు వేయండి. ఏ రెండు పొరుగు దేశాలకు ఒకే రంగు వేయగూడదు.

**పర్వతాలు, మైదానాలు, నదులు:**

మనమిపుడు పటం 4 ద్వారా యూరప్‌లోని పర్వతాలు, నదులు, మైదానాల గురించి మరింత తెలుసుకుందాం. ఐరోపాలో మంచుతో కప్పి ఉన్న అనేక పర్వతాలు ఉన్నాయి. పటంలో ఆల్ప్స్, పైరినీస్ పర్వతాలను గమనించండి. ఆల్ప్స్ పర్వత శ్రేణులు చాలా ముఖ్యమైనవి. అవి సంవత్సరం పొడవునా మంచుతో కప్పబడి ఉంటాయి.

- అనేక దేశాలను ఆనుకొని ఉన్న ఆల్ప్స్ పర్వత శ్రేణులను పటం 2, 4 లను పోలుస్తూ దేశాలను గుర్తించండి.
- ఆల్ప్స్ పర్వతాల నుండి ప్రారంభమయే రెండు నదుల పేర్లు రాయండి.
- పైరినీస్ పర్వతాలకు ఆనుకొనిఉన్న దేశాల పేర్లను రాయండి.
- తూర్పు ఐరోపా సరిహద్దులోని పర్వతశ్రేణులు ఏవి?
- యూరప్‌లోని ఇతర పర్వతశ్రేణులను గుర్తించి ఒక పట్టిక తయారుచేయండి.




*చిత్రం–5.1 పశ్చిమ యూరప్‌లోని హంగరి దేశం డాన్యూబ్ నది ఒడ్డునగల బుడాపెస్ట్ నగరం*

దక్షిణ యూరప్ ఖండం సరిహద్దులలో కాస్పియన్ సముద్రానికి, నల్ల సముద్రానికి మధ్యన కాకసస్ పర్వతాలు ఉన్నాయి. అవి కూడా చాలా ఎత్తైనవి. సంవత్సరమంతా మంచుతో కప్పబడి ఉంటాయి.


యూరప్, ఆసియా ఖండాల మధ్య చాలా వ్యత్యాసం కనబడుతుంది. ఆసియాలో విస్తారమైన పీఠభూములు ఉన్నాయి. కాని యూరప్‌లో మాత్రం అటువంటి పీఠభూములు లేవు. కాని జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లలో చిన్న చిన్న పీఠభూములు ఉన్నాయి. ఐరోపాలో విశాలమైన మైదానాలు ఉన్నాయి. తూర్పు ప్రాంతాల్లో రష్యా, ఉక్రేయిన్, పోలండ్, బైలో రష్యా దేశాల వరకు విస్తరించి ఉన్నాయి. ఈ మైదానములు ఎక్కువ మంచుతో నిండి ఉండటంవల్ల చలికాలంలో అత్యధికమయిన చలిగాలులు వీస్తాయి. వేసవిలో మంచుకరిగి కాలువలుగా నీరు ప్రవహించి పెద్దనదులు ఏర్పడతాయి. ఐరోపాలో పొడవైన ఓల్గా, నైపర్ నదులు ఇలా ఏర్పడి ప్రవహిస్తున్నవే.

ఐరోపాలోని నదులు కేవలం వ్యవసాయ నీటిపారుదలకే గాకుండా జలరవాణాకు అనుకూలంగా ఉన్నాయి. పడవలు, ఓడలు, తెప్పలు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సరుకులను, మనుషులను తీసుకొనివెళతాయి. ఈ నదులు అనేకదేశాలతో రవాణా సౌకర్యాలు కలిగిఉండి, అంతర్జాతీయ వ్యాపారానికి అనువుగా ఉన్నాయి. ఈ విషయంలో రైన్ నది ముఖ్యమైనది ఎందుకంటె అది చాలా దేశాలలో ప్రవహిస్తు ఉత్తర సముద్రంలో కలుస్తుంది. చాలా ప్రధాన పారిశ్రామిక

SCERT, TELANGANA





SCERT, TELANGANA




పటం–3
యూరప్ అభ్యాస పటం

SCERT TELANGANA



పటం 4 యూరప్ భౌతికపటం

SCERT TELANGANA

మరియు ఖనిజాలు లభించే నగరాలు సముద్ర తీరాన ఉన్నందున ఖండాంతర వాణిజ్యానికి దోహదపడుతున్నాయి. రైన్‌నది వలె కాకుండా వోల్గానది కాస్పియన్ సముద్రంలో కలుస్తుంది. అది ఒక పెద్ద సరస్సులాంటిది. ఈ నది ద్వారా ఖండాంతర వ్యాపారం చేయడం కష్టం. అందుకే వోల్గానది ద్వారా జల రవాణాతో ఖండాల మధ్య వ్యాపారం చేయలేక పోతున్నారు.

- 2, 4 పటాలసహాయంతో ఈ కింది ప్రశ్నలకు జవాబులివ్వండి:
- రైన్‌నది ఏ దేశాలగుండా ప్రవహిస్తోంది?
  (1) .............(2) ............. (3) .............
  (4) ............. (5) .............
- డాన్యూబ్ నది ఏ ఏ దేశాలగుండా ప్రవహిస్తోంది
  (1) .............(2) ............. (3) .............
  (4) ............. (5) .............
- హంగేరీ మైదాన ప్రాంతపు సరిహద్దులలో ఉన్న రెండు పర్వతశ్రేణులపేర్లు రాయండి.
  (1) .............   (2) .............
- నల్ల సముద్రం చుట్టూ ఏ దేశాలు ఉన్నాయి?
  (1) .............(2) ............. (3) .............
  (4) ............. (5) .............


- ఈ కింద తెలిపిన నదులు ఏ మహాసముద్రంలో లేదా సముద్రంలో కలుస్తున్నాయి?

| **నదులు** | **మహాసముద్రం/ సముద్రం** |
|---|---|
| 1. సెయిన్ | |
| 2. రైన్ | |
| 3. ఓడర్ | |
| 4. పో | |
| 5. డాన్యూబ్ | |
| 6. విస్టులా | |
| 7. వోల్గా | |
| 8. నైపర్ | |
| 9. డాన్ | |
| 10. వినా | |

## ద్వీపకల్పం, ద్వీపాలు, అఖాతాలు, గల్ఫ్స్ (Peninsulas, Islands, Bays and Gulfs):

పటంలో యూరప్ సముద్ర తీరాన్ని చూసినట్లయితే తీరమంతా ఒకే తీరుగా లేదని తెలుస్తుంది. చాలా ప్రాంతాలలో బాల్టిక్ సముద్రం మాదిరిగా సముద్రతీరం భూభాగంలోకి, చొచ్చుకొనివచ్చినట్టు ఉంటుంది. మరికొన్నిచోట్ల ఇటలీలో మాదిరి భూభాగం సముద్రంలోకి విస్తరించినట్లు ఉంటుంది.

ఇటలీకి మూడువైపులా సముద్రం ఆవరించి ఉంది. మూడువైపులా నీరు ఉండి ఒకవైపు భూభాగం ఉంటే దాన్ని ద్వీపకల్పం అంటారు (చిత్రం-5.2). నార్వే, స్వీడన్ కూడా దానిలో భాగమే. పటంలో చూడండి. ఈ ద్వీపకల్పాన్నే స్కాండినేవియా ద్వీపకల్పం అంటారు.




*చిత్రం-5.2 ద్వీపకల్పం, అఖాతం*

- ఈ రెండింటిలో ఏది ద్వీపకల్పం-గ్రీస్/ఫ్రాన్స్.
- స్పెయిన్, పోర్చుగల్ కూడా ద్వీపకల్పాలా?
- స్కాండినేవియా ద్వీపకల్పంలో గల పర్వత శ్రేణులను తెలపండి.

యూరప్ ఖండంలో కొన్ని దేశాలు మూడు వైపుల నీరుగల దేశాలు కాకుండా నాలుగు వైపుల నీరుండి ఒకవైపు కూడా భూభాగంలేని ద్వీపదేశాలు ఉన్నాయి. అందులో గ్రేట్ బ్రిటన్ ఒకటి.

SCERT TELANGANA

- యూరప్‌లోని మరికొన్ని ద్వీపదేశాలను గుర్తించండి.

ప్రాచీన కాలంనుండి సముద్రాలు, ద్వీపకల్పాలు, ద్వీపాలు ప్రజల జీవన విధానాన్ని చాలా ప్రభావితం చేశాయి. మధ్య, దక్షిణ యూరప్‌లో ఎక్కువ భాగం పర్వత ప్రాంతాలవటంవల్ల రవాణా చాలా కష్టసాధ్యమే కాకుండా ఖర్చుతో కూడుకున్నది. దీనితో పోలిస్తే సముద్ర ప్రయాణం సులభతరం. రవాణా ఖర్చు కూడా తక్కువ. అందుకే ప్రాచీనకాలంలో ఐరోపావారు సముద్రమార్గాలను ఎక్కువగా ఉపయోగించుకున్నారు.

పెద్ద సంఖ్యలో ఉన్న లోతైన అఖాతాలు, భూభాగంలోకి చొచ్చుకుని వచ్చిన సముద్రాలు (గల్ఫ్) సముద్ర రవాణాకు అవకాశం కల్పిస్తున్నాయి. ఇవి మూడు వైపుల నీరు ఆవరించినవి. అఖాతాల ముఖద్వారం వద్ద సాధారణంగా వెడల్పుగా బంగాళాఖాతంలో మాదిరి ఉంటాయి. గల్ఫ్ ముఖద్వారం చాలా ఇరుకుగా ఉంటుంది. బాల్టిక్ సముద్రాన్ని పటంలో చూసినట్లయితే అది పెద్ద గల్ఫ్‌ప్రాంతంగా గుర్తించవచ్చు. అఖాతాలు, గల్ఫ్‌ప్రాంతాలు ఉండడంవల్ల సముద్రపు తుఫానులనుండి నౌకాశ్రయాలకు రక్షణ లభిస్తోంది. సరుకులను ఎత్తడానికి, దించడానికి ఓడలను ఒక చోట నిలవడానికి అవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. నౌకాశ్రయాలను నిర్మించడానికి లోతైన సముద్రపు అంతర్భాభాగాలకు ప్రాధాన్యాన్ని ఇవ్వడంవల్ల ఓడ అడుగుభాగం భూమిని తాకదు.

- పటం-4 పరిశీలించి బాల్టిక్ సముద్రపు మూడువైపుల ఉన్న దేశాల పేర్లను రాయండి.

**శీతోష్ణస్థితి:**

యూరప్ శీతోష్ణస్థితి మనదేశానికంటే చల్లగా ఉంటుంది. అనేక యూరప్ దేశాలలో చలికాలంలో మంచు కురుస్తుంది. అక్కడ వేసవి ప్రాంతాల్లో మనదగ్గర వేసవిలో ఉన్నంత వేడి ఉండదు.

- ఐరోపా వాతావరణం భారతదేశం కంటే భిన్నంగా ఉంటుందని మీరు ఎందుకు భావిస్తున్నారు? తరగతి గదిలో చర్చించండి.

**భూమధ్యరేఖనుండి దూరం:**

భూమధ్యరేఖా ప్రాంతంనుండి మనం ఉత్తరం వైపుగాని, దక్షిణంవైపుగాని దూరంగా వెళ్ళేకొద్దీ ఆ ప్రాంతాలు సంవత్సరమంతా చల్లగా ఉంటాయి. వాస్తవంగా ధ్రువాల దగ్గర సంవత్సరమంతా మంచుతోకప్పబడి ఉంటుంది.

- భూమధ్యరేఖ నుండి ఉత్తర ఐరోపా ఎంత దూరంలో ఉందో గ్లోబు మీద చూసి తెలుసుకోండి.
- భూమధ్యరేఖకు భారతదేశంకంటే ఉత్తర ఐరోపా చాలా దూరంలో ఉందా?
- ఇటలీ, నార్వేలలో ఏది ఎందుకు వేడిగా ఉంటుంది?

**అట్లాంటిక్ మహాసముద్రం:**

భూమధ్యరేఖనుండి దూరం మాత్రమేకాక ఇతర కారకాలు యూరప్‌ను ప్రభావితంచేస్తున్నాయి. అట్లాంటిక్ మహాసముద్రం, పవనాలు ఐరోపా శీతోష్ణస్థితిపైన ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. లోపలి వైపుఉన్న భూభాగాల కంటే అట్లాంటిక్ మహాసముద్రం తీరం వెంబడి గల ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి.

- అట్లాంటిక్ మహాసముద్రం వెంబడి ఉన్న ఐరోపా ప్రాంతాలను గుర్తించండి. అవి అట్లాంటిక్ మహాసముద్రానికి తూర్పు తీరప్రాంతాలా, పశ్చిమతీరప్రాంతాలా?

శీతాకాలంలో పశ్చిమ యూరప్‌లో పూర్తిగా చల్లగాను, తూర్పు యూరప్‌లో మరింత చల్లగానూ ఉంటుంది. అందుకనే పోలండ్‌లోను, రష్యాలోను తీవ్రమయిన చల్లదనం ఉంటుంది. ఫ్రాన్స్‌లోను, గ్రేట్‌బ్రిటన్‌లోను వెచ్చదనం ఉంటుంది. వాటికంటే రష్యాలో శీతాకాలంలో చాలా చల్లగా ఉండి నదులు, సముద్రాలు గడ్డకడతాయి. ఏది ఏమైనప్పటికీ పశ్చిమ యూరప్‌లోని సముద్ర తీరప్రాంతాలకు అటువంటి పరిస్థితి లేదు.

- స్పెయిన్ లేదా స్లోవేకియాలలో, ఏ దేశంలో వెచ్చని ఉష్ణోగ్రత ఉంది? పటాన్ని చూసి గుర్తించండి.

SCERT, TELANGANA

పశ్చిమ యూరప్ అట్లాంటిక్ మహాసముద్రానికి దగ్గరగా ఉన్నందువల్ల అక్కడి పరిస్థితిని మీరు అంచనా వేసిఉంటారు. ఈ మహాసముద్రం యూరప్ శీతోష్ణస్థితిని ఎలా ప్రభావితం చేస్తుందో చూద్దాం.

**పశ్చిమ పవనాలు (Westerlies):**

సంవత్సరమంతా అట్లాంటిక్ మహాసముద్రంనుండి గాలులు యూరప్‌వైపు వీస్తాయి. పశ్చిమ దిశనుండి వీచే ఈ గాలులను పశ్చిమ పవనాలుగా పిలుస్తారు (వాస్తవంగా ఈ గాలులు నైరుతిదిశనుండి ఈశాన్యం వైపు వీస్తాయి). ఇవి భూమిపై ఉష్ణోగ్రతకంటే ఎక్కువగా వేడి తేమ కల్గి ఉంటాయి. ఈ పడమటిగాలులు సంవత్సరమంతా వీస్తూ యూరప్ శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తాయి.

- పశ్చిమ పవనాలు యూరప్‌మీద ఎటువంటి ప్రభావం చూపుతున్నాయో చెప్పండి.

**కవోష్ణ సముద్రపు ప్రవాహాలు**


**(Warm Ocean Currents):**

సముద్రజలాలు ఎప్పుడూ నిశ్చలంగా ఉండవు. అవి ఒక చోటునుండి మరొకచోటికి ఖండాలవెంట ప్రవహిస్తాయి. వీటినే సముద్ర ప్రవాహాలు అని పిలుస్తారు. అవి వేల కిలోమీటర్ల దూరంవరకు నదులలాగ ప్రవహిస్తుంటాయి.


అటువంటి సముద్ర ప్రవాహాలు అట్లాంటిక్ మహాసముద్రంలో కనిపిస్తాయి. భూమధ్యరేఖవద్ద ఉండే ఉష్ణోగ్రతవల్ల సంవత్సరమంతా ఈ ప్రవాహాలు పయనిస్తుంటాయి. అందుకే వీటిని కవోష్ణ ప్రవాహాలు అని పిలుస్తారు. ఈ ప్రవాహాలు పశ్చిమదిశ నుండి ఉత్తర అమెరికావైపు పయనిస్తాయి. అమెరికా ఈశాన్య తీర ప్రాంతాలను ఈ ప్రవాహాలు ప్రభావితం చేస్తాయి. ఆ తర్వాత యూరప్‌వైపు వీస్తాయి. ఈ ప్రవాహాలు యూరప్‌లోని పశ్చిమతీర ప్రాంతాలను తాకుతాయి. ఈ ప్రవాహాలను అమెరికాలో "గల్ఫ్ స్ట్రీము (స్ట్రీము అనగా వేగంగా ప్రవహించేది)"అని, ఐరోపాలో "ఉత్తర అట్లాంటిక్ డ్రిఫ్ట్ (డ్రిఫ్ట్ అనగా నిదానంగా ప్రవహించేది" అని అంటారు.

గల్ఫ్ ప్రవాహాల కారణంగా ఉత్తర అమెరికాలో తూర్పు తీరప్రాంతపు జలాలు, యూరప్‌లోని పశ్చిమ తీరపు జలాలు గడ్డకట్టవు. కాబట్టే ఓడలు చలికాలంలో కూడా తీరప్రాంతపు ఓడరేవులకు చేరుకుంటున్నాయి.

- ఉష్ణ ప్రవాహాలు తూర్పు యూరప్ శీతోష్ణస్థితిని ఎందుకు తీవ్రంగా ప్రభావితం చేయలేక పోతున్నాయని భావిస్తున్నారు?




*పటం-5 పశ్చిమ పవనాలు*




*పటం-6 గల్ఫ్ స్ట్రీమ్.*

SCERT TELANGANA

**ఖాళీలను పూరించండి:**

- భూమధ్యరేఖకు దగ్గరగా ఉన్న జలాలు .......... ఉంటాయి. (వేడిగా/చల్లగా/చాలాచల్లగా (icy-cold))
- భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ఉష్ణప్రవాహాలు అమెరికా..................తీరప్రాంతానికి చేరుకుంటాయి (తూర్పు /పశ్చిమ/ ఉత్తర).
- ఉష్ణప్రవాహాలు ................. నుండి మొదలవుతాయి (అట్లాంటిక్ మహాసముద్రం / మధ్యధరాసముద్రం /నల్లసముద్రం).
- ఐరోపాతీరాన్ని .................... గల్ఫ్ స్ట్రీం ప్రవాహజలాలు తాకుతాయి. (చల్లటి/వెచ్చటి/ హిమానీ).
- పశ్చిమ పవనాలు అట్లాంటిక్ మహాసముద్రం నుండి యూరప్‌వైపు ................... వీస్తాయి (చలికాలం/ఎండాకాలం/సంవత్సరం పొడవునా).
- ఈ పవనాలు ................... (పొడిగాలులు/తేమగాలులు/అతిశీతలపవనాలు)

## పశ్చిమ ఐరోపా : సంవత్సరమంతా చిరుజల్లులు

ఉత్తర ఐరోపా, పశ్చిమ ఐరోపా ప్రాంతాలలో పడమటిగాలులు చాలా తేమను నింపుకొంటాయి. ఈ గాలులు సంవత్సరమంతా తేమను పుంజుకొని వర్షాలకు కారణమవుతున్నాయి. ఈ రెండు ప్రాంతాలలో సంవత్సరం పొడవునా వర్షాలు కురుస్తాయి. కాని మన దేశంలో మాత్రం వర్షం కొన్ని నెలలు మాత్రమే ఉంటుంది. పశ్చిమ ఐరోపాలో సంవత్సరమంతా చిరుజల్లులుంటాయి. ఆకాశం మబ్బులతో కూడి ఉంటుంది. ఇలాంటి చిరుజల్లుల కోసం మనదేశంలో ఎదురుచూసినట్టుగా పశ్చిమయూరప్‌లో కాంతివంతమైన ఎండకోసం ఎదురుచూస్తారు.

- భారతదేశ శీతోష్ణస్థితికి, పశ్చిమ ఐరోపా శీతోష్ణస్థితికి మధ్య ఎలాంటి భేదాన్ని గమనించారు?

పశ్చిమ ఐరోపా ప్రాంతాలు ఉష్ణప్రవాహాలవల్ల మరోవిధంగా ప్రయోజనం పొందుతున్నాయి. చేపల పెంపకానికి వెచ్చటి ప్రవాహాలు అవసరం. దాంతో చేపలకు కావలసినంత ఆహారం లభ్యమవుతుంది. బ్రిటన్‌కు సమీపంలోని ఉత్తర సముద్రంవద్ద మత్స్యపరిశ్రమ అభివృద్ధి చెందినది. ఈ ప్రాంతాన్ని 'డాగర్ బ్యాంకు' అని పిలుస్తారు. ఐరోపా ప్రజలకు చేపలు ప్రధాన ఆహారం. కాబట్టి చేపలవేట యూరప్‌లో ప్రధాన పరిశ్రమగా మారింది.

- డాగర్ బ్యాంకుద్వారా ఎన్ని దేశాలు ప్రయోజనం పొందుతున్నాయి?

## దక్షిణ ఐరోపాలో మధ్యధరా శీతోష్ణస్థితి:

దక్షిణ ఐరోపా దేశాలను మనం గమనించినట్లయితే వాటికి దక్షిణాన మధ్యధరా సముద్రం ఉన్నదని తెలుస్తుంది. అందువల్ల వాటిని మధ్యధరాదేశాలని పిలుస్తున్నారు. అక్కడ ఉన్న విశిష్టమైన శీతోష్ణస్థితిని మధ్యధరాశీతోష్ణస్థితి అని పిలుస్తారు.

- పటం-2 చూసి నాలుగు మధ్యధరా దేశాల పేర్లను రాయండి.

మధ్యధరా దేశాలు ఐరోపాలో ఎక్కువగా దక్షిణాన ఉన్నాయి. ఫలితంగా ఇక్కడ చలికాలంలో చలి తక్కువ. కాని ఎండాకాలంలో వెచ్చగా ఉంటుంది. ఇక్కడ సంవత్సరమంతా పశ్చిమ యూరప్‌లాగ వర్షాలు ఉండవు. పడమటిగాలులు ఇక్కడ చలికాలంలో మాత్రమే వీస్తాయి. ఈ గాలులు మధ్యధరా దేశాలకు వర్షాలనిస్తాయి. అంటే ఇక్కడ చలికాలంలో వర్షాలు, ఎండాకాలంలో వర్షాభావ పరిస్థితివల్ల మధ్యధరా శీతోష్ణస్థితి అనే పదం స్థిరపడింది. ఇతర ఖండాలలో కూడా అనేక ప్రాంతాలలో మధ్యధరా

SCERT, TELANGANA

శీతోష్ణస్థితే ఉంటుంది. ఈ శీతోష్ణస్థితి పండ్ల తోటల పెంపకానికి అనుకూలమైనది. ద్రాక్ష, బత్తాయి, ఆలివ్, అత్తిపండ్లు/అంజూరపండ్లు మొదలయిన పండ్లతోటలను దక్షిణ యూరప్‌లో విస్తృతంగా పెంచుతారు.

- మధ్యధరా, తెలంగాణ శీతోష్ణస్థితి ఈ కింది వాని పరంగా పోల్చండి.
  (ఋతువులు, వర్షపాతం)
- మీ రాష్ట్రంలో వర్షాలు ఎప్పుడు ఎక్కువగా కురుస్తాయి?
  (వేసవికాలం/చలికాలం)
- మీ ప్రాంతంలో చలికాలంలో చిరుజల్లులు కురిస్తే వాటిని స్థానిక భాషలో ఏమని అంటారు?
- చేపలు పట్టుటకు ప్రధానమైన ప్రాంతం ......................
- పండ్ల తోటల పెంపకానికి ప్రధానమైనది ......................

**నాలుగు కాలాలు – వ్యవసాయం:**

మనదేశంలో చలికాలం, వేసవికాలం, వర్షాకాలం అనే మూడు కాలాలున్నాయి. చాలా యూరప్ దేశాలలో నాలుగు కాలాలు ఉంటాయి. ఇవి ఏవంటే చలికాలం, వసంతకాలం, వేసవికాలం, శరత్కాలం. కాలాన్ని బట్టి ఆయా ప్రదేశాల దృశ్యం మారుతుంది, అలాగే వ్యవసాయపు పంటలు మారతాయి. ప్రక్క పేజీలో ఇచ్చిన చిత్రాల ద్వారా కాలాలకనుగుణంగా మార్పుచెందిన ప్రదేశాలను గమనించవచ్చు.

**చలికాలం:** నవంబరు నెల రాగానే వణికించే చలితో ప్రారంభమయ్యే చలికాలం డిసెంబరునుండి అతిశీతలంగా మారుతుంది. పర్వతాలపై ఎక్కువగానూ మైదానాలపైన తక్కువగానూ మంచు కురుస్తుంది. సూర్యుడు చాలా ఆలస్యంగా 9 లేదా 10 గంటలకు ఉదయించి మధ్యాహ్నం 4.00 గంటలకే అస్తమిస్తాడు. మబ్బు కమ్మిన ఆకాశంతో చీకటి అలముకుంటుంది. ఫ్రాన్స్ దేశంలోని వెడల్పైన ఆకులు గల చెట్లు తమ ఆకులను రాల్చి ఆకులులేని చెట్లుగా మారతాయి.

**వసంతకాలం:** మార్చి నెల రాగానే ఫ్రాన్స్‌లో భూ దృశ్యం మారిపోతుంది. పగలు ఎక్కువకాలం, రాత్రి తక్కువ కాలం ఉంటుంది. మంచు కరగడం ప్రారంభించి చెట్లు చిగురించడం ప్రారంభమవుతుంది. పచ్చని ఆకులు, అందమైన పూలతో అంతా నిండిపోతుంది. పచ్చికబయళ్లలో గడ్డి మొలవడం ప్రారంభమవుతుంది.

వసంత కాలంలో భూములు దున్ని విత్తనాలు వేస్తారు. గోధుమ, రై, బార్లీ, మొక్కజొన్న, బీట్‌రూట్, ఓట్స్ ముఖ్యమైన పంటలు.

- పై పంటలలో మన రాష్ట్రంలో ఏయే పంటలు పండుతున్నాయి? ఏ ప్రాంతంలో?

**వేసవి కాలం:** యూరప్‌లో జూన్ నుండి ఆగష్టు వరకు వేసవి కాలం. ఈ కాలంలో వేడి ఎక్కువగా ఉంటుంది. వర్షాలు ఎక్కువగా కురవవు. పగటికాలం మనదేశం కంటే చాలా ఎక్కువ. తెల్లవారు ఝామున 4 గంటలకే సూర్యోదయం అవుతుంది. రాత్రి 8 గంటలకు సూర్యాస్తమయం అవుతుంది. వాస్తవానికి నార్వే, స్వీడన్ వంటి కొన్ని ఉత్తరాది దేశాలలో సూర్యాస్తమయమే ఉండదు. ఇలాంటి దేశాలను అర్ధరాత్రి సూర్యుడుగల దేశాలుగా పిలుస్తారు. ఇక్కడ అత్యధిక ఉష్ణోగ్రత కూడా ఉండదు. ఎందుకంటే సూర్యుడు ఆకాశంలో చాలా ఎత్తున కాకుండా చాలా దగ్గరగా అంటే భూమ్యాకాశాలు కలిసినట్లుగా అగుపించే రేఖ దగ్గర ఉంటాడు.

యూరప్‌లో వ్యవసాయానికి వేసవికాలం అనుకూలమైనది. ఈ కాలంలో పంట పండుతుంది. క్రమం తప్పకుండా వర్షాలు కురవడంవల్ల పంటలకు నీటిపారుదల అవసరం ఉండదు. వేసవి చివరినాటికి పంట కోతకు వస్తుంది.

మనదేశంలో రెండు వ్యవసాయ కాలాలున్నాయి. అవి రబీ, ఖరీఫ్ (చలికాలం, వర్షాకాలం). కాబట్టి 8 నుండి 10 నెలల పాటు పంటలను పండించగలం. కానీ ఫ్రాన్స్‌లోను, ఇతర యూరప్ దేశాలలోను 6, 7 నెలలు మాత్రమే పంటలు పండుతాయి.

SCERT, TELANGANA













- వివిధ కాలాలకు సంబంధించిన పై చిత్రాలను పరిశీలించండి. మీరు గమనించిన తేడాలేమిటి?

**శరత్కాలం:** సెప్టెంబరునుండి అక్టోబరు వరకు మళ్ళా వాతావరణం మారుతుంది. చెట్ల ఆకులు ఎరుపు, పసుపు రంగులకు మారి రాలిపోతాయి. వ్యవసాయపు పనులు నిలిచిపోతాయి. చలికాలంలో వాడేందుకు గడ్డి కోసి ఎండబెడతారు. ద్రాక్ష, ఇతర పండ్ల జాతుల నుండి తీసి సారా, జామ్, పండ్ల రసాలు తయారుచేసి వివిధ పద్ధతులలో నిలవచేస్తారు.

**భూమి, వ్యవసాయం :**

ఐరోపాలోని మైదానాలు, నదీలోయప్రాంతాలు చాలా సారవంతమైనవి. సంవత్సరమంతా వర్షాలు కురవడంవల్ల ఏ నదులూ ఎండిపోవు. అన్ని కాలాలలో నదులు పారతాయి. మైదాన భూములు వ్యవసాయానికి అనువైనవి. ఐరోపాలో అధిక భాగం పర్వతాలతోకూడి ఉంది. ఈ ప్రాంతం వ్యవసాయానికి అనువైనది కాదు. కొన్ని దేశాల్లో తక్కువ సేద్యపు భూములు ఉన్నాయి. నార్వేలో 3 శాతం, ఇంగ్లాండ్‌లో 30 శాతం, జర్మనీలో 40 శాతం వ్యవసాయ భూమి ఉంది. అదే భారతదేశంలో ఇంచుమించు 55 శాతం వ్యవసాయ భూమి ఉంది.

హాలండ్ (డచ్)లో వ్యవసాయానికి పనికివచ్చే భూమి చాలా తక్కువ. వారికి తీవ్రమైన భూభాగపు కొరత ఉంది. అందుకే వారు గతంలో సముద్ర జలాలతో నిండి ఉన్న ప్రాంతంలో నీటిని వెనకకు మళ్ళించి గోడలు కట్టి (dykes)ఆ ప్రాంతంలో కొద్దిపాటి వ్యవసాయం చేస్తున్నారు. ఆ భూమినే వారు పోల్డర్ అని పిలుస్తారు.

ఉత్తర, తూర్పు ఐరోపాలో చలికాలంలో అతి శీతల పరిస్థితులవల్ల వ్యవసాయం చేయడం కష్టం. ఆ ప్రాంతాలు ఆరు నెలల వరకు మంచుతో కప్పబడి ఉంటాయి. వసంత ఋతువులో మంచు కరగడంవల్ల సాగు పంట పరిపక్వత రావడానికి సరిపడే సమయం ఉండదు. కానీ వసంత ఋతువులో పంటలు విత్తడం వల్ల వేసవికాలంలో పంట

పరిపక్వత చెంది ఆకురాల్చే కాలంలో కోతకు సిద్ధంగా ఉంటుంది. దాని ఫలితంగా సంవత్సరానికి ఒకే పంటను తీస్తారు. దక్షిణ ఐరోపాలో మాత్రం సంవత్సరానికి రెండు పంటలు పండిస్తారు.

- మధ్యధరా దేశాలలో రెండు పంటలు పండించటానికి గల కారణాలను తెలపగలరా?

యూరప్ మైదానాలలో ముఖ్యమైన పంట గోధుమ. ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, ఉక్రేయిన్, పోలండ్, ఇటలీ, గ్రీస్ మొదలయిన దేశాలలో గోధుమ ఎక్కువగా పండిస్తున్నారు. పండ్ల తోటల పెంపకానికి దక్షిణ యూరప్ ప్రసిద్ధి గాంచింది. ద్రాక్ష పండ్లతో సారాయి తయారుచేస్తారు. ద్రాక్ష సారాయికి మధ్యధరా దేశాలయిన పోర్చుగల్, స్పెయిన్, ఇటలీ, దక్షిణ ఫ్రాన్స్ ప్రసిద్ధి పొందాయి.

యూరప్‌లో బార్లీ, ఓట్స్, రై, బీట్‌దుంపలు, బంగాళదుంపలు మొదలయినవి ముఖ్య పంటలు. రష్యా, ఉక్రేయిన్, జర్మనీ దేశాలలో బీట్ దుంపలనుండి పంచదార ఉత్పత్తి చేస్తారు.

### వ్యవసాయిక విప్లవం

ఆసియా మాదిరిగానే ఐరోపా కూడా పెద్ద భూస్వాములతో పాటు చిన్న రైతులు గల ఖండంగా ఉండేది. అయితే, గత రెండు శతాబ్దాల కాలంలో వ్యవసాయ రంగంలో సమూలమైన మార్పు చోటు చేసుకున్నది. ఇప్పుడు భారతదేశంలో లాగా ఐరోపాలో చిన్న రైతులు లేరు. సాంకేతిక రంగంలో వచ్చిన మార్పు కారణంగా పెద్ద రైతులు విశాలమైన వ్యవసాయ క్షేత్రాలను సమకూర్చుకొని కొద్దిమంది కూలీలతో యంత్రాలు, రసాయనిక ఎరువులు మొ॥వి ఉపయోగించి వ్యవసాయం చేస్తున్నారు. ప్రధానంగా మార్కెట్‌లో అమ్మడానికి వ్యవసాయ ఉత్పత్తులను పండిస్తున్నారు. పెద్ద భూస్వాములు, పెట్టుబడిదారుల చేతుల్లోకి భూములు చేరడంలో చిన్న రైతులు వ్యవసాయ రంగం వదిలి నగరాలలో పరిశ్రమలు లేదా సేవా రంగంలో ఉపాధి పొందుతున్నారు.

### యూరప్ వ్యవసాయ క్షేత్రాలు:

యూరప్‌లో 50 నుండి 100 ఎకరాల విస్తీర్ణతగల పెద్ద పొలాలలో వ్యవసాయం చేస్తారు. సాధారణంగా రైతులు తమ పొలాల్లోనే ఇళ్లు నిర్మించుకుంటారు. అందువల్ల ఫ్రాన్స్‌లో పెద్దపెద్ద గ్రామాలు కనపడవు. ఇండ్లు పెద్దవిగా ఉంటాయి. వివిధ అవసరాలకోసం చాలా గదులు ఉంటాయి. ఈ ఇండ్లలో భాగంగా పశువులకు కొట్టాలు, పంటగింజల గిడ్డంగులు, పక్షుల గూళ్లు, పందుల కొట్టాలు ఉంటాయి.


*చిత్రం-5.3 నిల్వచేసిన పశుగ్రాసం (గడ్డి)*

పెద్ద రైతులు పనులకోసం కూలీలను నియమిస్తారు. వీరు వ్యవసాయానికి అధికంగా ట్రాక్టర్లు, పంటకోసే యంత్రాలు ఉపయోగిస్తారు. పంటనంతటినీ బజారులో అమ్ముతారు. కొన్నిసార్లు రైతులు సమీప సహకార సంఘాలనుండి యంత్రాలను అద్దెకు తెస్తారు.

CERT, TELANGANA

- మీ ప్రాంతంలో సగటు వ్యవసాయభూమెంత ఉంటుంది?
- మీ ప్రాంతంలో కూడా రైతులు ట్రాక్టర్లను అద్దెకు తెస్తారా?

విశాలమైన వ్యవసాయ క్షేత్రాలు, యంత్రాలు ఫ్రెంచి రైతుల ఆర్థిక స్తోమతను పెంచుతున్నాయి. వీరు అన్ని సౌకర్యాలుగల విలాసవంతమైన ఇండ్లలో నివసిస్తున్నారు. వీరు వంటకు విద్యుత్ స్టౌలు, గ్యాస్‌స్టౌలు వాడుతున్నారు. 50 సంవత్సరాల కిందట రైతులు తమకు కావలసిన రొట్టెలను వారే తయారుచేసుకొనేవారు. కానీ నేడు వీరు పంటలను అమ్ముకొని బజారునుండి రొట్టెలు కొంటున్నారు. వీరి ఆహారంలో ముఖ్యమైన తాజా మాంసం కోళ్ళు, పశువులు, పందులవల్ల లభిస్తుంది. మాంసాన్ని ఎండబెట్టడం, పొగపెట్టడం వంటి ప్రక్రియలద్వారా నిలవ చేస్తున్నారు. ప్రతి ఇంటిలో సారా, జున్ను, మాంసం నిలవచేయడానికి ఆహారపు బీరువాలు (నేలమాళిగలు) ఉన్నాయి. వీటిని శీతల గిడ్డంగులలో కూడా నిలవచేస్తున్నారు.

రైతులు తమకు కావాల్సిన సామగ్రిని సమీపంలోని పట్టణాలనుండి తెచ్చుకుంటారు. రొట్టెలు, ఆహార పదార్థాలతోపాటు వ్యవసాయ పనిముట్లను, యంత్రాలు వీరు సమీపంలోని పట్టణాలనుండి తెస్తారు.

**ఆధునిక వ్యవసాయం:**

యూరప్‌లో ఇతర దేశాలమాదిరిగానే, ఫ్రాన్స్‌లో వ్యవసాయం ఒక పరిశ్రమగా సాగుతుంది. వీరు పండించిన పంటనంతా బజారులో అమ్మి తమకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. వ్యవసాయంలో అభివృద్ధి చెందిన సాంకేతికతతోపాటు రసాయన ఎరువులు, క్రిమిసంహారకమందులు, అధిక దిగుబడినిచ్చే వంగడాలు కూడా ఉంటాయి.

మన దేశంతో పోల్చితే ఐరోపాలో అతి కొద్ది మంది మాత్రమే వ్యవసాయంపై ఆధారపడతారు. ఎక్కువ మంది ప్రజలు పరిశ్రమలు లేదా సేవారంగంలోని బ్యాంకులు, రవాణా మొదలైన రంగాలలో పనిచేస్తారు. వ్యవసాయ రంగంలో పనిచేసే వారికి ఆదాయం తక్కువగా వస్తుంది. కాబట్టి ప్రభుత్వం వారిని పెద్ద మొత్తంలో సబ్సిడితో ఆదుకుంటుంది. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం కొనసాగించడానికి ప్రభుత్వం ఈ విధమైన ఆర్థిక సహాయం చేస్తుంది.

**సముద్ర మార్గాన్ని కనిపెట్టడం:**

పశ్చిమ యూరప్‌లో ఏ ఒక్క భాగము కూడా సముద్రానికి దూరంగా లేదు. కాని ఆసియాలో అనేక దేశాలు సముద్రానికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.


- తరగతిలోని గోడపటం లేదా అట్లాస్‌ను చూసి యూరప్‌లో సముద్ర తీరంలోని కనీసం ఆరు పట్టణాల పేర్లను రాయండి.

వందల సంవత్సరాలనుండి ప్రజలు సముద్ర తీరాలలో వేలసంఖ్యలో నివాసాలు ఏర్పరుచుకొని, సముద్రంలో లభించే ఉత్పత్తుల్ని సేకరిస్తూ జీవిస్తున్నారు. ఐరోపా నావికులకు అనేక శతాబ్దాల సముద్రయానానుభవం, ధైర్యం ఉండటమేకాక ఓడల, పడవల నిర్మాణంలో నైపుణ్యంఉంది. మొదట లోతైన సముద్రంలో చేపలు పట్టడానికి పడవలు తయారుచేశారు. ఓడలను క్రమంగా అంతర్జాతీయ వ్యాపారానికి ఉపయోగించారు.

పూర్వకాలం నుండి ఐరోపా దేశస్థులు భారతదేశంతోను, ఇతర ఆసియాదేశాలైన చైనా, ఇండోనేషియాలతోను వ్యాపారం చేసేవారు. ఎక్కువగా పత్తి, పట్టువస్త్రాలు, రత్నాలు, దంతవస్తువులు, లవంగాలు, మిరియాలు, దాల్చినచెక్క లాంటి సుగంధ ద్రవ్యాలు ఐరోపాలో లభించని కారణంగా వారు వెండి, బంగారాలతో మార్పిడి చేసుకొని యూరప్‌కు తీసుకువెళ్ళేవారు. వారు ఐరోపాకు ఏ మార్గం ద్వారా వాటిని తీసుకువెళ్ళేవారో మీకు తెలుసా? పటం–7లో రెండు ప్రధాన మార్గాలను ఇచ్చారు. అందులో మధ్య తూర్పు ప్రాంతాలు, ఇరాన్, అఫ్ఘనిస్తాన్ ద్వారా భూమార్గం; మరొకటి ఎర్రసముద్రం, అరేబియాసముద్రం ద్వారా సముద్రమార్గం.



SCERT, TELANGANA



పటం-7 వ్యాపార వర్తకమార్గాలు

500 సంవత్సరాలక్రితం పశ్చిమ ఐరోపా నావికులు, వ్యాపారస్థులు భారతదేశానికి కొత్త మార్గాలను అన్వేషించడం ప్రారంభించారు. అరబ్‌దేశాలు తరచుగా ఐరోపావారితో యుద్ధాలు చేయడంవల్ల వారికి కొత్తమార్గాల అన్వేషణ అవసరమైంది. మధ్యధరా సముద్రంమీద ఇటలీ వ్యాపారస్థుల నియంత్రణ ఉండటంవల్ల ఇతరదేశాలకు అంత సులువుగా అనుమతి లభించేదికాదు. అందుకే ఇతర దేశ నావికులు భారతదేశానికి కొత్త మార్గాలను కనిపెట్టాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఎందుకంటే మధ్యధరా సముద్రం ఇటలీవర్తకుల అధీనంలో ఉండడంవల్ల, అరబ్బులు అనేక అడ్డంకులు కల్పించడంవల్లనే కొత్త మార్గాలకోసం అన్వేషణ మొదలైంది.

- పటాన్ని చూసి కొత్త మార్గం ఏదై ఉంటుందో చెప్పగలరా?

బహుశా ఇలాంటి పటాలు ఆ రోజులలో లేవు. భూమి బల్లపరుపుగా కాక గుండ్రంగా ఉందని తెలుసుకుంటున్న సమయమది. ఇటలీ నావికుడు క్రిస్టోఫర్ కొలంబస్ భూమి గుండ్రంగా ఉండటంవల్లనే భారతదేశాన్ని పశ్చిమవైపున ప్రయాణించి చేరుకోవచ్చునని భావించాడు. ఒకవేళ అట్లాంటిక్ మహాసముద్రంమీదుగా పశ్చిమంవైపు ప్రయాణించి నట్లయితే చైనాకు, భారతదేశానికి ముందో, తరవాతో చేరుకోవచ్చునని భావించాడు.

- గ్లోబుకాని, అట్లాస్‌కాని చూసి కొలంబస్ భావించినది నిజమో, కాదో పరిశీలించండి.

క్రీ.శ.1492లో కొలంబస్ అట్లాంటిక్ మహా సముద్రాన్ని దాటడానికి మూడు నౌకలతో ప్రయాణమయ్యాడు. మూడు నెలలు ప్రయాణించిన తర్వాత అతడు భూభాగానికి చేరుకున్నాడు. అప్పుడు అతడు భారతదేశానికి చేరుకున్నానని భావించాడు. వాస్తవంగా భారతదేశానికి అతడు చాలా దూరంలో ఉన్నాడు. అతడు చేరినది వెస్ట్ ఇండీస్. అది అమెరికాకు దగ్గరఉన్న అనేక ద్వీపాల సముదాయం. కొలంబస్‌కంటే ముందు ఐరోపావారికి అమెరికా గురించి తెలియదు. పొరపాటుగా అమెరికాను చేరుకున్నట్లు గుర్తించారు. కొలంబస్ చేరుకున్నది భారతదేశంకాదని, ఒక తెలియని కొత్త ఖండాన్ని అతడు చేరుకున్నాడని ఐరోపావారు వాస్తవాన్ని తెలుసుకున్నారు. ఆ తరవాత అనేకమంది ఐరోపా వాసులు వ్యాపారరీత్యా వెళ్లి, స్థానికులపై ఆధిపత్యం సాధించి అమెరికాలో స్థిరనివాసాలు ఏర్పరుచుకున్నారు.

సహజంగా వీచే పవనాలను ఆ రోజులలో నౌకాయానానికి శక్తిగా మార్చుకున్నారు. పశ్చిమానికి అమెరికావైపు వీచేగాలుల ద్వారా నౌకాప్రయాణం చేశారు. అది పశ్చిమపవనాలా? కావు. ఇవి యూరప్‌వైపు వీచే

SCERT, TELANGANA

గాలులు కావు. ఇవి ప్రత్యేకమైన గాలులు. ఈ గాలులు సంవత్సరమంతా వీస్తాయి. నైరుతి ఐరోపానుండి అమెరికా తూర్పు తీరానికి వీచే పవనాలను వ్యాపార పవనాలు అంటారు (పటం. 7).

అలాగే పశ్చిమ పవనాలు నైరుతిదిశనుండి ఈశాన్యంవైపుకి, ఈశాన్య దిశ నుండి నైరుతి దిశకు వీస్తాయి (ఈ రెండు రకాల పవనాలు సంవత్సరమంతా వ్యతిరేక దిశలో వీస్తాయి. ఈ రెండు రకాల పవనాలను పటం-7లో చూపాం). ఈ పవనాలే ఐరోపావాసులకు, అమెరికా రాకపోకలకు సహాయ పడుతున్నాయి. వారు ఇలాంటి వ్యాపార పవనాలను అమెరికాకు వెళ్ళటానికి ఉపయోగించుకున్నారు.

పటం-7 చూసి ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి:

- యూరప్‌నుండి అమెరికాకు వెళ్ళడానికి నావికులకు ఏ పవనాలు ఉపయోగపడతాయి?
- ఐరోపాకు తిరిగి రావడానికి వ్యాపార పవనాలను ఉపయోగించుకున్నారా? కారణాలు తెలపండి.

కొలంబస్ తరవాత ఐరోపావాసులు అనేక సముద్ర మార్గాలను కనిపెట్టారు. వారు కేవలం అమెరికాకే కాకుండా ఆఫ్రికా, భారతదేశం, ఆస్ట్రేలియా దేశాలకు కూడా సముద్రయానం చేశారు. ఈ దేశాలతో వ్యాపారం చేసి అపారమైన సంపదను తీసుకువెళ్ళారు. ఈ సంపద ఐరోపా పారిశ్రామిక ఉత్పత్తులకు దోహదపడింది.

ఐరోపాలోని పారిశ్రామిక విప్లవం గురించి మరో పాఠంలో చాలా వివరంగా తెలుసుకుంటారు.

**కీలకపదాలు:**

1. ద్వీపకల్పం
2. ద్వీపం
3. అఖాతం
4. ప్రవాహాలు
5. గల్ఫ్
6. శీతోష్ణస్థితి

SCERT, TEALANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) ఐరోపావాసుల జీవన విధానంమీదా, శీతోష్ణస్థితిమీదా అట్లాంటిక్ మహాసముద్రం తీవ్రప్రభావం చూపుతోంది. దానికి సంబంధించిన ఆధారాలను చూపుతూ ఒక వ్యాసం రాయండి.

Y5Q2R1

2) పాఠ్యాంశంలో ఇచ్చిన పటాల ఆధారంగా ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

- ఈ కింద తెలిపిన దేశాలలో చుట్టూ భూభాగంలేనిది:
  (హంగేరి/ రుమేనియా/ పోలండ్/ స్విట్జర్‌లాండ్)
- కాస్పియన్ సముద్రానికీ, నల్ల సముద్రానికీ మధ్యలో ఏ పర్వతాలు ఉన్నాయి?
  (ఆల్ప్స్/ కాకసస్ పర్వతాలు)
- ఆర్కిటిక్ సముద్రం ఒడ్డున ఉన్న దేశాలు ఏవి?
  (రష్యా/ జర్మనీ/ స్వీడన్/ నార్వే)
- నల్లసముద్రంనుండి అట్లాంటిక్ మహాసముద్రానికి ఓడలో వెళ్లగలరా? అయినట్లయితే ఆ సముద్ర మార్గాన్ని గీయండి.

3) ఓడరేవులను లోతైన సముద్రపు భాగంలో, అఖాతాలలో ఎందుకు నిర్మిస్తారు?

4) తూర్పు ఐరోపాలోకంటే పశ్చిమ ఐరోపాలో చలికాలం ఎందుకు తక్కువ తీవ్రంగా ఉంటుంది?

5) నల్లసముద్ర తీరం వెంబడి ఉన్న నాలుగు దేశాల పేర్లను తెలపండి.

6) పశ్చిమ యూరప్ ప్రజలకు పశ్చిమ పవనాలు (గాలులు) ఎలా లాభం చేకూరుస్తున్నాయి?

7) మధ్యధరా ప్రాంతపు శీతోష్ణస్థితి లక్షణాలు ఏమిటి? ఆ ప్రాంతంలోని దేశాల పేర్లేమిటి?

8) ఏ కారకాలు ఐరోపా వ్యవసాయరంగాన్ని పరిమితం చేస్తున్నాయి?

9) దక్షిణ ఐరోపాలోని ముఖ్యమైన పంటలను తెలపండి.

10) ఐరోపా నావికులు కొత్త సముద్ర మార్గాలను కనుగొనడం వలన దేశాల మధ్య వ్యాపార, సాంస్కృతిక సంబంధాలు ఏర్పడ్డాయని నీవు ఎట్లు చెప్పగలవు?

11) "కాలక్రమేణా..... వృద్ధిచేసుకున్నాయి" పేజీ నెం 56లోని ఈ పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

12) ఐరోపా దేశ వ్యవసాయానికి, మన దేశ వ్యవసాయానికి పోలికలు, తేడాలు ఏమిటి?

SCERT, TELANGANA


పాఠం 6

# ఆఫ్రికా

F8L3M4

భారతదేశానికి పశ్చిమ భాగాన ఒక పెద్ద ఖండం ఉంది. ఈ ఖండంలో ఎంతో పెద్ద ఎడారులు, దట్టమైన అడవులు, అతి పొడవైన వెడల్పైన నదులు, లెక్కలేనన్ని పెద్ద సరస్సులు, వేల మైళ్ళు వ్యాపించిన విశాలమైన పచ్చికబయళ్ళు ఉన్నాయి. మనదేశంలో లేని చాలారకాల జంతువులు ఈ ఖండంలో ఉన్నాయి. ప్రపంచంలోనే బంగారం, వజ్రాల అతి పెద్ద గనులు ఈ ఖండంలోనే ఉన్నాయి. ఈ ఖండం పేరు ఆఫ్రికా. ఆఫ్రికాను మానవ సంతతికి పుట్టిల్లు అని చెబితే మీరు ఆశ్చర్యపోవచ్చు. మానవ సంతతి ఈ ఖండంలోనే మొదట ఆవిర్భవించింది. తరవాత ఇక్కడ నుంచి ఇతర ఖండాలవైపు వ్యాపించింది.

చిత్రం-6.1 భూమధ్యరేఖాప్రాంతపు అడవులు-ఉగాండా





చిత్రం-6.2 కెన్యాలోని సవాన్నా



చిత్రం-6.3 నైలునది ఒడ్డున కైరో నగరం

SCERT TELANGANA

- ఆఫ్రికా ఖండాన్ని ప్రపంచ పటంలో చూసి పరిశీలించండి. దాని చుట్టూ ఉన్న సముద్రాల పేర్లను రాయండి. ఈ ఖండానికి చుట్టు ప్రక్కల ఉన్న ఖండాలు ఏవి?

**ఆఫ్రికా - విశాలమైన పీఠభూమి:**


ఆఫ్రికా భౌతిక పటాన్ని పరిశీలించండి. ఈ ఖండంలో ఏవైనా అతి పెద్ద మైదానాలు గమనించారా? తీరప్రాంతంలోనే ఇరుకైన మైదానాలు ఉన్నాయా? మిగతా ఖండమంతా బాగా విస్తారమైన పీఠభూమి విస్తరించి ఉంది. మీరు పటాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ పీఠభూమి ఎత్తు అన్ని ప్రాంతాలలోను సమానంగా లేదనే విషయాన్ని గమనిస్తారు. నైలు, కాంగో నదీ పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించండి. ఈ పీఠభూమిపైన అనేక పర్వతశ్రేణులు ఉన్నాయి. ఆఫ్రికాలోనే అత్యంత ఎత్తైన పర్వత శిఖరం టాంజానియాలోని కిలిమంజారో పర్వతం.

ఎత్తైన పీఠభూములలో చాలా పొడవైన, ఇరుకైన లోయలు ఉన్నాయి. ఈ లోయలలో విశాలమైన సరస్సులు అనేకం ఉన్నాయి.

- ఆఫ్రికాలోని విక్టోరియా సరస్సు కాకుండా రెండు ఇతర సరస్సులను గుర్తించండి. వాటి పేర్లు రాయండి.
- ఆఫ్రికా పటంలో కింద సూచించిన నదులను గుర్తించండి. పటం-6ను ఉపయోగించి ఆఫ్రికా ఖండంలోని దేశాలను గుర్తించండి. ఏ దేశం గుండా కింది నదులు ప్రవహిస్తున్నాయి? అలాగే ఏ సముద్రంలో కలుస్తున్నాయో గుర్తించండి.

| నది | దేశం | సముద్రం |
|---|---|---|
| 1. నైలు | | |
| 2. నైజర్ | | |
| 3. కాంగో | | |
| 4. జాంబేజి | | |

*పటం-1 ఆఫ్రికా భౌతిక పటం*




పటం-1 చూసి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి:

- ఇరుకైన తీరమైదానం సగటు ఎత్తు ఎంత?
- ఎక్కువ ప్రాంతాన్ని ఆక్రమించిన పీఠభూమి ఎత్తు ఎంత?
- ఆఫ్రికాలో దక్షిణ తూర్పు భాగాలలోని పీఠభూముల ఎత్తు ...............
- ఉత్తరాన ............. పర్వతాలు ఉన్నాయి.

SCERT, TELANGANA

ఈ ఖండం ఉత్తర ప్రాంతంలో ఎలాంటి నదులు మనకు కనిపించవు. ఈ ప్రాంతం పేరే సహారా ఎడారి. ఇక్కడ వర్షపాతం చాలా తక్కువ. ఒక్క నైలునది మాత్రం ఈ సహారా ఎడారి గుండా ప్రవహిస్తుంది.

పీఠభూమిలో విశాలమైన సరస్సులను చూడండి. ఆఫ్రికాలోని సరస్సులన్నింటికంటే విక్టోరియా సరస్సు పెద్దది. ఇది ప్రపంచంలోని పరిశుభ్రమైన నీరు లభించే పెద్ద సరస్సులలో ఒకటి. నైలునది ఈ సరస్సునుంచి పుడుతుంది.

ఈ నది పుట్టిన ప్రాంతంలో ఎక్కువ వర్షపాతం ఉండటంవల్ల ఎక్కువ నీరు ఉండి సహారా ఎడారి గుండా ప్రవహిస్తూ మధ్యధరా సముద్రంలో కలుస్తున్నది. నైలునది ఈజిప్టు గుండా ప్రవహిస్తుంది. ఈజిప్టులో చాలాభాగం ఎడారితో నిండి ఉంది.

నైలునది నాగరికత అభివృద్ధి చెందడానికి తోడ్పడింది. ఈజిప్టు నాగరికత ఎంతో ప్రాచీనమైనది. ఎన్నో వేల సంవత్సరాల నుంచి నైలునది నీరు ద్వారా ఈజిప్టులోని భూములు సాగు అవుతున్నాయి (పటం-3 చూడండి).

**పటం-2 ఆఫ్రికా - రేఖా చిత్రం**




**శీతోష్ణస్థితి:**

మీరు ఆఫ్రికా ఖండాన్ని గ్లోబుమీద పరిశీలించి-నట్లయితే భూమధ్యరేఖ ఈ ఖండం మధ్యగుండా పోవటాన్ని గమనిస్తారు. ఈ విధంగా ఆఫ్రికా ఉత్తరదక్షిణ భాగాలుగా వేరుపడిఉంది.

- ఆఫ్రికా పటాన్ని పరిశీలించి కర్కట రేఖను గుర్తించి పటం-2లో సూచించండి. భూమధ్యరేఖకు దక్షిణ భాగాన మకర రేఖ ఉంది. ఈ రేఖను గుర్తించి పటంలో సూచించండి.
- భూమధ్యరేఖ ఇంకా ఏవైనా ఇతర ఖండాల మధ్యగుండా వెళుతోందా?

కర్కట రేఖ, మకర రేఖ మధ్య ఉన్న ప్రాంతంలో శీతోష్ణస్థితి వేడిగా ఉంటుంది. ప్రపంచంలోనే ఇది అతి ఉష్ణమండల ప్రాంతం. ఇక్కడ చలి ఉండదు. ఈ ప్రాంతాన్ని ఉష్ణమండలం అంటారు (Tropic Region).


- ఆఫ్రికా పటంలో ఈ ప్రాంతాన్ని గుర్తించి అక్కడ "అయన రేఖా ప్రాంతం"గా రాసి భూమధ్య రేఖకు ఉత్తరంవైపు ఉన్న ప్రాంతాన్ని ఒక రంగుతోను దక్షిణంవైపు ఉన్న ప్రాంతాన్ని వేరొక రంగుతోనూ నింపండి.

అయనరేఖలకు దక్షిణం, ఉత్తరం వైపు ఉన్న ప్రాంతాలలో వేసవికాలం, శీతాకాలం ఉంటుంది. వీటిని సమశీతోష్ణప్రాంతాలు (Temperate Regions) అంటారు.


ఇంతవరకు మనం వేసవికాలం, శీతాకాలం గురించే చర్చించాం. అయితే వర్షపాతం ఎక్కువగా పొందే ఉష్ణమండల ప్రాంతాలలో కంటే, తక్కువ వర్షపాతం పొందే ప్రాంతాలు భిన్నమైన శీతోష్ణపరిస్థితులను కలిగి ఉంటాయి.

SCERT, TELANGANA

పటం-3 : ఆఫ్రికా-వర్షపాత విస్తరణ




పటం-4 : ఆఫ్రికాలోని సహజ వృక్ష సంపద




SCERT TELANGANA

**అత్యధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలు:**

భూమధ్య రేఖకు రెండువైపులా ఆఫ్రికాలోని చాలా ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం ఉంటుంది. పటం-3లో అత్యధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలను గుర్తించండి. ఆఫ్రికాలోని పశ్చిమ భాగంలోను, మధ్యభాగంలోను ఈ ప్రాంతాలున్నాయి. ఎక్కువ వర్షపాతం, వేడి వాతావరణంవల్ల ఇక్కడ దట్టమైన అడవులు ఉన్నాయి.

**అతి తక్కువగా లేదా పరిమిత వర్షపాతం ఉన్న ప్రాంతాలు:**

పటం-3ను పరిశీలించి తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతాలను గుర్తించండి. ఒక మాదిరి వర్షం నమోదు అయ్యే ప్రాంతాలు అత్యధికంగా వర్షపాతం నమోదు అయ్యే ప్రాంతాలకు ఆనుకొని ఉన్నాయి. వర్షపాతం మితంగా ఉండే ప్రాంతాలలో వర్షం వేసవి కాలంలోనే పడుతుంది. కాని భూమధ్యరేఖా ప్రాంతంలో సంవత్సరం పొడవునా వర్షం పడుతుంది.

మనదేశంలోలాగే ఆఫ్రికాలో మధ్యస్థంగా వర్షం పడే ప్రాంతాలలో పొడి, తేమ వాతావరణం ఉంది. ఈ ప్రాంతాలలో ఈ రకమైన వర్షపాతంవల్ల పొడవైన గడ్డి పెరుగుతుంది. ఏనుగు కూడా కనిపించనంత ఎత్తులో, దట్టంగా ఈ గడ్డి ఉంటుంది. వీటినే సవాన్నా గడ్డిభూములు అంటాం. పటం-4 ను పరిశీలించండి. ఎన్నో రకాల క్రూరజంతువులు సవన్నా ప్రాంతంలో ఉంటాయి. వీటిని గురించి మీరు తరవాత తెలుసుకుంటారు.

ఆఫ్రికాలోని ఎక్కువ భూభాగం అతితక్కువ వర్షపాతాన్ని కలిగి ఉండి లేదా సంవత్సరాల నుండి వర్షపాతం లేకుండా ఉండి తీవ్ర శుష్క ప్రాంతంగా, పొడిగా ఉంది.

- పటం-3లో ఈ శుష్క (వర్షాభావ(arid)) ప్రాంతాన్ని గుర్తించండి.

ఆఫ్రికాలోని ఉత్తర భూభాగంలోని సగభాగం శుష్క ప్రాంతం. ఈ ప్రాంతాన్ని 'సహారా ఎడారి' గా పిలుస్తాం. ఈ ఎడారి ప్రాంతంలో కొన్ని చోట్ల ముళ్ళ పొదలు, చిన్న చిన్న గడ్డి మొక్కలు పెరుగుతాయి. మిగిలిన ప్రాంతం పూర్తిగా ఇసుక దిబ్బలతో, కొండలు, పర్వతాలు రాళ్ళు, గులకరాళ్ళతో నిండి ఉంది. దక్షిణ భాగంలో ఉష్ణమండల ప్రాంతం ఉంది. దీన్ని కలహారి ఎడారిగా పిలుస్తాం.

పటం-2, 4ను పోల్చండి. ఈ కింది వాటికి జవాబులివ్వండి.

- అత్యధిక వర్షపాతం ఉన్న ప్రాంతాలలో ................ చెట్లు ఉన్నాయి.
- వర్షపాతం మధ్యస్థంగా ఉన్న ప్రాంతాలలో .............. చెట్లు ఉన్నాయి.
- అతి తక్కువ వర్షపాతం గల ప్రాంతాలలో ................ చెట్లు ఉన్నాయి.

ఈ పాఠం ప్రారంభంలో ఆఫ్రికాలోని వివిధ ప్రాంతాలను చూపే చిత్రం ఉంది. ఈ చిత్రంలో ఎంతో వైవిధ్యం ఉంది. కొన్నిచోట్ల దట్టమైన అడవులున్నాయి. ఇంకొకవైపు చెట్లు, గడ్డి పెరగడం మిగిలిన కొన్ని ప్రాంతాలలో గడ్డి, ముళ్ళపొదలు, ఇంకా కొన్ని ప్రాంతాలలో ఏరకమైన మొక్కలూ, చెట్లూ లేకుండా ఉంది.

**ఆఫ్రికా ప్రజలు:**

వివిధ భాషలు మాట్లాడే ప్రజలు, వివిధ జీవనశైలులు, అలవాట్లతో వేర్వేరు ప్రాంతాలలో నివసిస్తున్నారు. ప్రాచీనకాలం నుండి ఇక్కడి ప్రజలు చిన్న తెగలుగా ఉండి జంతువులను వేటాడుతూ, పశుపోషణ, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. వీరు భూమధ్యరేఖా ప్రాంతంలో, ఎడారి ప్రాంతంలో నివసిస్తున్నారు. పశు పోషకులు ఎత్తైన పీఠభూమిలో గల సవాన్నా గడ్డిభూములలో తమ జంతువులను మేపుతారు. నదీతీర ప్రాంతంలో అడవి భాగం అంచులలో వ్యవసాయం ఎంతోకాలంగా చేస్తున్నారు. సముద్ర తీరప్రాంతంలో ఎన్నో పట్టణాలు ఉన్నాయి. అక్కడకు ఎంతో దూరంనుంచి వర్తకులు వచ్చి వ్యాపారాలు చేసేవారు.



*చిత్రం-6.4*
**బోబాబ్ చెట్టు**

SCERT, TELANGANA

## ఆఫ్రికా, యూరప్, ఆసియా:

చాలా కాలం క్రితం వరకు ఇతర ఖండాల వారికి ఆఫ్రికా గురించి తెలియదు. యూరోపియన్లకు ఆఫ్రికా సముద్రతీర ప్రాంతంలోని ఉత్తర ప్రాంతాలు తెలియగా, భారతీయులకు, అరబ్బు వ్యాపారులకు తూర్పు తీర ప్రాంతం గురించి తెలిసింది.

- పటాన్ని పరిశీలించి యూరోపియన్లు ఆఫ్రికాలోని ఉత్తర సముద్రతీర ప్రాంతాన్ని ఏవిధంగా చేరుకున్నారో ఊహించండి. యూరప్ నుండి ఆఫ్రికా వెళ్లటానికి ఏమార్గం గుండా వెళ్లాలి? మార్గంలో ఏ సముద్రాన్ని దాటవలసి ఉంది?

ఈ తీరప్రాంతాలను మినహాయిస్తే యూరోపియన్లకు, భారతీయ లేదా అరబ్ వర్తకులకు ఆఫ్రికాలోని మిగిలిన ప్రాంతాల గురించి తెలియదు.

500 సంవత్సరాల కిందట, యూరోపియన్లు సముద్ర మార్గం గుండా భారతదేశాన్ని చేరుకోడానికి ఆఫ్రికా చుట్టుతిరిగి వచ్చేవారు. అట్లాంటిక్ మహాసముద్రం దాటుతూ వారు సెయింట్ మదీర, అజోర్స్ ద్వీపాలలో ఆగేవారు. ఈ ద్వీపాలనుంచి దక్షిణం వైపు ప్రయాణించడానికి వీరు భయపడ్డారు. అక్కడ చాలా వేడిగా ఉంటుందని, సముద్రంకూడా వేడినీటితో మసలుతూ ఉంటుందని భావించారు. తరవాత 1498 సంవత్సరంలో పోర్చుగీసు నావికుడు వాస్కోడగామా ఆఫ్రికా దక్షిణ అగ్రం వెళ్లి అక్కడనుంచి భారతదేశం చేరుకున్నాడు.

పటాన్ని పరిశీలించి కింది ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి:

- ఎవరైనా ఆఫ్రికానుంచి ఇండియా రావాలంటే ఏ మార్గంగుండా ప్రయాణించాలి? ఏ సముద్రాన్ని మధ్యలో దాటతాం?
- ఆసియా, ఆఫ్రికా ఖండాలు భూమార్గం ద్వారా కలిసి ఉన్నాయా?

*చిత్రం-6.5* దక్షిణ ఆఫ్రికాలో కేప్ ఆఫ్ గుడ్ హోప్



## ఆఫ్రికా తీరప్రాంతం:

మీరు యూరప్ గురించి చదువుతున్నప్పుడు అక్కడి సముద్రతీరం ఖండఖండాలుగా ఉన్నదని గమనించారు. సముద్రతీరంలోకి చొచ్చుకొని వచ్చిన భూభాగాలను, అఖాతాలను గురించి మీరు చదివారు. ఇవి యూరోపియన్ల సముద్ర ప్రయాణానికి ఏ విధంగా ఉపయోగపడ్డాయో గుర్తుతెచ్చుకోండి.

- ఆఫ్రికా ఖండ సముద్రతీర ప్రాంతాన్ని చూడండి. విడిపోయిన (Broken Coast) తీర ప్రాంతం మీకు కనిపిస్తోందా? లేదా చదునుగా ఉన్న తీరప్రాంతం కనిపిస్తోందా?
- యూరప్‌లోలాగ ఇక్కడ కూడా చాలా అఖాతాలు, సముద్రతీరాలు ఉన్నాయా? ఆఫ్రికాలో ఉన్న ఒక అఖాతాన్ని, సముద్రాన్ని పటం-6లో పరిశీలించి చెప్పండి.


యూరోపియన్‌లు మొదట ఆఫ్రికాలోపలికి వెళ్లటానికి ప్రయత్నించినప్పుడు ఎన్నో ఆఫ్రికా తెగలవారు వారితో యుద్ధంచేశారు. వర్తకంలో ఆఫ్రికావారిని యూరోపియన్లు మోసంచేసి, వారిని బానిసలుగా చేసుకొని ఇతర దేశాలలో అమ్మారు. యూరోపియన్లు ఆఫ్రికాలో తమ రాజ్యాన్ని స్థాపించి అక్కడ ఉన్న వనరులను, సంపదను దోచుకోవాలనుకున్నారు. అందువల్ల ఆఫ్రికా ప్రజలు వారి ప్రయత్నాలను అడ్డుకుంటూ వారిని తమ భూభాగంలోకి రాకుండా చేశారు.

## బానిసల వర్తకం (Slave Trade):

16వ శతాబ్దంలో యూరోపియన్లు అమెరికాకు వలస వెళ్లారు. అక్కడ భూములను సేద్యం చేశారు. అక్కడ ఎంతో భూమి ఉంది కాని భూములలో పనిచేయడానికి సరిపోయేటంతగా ప్రజలు లేరు. ఈ అవసరాన్ని తీర్చుకోడానికి ఆఫ్రికా నుంచి బానిసల వర్తకం ప్రారంభం అయింది.

SCERT, TELANGANA

కోస్తా తీర ప్రాంతంలోని గినియాలోను, ఆఫ్రికా తూర్పుతీర ప్రాంతంలోను ఉన్న వాళ్ళను పట్టుకొని వాళ్ళను బానిసలుగా చేసుకొన్నారు. ఈ విధంగా పట్టుకున్న వారిని సముద్రతీరానికి తీసుకొని వచ్చి యూరోపియన్లకు అమ్మేవారు. ఇందుకు ప్రతిఫలంగా ఆఫ్రికాలోని కొన్ని తెగల పెద్దలు యూరోపియన్ల నుంచి తుపాకులు, ఇనప ఆయుధాలు, మద్యం, దుస్తులను పొందేవారు.




**చిత్రం-6.6 సంకెళ్లతో బానిస**

ఈ విధంగా బానిసలుగా చేసినవారిని ఎన్నో ఇబ్బందులు పెట్టేవారు. ఎంతో మంది ప్రయాణం పూర్తికాకముందే, రేవుకు చేరుకోకుండానే మార్గమధ్యంలో మరణించేవారు. నౌకలు పూర్తిగా బానిసలతో నిండి ఉండేవి. వారికి అవసరమైన ఆహారం, నీరు, మందులు అందుబాటులో ఉండేవికావు. ఆరోజులలో ఆఫ్రికా నుండి అమెరికాకు వెళ్ళడానికి ఎన్నో రోజులు పట్టేది. అందువల్ల అనారోగ్యంతో, పౌష్టికాహార లోపంతో ఎంతోమంది బానిసలు ప్రయాణంలోనే మరణించేవారు.

అమెరికాలో కూడా వీరిపై అమానుషంగా కఠిన చర్యలు తీసుకునేవారు. వారితో ఎంతో పని చేయించుకుంటూ వారికి సరిపడే ఆహారం, ఉండటానికి వసతి కల్పించలేదు. ఈ విధంగా ఆఫ్రికానుంచి ఎన్నో లక్షల మందిని బానిసలుగా అమెరికా దక్షిణ, ఉత్తర ప్రాంతాలకు, దగ్గరలోని ద్వీపాలకు తరలించారు. వీరిలో లక్షల మంది మరణించారు. 16వ, 17వ శతాబ్దంలో ఈ రకమైన బానిసలవర్తకాన్ని ఎన్నో కంపెనీలు నిర్వహించాయి. 19వ శతాబ్దంలో ఈ వర్తకం ముగిసింది. అమెరికాలో ఈ విధంగా వచ్చిన బానిసలందరినీ అనేక పోరాటాల అనంతరం స్వేచ్ఛాయుత అమెరికా పౌరులుగా 1860లో ప్రకటించారు.

**పటం-5 1913లో యూరోపియన్ వలస ప్రాంతాలు**




**యూరప్ వలసప్రాంతాలు:**

యూరోపియన్లు భారతదేశాన్ని చేరడానికి ఆఫ్రికాను చుట్టి వచ్చేవారని మీరు తెలుసుకున్నారు. ఆ ప్రయత్నంలో వారు ఆఫ్రికా నౌకాశ్రయాల్లో సేదతీరేవారు. తరువాత పోర్చుగీసు, డచ్, ఆంగ్లేయులు, ఫ్రెంచి, జర్మనులు ఆఫ్రికా ఖండంలోని లోపలి భూభాగంలోకి ప్రవేశించి అక్కడి ప్రాంతాలను వలసప్రాంతాలుగా చేసుకున్నారు. పటం-5లో 19వ శతాబ్దంనాటి ఆఫ్రికా రాజకీయ పరిస్థితిని చూడండి. ఈ పటం 5 యూరోపియన్ దేశాలు వలసలుగా చేసుకున్న ప్రాంతాలను చూపిస్తుంది.

- ఆఫ్రికాలో వలస ప్రాంతాలు ఏర్పరుచుకున్న యూరప్ దేశాలను యూరప్ పటంలో మీరు గుర్తించండి.
- సూడాన్, జైరీలో వలస

SCERT TELANGANA

ప్రాంతాలు ఏర్పరుచుకున్న ఐరోపా దేశాలు ఏవి?

- ఆఫ్రికాలో వలసలు ఏర్పడని ఏదైనా ఒక ప్రాంతాన్ని మీరు గుర్తించగలరా?

యూరోపియన్లు ఆఫ్రికాలో వలసప్రాంతాలు ఏర్పరుచుకుంటూ ఖండం లోపలి భాగంలోకి వెళ్లారు. వాళ్ళు ఉత్తరం వైపు నైలునది పుట్టుక స్థానం వరకు ప్రయాణించారు. పశ్చిమ ప్రాంతంలో నైజర్ లోయ నుండి దక్షిణం వైపు కేప్‌టౌన్ వరకు వెళ్లారు. జాంబేజి నదీ పరీవాహక ప్రాంతాన్ని ఆవిష్కరించారు.

యూరోపియన్లు ఆఫ్రికా కలప, ఖనిజ సంపదను పెద్ద ఎత్తున యూరప్‌కు ఎగుమతి చేశారు. ఆఫ్రికా ఖండం దక్షిణప్రాంతంలోని బంగారం గనులు, వజ్రాల గనులు నేటికీ యూరోపియన్ కంపెనీల ఆధీనంలో ఉన్నాయి. జాంబియా, జింబాబ్వేలలో విలువ కట్టలేని రాగి గనులు ఉన్నాయి. ఎంతో కాలంనుంచి ఈ ఖనిజం వారికి ఎంతో ముఖ్యమైన ఎగుమతి. ఆఫ్రికానుంచి వనరులను ఎగుమతి చేయటం యూరోపియన్లు ఆపలేదు. వారు టీ, కాఫీ, రబ్బరు, పొగాకు మొదలైన తోటల పెంపకం చేపట్టి వాటిని యూరప్‌కు ఎగుమతి చేసేవారు.

**నైజీరియాలో పంటలు/తోటలు:**

మీకు చాక్లెట్లు తినడమంటే ఇష్టమే కదా? వాటిని నైజీరియాలో పండే కోకోతో తయారుచేస్తారు. దక్షిణ నైజీరియాలో కోకో మాత్రమే కాకుండా రబ్బరు తోటలు ఉన్నాయి. పామ్ ఆయిల్ చెట్లుకూడా ఎక్కువగా పెంచుతారు. వీటి గింజలనుండి నూనె తీస్తారు. పడవలో నైజర్ నదిని దాటి పామ్‌ఆయిల్ పండ్లను, గింజలను సేకరిస్తారు. పూర్వం అడవులలోనే పామ్ ఆయిల్ చెట్లు పెంచేవారు. డిమాండ్ పెరగడంతో అటవీ ప్రాంతాలలో వీటి ఉత్పత్తి పెరిగింది. నైజీరియానుండి కోకో, రబ్బరు, పామ్ ఆయిల్ ఎగుమతి చేసి విదేశీ మారకద్రవ్యాన్ని పొందుతున్నారు.

- నైజీరియాలో ఈ పంటలను పండించే ప్రాంతాలను పటం-4లో గుర్తించండి.

బ్రిటిష్‌వారు తోటలు పెంచడం మొదలుపెట్టారు. అడవులనుండి వచ్చే ఉత్పత్తితో బ్రిటిష్‌వారు సంతృప్తిపడేవారు కారు. వారు ఎక్కువ ఉత్పత్తి చేసి ఎగుమతి చేసేవారు.

తోటలు వారికి అనేక పనులను సులభం చేశాయి. మొదటగా వారు అడవులకు వెళ్లి పామ్ ఆయిల్ చెట్లను గుర్తించాల్సిన అవసరం ఉండేది కాదు. చెట్లు అన్నీ ఒక్కచోటనే పెంచినందువల్ల వాటిని కాపాడటం, పంట కోయడం సులభమయింది. వ్యాపారానికి అవసరమైన ఉత్పత్తి బాగా పెరిగింది. నైజీరియా ప్రజలు ఈ తోటలలో పనిచేయడం ప్రారంభించారు. బ్రిటిష్‌వారు ఈ తోటలకు మేనేజర్లుగా ఉండేవారు. ఈ విధంగా నైజీరియాలో పామ్ ఆయిల్ చెట్లు, కోకో, రబ్బరు వంటి వాణిజ్య వ్యవసాయం మొదలైంది.

ఇది మాత్రమే కాకుండా, తోటలుగల ప్రాంతంలో అనేకమైన ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటుచేశారు. వీటిలో కోకో పండ్లనుంచి గింజతీయడం, వీటిని ఎండబెట్టడం, పామ్‌చెట్ల పండ్లనుంచి నూనెను తీయడం, చెట్లనుంచి రబ్బరు తీయడం వంటివి ముఖ్యమైనవి.

వీటినుండి వచ్చే లాభాన్ని ఎక్కువగా బ్రిటిష్‌వారు పొందేవారు. నైజీరియా ప్రజలు కేవలం వ్యవసాయ కూలీలుగా పనిచేసేవారు. భారత దేశంలో బ్రిటిష్ వారి కాలంలో వ్యాపారం కోసమే టీ, కాఫీ తోటలు ప్రారంభమైనాయి. 1960 వరకు నైజీరియా బ్రిటిష్ వారి అధీనంలో ఉండి, స్వాతంత్ర్యం పొందినది. ఆ తరవాత క్రమంగా తోటల పెంపకం మరియు ఈ తోటలకు సంబంధించిన వ్యాపారం నైజీరియా ప్రజల అధీనంలోకి రావడంతో వారు ప్రయోజనం పొందుతున్నారు.

**స్వతంత్ర ఆఫ్రికా:**

ఆఫ్రికా దేశాలు యూరోపియన్ల అధికారంనుంచి శతాబ్దకాలంగా స్వాతంత్ర్యం పొందుతున్నాయి. కొత్త దేశాల ఆవిర్భావం జరిగి అక్కడి ప్రజలు నూతన ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఎంతోమంది యూరోపియన్లు ఆఫ్రికా ఖండంలోనే స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. కాని ఆఫ్రికన్లు మెల్లమెల్లగా తమ దేశంమీద, తమ అడవులమీద, గనులమీద, వ్యవసాయ ఉత్పత్తులమీద ఆధిపత్యం నెలకొలుపుకొంటూ వాటి ప్రయోజనాలు పొందుతున్నారు.

SCERT, TELANGANA

**ఆఫ్రికాలో ఖనిజ సంపద**

బొగ్గు, రాగి, తగరము మొదలైన ఖనిజాలు ఆఫ్రికా ఖండంలో విరివిగా లభిస్తాయి. బంగారం, వజ్రాలు వంటి విలువైన ఖనిజాలకు బహుశ ప్రపంచంలోనే ఈ ఖండం అత్యధిక ఉత్పత్తిదారు. ఇక్కడ ప్రజలను బానిసలుగా పనిచేయించుకొని ఖనిజ సంపదను దోచుకోవడమే ఐరోపా వాసుల ముఖ్య ఉద్దేశ్యం. ఆఫ్రికా దేశాలు స్వాతంత్ర్యం పొందినప్పటికి ఖనిజ సంపదపై నేటికి ఐరోపా కంపెనీలో ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది.

ఉదాహరణకు నైజీరియా సహజ వనరులలో ఖనిజ తైలం లేదా పెట్రోలియం అతి ప్రధానమైనది. ఈ దేశంలోని చమురు శుద్ధి కర్మాగారాలపై డచ్ కంపెనీలు ఆధిపత్యం కలిగి వున్నాయి. 1958 నుండి నైజీరియా ఖనిజ తైలాన్ని ఎగుమతి చేస్తూనే ఉంది. చమురు శుద్ధి కర్మాగారాలు హార్‌కోర్ట్‌లోను (Horcourt), వారిపోర్ట్‌లోను (Vari-port) నెలకొల్పారు.

నేటికి ఈ పరిశ్రమ దాదాపు విదేశీ కంపెనీల చేతిలో ఉంది. నైజీరియా ప్రభుత్వానికి ఉన్న వాటా చాలా తక్కువ. నైజీరియాలో లభించే ఇతర ఖనిజాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

నూతన సాంకేతిక పరిజ్ఞానంతో పెద్ద మొత్తంలో పెట్టుబడులతో విదేశీ కంపెనీలు ఆఫ్రికాలోని ఖనిజాలు వెలికి తీసి శుద్ధి చేసే పరిశ్రమలు నెలకొల్పి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. శ్రామికులకు తక్కువ వేతనాలు చెల్లించి ఎక్కువ లాభాలు పొందుతున్నాయి. చాలా కంపెనీలు పర్యావరణ పరిరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నాయి. తద్వారా ప్రజలకు ప్రకృతికి ఎంతో నష్టం కలుగుతున్నది. దీని యొక్క ప్రభావము భూమి నాణ్యతపై, ప్రజల జీవనం పై తీవ్ర ప్రభావం చూపుతున్నది.

- ఆఫ్రికా దేశాలను తెలుసుకొని వాటిని పటం-7లో రంగులతో దిద్ది, దేశాల పేర్లు రాయండి.

**కీలకపదాలు:**

వలస ప్రాంతాలు బానిస పీఠభూమి

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) యూరప్‌నుండి ఆఫ్రికాలోని ఉత్తర భాగాన్ని చేరుకోవాలంటే మార్గమధ్యంలో ఏ సముద్రాన్ని దాటాలి?

2) యూరోపియన్లు ఆఫ్రికాలోని అంతర్భాభాగాలు చేరుకున్నప్పుడు వారు ఎదుర్కొన్న మూడు ఇబ్బందులు ఏవి?

V5S7F4

3) ఆఫ్రికాలోని రెండు పెద్ద ఎడారులు ఏవి?

4) ఈ పాఠంలో ఆఫ్రికాకు సంబంధించిన రెండు రాజకీయ పటాలున్నాయి. ఆ రెండు పటాలను పరిశీలించి నైజీరియా, జింబాబ్వే దేశాలు గతంలో ఏ యూరోపియన్ దేశ నియంత్రణలో ఉన్నాయో గుర్తించండి.

5) ఆఫ్రికాలోని భూమధ్యరేఖాప్రాంతంలో అడవులున్న దేశాలను రెండింటిని గుర్తించండి.

6) ఆఫ్రికాలో యూరోపియన్లు ఏ వస్తువుల వ్యాపారం చేశారు? వారు వర్తకంకోసం ఏరకమైన వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించారు?

7) బానిసల వర్తకంలో ఎవరు లబ్ధిపొందారు? అమెరికావారికి బానిసలు ఎందుకు అవసరమయ్యారు?

8) బానిసల వర్తకం చాలా హేయమైనదని నీవు ఎట్లు చెప్పగలవు?

9) ఈ పాఠ్యాంశం చివరి పేరా చదివి, వ్యాఖ్యానించండి.

SCERT, TELANGANA

పటం–6 : ఆఫ్రికా దేశాలు




SCERT TELANGANA

పటం –6 సహాయంతో ఈ పటంలో ఉన్న దేశాలను గుర్తించండి. వాటికి వివిధ రంగులను వేయండి. ఏ రెండు సరిహద్దు దేశాలకు కూడా ఒకే రంగు రాకుండా జాగ్రత్త తీసుకోండి.

**పటం–7 : ఆఫ్రికా దేశాలు**


SCERT, TELANGANA

పాఠం 7

Y8H5L8

# చేతివృత్తులు - చేనేత వస్త్రాలు

## మొదటి భాగం

**అందుగుల గ్రామానికి చెందిన బుట్టల అల్లకందారు:**

పోలయ్య చేతివృత్తిపనివాడు. అతడు బుట్టలు అల్లుతాడు. అతని సొంతగ్రామం రంగారెడ్డి జిల్లాలోని మాడుగుల మండలంలోని అందుగుల. అతని వయస్సు 35 సంవత్సరాలు. అతనిది గిరిజన జాతి ఎరుకల కులం. అతని భార్య భాగ్యమ్మ కూడా బుట్టలు అల్లుతుంది. బుట్టలు అల్లడం తరతరాలుగా కొనసాగుతున్న వృత్తి. పోలయ్యకు ముగ్గురు సంతానం. వారి వృత్తికి గ్రామంలో ఆదరణ లేకపోవడంతో 30 సంవత్సరాల క్రితం పోలయ్య తండ్రితోపాటు మరో 25 కుటుంబాలు హైదరాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. చాదర్‌ఘాట్ ఫుట్‌పాత్ పక్కన పోలయ్య బుట్టలు అమ్ముతాడు.

పోలయ్య ఈతకమ్మలను తీసుకువచ్చి కత్తితో చెక్కి కొన్ని రోజులు ఎండబెట్టి వాటితో బుట్టలు అల్లుతాడు. ఇతడు వారి స్వగ్రామమైన అందుగులలో స్థానికులు సేకరించిన ఈతకమ్మల కట్టలను కొనుగోలుచేసి హైదరాబాదుకు తీసుకువస్తాడు. అందుగుల గ్రామం హైదరాబాద్‌కు 60 కి.మీ. దూరంలో ఉంది.

- బుట్టల తయారీలో ఉపయోగించే ముడిసరుకు గురించి నీకేమి తెలుసు? వాటిని ఎవరు సేకరిస్తారు?
- బుట్టల అల్లకానికి ఏ పనిముట్లను ఉపయోగిస్తారు?

పోలయ్య ఈతకమ్మ కట్టలను ఒక్కోదానికి రూ. 120 చొప్పున మొత్తం 10 కట్టలు ఖరీదుచేసి తీసుకువస్తాడు. అవి రెండు నెలల వరకు బుట్టల తయారీకి సరిపోతాయి. ఒక్క కట్టకు 25 చొప్పున మొత్తం కట్టలకు 250 బుట్టలు అల్లుతాడు. ఒక బుట్ట అల్లడానికి 30 నిమిషాల సమయం పడుతుంది. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాడు. మధ్యలో భోజనానికి, కాసేపు విశ్రాంతికి కొంత సమయాన్ని తీసుకుంటాడు.



*చిత్రం-7.1 వెదురు బుట్టల దుకాణం*

పోలయ్య 20/- రూపాయలకు ఒక బుట్ట అమ్ముతాడు. పండగలప్పుడు పెద్దసైజు బుట్టలను కూడా అమ్ముతాడు. వాటిధర బుట్టకు వాడిన ముడిసరుకుపైన ఆధారపడి ఉంటుంది. అతను సంవత్సరం పొడవునా బుట్టలు అమ్ముతాడు. రెండు నెలల్లో రూ. 5000/- విలువగల బుట్టలు అమ్ముతాడు. దానినుండి రూ. 1200/

SCERT, TELANGANA



*చిత్రం-7.2 బుట్టల అల్లిక*

- ముడిసరుకు ఖర్చు, రూ.100/- రవాణా ఖర్చును తీసివేయగా పోలయ్య కుటుంబానికి మిగిలేది రూ.3700/- మాత్రమే. అది రెండు నెలల ఆదాయం. కుటుంబ ఖర్చులకు సరిపడదు. అందుకు బుట్టలతోపాటు వెదురు ఉత్పత్తులైన అంచెలు, స్టాండులు కూడా కొని, అమ్మడం ద్వారా ఆదాయాన్ని కొంత పెంచుకుంటాడు.

బుట్టల తయారీ అనేది కళాత్మకమైన పని. దానికి సంబంధించిన ఈతకమ్మలు, వెదురు అడవిలో దొరికే సంపద. ఆ సంపద పెద్ద పరిశ్రమల విపరీతమయిన దోపిడి వల్ల రోజురోజుకూ తరిగిపోతోంది. సాంప్రదాయికంగా అడవినే నమ్ముకొని జీవిస్తున్న వారిమీద అది ప్రభావం చూపుతోంది. ఇలాంటి ఉత్పత్తులకు డిమాండ్ కూడా తగ్గుతోంది. వాళ్ళు ఇక వేరే దారి లేక గ్రామీణ జీవనం మారి పట్టణ జీవనానికి సిద్ధపడవలసి వస్తోంది. ఇది కేవలం బుట్టలు తయారుచేసే వారిపైనేకాకుండా అనేక సాంప్రదాయిక వృత్తులపైన ప్రభావం చూపుతోంది. గ్రామీణ ప్రాంతాలనుండి తరలివచ్చి నగరంలో బతుకుతున్నా వారికి కనీస సౌకర్యాలు అందడంలేదు.

**నగరంలో మురికివాడలు:**

పోలయ్య మురికివాడలో నివసిస్తాడు. అక్కడ ఈగలు, దోమలు, మురికినీరు, దుర్వాసన లాంటి అనేక సమస్యల మధ్య జీవనం గడుపుతున్నాడు. తాగేనీరు కాని, విద్యుత్ సరఫరా కాని లేవు. వారు నివసించే గుడిసె తడకలతోవేసి ప్లాస్టిక్ కవర్ కప్పి ఉంది. వర్షాకాలంలో నీరు గుడిసెలలోకి రావడం, పైకప్పులు కురవడం లాంటి గడ్డు పరిస్థితులు, నగర మున్సిపల్ అధికారులు తరచుగా గుడిసెలు ఖాళీచేయించడం, వాళ్లు మళ్లీ వాటిని వేసుకోడం నిరంతరం జరుగుతున్న ప్రక్రియ.

కాయకష్టం చేసే పోలయ్య లాంటివారికి రేషన్ కార్డు, ఓటుహక్కు లేవు. వారికి కనీసం నివాస ధృవీకరణ గుర్తింపు కార్డూ ఉండదు. దాంతో వారు ఏ ప్రజాస్వామిక ప్రక్రియలో పాల్గొనడం లేదు. పేదలకు అందే సౌకర్యాలు కూడా పొందడంలేదు.

**బుట్టలు అల్లేవారు:**

మన రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో ఎరుకల తెగవారు బుట్టలు అల్లి జీవిస్తున్నారు. ఎరుకల స్త్రీలు వారికి వారసత్వంగా వస్తున్న *(సోది)* ఎరుక చెపుతారు. సోది అంటే వ్యక్తుల భవిష్యత్తు గురించి చెప్పడం. వారు మాట్లాడేది ఒకరకం మాండలికమైన ఎరుకల భాష. తెలుగు, తమిళ మరియు కన్నడ భాష పదాలను వీరు తమ భాషలో వాడతారు.



*చిత్రం-7.3 బుట్టల అల్లిక*

SCERT, TELANGANA

**సరైన జవాబును ఎన్నుకోండి:**

a. అడవులు చాలా తరిగిపోతున్నాయి. (పరిశ్రమలవల్ల / బుట్టల తయారీవల్ల. )

b. పోలయ్య వెదురు వస్తువులు ఎక్కడ కొంటాడు? (మండీలో వ్యాపారస్థుల దగ్గర / అందుగుల గ్రామంలో).

- బుట్టల తయారీకి అయే ముడిసరుకుల ఖర్చును, వచ్చే ఆదాయాన్ని ఒక పట్టికలో రాయండి.
- పోలయ్య లాంటివాళ్లకు రేషన్‌కార్డు ఇవ్వవచ్చా? ఓటుహక్కు కల్పించవచ్చా?

ఎరుకల భాష తెలుగు, తమిళం, కన్నడ భాషలతో మిళితమై ఉంటుంది.

అడవిలో లభించే వెదురు మరియు ఈత చెట్టు వంటి ముడిసరుకుల సహాయంతో బుట్టలు అల్లడం వంటి తేలికైన చేతివృత్తుల గురించి ఇప్పటి వరకు తెలుసుకున్నారు. కాని కొన్ని ఉత్పత్తుల తయారీ చాలా సంక్లిష్టంగా ఉంటుంది. వాటి ముడిసరుకు తయారీ, ఆ పరికరాలు సంక్లిష్టంగా ఉంటాయి. ఉదాహరణకు నూలు, పట్టు బట్టలను చేతిమగ్గాలు, మరమగ్గాలు, పెద్ద మిల్లులు తయారుచేస్తున్నాయి. మనమిపుడు చేనేత పనివారు బట్టలను ఎలా నేస్తారో తెలుసుకుందాం.

## రెండవ భాగం

**పోచంపల్లిలోని చేనేత కార్మికులు:**

తెలంగాణలో పోచంపల్లి యాదాద్రి జిల్లాలోని ఒక చిన్నఊరు. అక్కడ చేనేత కార్మికులు ప్రత్యేకమైన ఇక్కత్, టై అండ్ డై చీరలు నేస్తారు. అవి ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవి. ఇక్కత్ అంటే మగ్గంమీద నేతకు ముందే నూలుకు ఒక ప్రత్యేక పద్ధతిలో రంగులు అద్దడం. దీన్నే బంధిని లేదా పోచంపల్లిగా పిలుస్తారు. నాణ్యమైన పట్టుచీరలను స్థానికంగా రూపొందించిన డిజైన్‌లలో నేస్తారు. ఇవి మూడు ఛాయలుగా కనబడేవిధంగా నేస్తారు. పోచంపల్లి చుట్టపక్కల 100 గ్రామాలలో దాదాపు 10000 కుటుంబాలవారు ఈ పని చేస్తున్నారు.

పోచంపల్లి చీరకు ఒక ప్రత్యేకత ఉంది. అది రంగులలోను, డిజైన్‌లలోను ప్రసిద్ధిగాంచినది. ఇతర పట్టుచీరలకంటే భిన్నమైనది. అందుకే భారతదేశంలో పోచంపల్లి చీరకు మొట్టమొదట పేటెంట్ రైట్ లభించింది. అందువల్ల ప్రపంచంలో ఎక్కడా కూడా పోచంపల్లి ఇక్కత్ డిజైన్‌ను ఉపయోగించుకోడానికి వీలులేదు. ప్రధానంగా ఇక్కత్ చీర అనగానే పోచంపల్లి గుర్తుకు వస్తుంది. పోచంపల్లి చీరలకు ఇక్కత్ బ్రాండ్‌ఉంది. పోచంపల్లి చుట్టుపక్కల గ్రామాలవారు కూడా ఈ బ్రాండుతోనే నేసిన చీరలను అమ్ముతారు. వీటిని దేశవిదేశాలలో ఎక్కువ ధరకు అమ్ముతున్నారు.

చీర తయారీకి కావలసిన పట్టుదారం, రంగులు, నూలు మొదలయిన వాటిని నేతకార్మికులు సొంతంగా ఉత్పత్తిచేయరు. వాటిని మార్కెట్‌నుంచి కొనుగోలు చేస్తారు. పట్టుపురుగుకాయనుంచి పట్టుదారం తీస్తారు. రైతులు మల్బరీతోటలలో పట్టు పురుగులను పెంచుతారు. చేన్లో పండిన పత్తి, ఫ్యాక్టరీలో కాని, ఇంటిలో వడకడం వలన కాని నూలుదారంగా తయారవుతుంది. రంగులు ఫ్యాక్టరీలో తయారవుతాయి. చేనేత కార్మికులు నూలుదారాన్ని, రంగులను మార్కెట్లో కొనుగోలు చేస్తారు.

**పరికరాలు:** చేనేత కార్మికులకు కలపతో తయారుచేసిన సొంత మగ్గాలు ఉంటాయి. అవే నేతకు ప్రధాన పరికరాలు, మగ్గంతోపాటు కత్తులను, ఇతర పరికరాలను ఉపయోగిస్తారు. చీర నేయడానికి చేనేత కార్మికులు డిజైన్‌కు ప్రాధాన్యమిస్తారు. మీరు ఆ చీరను పరిశీలిస్తే దానిపై అంతర్లీనంగా ఉన్న అనేక డిజైన్‌లు కనిపిస్తాయి. ఈ ప్రత్యేకమయిన డిజైన్‌ను మొదట గ్రాఫ్ కాగితంమీదవేసి దాన్ని బట్టి నూలుకు రంగు అంటగూడని చోట్ల కట్లుకడతారు. తరవాత రంగులో ముంచుతారు.

SCERT, TELANGANA

ఆ విధంగా కార్మికులు ఈ పనిలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తపడతారు. తరతరాలుగా నేత కార్మికులు పనిచేయడంవల్ల అనేక కొత్త డిజైన్లను కూడా రూపొందిస్తున్నారు.

- ఏదైనా ఒక చీరను పరిశీలించి ఒక సామాన్య డిజైన్ గీయండి.

## చీర నేయడంలో వివిధ దశలు:


చీర నేయడంలో వివిధ దశలు ఉంటాయి. మొదటిది పట్టుదారాన్ని వడకటం. తరవాత పడుగుకు వాడే దారాన్ని ఆసుపోస్తారు. పేక దారాన్ని రాట్నంమీద కండెలుగా చుడతారు. దారంమీద డిజైన్ గుర్తులు వేసి, రంగు అంటకుండా (తెల్లగా) ఉండవలసినచోట్ల కట్టుకట్టి, రంగు అద్దుతారు. రంగులు వేయడానికి ఈ గుర్తులు సహాయపడతాయి. దారంపైన రంగులను అద్దడానికి ఎక్కువ సమయం తీసుకొంటుంది. ప్రతి రంగునూ అద్ది, ఆరబెట్టాలి. రంగులు, డిజైన్ల తరవాత నేతకోసం మగ్గంమీదికి ఎక్కిస్తారు.

## దారానికి రంగులు అద్దడం:

పట్టుదారానికి కట్టుకట్టి రంగులలో ముంచి, దాన్ని ఆరబెడతారు. మళ్లీ కట్టువిప్పి రంగుభాగానికి పైన కట్టుకట్టి మళ్లీ (మరొక) రంగు అద్ది, ఆరబెడతారు. ఈ విధంగా అనేక సార్లు చేస్తారు. దీన్నే టై అండ్ డై అని పిలుస్తారు. ఎరుపు, గోధుమరంగు ఛాయల మధ్యలో నలుపు, తెలుపు రంగులు రావడానికి అలిజారిన్ రంగులను వాడతారు. దారాన్ని ఆముదం, క్షారజలం మిశ్రమంలో నానబెట్టి కొంత సమయం తరవాత ఆరబెట్టి అలిజారిన్ పేస్ట్‌లో ముంచి ఎరుపు రంగువచ్చే వరకు ఉడకబెడతారు. నలుపు రంగు కోసం ఇనుప రజను, వెనిగర్ కలుపుతారు.

**పడుగు-పేక (వార్ప్ - వెఫ్ట్) :**

బట్టలో దారాలు మీరు గుర్తిస్తారు. పడుగు (వార్ప్) దారాలు పై నుండి కింది వరకు ఉంటాయి. పేక (వెఫ్ట్) దారాలు ఎడమనుండి కుడివైపు అడ్డంగా ఉంటాయి. (ఈ విధంగా #)




SCERT, TELANGANA

మనమిప్పుడు పోచంపల్లి నేత కార్మికుని కుటుంబానికి వెళ్లి ఇక్కత్ చీరను గురించి మరింత తెలుసుకుందాం.

జగతయ్య పోచంపల్లి గ్రామ నివాసి. అతని కుటుంబ సభ్యులు అతడు, అతని భార్య, కొడుకు, కోడలు, అందరూ నేతపనివారే. మేము వెళ్లే సరికి కుటుంబ సభ్యులు అందరూ కలిసి నేతకు సంబంధించిన వేరువేరు పనులు చేస్తున్నారు. అతను పేకకువాడే దారాన్ని కండెలుగా చుడుతున్నప్పుడు అతని కొడుకు మురళి ఇంటిలోనే అమర్చిన గుంట మగ్గంమీద నేతనేస్తున్నాడు, టై అండ్ డై రబ్బరు ముక్కలుచుట్టి చిటికెపోయడం, పడుగుకు వాడే దారాన్ని కుంచెతో దువ్వి అచ్చు అతకడం, చుట్టచుట్టి మగ్గందగ్గరికి తేవడం మొదలయిన రకరకాల పనుల ద్వారా ఇక్కత్ చీర తయారవుతుంది. ఈ నేతకు సంబంధించిన పరికరాలు కలపతో చేసిన వస్తువులే. ముసలితనంలో ఉన్న జగతయ్య ఎక్కువ సమయం నూలు వడుకుతుండగా, అతని కొడుకు మగ్గంపై నేసేవాడు.

జగతయ్య భార్య, కోడలు రాట్నంమీద దారపు కండెలు చుట్టే పనికూడా చేస్తారు.



*చిత్రం-7.4 గుంటమగ్గం మీద చీరనేయడం*




*చిత్రం-7.5 దారం చుట్టడం*

SCERT TELANGANA



చిత్రం-7.6 కండెలు చుట్టడం

జగతయ్య కొడుకు మురళి మాస్టర్ వీవర్ దగ్గరి నుండికాని, సొసైటీ నుండి గాని పట్టుదారం, జరీ, రంగులు, డిజైన్‌లు సమకూర్చు కుంటాడు. అతను సొసైటీ సభ్యుడు. ఒకేసారి 8 చీరలకు కావలసిన ముడి సరుకును తీసుకుంటాడు. కుటుంబ సభ్యులంతా కలిసి రోజుకు 12-15 గంటల వరకు పనిచేస్తారు. 8 చీరలు నేయడానికి 50 రోజులు పడుతుంది. వారు చీరకు సగటున రూ. 1200/- సంపాదిస్తారు.

జగతయ్య మనువళ్ళు పాఠశాలలో చదువుకుంటున్నారు. ఆరుబయట ఊడ్తెలను నిలబెట్టి పడుగు చేయడానికి అందరూ కలసి పని చేస్తారు.



చిత్రం-7.7 డిజైన్‌లు వేయడం

ఇక్కత్ చీరలు నేయడం జగతయ్య కుటుంబానికి వంశ పారంపర్యంగా వస్తున్న వృత్తి. కుటుంబ సభ్యులందరూ కలిసి పనిచేసినా సరిపడేటంత ఆదాయం రావడంలేదు. దాంతో కుటుంబం గడవడం కష్టంగా ఉంది.

మార్చి నుండి మే వరకు జగతయ్య కుటుంబ సభ్యులు కొన్ని గంటలు మాత్రమే పనిచేయగలుగుతారు. కారణం అత్యధిక ఉష్ణోగ్రత వల్ల తరచుగా దారం తెగిపోతుంది. దాంతో పనికి ఆటంకం కలుగుతుంది. కాబట్టి మధ్యాహ్నం వరకు మాత్రమే పనిచేయడానికి, వీలుకలుగుతుంది. చేనేత మహిళలు వృత్తిపనిచేస్తూ, కుటుంబాన్ని చూసుకోవడం, వంట, నీటిసమస్య, పిల్లలను పాఠశాలలకు పంపడంలాంటి బాధ్యతలతో సతమతమవుతూ ఉంటారు.

గతంలో జగతయ్య కుటుంబం సొసైటీలో పనిచేసేది. ఇందులోని సభ్యులు జబ్బుపడినప్పుడు, అకాల మరణం పొందినప్పుడు సొసైటీ నుండి బీమాద్వారా ఆర్థిక సహాయం లభించేది. ఇంటి నిర్మాణానికి సొసైటి నుండి రుణం ఇచ్చేవారు. ప్రస్తుతం సొసైటీద్వారా కావలసినంత పని లభించడం లేదు. అందుకు నేతపనితోబాటు అదనంగా ఏదైనా ఆదాయం లభించే పనిచేసి కుటుంబాన్ని

SCERT TELANGANA

పోషించుకుంటున్నారు. మాస్టర్ వీవర్స్ పనిని కల్పించి ఆదాయాన్ని పెంచుకోడానికి అవకాశం కల్పిస్తున్నారు. జగతయ్య తమ మాస్టర్ వీవర్ కోసం ఇక్కత్ చీర నేస్తున్నాడు. రాబోయే రోజులలో సహకార సంఘాల ద్వారా పని లభించే అవకాశం ఉందని జగతయ్య ఆశాభావం వ్యక్తంచేశాడు. అందువల్ల సహకార సంఘాల సభ్యత్వాన్ని కొనసాగించాడు.



చిత్రం-7.8 చేనేత ప్రక్రియ

**చేనేత కార్మికుల సమస్యలు – సహకారసంఘాలు:**

భారతదేశంలో అత్యధిక చేతి మగ్గాలు ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ ఒకటి. గత కొన్ని శతాబ్దాలుగా చేనేత కార్మికులు అనేక రకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీరు మిల్లుగుడ్డ, మరమగ్గాలతో పోటీపడలేకపోతున్నారు. యంత్రాలపై తయారు కావడం, సింథటిక్ దారాలను ఉపయోగించడం వలన నూలు వస్త్రాలకంటె అవి తక్కువ ధరకు లభిస్తున్నాయి. మంచి నాణ్యత కలిగి ప్రపంచ ప్రసిద్ధి చెందిన అందమైన చీరలుగా గుర్తింపు లభించినప్పటికి మధ్యవర్తుల ప్రమేయంతో నేతపనివారికి సరైన గిట్టుబాటు లభించడంలేదు.

కొనుగోలుదారులు ప్రపంచ-మంతటా ఉన్నా నేరుగా నేతకార్మికులతో సంబంధాలు లేవు. అనునిత్యం వినియోగదారుల ఫ్యాషన్స్ మారుతున్నాయి. మారే డిజైన్స్ గురించి గానీ, ఎక్కువ డిమాండ్‌గల డిజైన్ల గురించిగానీ నేత కార్మికులకు తెలియదు. మధ్యవర్తుల ద్వారా వాడుకలో ఉన్న డిజైన్ తెలుసుకొని మార్పుచేయాలి. ముడిసరుకు కొనుగోలుకు కూడా వారు మధ్యవర్తుల పైనే ఆధారపడాలి. చేనేత రంగంలో మధ్యవర్తులు కీలక పాత్ర పోషిస్తూ కొనుగోలు దారులనుండి పెద్ద మొత్తంలో లాభాలు ఆర్జిస్తున్నారు.



చిత్రం-7.9 పడుగు చేయడం

SCERT, TELANGANA

చేనేత కార్మికులు సమస్యలను అధిగమించాలంటే ప్రభుత్వమే సహకార సంఘాలను ప్రోత్సహించాలి. ముడి సరుకు తక్కువ ధరకు అందించి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి మధ్యవర్తుల, వర్తకుల పాత్రను తగ్గించాలి. కొత్త డిజైన్‌ల రూపకల్పనకు సొసైటీ వారు శిక్షణా కేంద్రాలను ఏర్పాటుచేయాలి.

ఏది ఏమైనప్పటికీ ప్రస్తుత సమయంలో తెలంగాణలోని చాలా మంది నేతపని వారికి సొసైటీలనుండి తగినంత పని లభించడంలేదు. ముడిసరుకు సేకరణలో, అమ్మకాలు, విధాన నిర్ణయాలలో చేనేత సహకార సభ్యులకు సొసైటీలు తగినంత ప్రాధాన్యం ఇవ్వడంలేదు. మారుతున్న వినియోగదారుల అభిరుచుల మేరకు వస్త్రాల ఉత్పత్తికి సొసైటీలు నేత కార్మికులకు అవకాశాలు కల్పించడంలేదు. మళ్లీ మధ్యవర్తుల, వర్తకుల ఆధిపత్యానికే వాళ్ళు తల ఒగ్గవలసి వస్తోంది.

చేనేత వస్త్రాల తయారీకి కావలసిన ముడిపదార్థాలు వాటి మార్కెటింగ్ సౌకర్యాలను తెలంగాణలో మాస్టర్ వీవర్స్ మరియు వర్తకులు కల్పిస్తున్నారు. మాస్టర్ వీవర్స్



*చిత్రం–7.10 ఇక్కత్ చీరను మడతపెట్టడం*

ముడిసరుకును సేకరించి చేనేత కార్మికులకు సరఫరా చేసి, తయారైన బట్టలు వారు తీసుకుంటున్నారు. తరువాత వారు టోకు వర్తకులకు అమ్ముకుంటున్నారు. చేనేత కార్మికులకు మాత్రం ఒప్పందం చేసుకున్నమేరకు వేతనం చెల్లిస్తున్నారు. చాలా మంది మాస్టర్ వీవర్స్ నేతకు సంబంధించిన మగ్గాలు, పనిముట్లు, ముడిపదార్థాలు ఋణాలపై అందిస్తున్నారు. కాని తయారైన చీరలు ఇతర మాస్టర్ వీవర్స్‌కు అమ్మగూడదు. చేసిన పనికి కూలి నిర్ణయించి చెల్లిస్తారు. ఒకవేళ నేతకార్మికులు తమ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రయత్నించినా తక్కువ కూలికి పనిచేసేవారికి పనిని అప్పగిస్తారు. నేత కుటుంబాలను ఈ దుస్థితి నుండి కాపాడటానికి వారికి తగినంత పని కల్పించి మాస్టర్‌వీవర్‌ల నుండి రక్షించాల్సిన బాధ్యత చేనేత సొసైటీలపైన ఉంది.

- ఇక్కత్ చీర తయారుచేయడానికి కావాల్సిన ముడిసరుకును, పరికరాలను తెలియజేసే పట్టిక తయారుచేయండి.
- జగతయ్య కుటుంబం మాస్టర్ వీవర్స్ వద్దనే ఎందుకు పనిచేస్తున్నది?

**కీలకపదాలు:**

1. ముడిసరుకు
2. ఇక్కత్
3. పేటెంట్ హక్కు
4. పడుగు–పేక (వార్పు–వెఫ్ట్).
5. టై అండ్ డై
6. సహకార సంఘాలు

SCERT, TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

R7E5E5

1) బుట్టల అల్లకంలోను, నేతపనిలోను మంచి ఆదాయం లభిస్తుందని భావిస్తున్నారా?
2) మీ తల్లిదండ్రులతో చర్చించి బుట్టలకు ప్రత్యామ్నాయంగా ఏయే వస్తువులు ఉన్నాయో జాబితా తయారుచేయండి.
3) చేతివృత్తులవారి ఉత్పత్తుల స్థానంలో ఎన్నో ఇతర ఉత్పత్తులు వచ్చి చేరాయి. వాటిని గుర్తించి అవి ఎందుకు ఉత్పత్తి అయ్యాయో తెలుసుకోండి. అవి వారి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తున్నాయో చర్చించండి.
4) పోలయ్య కుటుంబం హైదరాబాద్‌కు ఎందుకు వచ్చింది? పోలయ్యకు హైదారాబాద్‌లో ఓటుహక్కు ఎందుకు లేదు?

| వరుస సంఖ్య | చేతివృత్తిపనివాని పేరు | ఉత్పత్తి అయిన వస్తువు | ఉపయోగించే ముడిసరుకులు | ముడిసరుకులు ఎక్కడ లభ్యమవుతాయి? |
|---|---|---|---|---|
| 1 | పోలయ్య | బుట్టలు | ఈతకమ్మలు | అందుగుల గ్రామం |
| 2 | | | | |
| 3 | | | | |

5) బుట్టలే కాకుండా ఇతర వస్తువులను తయారుచేసేవారిని మీరు చూసి ఉంటారు. అలాంటి వ్యక్తుల గురించి వివరాలను సేకరించి ఈ కింది పట్టికలో రాయండి.
6) పోచంపల్లి ఇక్కత్ చీరకు పేటెంట్ హక్కు లభించడంవల్ల పోచంపల్లి చేనేత పనివారికి ఎలా మేలుజరుగుతుంది?
7) చేనేత కార్మికులు ముడిసరుకును సేకరించుకొని ఇక్కత్ చీరను తయారుచేసి స్వయంగా ప్రజలకు అమ్ముతారా? ఇందులో వారు ఎదుర్కొనే సమస్యలేమిటి?

| ఉత్పత్తి | ఉపయోగించిన ముడిసరుకు | ఉపయోగించిన పనిముట్లు | వస్తువులు అమ్మే విధానం |
|---|---|---|---|
| బుట్టల అల్లకం | | | |
| చేనేత వస్త్రాలు | | | |

8) బుట్టల అల్లకంలో, చేనేత వస్త్రాల నేతలో జరిగే వివిధ ఉత్పత్తి దశలను ఫ్లోచార్టు రూపంలో చూపండి.
9) బుట్టల అల్లకానికీ, ఇక్కత్ చీరల తయారీకీ మధ్యగల భేదాలను ఈ కింది పట్టికలో రాయండి.
10) తెలంగాణలో ఏయే ప్రాంతాలలో, ఏయే చేతి వృత్తులు ఉన్నవో జాబితా రాసి, ఒక చార్ట్ రూపొందించండి?

**చర్చ:** స్థానికంగా అందుబాటులో ఉన్న చేతివృత్తి కారులను పాఠశాలకు ఆహ్వానించి, వారి వృత్తి గురించి చర్చించండి.

**ప్రాజెక్టు పని:**

1) మీ తరగతి గదికి చేతి వృత్తిదారుని ఆహ్వానించి మాట్లాడించండి లేదా నేత కార్మికుడు పనిచేసే చోటికి విద్యార్థులను తీసుకవెళ్ళి అతని ఉత్పత్తి దశలను ఒక పేపర్‌పై రాయించండి.
2) మీ గ్రామం/ప్రాంతంలోని వివిధ వృత్తుల వారిని కలిసి వారి వివరాలతో పట్టికను నింపి తరగతి గదిలో చర్చించండి.

| క్రమ సంఖ్య | వృత్తిదారుని పేరు | వృత్తి | కొనసాగిస్తున్నారా/ మానేశారా | మానేస్తే కారణం | కొనసాగితే సంతృప్తిగా ఉన్నారా? |
|---|---|---|---|---|---|

SCERT, TELANGANA

పాఠం 8

A5V5G4

# పారిశ్రామిక విప్లవం

**ఇంతకు ముందు పాఠాలలో వివిధ వృత్తిపనివాళ్లు వివిధ పద్ధతులలో వస్తువులను ఏ విధంగా తయారుచేస్తారో తెలుసుకున్నాం. వాళ్లు తయారుచేసిన వస్తువులు యంత్రాలతో తయారైన వస్తువులతో పోటీపడలేవని వాళ్లలో చాలామంది తమ వృత్తులను మానివేస్తున్నారు. వస్తూత్పత్తిలో యంత్రాలు ఏ విధంగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయో, అవి సమాజంలోని ప్రజల జీవన విధానాన్ని ఏవిధంగా ప్రభావితం చేశాయో ఈ అధ్యాయంలో మనం చర్చిద్దాం.**

SCERT TELANGANA

### పెరిగిన వర్తకుల నియంత్రణ:

సాధారణ శకానికి పూర్వం (సా.శ.పూ.) 1500 నుండి 1800 సంవత్సరాల మధ్య కాలంలో ఆఫ్రికా, అమెరికా, ఆసియా యూరప్ ఖండాల దేశాల మధ్య వ్యాపారం బహువిధాలుగా వృద్ధి చెందింది. వస్త్రవ్యాపారం కూడా విస్తరించడం ప్రారంభమయింది. యూరోపియన్ వర్తకులు సబ్‌కాంట్రాక్ట్ పద్ధతిని (Putting out system) ప్రారంభించి వస్త్రపరిశ్రమకు అవసరమైన సామగ్రిని ఉత్పత్తి చేయడానికి చేతివృత్తి పనివారికి, చిన్న రైతులకు ముందుగా చెల్లింపులు చేసేవారు. ఈ కాలంలో వ్యవసాయం నుండి వచ్చే ఆదాయం క్షీణించగా, అనేకమంది వ్యవసాయంలో నష్టాలు చవిచూసి పశువుల్ని మేపడానికి (grazing) వ్యవసాయ భూముల్ని ఉపయోగించారు. కాబట్టి వీరికి జీవించడానికి అవసరమైన ఆదాయం వస్త్రపరిశ్రమలో పనిచేయడం ద్వారా లభించింది.

సబ్‌కాంట్రాక్ట్ పద్ధతి కింద, బ్రిటన్‌లో ఒక వస్త్రవ్యాపారి ముడినూలును వాటి సరఫరాదారు దగ్గర కొని, దీన్ని నూలువడికే (spinner) వారి వద్దకు తీసుకెళ్లి దారంగా మార్చి, తరవాత నేతపనివారి వద్దకు తీసుకువెళతాడు. తర్వాత వస్త్రాన్ని శుభ్రపరిచే ఫుల్లర్స్ వద్దకు, చివరికి వస్త్రానికి రంగులు అద్దడంతో వస్త్రతయారీ పూర్తి అవుతుంది. ఈ దశలన్నీ దేశంలో వివిధ ప్రదేశాలలో జరుగుతాయి. వస్త్రాన్ని ఇతర దేశాలలో అమ్మే ముందు జరిగే తుదిపని (finishing work) లండన్‌లో జరుగుతుంది. ఈ విధంగా వ్యాపారుల నియంత్రణలో అనేకమంది ఉత్పత్తిదారులు వస్త్రాలను ఉత్పత్తి చేస్తారు. ఇక్కడ ఫ్యాక్టరీ వ్యవస్థ లేదు. వస్త్రాలతయారీలో ఉన్న వివిధ దశల్లో/ పద్ధతుల్లో ఒకేచోట గాక వివిధ కుటుంబాలలో పనులు జరిగేవి. ప్రతి వర్తకుడూ వస్త్రాల తయారీలోని ప్రతి దశలోనూ 20 నుండి 25 మంది చేతివృత్తి పనివారిని వినియోగించేవారు.


కొంతకాలం తరవాత వస్త్రవ్యాపారులు చేతివృత్తి పనివారిలో ప్రతి ఒక్కరి ఇంటికీ వెళ్లకుండా వీరందర్నీ ఒకచోటుకు తీసుకువచ్చి తమకు కావలసిన విధంగా వస్తూత్పత్తి చేయించేవారు. ఈ విధంగా ఏర్పాటు చేసిన పని కేంద్రాలను కర్మాగారాలని పిలిచేవారు. పనివాళ్లు తమ సొంత పనిముట్లతో కర్మాగారానికి వచ్చి వర్తకుడు ఇచ్చే ముడిపదార్థాలతో వస్తువుల్ని తయారుచేసేవారు. వీటిని వర్తకుడు మార్కెట్‌లో అమ్మేవాడు. ఈ విధంగా హస్తకళాకారునిపై వర్తకుని ఆధిపత్యం పెరిగింది. ఈ దశను పూర్వ పారిశ్రామికాభివృద్ధి దశ (Proto-Industrialisation) అని అంటారు. ఈ దశలో అనేకమంది

చేతి ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొనడం, వర్తకులు శ్రామికులపై, మార్కెట్లపై నియంత్రణ సాధించి హస్తకళాత్మక ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా మార్కెట్‌ను అభివృద్ధిచేశారు.

**పారిశ్రామిక విప్లవ ప్రారంభం సా.శ.పూ. 1750 – 1850:**

ఈ కాలంలో అనేక మార్పులు సంభవించాయి. 1750 సంవత్సరంలో వస్తువులతయారీలో, రవాణాలో, ప్రజారవాణాలో యంత్రాల వాడుక, ఆవిరిశక్తి వినియోగం పెరిగాయి. చాలామంది ప్రజలు జీవనోపాధి నిమిత్తం గ్రామాలనుండి పట్టణాలకు వలస వెళ్లారు. ఈ రోజున మనం ఎన్నో యంత్రాలను, యంత్రంతో తయారుచేసిన వస్తువులను వినియోగిస్తున్నాం. ఇదే బ్రిటన్‌లో యాంత్రికదశ (Machine Age)కు ప్రారంభం.

వస్త్రాలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ఆశ్చర్యపడి సరఫరాను ఏ విధంగా పెంచాలో అనేక విధాలుగా ఆలోచించారు. వీరిలో కొంతమంది ఆలోచన ఈ విధంగా ఉంది: "ఈ రోజులలో మన వస్త్రానికి డిమాండ్ విపరీతంగా ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను మనం చేయలేం. అంతేగాక, మగ్గాలమీద వస్త్రం తయారీ అధికవ్యయంతో కూడుకుని ఉంది. వేగంగా నూలు వడికే యంత్రాన్ని, నేతనేసే యంత్రాన్ని తయారుచేసినట్లయితే, మనం తక్కువధరకు అధిక వస్త్రాన్ని ఉత్పత్తి చేయవచ్చు. అప్పుడు ఎక్కువ మంది మన బట్ట కొంటారు. మనం ఎక్కువ డబ్బు సంపాదించవచ్చు."




*చిత్రం–8.1 నూలు వడికే యంత్రం*

వ్యాపారపు, పని ఒత్తిడుల ఫలితంగా అనేకమంది యంత్రాల తయారీకి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ ప్రయత్నాల ఫలితంగా చాలా కాలానికి ఎక్కువ నూలును, తక్కువకాలంలో వడికే యంత్రాన్ని (చిత్రం–8.1) కనుక్కొన్నారు. దీని బరువు చాలా ఎక్కువ. దీన్ని ఉపయోగించడంలో శ్రామికులు తమ కాళ్ళు, చేతులు, అధికశక్తిని వినియోగించటం వల్ల వీరు తీవ్ర అలసటకు గురిఅయి, యంత్రం దానికదే కదిలే విధంగా ఉంటే బాగుంటుందని అనుకునేవారు. ఈ ఆలోచన జేమ్స్ వాట్ ఆవిష్కరణతో అంటే, ఆవిరియంత్రంతో నిజమయింది.

**జేమ్స్ వాట్ ఆవిష్కరణ:**

జేమ్స్ వాట్ ఇంగ్లాండు దేశపు హస్తకళాకారుడు, యంత్రాలను తయారుచేసేవాడు. నీటి ఆవిరికి భారీ బరువులను కదిలించే శక్తి ఉందని ఇతడు గుర్తించాడు. ఈ ఆలోచనతో జేమ్స్ వాట్ మానవ, జంతుశక్తి అవసరం లేకుండా ఆవిరిశక్తితో నడిచే యంత్రాన్ని తయారుచేశాడు.

జేమ్స్ వాట్ తాను తయారుచేసిన యంత్రాన్ని బౌల్టన్ అనే పారిశ్రామికవేత్తకు చూపించి, వారిద్దరు భాగస్వాములుగా ఈ యంత్రాలను తయారుచేయడం ప్రారంభించారు. బౌల్టన్ మూలధనం సమకూర్చడమే




*చిత్రం–8.2 జేమ్స్‌వాట్ కనిపెట్టిన ఒకరకమైన ఆవిరి యంత్రం. ఆవిరితో ఏర్పడే పీడనము పిడి చక్రానికి గల కడ్డీని క్రిందకి, పైకి నెట్టడం వలన చక్రం తిరుగుతుంది.*

SCERT, TELANGANA

కాకుండా, వాట్‌కు జీతం కూడా చెల్లించాడు. వీరిద్దరూ కలిసి యంత్రాలను తయారుచేసి లాభాలను గడించారు. లాభాలలో 2/3 వంతు బౌల్టన్, 1/3 వంతు వాట్ పంచుకున్నారు. వీరు ఆవిరి యంత్రాలు తయారుచేసి అమ్మి, చాలా లాభాలు గడించారు. యంత్రాలు ఆవిరిశక్తితో పనిచేస్తాయని తెలుసుకున్నాక అనేక రకాల యంత్రాలను నూలు వడకడానికి, నేతనేయడానికి, ఇనుపవస్తువుల తయారీకి, వాహనాలు, ఓడలు నడపడం వంటి పనుల కోసం తయారుచేసారు.

- ఇంగ్లాండులో స్వయంచాలక (self-driven) యంత్రాల ఆవిర్భావం అవసరం ఏవిధంగా ఏర్పడింది?
- పైన పేర్కొన్న ఉదాహరణలో – శాస్త్రవేత్తకూ పెట్టుబడిదారుకూ మధ్య జరిగిన ఒప్పందం న్యాయబద్ధమైనదని మీరు భావిస్తున్నారా?

### ఉత్పత్తిలో ఫ్యాక్టరీ విధానం:

క్రీ.శ. 1750 – 1850 మధ్యకాలంలో 'ఫ్యాక్టరీ విధానం' అనే కొత్తపద్ధతి ఆవిర్భవించింది. సాధారణ పనిముట్లు, మానవ శ్రామికశక్తి స్థానంలో కొత్త యంత్రాలు, ఆవిరిశక్తి వాడకం పెరిగింది. ఉత్పత్తి జరిగే ప్రదేశం ఇళ్లవద్దనుండి ఫ్యాక్టరీలవద్దకు మారింది. వందలమంది శ్రామికులను ఉపాధి నిమిత్తం ఫ్యాక్టరీల వద్దకు తరలించారు. చిన్నపనిముట్లు, మరమగ్గాల స్థానంలో యంత్రాలకు ప్రాధాన్యం పెరిగింది. ఇవి భారీస్థాయిలో వస్తువులను ఉత్పత్తిచేశాయి.

ఉత్పత్తికి సంబంధించిన సౌకర్యాలు సొంతంగా కలిగి ఉండి, నిర్వహణచేసే వ్యక్తులను పెట్టుబడిదారులని అంటారు. వీరు యంత్రాలకోసం, శ్రామికులకోసం మూలధనాన్ని వ్యయం చేస్తారు. ఫ్యాక్టరీ, ముడిపదార్థాలు, తయారైన వస్తువులపైన పూర్తి అధికారం యజమానులదే. వర్తకశ్రేణుల విధానం (Guild System)లో లాగాకాకుండా శ్రామికులు జీతం కోసం పనిచేస్తారు కాని ఉత్పత్తిమీద వీరికి అధికారం లేదు.

ప్రారంభంలో ఫ్యాక్టరీలలో పరిస్థితులు చాలా భయంకరంగా ఉండేవి. తొలినాళ్ళలోని ఫ్యాక్టరీ కార్మికుల, గని కార్మికుల అనుభవాలను పరిశీలిద్దాం.

### 19వ శతాబ్దపు బాలకార్మికుని అనుభవం:

19వ శతాబ్దంలో యూరప్‌లోని ఫ్యాక్టరీ కార్మికులు చాలా భయంకరమైన ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఇంగ్లాండులోని బొగ్గుగనిలో ఆనాటి ఒక బాలకార్మికుని అనుభవాన్ని పరిశీలిద్దాం.

"నేను ఈ గనులలో 4 సంవత్సరాల వయసు నుండి పనిచేస్తున్నాను. కార్మికులు గొడ్డళ్ళవంటి పరికరాలతో గనినుండి బొగ్గును తవ్వి వేగన్లలో నింపుతారు. ఈ వేగన్లను గుర్రాలో, కంచరగాడిదలో లాక్కొని వెళతాయి. ఈ వేగన్లకు వెనక ఉండి తోయడమే మా పని. ఈ వేగన్లు నీరు, బురద, నిటారుగా ఉండే ప్రాంతాల మీదుగా వెళ్ళటం వల్ల మేం త్వరగా అలిసిపోతాం. రోజుకు 12 గంటలు పనిచేయడంవల్ల అలిసిపోయి తిరిగి ఇంటికి వెళ్ళేటప్పటికి అన్నం తినాలనే కోరిక కూడా ఉండేది కాదు. నిన్న నేను ఇంటికి వెళ్లే మధ్యదారిలో నిద్రపోయాను. మా అమ్మ వెదుకుతూ నన్ను పట్టుకొని ఇంటికి తీసుకువెళ్ళింది."

ఫ్యాక్టరీలలో, గనులలో ఈ విధంగా పిల్లలచే పనిచేయించడాన్ని, నియంత్రించడానికి అనేక ఉద్యమాలు బయల్దేరాయి. ఈ ఉద్యమాల ఫలితంగా బాలకార్మిక



*చిత్రం-8.3 బొగ్గుబావిలో పిల్లలు బండిని నెట్టడం*

SCERT, TELANGANA

వ్యవస్థను యూరప్ మరియు అమెరికాలలో 1936 తరవాత నిషేధించారు.

### తొలి ఫ్యాక్టరీలలో లోపలి పరిస్థితులు:


నూతన యంత్రాల రాకతో పరిశ్రమలలో భారీమార్పులు వచ్చాయి. నైపుణ్యంలేని శ్రామికులు కూడా యంత్రాలతో పనిచేసేవారు. ఈ విధంగా నైపుణ్యంగల శ్రామికుల అవసరం లేకుండా పోయింది. వారి స్థానంలో స్త్రీలు, పిల్లలు వాళ్ల ప్రాంతాలలోని ఫ్యాక్టరీలలో అతి తక్కువ వేతనాలకు పనిచేసేవారు. యంత్రాల తయారీ వ్యయం అధికంగా ఉండటంవల్ల సాధారణ హస్తకళాకార్మికులకు ఈ ఖర్చును భరించే శక్తి ఉండేదికాదు. ధనికవర్తకులు మాత్రమే యంత్ర ఆధారిత ఫ్యాక్టరీలను నిర్మించేవారు.

నాటి కార్మికులు వారి దురవస్థను గూర్చి ఇలా తెలిపారు:

"ప్రతిరోజూ మేము ఫ్యాక్టరీకి పనికోసం ఉదయం 6 గంటలకు వచ్చి సాయంత్రం 8.30 గంటల వరకు పనిచేసేవాళ్లం. మధ్యాహ్నభోజన విరామం 1 గంట మాత్రమే. సాయంత్రానికి చాలా అలసట చెంది పనిచేయలేని స్థితిలో ఉంటే ఫ్యాక్టరీ యజమాని వచ్చి కొరడా, ముల్లుగర్ర ఉపయోగిస్తూ ఇంకా పనిచేయమని ఒత్తిడి చేసేవాడు.


"ఈ రోజులలో కొత్త కొత్త యంత్రాలు వస్తున్నాయి. అనేకమంది చేసే పనిని ఈ యంత్రాలు చేయడంవల్ల శ్రామికుల అవసరం తగ్గేది. ఒక కొత్త యంత్రం వచ్చిన ప్రతి సారీ మాలో కొంతమంది ఉపాధిని కోల్పోయి వీధిన పడేవారు."

ఈ కార్మికులు అంతకుముందే వారి వారి భూముల నుండి తప్పుకోటం వల్ల వీరిలో చాలామందికి యంత్రాల రాకతో ఉపాధి కోసం వేరే మార్గాలు లేకపోయాయి. చిన్న చిన్న హస్తకళాకారులు వారి దుకాణాలను మూసుకోవలసి వచ్చింది. క్రమేపి ఫ్యాక్టరీ, గనుల కార్మికులు సంఘాలుగా ఏర్పడి పని పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడారు. ప్రారంభకాలంలో వీరి డిమాండ్‌లు రోజుకు 8 లేదా 10 పనిగంటలు, అధిక వేతనాలు, 14 సంవత్సరాలలోపు పిల్లలతో పనిచేయించకపోవడం మొదలైనవి. కొంతకాలానికి వారి పోరాటాల ఫలితంగా శ్రామికుల స్థితిగతులు మెరుగైనాయి.




*చిత్రం-8.4 కర్మాగారంలో వస్త్రాలమీద చిత్రాలు గీస్తున్న దృశ్యం*


SCERT, TELANGANA



చిత్రం 8.5



చిత్రం 8.6



చిత్రం 8.7

***చిత్రాలు – 8.5, 8.6, 8.7***

- పారిశ్రామిక విప్లవం కాలం నాటి ఈ చిత్రాలను పరిశీలించండి.
- ఇవి ఫొటోగ్రాఫ్‌లు కావు. లోహాలపై రసాయనిక పదార్థాలను ఉపయోగించి రూపొందించిన చిత్రాలు. ఇవి పారిశ్రామిక విప్లవ కాలంలో తయారుచేసినవి. ముందు పేజీలో రంగులతో గీయబడిన చిత్రం కూడా ఉంది. ఈ చిత్రాలు దానికన్న ఏ విధంగా భిన్నంగా ఉన్నాయి? ఏ చిత్రం ఎక్కువ వివరాలను చూపిస్తుంది. ఈ చిత్రాలలో పిల్లలను మీరు గమనించారా? ఒక పరిశ్రమకు చెందిన ఏయే వివరాలను మీరు గమనించారు?

SCERT TELANGANA

- యంత్రాలపై పనిచేయడానికి ఎవరికి ఉద్యోగాలు కల్పించారు?
- దగ్గరలో ఉన్న ఏ ఫ్యాక్టరీ గురించైనా మీకు తెలుసా? ఈ ఫ్యాక్టరీలోని పని పరిస్థితుల్ని 150 సంవత్సరాల క్రితం ఇంగ్లాండులోని ఫ్యాక్టరీలోని పనిపరిస్థితులతో పోల్చండి.

ప్రస్తుతం ఫ్యాక్టరీలు కూడా మారాయి. ఇప్పుడు అన్ని రకాల పనులు కంప్యూటర్స్ సూచనల ద్వారా పనిచేసే యంత్రాలు చేస్తున్నాయి. వీటి నిర్వహణకు తక్కువ సంఖ్యలో శ్రామికులు, కనీసస్థాయిలో మానవ శ్రామిక శక్తి అవసరం అవుతుంది.

### శక్తి ఆధారాలు, పారిశ్రామికాభివృద్ధి:

ఫ్యాక్టరీలలోని యంత్రాలు నడవడానికి శక్తి (power) అవసరం. బొగ్గు, విద్యుత్తు, పెట్రోలు మొదలైనవాటి నుండి శక్తి లభిస్తుంది. ప్రాథమికంగా పరిశ్రమలు శక్తి కోసం బొగ్గుమీద, నీటి ఆవిరిమీద ఆధారపడ్డాయి. ఆ తర్వాత థర్మల్ విద్యుచ్ఛక్తి, పెట్రోలు, డీజిల్, గ్యాస్, అణుశక్తి, సౌరశక్తి మొదలయిన వాటిని ఉపయోగిస్తున్నారు.

### రవాణారంగంలో విప్లవం:

స్టీమ్ ఇంజన్/ఆవిరి యంత్రం ఆవిష్కరణ నౌకానిర్మాణ పరిశ్రమ అభివృద్ధికి దారితీసింది. జలరవాణా, రోడ్డురవాణాలోని వ్యయాన్ని 1/3 వంతుకు తగ్గించింది. అయినప్పటికీ ప్రజలు ఇంకా మంచి రవాణా విధానంకోసం ఎదురుచూడసాగారు. కదిలే యంత్రానికి (locomotives) ఆవిరి యంత్రాన్ని వాడటం రవాణా రంగంలో భారీ మార్పులకు తెరతీసింది. జార్జి స్టీవెన్సన్ చలనశక్తి యంత్రం లివర్‌పూల్‌నుండి మాంచెస్టర్ వరకు గల 64 కి.మీ.ల మార్గాన్ని గంటకి 46 కి.మీ. వేగంతో భారీ సామాగ్రిని తీసుకువెళ్ళింది.

1840లో జాన్ లౌడన్ మెక్‌డమ్ కంకర రాళ్ళతో రోడ్డును నిర్మించే పద్ధతిని కనుక్కొన్నాడు. ఈ విధానం రోడ్డు నిర్మాణంలో ఒక మైలురాయి. మరో దశాబ్దానికి ప్రస్తుతం మనం చూస్తున్న తారురోడ్ల నిర్మాణం జరిగింది. ఆ తరువాత మోటారు వాహనాల వినియోగం పెరిగింది.

20వ శతాబ్దపు తొలినాళ్ళలో రైట్‌సోదరులు విమానాన్ని (Aircraft) కనుక్కోవడంతో, వాయురవాణా ముఖ్యరవాణా మార్గంగా ఏర్పడింది.

### పారిశ్రామిక ఉత్పత్తులు – వర్తకం:

పారిశ్రామిక ఉత్పత్తులు భారీస్థాయిలో పెరగడంతో, తమ సొంత దేశాలలో మొత్తం ఉత్పత్తులను అమ్మడానికి కుదరలేదు. ఫ్యాక్టరీ యజమానులు పెరిగిన ఉత్పత్తిని ఇతర దేశాలలో కూడా అమ్మటం ప్రారంభించారు. యంత్రపు తయారీ వస్తువులు చవకయినవి, మన్నికయినవి. అందువల్ల వీటికి ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ పెరిగింది. దీనితో ఇంగ్లాండ్‌లోను, ఇతర దేశాలలోను పరిశ్రమలకు ప్రోత్సాహం లభించింది. కాని, పారిశ్రామిక దేశాలకు తమ ఉత్పత్తులకు అవసరమైన ముడిపదార్థాల లభ్యత లేదు. ఉదాహరణకు వస్త్రాలతయారీకి అవసరమైన ముడిపత్తిని ఇండియానుంచి, ఇతర దేశాలనుంచి కొనుగోలుచేసి ఫ్యాక్టరీ యజమానులకు అమ్మేవారు. తర్వాత వర్తకులు తయారైన వస్తువులను కొనుగోలుచేసి ఇండియా, అమెరికావంటి దేశాలలో అమ్మేవారు.

తమ వ్యాపారంకోసం, పారిశ్రామికాభివృద్ధి అవసరాల నిమిత్తం యూరోపియన్‌లు ముడిపదార్థాలు లభించే దేశాలను ఆక్రమించుకున్నారు. తమ మాతృదేశాలుగా పరిగణింపబడిన ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, స్పెయిన్, పోర్చుగల్, బెల్జియం, హాలండ్, ఇతర యూరోపియన్ దేశాలు ఆసియా, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, అమెరికా ఖండాలలో వలసలను ఏర్పాటుచేసుకున్నాయి. (ఏ దేశపు సహజవనరులు ఇతరదేశాల ప్రయోజనాల కోసం వినియోగమవుతూంటాయో ఆ దేశాన్ని వలస దేశంగా పేర్కొంటారు.) ఈ యూరోపియన్ దేశాలు ఇతర


SCERT, TELANGANA

ఖండాలలోని వలసదేశాలను దోచుకుంటూ సుసంపన్నమయ్యాయి.

**పట్టణీకరణ, మురికివాడలు:**

పారిశ్రామిక విప్లవం ఫలితంగా క్రమేణా ప్రజలు గ్రామాలనుండి పట్టణాలకు వలసపోయే పరిస్థితి ఏర్పడింది. పరిశ్రమలు, ఇతర పట్టణ కార్యకలాపాలు ప్రజలకు జీవనోపాధిని కలిగించాయి. కొత్తగా ఏర్పడిన పట్టణాలకు ప్రజలు భారీగా వలస వెళ్ళడంతో, వీరు ఇళ్ళు, గుడారాలు (Shelters) ఇబ్బడి ముబ్బడిగా నిర్మించుకోడంతో ఇవి పారిశుద్ధ్య, తదితర సౌకర్యాల కల్పనకు ఆటంకంగా మారాయి. ప్రమాదాలు, అంటువ్యాధుల వ్యాప్తి ఇక్కడ చాలా సాధారణం. చాలామంది శ్రామికుల నివాసాలు వెలుతురు, ఆరోగ్య, పారిశుద్ధ్య సౌకర్యాలు లేకుండా ఉంటాయి. ఫ్యాక్టరీలు, గనులవద్ద మురికివాడలనేవి సర్వసాధారణమైపోయాయి. ఈ పట్టణాలలోనే ధనవంతులకోసం విశాలమైన రోడ్లతో, పారిశుధ్య సౌకర్యాలతో, మంచినీటి సరఫరా, ఇతర సౌకర్యాలతో కూడిన నివాసాలు (క్వార్టర్లు) నిర్మాణ మయ్యాయి. పౌరహక్కులు, కార్మికుల స్థితిగతులు, నివాసాల నిర్మాణం, అభివృద్ధి గురించి క్రమేణా ప్రజలు పోరాటాలు చేట్టారు.

క్రింద ఈయబడిన పటం-1లో యూరోపియన్ దేశాలు మరియు వాటి వలసలను గమనించగలరు.




***పటం-1 : క్రీ.శ.1800 సంవత్సరం నాటి ప్రపంచంలోని యూరోప్ దేశాల వలసలు. ఆ సమయంలో అత్యధిక వలసలు భారతదేశంలో సహా, తీర ప్రాంతాలలో ఉన్నట్లుగా గమనించండి. ఆఫ్రికా పాఠంలోని పటం-5ను గమనించి మార్పులను వివరించండి.***

**కీలకపదాలు:**

1. విప్లవం
2. ఉత్పత్తి
3. ఫ్యాక్టరీ
4. నిర్వహణ
5. అణుశక్తి (న్యూక్లియర్ ఎనర్జీ)
6. పట్టణీకరణ
7. బాలకార్మికులు
8. మురికి వాడలు

SCERT, TELANGANA

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) ఈ వాక్యాలను సరిచేయండి.

- సబ్‌కాంట్రాక్ట్ విధానం (Putting out system)లో
  - a) వడికేవారు దారాన్ని నేతపనివారివద్దకు తీసుకువెళ్తారు.
  - b) వర్తకశ్రేణుల విధానంలోలాగ కాకుండా ఏం ఉత్పత్తి చేయాలో వర్తకులే నిర్ణయిస్తారు.
  - c) మొత్తంపనిని ఒకే సమూహం చేస్తుంది.
- వర్తకశ్రేణులు (Guild System)
  - a) చిన్న రైతులందరికీ నేతపని నేర్చుకునే అవకాశం కల్పించారు.
  - b) నేతపనివారి ఉత్పత్తుల నాణ్యతను, ధరను నిర్ణయిస్తారు.

2) వస్త్ర పరిశ్రమలో సబ్ కాంట్రాక్ట్ పద్ధతి పారిశ్రామిక ఉత్పత్తి విధానంకన్న మెరుగైనది. అంగీకరిస్తారా? కారణాలు తెలపండి.

3) "భారతదేశంలో రైల్వేలను ప్రజల సౌకర్యార్థం వలస పాలకులు నిర్మించారు"అని, కృత్తిక అనే విద్యార్థిని వాదిస్తూంటే, ఈ వాదనపట్ల మీ అభిప్రాయం ఏమిటి?

4) కార్మికుల వేతన అభివృద్ధి పారిశ్రామిక ఉత్పత్తిని ఎలా ప్రభావితం చేస్తుంది?

5) కార్మికులకు తక్కువ వేతనాలు ఇచ్చి ఎక్కువ గంటలు పనిచేయమని ఫ్యాక్టరీ యజమానులు ఎందుకు ఒత్తిడి చేస్తారు?

6) ఫ్యాక్టరీలలో పనిపరిస్థితులను మెరుగుపరచాలని ఎందుకు అనుకుంటున్నారు?

7) ఫ్యాక్టరీలలో పనిపరిస్థితులను మెరుగుపరచడానికి ప్రభుత్వం ఎందుకు చట్టాలు చేయాలి?

8) బాలలను ఫ్యాక్టరీలలో కార్మికులుగా నియమించగూడదని ఎందుకు అంటూఉంటారు?

9) "రవాణావ్యవస్థ పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడుతుంది." ఈ అభిప్రాయాన్ని సమర్థించండి.

10) ప్రపంచ పటంలో ఈ క్రిందివానిని గుర్తించుము.

ఎ) ఇంగ్లాండ్ బి) పోర్చుగల్ సి) ఫ్రాన్స్ డి) స్పెయిన్

11) 'పట్టణీకరణ – మురికివాడలు' పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

**ప్రాజెక్ట్‌పని:**

1) ఆరవ తరగతిలోని 'వ్యవసాయం, వర్తకం' అధ్యాయంలో గల పాఠ్యాంశాలను పునఃస్మరణ చేసుకోండి. తెలంగాణలోని రైతులు, వర్తకుల స్వభావాన్ని బ్రిటన్ లేదా యూరప్‌లోని వర్తకులతో పోల్చండి. మీరు ఏవైనా పద్ధతులను, పట్టికలను ఉపయోగించవచ్చు.

2) మీ చుట్టు పక్కల ప్రదేశంలో పిల్లలెవరైనా ఫ్యాక్టరీలోగాని, షాపులోగాని పనిచేస్తున్నారా? ఉంటే వారిపట్ల మీ స్పందన ఏమిటి?

SCERT, TELANGANA

పాఠం 9

# ఫ్యాక్టరీలో ఉత్పత్తి – కాగితపు పరిశ్రమ

J2J4U3

**కొన్ని చిన్న పనిముట్లను ఉపయోగించి ఇండ్లలోనే చేతిపనితో వస్తువులు తయారుచేస్తారు. దీనికి భిన్నంగా ఫ్యాక్టరీల్లో భారీ ఎత్తున వస్తువులను ఉత్పత్తి చేస్తారు. ఈ ఫ్యాక్టరీల్లో యంత్రాలను ఉపయోగిస్తూ అనేక మంది కార్మికులు పని చేస్తారు. పెద్ద ఫ్యాక్టరీల్లో ఉత్పత్తి ఎలా జరుగుతుందో చూద్దాం.**

- మీరు ఎప్పుడైనా ఏదైనా ఫ్యాక్టరీని చూశారా? దాని గురించి వివరించండి.
- మీ ఊహాశక్తిని ఉపయోగించి, మీరు చూసిన ఫ్యాక్టరీ చిత్రాన్ని గీయండి. ఆ ఫ్యాక్టరీలో ఏం జరుగుతుందో 300 పదాల్లో వివరించండి.

మనం చాలా కాగితాన్ని వాడుతున్నాం. పుస్తకాలు, రికార్డులు, రిజిస్టర్లు, ప్రగతి పత్రాలు, వార్తాపత్రికలు మొదలయినవి దేనితో తయారుచేస్తారో మీకు తెలుసా? తెలంగాణలో రెండు ప్రధాన కాగితపు పరిశ్రమలు ఉన్నాయి. అవి సిర్‌పూర్ కాగజ్‌నగర్ (కొమరంభీమ్ జిల్లా), భద్రాచలం (భద్రాద్రి జిల్లా)లో ఉన్నాయి.

- తెలంగాణపటంలో కాగితపు పరిశ్రమలు ఉన్న ఈ రెండు జిల్లాలను గుర్తించండి. వాటిని అక్కడ ఎందుకు స్థాపించారో ఆలోచించండి.

**ముడిసరుకులు:**

ఒక వస్తువు తయారుచేయడానికి అవసరమైన పదార్థాలను ముడిపదార్థాలు లేదా ముడిసరుకులు అంటారు. ఫ్యాక్టరీలకు ముడిసరుకులు ఎక్కువ మొత్తంలో



*చిత్రం–9.1. దూరంనుండి కనిపిస్తున్న ఫ్యాక్టరీ*

SCERT, TELANGANA



*చిత్రం-9.2 వెదురు లోడుతో నిలిచిఉన్న లారీలు*

నిరంతరం సరఫరా కావలసి ఉంటుంది. ప్రతి రోజూ డజన్లకొద్దీ లారీల్లో ముడిసరుకు రావడం మీరు చూస్తూంటారు. కాగితపు పరిశ్రమల్లో సాధారణంగా వెదురు, యూకలిప్టస్, సుబాబుల్‌ను ఉపయోగిస్తారు. ప్రస్తుతం సుబాబుల్ కలపను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీంతోబాటు ఎక్కువ మొత్తంలో రసాయనాలు, సాధారణ ఉప్పు, కాస్టిక్‌సోడా మొదలైనవాటిని వివిధ దశలలో ఉపయోగిస్తూ కాగితం తయారుచేస్తారు. చిత్తుకాగితాలతో (Scrap Paper) కూడా కాగితపు మిల్లుల్లో మళ్లీ కొత్తకాగితం తయారుచేస్తారు (recycling).

ఫ్యాక్టరీల్లో విద్యుత్తుతో నడిచే భారీ యంత్రాలను వాడతారు. కాగితపు మిల్లులోని యంత్రాలు పనిచేయడానికి చాలా విద్యుత్తు అవసరం. చిత్రంలో కనిపిస్తున్న కాగితపు మిల్లుకు సంవత్సరానికి దాదాపు 25 మెగావాట్ల విద్యుత్తు కావాలి. సగంకంటె ఎక్కువ విద్యుత్తును ఫ్యాక్టరీ సొంతంగా ఉత్పత్తి చేసుకొంటుంది. విద్యుత్తుతోబాటు ఎక్కువ మొత్తంలో శుభ్రమైన నీరు సంవత్సరమంతా అవసరం.

**కాగితపుపరిశ్రమలు - కనుమరుగవుతున్న వెదురు:**

కాగితం తయారుచేయడానికి అవసరమైన ముడిపదార్థాలు అడవుల్లో లభ్యమయినా, వాటిని సేకరించడం సులభం కాదు. సాధారణంగా వెదురు, మెత్తని కలప దొరికే అటవీ ప్రాంతాల సమీపంలోనే కాగితం పరిశ్రమలను స్థాపిస్తారు.

కాగితపు పరిశ్రమల్లో, వెదురు, ఇతర ముడిసరుకులను తేవడానికి కాంట్రాక్టర్లను వినియోగిస్తారు. కొన్ని దశాబ్దాలకు ముందు అడవులలో వెదురు నరకడానికి గిరిజనులను (మీరు 6వ తరగతిలో చదివిన పెనుగోలు నివాసుల వంటివారు) ఉపయోగించేవారు. గతంలో అధికంగా వెదురును నరికివేయడంవల్ల కాగితపు పరిశ్రమలకు సమీపంలో ముడిసరుకు లభించని స్థితి ఏర్పడింది.

ఇప్పుడు కాగితపు పరిశ్రమలు గ్రామాల్లో పెంచుతున్న సుబాబుల్ వంటి ప్రత్యామ్నాయ ముడిసరుకుమీద ఆధారపడుతున్నాయి. ఇది వ్యవసాయ భూముల్లో సుబాబుల్ చెట్లను పెంచడాన్ని ప్రభుత్వం ప్రోత్సహించేటట్లు చేసింది. ఈ రోజుల్లో కాగితపు పరిశ్రమకు సుదూర ప్రాంతాలనుంచి కలపను తెస్తున్నారు.

- కాగితపు పరిశ్రమకు అతి ముఖ్యమైన ముడి పదార్థాలేమిటి?
- విద్యుచ్ఛక్తిని ఒక ముడిసరుకుగా భావించవచ్చా? కారణాలను తెలపండి.
- మీకు తెలిసిన ఫ్యాక్టరీల గురించి మీ ఉపాధ్యాయునితో చర్చించి ఈ పట్టికను పూరించండి.

| క్ర.సం. | ఉత్పత్తి | పరిశ్రమపేరు | ముడిపదార్థం |
|---|---|---|---|
| 1. | చెప్పులు / బూట్లు | చెప్పుల పరిశ్రమ | తోళ్లు / రబ్బరు / కేన్వాస్ |
| 2. | | | |
| 3. | | | |
| 4. | | | |

SCERT TELANGANA

- కాగితాన్ని బాగా వాడితే చాలా అడవులను నరకవలసి వస్తుంది లేదా ఆహారపు పంటలు పండించే ప్రాంతాల్ని తగ్గించాల్సి వస్తుందని భావిస్తున్నారా? తరగతిలో చర్చించండి.



చిత్రం-9.3 వెదురు లారీ - లిఫ్టర్

వేము కాగితపు పరిశ్రమవద్దకు చేరుకొన్నాం. సుబాబుల్ కర్రలోడుతో 4, 5 లారీలు గేటు బయట వేచి ఉన్నాయి. ఉదయం 9.30 తర్వాత మాత్రమే వాటిని లోపలికి అనుమతిస్తారు. కార్మికుల కోసం ఒక గేటు, వాహనాల కోసం మరొక పెద్ద గేటు వేరువేరుగా ఉన్నాయి. ఆ పరిశ్రమను చూడడానికి అధికారులనుండి ముందుగానే అనుమతి తీసుకొన్నాం. భద్రతా అధికారి వద్ద గల రిజిస్టరులో మా పేర్లు రాసి, పరిశ్రమ లోపలికి వెళ్లాం. తర్వాత లారీలు లోపలికి వచ్చాయి.

**కాగితం తయారీ ప్రక్రియ:**

కాగితపు పరిశ్రమ లోపల సుబాబుల్ కలపను లారీ నుండి తీసి పక్కనే ఉన్న ఇనుప ప్లాట్‌ఫారం (Platform) పైన వేస్తున్న క్రేన్‌వంటి యంత్రాన్ని చూశాం. ఒక కన్వేయర్ బెల్టు ఆ కలపను ముక్కలుచేసే యంత్రానికి చేరుస్తుంది. వాస్తవంగా కాగితం ఐదు దశలలో తయారవుతుంది. ఈ పరిశ్రమలో ప్రతి దశకూ ఒక ప్రత్యేకమైన విభాగం ఉంది. వివిధ దశలలో వీటి యంత్రాలు ముడిసరుకును వినియోగిస్తాయి. ఆ దశలు ఇలా ఉంటాయి.

***1) ముక్కలు చేయటం (Chipping):*** ఈ దశలో పెద్ద కలప ముక్కలను యంత్రాల సహాయంతో చిన్న ముక్కలుగా చేస్తారు. ఈ విభాగంలో దాదాపు 15-20 మంది కార్మికులు పనిచేస్తారు. ముక్కలను వాటి పరిమాణాన్ని బట్టి వేరుచేస్తారు. పెద్ద ముక్కలను మళ్లీ చిన్న ముక్కలుగా చేస్తారు. ఒక లారీ కలపను యంత్రాల సహాయంతో 30 నిమిషాల్లో చిన్న ముక్కలుగా చేస్తారు. ఇదే విధంగా రోజంతా పని కొనసాగుతుంది. ఒక రోజంతా (24 గంటలు) పరిశ్రమ నడవడానికి ఎన్ని చెట్లు నరికివేయవలసి వస్తుందో ఊహించగలరా?

***2) కలపగుజ్జు తయారీ:*** చిన్న కలప ముక్కలను ఫైబర్‌లైన్ విభాగంలోకి పంపిస్తారు. అక్కడ పెద్ద పాత్రలలో రసాయనాలు కలిపి బాగా మరిగిస్తారు. ఈ ప్రక్రియ ద్వారా



చిత్రం-9.4 ముక్కలుచేసే విభాగంలో కార్మికుడు




చిత్రం-9.5 సెటింగ్ యంత్రంవద్ద పనివారు

SCERT, TELANGANA



*చిత్రం-9.6 గుజ్జు తయారీ విభాగం (fibreline)*

ముక్కలు సన్నని గుజ్జుగా మారతాయి. ఈ ద్రవరూపంలోని గుజ్జుకు రసాయనాలు కలిపి తెల్లగా కనిపించేటట్లు చేస్తారు. తర్వాత ఇది చిక్కబడి ఎలాంటి దుమ్ము లేకుండా పాలవంటి తెల్లని గుజ్జు (Creamy)గా మారుతుంది.

***3) గుజ్జును పరచడం:*** ఈ ద్రవరూపంలోని గుజ్జును సిలిండర్లమీద సన్నని తెరలమీద పరుస్తారు. వెడల్పు, పొడవు, మందం కావలసిన విధంగా చేసే ఈ దశ కాగితం తయారీలో అత్యంత కీలకమైనది. గుజ్జులోని నీరు బయటకు కారిపోవటం, వేడివల్ల ఆవిరికావటంతో గుజ్జు ఆరిపోతుంది. ఈ దశ పూర్తయిన తర్వాత గుజ్జు కన్వేయర్ బెల్టుపై నుండి ముందుకు వెళుతుంది.

***4) ఒత్తడం (Pressing), ఆరబెట్టడం, చుట్టడం:*** గుజ్జును రోలర్స్‌తో ఒత్తిడికి గురిచేసి నునుపుగా చేస్తారు. గుజ్జు పూర్తిగా ఆరిన తర్వాత కాగితంగా మారి సిలిండర్లకు చుట్టుకుంటుంది.

***5) కటింగ్ (Cutting):*** కావలసిన పరిమాణంలో యంత్రాలతో కాగితాన్ని కత్తిరిస్తారు. కాగితాన్ని చుట్టలుగా గానీ, షీట్లుగా గానీ చేస్తారు. వాటిని ప్యాక్ చేసి గోదాములకు పంపిస్తారు.

పరిశ్రమల్లో ఉత్పత్తి ఎల్లవేళలా, ఏకకాలంలో అన్ని విభాగాలలో జరుగుతూనే ఉంటుంది.

**బ్యాచ్‌ల (Batches) వారీగా పని:**

చుట్టలుగా, షీట్లుగా ఉన్న కాగితాన్ని గోదాముల్లో నిలవచేస్తారు. ప్రతి ఒక చుట్టమీద బ్యాచ్ నెం/లాట్ నెం, బరువు మొదలైన వివరాలను తెలిపే లేబుల్ వేస్తారు. బ్యాచ్ అంటేఏమిటి? ఫ్యాక్టరీలోకి ఒక లారీలోడు కలపవస్తే, ఆ మొత్తం కలపకు ఒక బ్యాచ్‌నెంబరు ఇస్తారు. ఈ బ్యాచ్‌ను వివిధ విభాగాలకు ఒకదాని తర్వాత మరొకదాన్ని పంపిస్తారు. ఒకే బ్యాచ్‌కు సంబంధించిన ముడిసరుకును ప్రతి దశలోను కాగితం తయారీకి ఉపయోగిస్తారు. ఉదాహరణకు జట్టు నెం. 201 కలపను చిన్న ముక్కలుగా చేస్తూంటే దానికి ముందు బ్యాచ్ నెం. 200 గుజ్జు తయారీ విభాగంలోనూ, బ్యాచ్ నెం. 199 పరచడం, ఆరబెట్టడం విభాగంలోనూ ఉండవచ్చు. బ్యాచ్‌నెం. 201 ముక్కలుచేసిన తర్వాత, వేరే విభాగంలోకి వెళ్లగానే బ్యాచ్‌నెం. 202 ముక్కలు చేయటానికి తెస్తారు.

ఒక బ్యాచ్‌కి సంబంధించిన అన్ని కాగితాలకూ ఒకే రకం ముడిపదార్థాలు, ప్రక్రియ, నాణ్యత ఉంటాయి. బ్యాచ్ పద్ధతి రోజంతా నిరంతరం ఉత్పత్తి కొనసాగేటట్లు చేస్తుంది. ప్రతి విభాగంలోనూ నిరంతరం పని ఉంటుంది. ఏ బ్యాచ్‌లో అయినా ఏదైనా పొరపాటు జరిగితే మేనేజర్లు దాన్ని సులభంగా తెలుసుకొంటారు.

**వంతులవారీగా పని గంటలు:**

ఈ కాగితపు పరిశ్రమ రోజులో 24 గంటలు పనిచేస్తూనే ఉంటుంది. కార్మికులు మూడు షిఫ్టులలో 8 గంటల చొప్పున పనిచేస్తారు. అవి ఎ, బి, సి షిఫ్టులు, ప్రతి షిఫ్టులోనూ 800-900 మంది కార్మికులు పనిచేస్తారు.

ఎ-షిఫ్టు : ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు.

బి-షిఫ్టు : మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు.

సి-షిఫ్టు : రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు (రాత్రి షిఫ్టు).

రాత్రి షిఫ్టులో పనిచేసే కార్మికులకు ప్రత్యేక అలవెన్సు ఇస్తారు. కార్మికులు షిఫ్టులు మారుతుంటారు (Cyclical). ఈ వారం ఎ-షిఫ్టు చేసినవాళ్లు రెండో వారం బి-షిఫ్టుకు

SCERT, TELANGANA

మళ్లీ వారానికి సి–షిఫ్టుకు మారతారు. ఉదయం 9.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహణ, పరిపాలనా సిబ్బందికోసం సాధారణ షిఫ్టు ఉంటుంది. వీరు ఖాతాల నిర్వహణ, వ్యాపారం, అమ్మకాలు, కార్మికుల సంక్షేమం మొదలైన అంశాలకు సంబంధించిన పనులు చేస్తారు.

**కాగితం అమ్మకాలు:**

ఈ కాగితపు పరిశ్రమకు వేరువేరు నగరాల్లో మార్కెటింగ్ డిపోలున్నాయి. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మలేషియా, సింగపూర్, నైజీరియా, దక్షిణాఫ్రికా దేశాలతో కాగితం వ్యాపారం కొనసాగుతోంది. ఈ డిపోల ద్వారా కాగితం అమ్మకాలు కొనసాగుతున్నాయి.

ఇక్కడ అభివృద్ధి చెందిన రోడ్డు మార్గం, రైలు మార్గం ఉంది. అందువల్ల కలప, కాగితం రవాణా సులభమవుతోంది.

- కాగితపు చుట్టలమీద బ్యాచ్ నెంబరు, లేబుల్ వేయడం ఎందుకు అవసరం?
- కాగితపు పరిశ్రమ రాత్రి, పగలు ఎందుకు పనిచేస్తోందని భావిస్తున్నారు? దీన్ని వ్యవసాయ పనులతో పోల్చండి.
- గేటువద్ద సెక్యూరిటీగార్డు ఎందుకు ఉంటాడు?

వాచ్‌మన్ లాగ నటించి చూపగలరా? ఈయన ఎవరిని లోపలికి అనుమతిస్తాడు? ఎవరిని అనుమతించడు?


**కాగితపు పరిశ్రమలో పని:**

ఒక ఫ్యాక్టరీలో వివిధ రకాలైన అనేకమంది కార్మికులను పనిలోకి తీసుకొంటారు. కొందరు యంత్రాలతో పనిచేస్తే మరికొందరు వారికి సహకరిస్తారు. కొందరు విద్యుత్తు అమర్చడంలో పనిచేస్తారు. ఇంకా కొంతమంది రవాణాకు సహాయపడతారు. వారిలో కొందరు ఉన్నత విద్యార్హత గల ఇంజనీర్లు కాగా మరికొందరు ఐటిఐ లేదా పాలిటెక్నిక్ కళాశాలల్లో చదివి ఉంటారు. శుభ్రపరచడం వంటి పనుల్లో నిరక్షరాస్యులు కొంతమంది ఉంటారు. పరిశ్రమల్లోకి వివిధ షరతులు, నిబంధనలతో పనుల్లోకి తీసుకొంటారు.

కొందరు శాశ్వత ఉద్యోగులైతే మరికొందరు దినసరి కూలీలు. ఈ కూలీలు పనిఉన్నప్పుడే అవసరం. వీరితోబాటు కాంట్రాక్టు కార్మికులు కూడా ఉంటారు. దీన్ని విపులంగా చర్చిద్దాం.

సూరజ్ కాగితపు పరిశ్రమలో ఒక శాశ్వత కార్మికుడు. ప్రెస్సింగ్ విభాగం (Pressing Section) లో పనిచేసే ఈయన నీలిరంగు చొక్కా, ఖాకీ ప్యాంటు ధరించి వస్తాడు.

దిగువ విభాగాన్ని చదివి మీ సొంత వాక్యాలతో ఖాళీలను పూరించండి.




SCERT, TELANGANA

10 సంవత్సరాలనుంచి పనిచేస్తూ నెలకు ప్రస్తుతం రూ. 15000/- వేతనం పొందుతున్నాడు. శాశ్వత ఉద్యోగులు పొందే ప్రావిడెంట్ ఫండ్ (పదవీ విరమణ తర్వాత పొందే మొత్తం), ఆరోగ్యబీమా వంటి ప్రయోజనాలన్నీ సూరజ్ పొందుతున్నాడు. ఏదైనా కారణంవల్ల అతన్ని ఉద్యోగం నుండి తీసేసినా లేదా ప్రమాదం జరిగి పని మానేసినా అతనికి పరిశ్రమ కొంత డబ్బును పరిహారంగా ఇస్తుంది. ప్రతి సంవత్సరమూ సూరజ్‌కు వేతనం పెరుగుతుంది. అతడు కానీ, అతని కుటుంబ సభ్యులుకానీ అనారోగ్యానికి గురయితే ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సదుపాయం పొందవచ్చు (E.S.I., Employees State Insurance). అతను కొంత మొత్తం చెల్లిస్తే పరిశ్రమ యాజమాన్యం మరికొంత మొత్తం చెల్లించి ఈ సౌకర్యం కల్పిస్తుంది. సూరజ్ వారంలో ఒక రోజు వారాంతపు సెలవు, పండుగలు, కొన్ని అదనపు సెలవులు, సాధారణ సెలవులు పొందుతాడు. యూనిఫారం కొనుక్కోడానికి, శుభ్రంచేసుకోడానికి అలవెన్సు ఇస్తారు. పరిశ్రమ అధిక లాభాలు పొందినప్పుడు కొంత మొత్తాన్ని అతనికి బోనస్‌గా అదనంగా చెల్లిస్తారు. ఈ పరిశ్రమలో సుమారు 1800 మంది శాశ్వత కార్మికులు పనిచేస్తున్నారు.

చందు శాశ్వత కార్మికుడు కాదు కానీ ప్రతిరోజూ ఫ్యాక్టరీకి వచ్చి పనిచేస్తాడు. ఇతడు కాంట్రాక్ట్ కార్మికుడు. అతడు వాహనాలనుండి ముడిసరుకు దించడం, ప్యాకింగ్‌చేయడం, కాగితాన్ని లారీల్లోకి ఎక్కించడం వంటి పనులు చేస్తాడు. ఈ పరిశ్రమలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పిన కాంట్రాక్టర్‌ను గత సంవత్సరం మహారాష్ట్రలోని తన గ్రామంలో చందు కలిశాడు. శాశ్వత ఉద్యోగులకంటె చందు లాంటి కార్మికులకు తక్కువ వేతనం ఇస్తారు (నెలకు సుమారు రూ. 8000/-). ఇతర అలవెన్సులు, వైద్య సహాయం, బోనస్ వంటివి ఇవ్వరు. వేతనంతో కూడిన సెలవులు ఉండవు. అయినా సంవత్సరమంతా పని లభిస్తుంది. రెండు మూడు సంవత్సరాల తర్వాత శాశ్వత కార్మికులుగా వారి సేవలను క్రమబద్ధీకరించవచ్చు.

ఈ కాగితపు పరిశ్రమలో పనిచేసే స్త్రీలు సాధారణంగా నేల ఊడ్చి శుభ్రంచేయడం, కాగితం ప్యాకింగ్‌లమీద లేబుల్స్ అతికించడం వంటి పనులు చేస్తారు. తార ఈ పరిశ్రమలో ఒక దినసరి కార్మికురాలిగా పనిచేస్తోంది. అప్పుడప్పుడు పని లభించే వారిని దినసరి కార్మికులు అంటారు. తార పని ఉందేమోనని ప్రతి రోజూ ఉదయం పరిశ్రమకు వస్తుంది. వారంలో నాలుగు, అయిదు రోజులు ఫ్యాక్టరీలో శుభ్రం చేస్తుంది. కలపను ముక్కలు చేసేచోట చాలా ముక్కలు, దుమ్ము పేరుకొనిపోయి ఉంటాయి. దుమ్ము ఊడ్చి శుభ్రంచేస్తుంది, యంత్రాలను తూడుస్తుంది. మూడు సంవత్సరాలకు పైగా ఆమె ఇక్కడ పనిచేస్తున్నా ఆమెకు రోజుకు రూ. 100/- నుండి రూ. 150/- చెల్లిస్తారు. ఆమెకు రోజువారీ కూలీ ఇస్తారు. ఒక నెలలో ఆమె 2500 రూపాయల వరకు సంపాదిస్తుంది. సూరజ్ వంటి శాశ్వత ఉద్యోగులు పొందే ప్రయోజనాలు ఏవీ ఈమె పొందడంలేదు.




*చిత్రం-9.7 కటింగ్ యంత్రం*

సాధారణంగా పరిశ్రమల యజమానులు ఉత్పత్తి ఖర్చు తగ్గిస్తూ ప్రతి రోజూ ఉండే పనికి కూడా దినసరి కూలీలను ఉపయోగిస్తారు. కొన్ని సమయాల్లో తక్కువమంది సహాయంతో నడిచే యంత్రాలను కొంటారు. అలాంటి పరిస్థితుల్లో కార్మికులు, యూనియన్లు ఉద్యమాలు లేవదీసి వారి

SCERT TELANGANA

పరిస్థితులు మెరుగుపరచడానికి యాజమాన్యంతో చర్చలు జరుపుతారు.

ప్రయివేటు యాజమాన్యంతో నడిచే పరిశ్రమల్లో కార్మికులతో బాటు పరిశ్రమల్లో గణకులు, క్లర్కులు, మేనేజర్లు ఉంటారు. వీరికి ఎక్కువ వేతనాలు చెల్లిస్తారు. సీనియర్ మేనేజర్లుగా దాదాపు యజమానుల కుటుంబాలకు చెందినవారే ఉంటూ అధిక వేతనాలు పొందుతారు. అనేక అలవెన్సులు, ఉచిత నివాసం, పిల్లలకు ఉచిత విద్య వంటి సౌకర్యాలు పొందుతారు.



*చిత్రం-9.8 కాగితపు పరిశ్రమ లోపలి భాగం*

- సూరజ్, చందు, తారలను పోలుస్తూ ఈ కింది పట్టికను పూరించండి.

**కాగితపు పరిశ్రమ ఎవరి సొంతం?**

ఈ కాగితపు పరిశ్రమకు ఏ ఒక్కరూ యజమాని కాదు. కొంతమంది కలిసి ఒక కంపెనీగా ఏర్పడి ఈ పరిశ్రమకు యాజమాన్యం వహిస్తున్నారు. వీరు ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి బ్యాంకుల్లో అప్పుకూడా తీసుకొని

| క్ర.సం. | పేరు | పని | అనుభవం | ఆదాయం | ఇతర ప్రయోజనాలు |
|---|---|---|---|---|---|
| 1. | సూరజ్ | | | | |
| 2. | చందు | | | | |
| 3. | తార | | | | |

- పరిశ్రమలో శాశ్వత, తాత్కాలిక, దినసరి కార్మికులు ఎందుకు అవసరం?
- తాత్కాలిక కార్మికులకు ఏయే సమస్యలు ఉంటాయని భావిస్తున్నారు?
- తెలంగాణలోని కాగితపు పరిశ్రమల్లో పనిచేయడానికి ప్రజలు సుదూర ప్రాంతాల నుండి ఎందుకు వస్తున్నారో ఆలోచించండి.

దీన్ని ప్రారంభించారు. మేనేజర్లను, కార్యాలయ సిబ్బందిని, కొందరు శాశ్వత ఉద్యోగులను నియమించారు. వీరికి వేతనాలు చెల్లిస్తారు. కానీ యజమానులు వేతనాలు పొందరు. వేతనాలు, ఖర్చులు పోగా మిగిలిన లాభాలను యజమానులు పంచుకుంటారు. లాభాలతోపాటు నష్టాలుకూడా భరిస్తారు.

SCERT, TELANGANA

◆ దిగువ అంశాలను ఉపయోగిస్తూ పారిశ్రామిక ఉత్పత్తి ప్రధానలక్షణాలను క్లుప్తంగా తెలపండి.

1. యంత్రాలు
2. ముడిసరుకులు
3. శక్తి (విద్యుత్తు) నీరు
4. ఉత్పత్తి
5. కార్మికులు
6. మేనేజర్లు
7. మార్కెటు
8. యజమానులు

కొన్ని ఫ్యాక్టరీలు ఒక వ్యక్తి యాజమాన్యంలోగానీ, ఒక సమూహ యాజమాన్యంలోగానీ ఉండకుండా ప్రభుత్వ యాజమాన్యంలో ఉంటాయి. వీటిని ప్రజల సంక్షేమంకోసం ప్రభుత్వం నిర్వహిస్తుంది.

ఫ్యాక్టరీలకు చాలా పెద్దమొత్తంలో ముడిసరుకు అవసరమవుతున్నందువల్ల సహజ వనరులైన అడవులు, నదులు, గనులు వంటివి త్వరితంగా అంతరిస్తున్నాయి.. అంతేగాకుండా అవి పొగను బయటకు వదులుతూంటాయి. నదులను, పరిసరాలలోని నేలను విషపూరిత కారకాలతో నింపివేస్తాయి. అందువల్ల పర్యావరణాన్ని కాపాడుకొనే పద్ధతులను మెరుగుపరచుకోడం అవసరం.

ఫ్యాక్టరీలు చాలామందికి ఉపాధి కల్పిస్తాయి. అప్పుడప్పుడు పనిభారం ఎక్కువ కావడంవల్లగానీ, దుమ్ము, రసాయన పదార్థాలవల్లగానీ కార్మికులు అనారోగ్యానికి గురవుతారు. కార్మికులకు తక్కువ వేతనం చెల్లిస్తారు. వారు మురికి వాడలలో, అతి తక్కువ సౌకర్యాలతో జీవించవలసి వస్తుంది.

ఒకవైపు మన అవసరాలు, మరొకవైపు ఫ్యాక్టరీల దుష్ప్రభావాలమధ్య ఏ విధంగా సమతౌల్యం సాధించాలనేది మన ముందు ఉన్న ఒక ముఖ్యమైన సవాలు. కార్మికులు తమ జీవితాలను సుఖప్రదంగా, హుందాగా గడపడానికి మార్గాలు వెతకాల్సి ఉంది.

**కాలుష్యం:**

కాగితపు పరిశ్రమకు ఆవలివైపు వెళ్తే ఒకరకమైన చెడువాసన వస్తుంది. దీనికి కారణం ఆ పరిశ్రమలో వాడే వివిధ రసాయనాలే. పరిశ్రమ నుండి బయటకు వచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో నివసించేవారితో మాట్లాడాం. ఈ వాసన సర్వ సాధారణమని అంతేకాకుండా పొలాల్లోని మొక్కలు, ఆకులు, తోటల్లోని చెట్లు, ఫ్యాక్టరీలు వదిలే దుమ్ము, ధూళితో నిండిపోతాయని వారన్నారు. ఈ పరిశ్రమ మంచినీటిని అధిక మొత్తంలో తీసుకొని, రసాయనాలతో కలుషితమైన నీటిని బయటకు పంపుతుంది. ఈ నీరు నదుల్లో కలుస్తుంది.

గత సంవత్సరమే ఈ పరిశ్రమలో బయటకు పంపే నీటిని శుభ్రంచేసే ప్లాంటును నిర్మించారు. దీంట్లోకి రసాయనాలు కలిసిన నీటిని పంపిస్తారు. ఈ ప్లాంటులోని యంత్రాలు కలుషిత కారకాలను (గాలి, నీరు, నేల, ఆహారం వంటివాటిని కలుషితం చేసే పదార్థాలు) తొలగించి వాతావరణాన్ని కలుషితం చేయని విధంగా నీటిని బయటకు పంపిస్తాయి. మిగిలిన ఇతర ఘనరూప పదార్థాన్ని ఎరువుగా వాడవచ్చు. బయటకు వచ్చే నీటిని వ్యవసాయానికి ఉపయోగిస్తారు.

మన రాష్ట్రంలో, దేశంలో విభిన్న వస్తువులను తయారుచేసే అనేక పరిశ్రమలు ఉన్నాయి. అవి తక్కువ సమయంలో ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నాయి.



*చిత్రం-9.9 కాగితపు చుట్టలు*

SCERT, TELANGANA

**కీలకపదాలు:**

| | | |
|---|---|---|
| 1. ఉత్పత్తి ప్రక్రియ | 2. కన్వేయర్ బెల్టు | 3. ఫైబర్ లైన్ |
| 4. లేబుల్ | 5. భత్యము (అలవెన్సు) | 6. బోనస్ |
| 8. కాలుష్యము | 8. పని గంటలు | 9. ముడిసరుకులు |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

K8B2W9

1) మీరు ఒక తోళ్లఫ్యాక్టరీని లేదా వస్త్రపరిశ్రమను ప్రారంభించాలని అనుకుంటున్నట్లు ఊహించుకొని, దానికోసం ఏయే అంశాలను పరిగణనలోకి తీసుకోవాలో తెలపండి.
2) కాగితం తయారీ ప్రక్రియను మీ సొంత మాటల్లో వివరించండి.
3) ఏదో ఒక రోజు ఈ కాగితపు పరిశ్రమ ఆగిపోతుందని అనుకుంటున్నారా? అలా జరిగితే కార్మికుల జీవితాలమీద దాని ప్రభావం ఎలా ఉంటుంది?
4) కాగితంలేని ప్రపంచాన్ని ఊహించండి. కాగితానికి బదులుగా దేన్ని ఉపయోగించాలో ఆలోచించండి.
5) పరిశ్రమలవల్ల జరుగుతున్న కాలుష్యాన్ని నివారించడానికి గల మార్గాలను తెలపండి.
6) కాగితపు పరిశ్రమకుగల అనుకూలతలు, వ్యతిరేకతలను తరగతిగదిలో చర్చించండి.
7) కాగితపు పరిశ్రమలో పనిచేసే శాశ్వత ఉద్యోగి ఆదాయం, ప్రయోజనాలను పట్టిక రూపంలో రాయండి. తాత్కాలిక, దినసరి కార్మికుల విషయంలో అవి ఎలా భిన్నంగా ఉన్నాయో తెలపండి.
8) చేతివృత్తులవారు తయారుచేసిన బుట్టల ఉత్పత్తిని, పరిశ్రమలో తయారైన కాగితం ఉత్పత్తిని కింది అంశాలను దృష్టిలో ఉంచుకొని పోల్చండి.

   1) పనిచేసే చోటు  2) పరికరాలు / యంత్రాలు  3) ముడిపదార్థాలు
   4) కార్మికులు  5) మార్కెటు  6) యజమానులు

9) కొమరంభీమ్ జిల్లాలో సిర్‌పూర్ కాగజ్‌నగర్‌లో కాగితపు పరిశ్రమ ఉంది. దాన్ని జిల్లా కేంద్రంలో ఎందుకు స్థాపించలేదో చర్చించండి.
10) ప్రపంచ పటంలో ఈ కింది దేశాలను గుర్తించండి.

    అ. శ్రీలంక ఆ. సింగపూర్ ఇ. నైజీరియా ఈ. దక్షిణాఫ్రికా ఉ. నేపాల్

11) పేజీ నెం.93లోని 3వ పేరాను చదివి, ఫ్యాక్టరీలు కార్మికుల ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహిస్తున్నాయని అనుకుంటున్నారా? ఎందుకు?

**ప్రాజెక్టు పని:**

మీ ప్రాంతంలో కాలుష్యానికి కారణమయ్యే కొన్ని ఫ్యాక్టరీలను గమనించే ఉంటారు. ఒకవేళ గమనించి ఉండకపోతే అలాంటి కాలుష్య కారక ఫ్యాక్టరీని ఊహించండి. దాన్ని గురించి స్థానిక వార్తాపత్రిక సంపాదకునికి (Editor) వివరాలతో లేఖ రాయండి. తరగతి గదిలో చర్చించండి.

SCERT, TELANGANA

పాఠం 10

# రవాణా వ్యవస్థ-ప్రాధాన్యత

J3Y6R8

**మనం నిత్యజీవితంలో ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి ప్రయాణం చేయటానికి వివిధ రకాలైన వాహనాలను ఉపయోగిస్తాం. ప్రజలు రోడ్డు రవాణా, రైలు రవాణా, వాయుమార్గాలు, జలమార్గాలు ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో ఈ పాఠంలో చర్చిస్తాం. ఇవే కాకుండా ప్రజలు ప్రయాణ సాధనాలను ఒక ఉపాధి మార్గంగా ఏ విధంగా ఎంచుకుంటారో, మార్కెట్‌లో రవాణాను ఏ విధంగా ఉపయోగించుకుంటున్నారో మనం ఈ పాఠంలో చర్చిస్తాం.**

**ఇతర రవాణా సాధనాలైన రైల్వేలు, వాయు మార్గాలు, జల మార్గాల గురించి మీరు పై తరగతులలో చదువుతారు.**

వివిధ రకాల రవాణా పద్ధతులను గురించి మీరు ఇదివరకే తెలుసుకొని ఉన్నారు.

- ఇక్కడ ఇచ్చిన పదాలతో కింద ఉన్న పట్టికను పూరించండి. కొన్ని పదాలను ఒకటికంటే ఎక్కువసార్లు వాడవలసి వస్తుంది. ఆ వరసలో ఆ పదం వాడటానికి గల కారణాలను పేర్కొనండి.

  ***యాత్రికులు, కారు, చేప, పశువులు, ధాన్యం, ఎడ్లబండి, పెట్రోలియం, శ్రామికులు, ఓడ, హెలికాప్టర్, ట్యాంకర్, లారీ, సైకిల్, పర్యాటకులు, ముడిఇనుము, వస్తువులరైలు, మామిడికాయలు.***

| రవాణా వ్యవస్థ | ఉపయోగించే వాహనం | కొన్ని ఉత్పత్తులు/ప్రజాసమూహాలు వాడుకునేవి |
|---|---|---|
| రోడ్లు | | |
| రైల్వేలు | | |
| జలమార్గాలు | | |
| వాయుమార్గాలు | | |

SCERT, TELANGANA

### తెలంగాణలో రవాణావ్యవస్థ:

మన రాష్ట్రంలోని రవాణా వ్యవస్థ ముఖచిత్రాన్ని చూసినట్లయితే, మనం ఈ కింది విషయాలను గమనించవచ్చు.

**రోడ్లు:** భారతదేశంలో రోడ్లను నిర్మించడం, నిర్వహించడం చాలావరకు ప్రభుత్వయాజమాన్యంలోనే జరుగుతాయి. మనదేశంలో వివిధ రకాల రోడ్లు ఉన్నాయి. వీటిలో జాతీయ రహదారులు దేశంలోని వివిధ రాష్ట్రాలలోని నగరాలను కలుపుతూ నిర్మించినవి. ఉదాహరణకు జాతీయ రహదారి నెం.44 ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలగుండా పోతుంది. జిల్లాలను, చిన్నపట్టణాలను కలుపుతూ నిర్మించిన రోడ్లను తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తుంది. కంకరతో నిర్మించిన గ్రామీణ

రోడ్ల బాధ్యతను గ్రామపంచాయితీలు, పట్టణ రోడ్ల నిర్వహణ బాధ్యతను కార్పొరేషన్‌లు, మునిసిపాలిటీలు తీసుకుంటాయి. వీటితో పాటు అంతర్జాతీయ సరిహద్దుల వెంట నిర్మించిన రోడ్లను సరిహద్దు రోడ్లు అంటారు. మారుమూల ప్రాంతాలలో నివసించే ప్రజలను ప్రముఖ పట్టణాలతో కలపడంలో రోడ్లు ముఖ్యపాత్రను పోషిస్తున్నాయి.




*చిత్రం-10.1 27 వాహనాలతో 1932లో రోడ్డు రవాణా వ్యవస్థను నిజాం ప్రారంభించాడు. అప్పటి రవాణా శాఖ యొక్క లోగోను చిత్రంలో చూడవచ్చు*

**రైలుమార్గాలు:** భారతదేశంలోని ప్రయాణికులలో 1/5 వ వంతుమంది రైళ్లలో ప్రయాణిస్తున్నారు. రైలుమార్గాలను ముఖ్యంగా బొగ్గు, ముడిఇనుము, ఎరువులు, సిమెంటు, ఆహారధాన్యాలు మొదలయిన వస్తువులను రవాణాచేయడానికి ఉపయోగిస్తున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాలను కలుపుతూ అభివృద్ధి చెందిన రైలు మార్గాలు ఉన్నాయి.

**వాయుమార్గాలు:** తెలంగాణలోని హైదరాబాద్ (శంషాబాద్)లో ఒక అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్నది. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ద్వారా తెలంగాణ మరియు పొరుగు రాష్ట్రాల వారు వివిధ దేశాలతో పాటు దేశంలోని ముఖ్యపట్టణాలకు ప్రయాణంచేయవచ్చు.

**జలమార్గాలు:** భారతీయ వ్యాపారస్థులు అన్ని రకాల వస్తువులను విదేశాలకు ఓడరేవులు ద్వారానే రవాణా చేస్తారు. ఓడరేవు పట్టణాలు లేదా నగరాలు ముఖ్య వ్యాపార కేంద్రాలు. తెలంగాణ రాష్ట్రానికి తీరరేఖ గాని ఓడరేవులు గాని లేవు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 15 ఓడరేవులలో విశాఖపట్టణం పెద్ద ఓడరేవు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను, వాటి కాలువలను జలమార్గాలుగా ఉపయోగిస్తున్నారు. అంతర్జాతీయ వర్తకం ఓడరేవుల ద్వారానే జరుగుతుంది. కాబట్టి ఓడరేవులు అత్యంత కీలకమైనవి.

- భారతదేశ పటంలో ముఖ్యమైన విమానాశ్రయాలను, ఓడరేవు పట్టణాలను గుర్తించండి.

## రోడ్ల ఉపయోగాలు - ఉత్పత్తి అమ్మకాలు

తెలంగాణలో చాలామంది ప్రజలు ప్రయాణించడానికి రోడ్డు మార్గాలను అధికంగా వినియోగిస్తారు. రవాణాసౌకర్యాల లభ్యత విషయంలో తెలంగాణలోని గ్రామాలమధ్య మార్పు కనిపిస్తుంది. 2001లో 3/4 వంతు గ్రామాలకు రవాణా సౌకర్యాలున్నాయి.

ఇంతకుముందు అధ్యాయాలలోను, తరగతిలోను రైతులు, మత్స్యకారులు, పరిశ్రమలు ఏ విధంగా రవాణాపై ఆధారపడిఉన్నారో తెలుసుకున్నాం. రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు బజారుకు తీసుకువెళ్లాలి, మత్స్యకారుడు తాను పట్టిన చేపలను పాడవకుండా వినియోగదారుని వద్దకు చేర్చాలి, ముడిపదార్థాలను తీసుకురావడానికి కాగితపు పరిశ్రమ లారీలను ఉపయోగిస్తుంది. తమ ఉత్పత్తులను వినియోగదారులకు చేర్చడానికి పరిశ్రమలు రవాణాసౌకర్యాలపై ఆధారపడతాయి. ఉదాహరణకు పత్తిని తీసుకుందాం. రైతులు పండించిన పత్తిని ఫ్యాక్టరీలకు తీసుకువెళ్తారు. పత్తి నుండి వస్త్రం తయారుకావడానికి వివిధ దశలలో మార్పులు వివిధ ప్రాంతాలలో జరిగి చివరికి వస్త్రం తయారౌతుంది. మార్కెట్లు చాలా వరకు రవాణా సౌకర్యాలపైన ఆధారపడి ఉంటాయి.

SCERT TELANGANA

◆ కింది విషయాన్ని చదవండి, కింద ఇచ్చిన సమస్యకు పరిష్కారం చూపండి:

సత్యంపల్లి గ్రామంలోని రైతులు తమ ధాన్యాన్ని 7 కి.మీ. దూరంలో ఉన్న నయాపేట్ పట్టణంలో అమ్ముతూంటారు. ఎడ్లబండి ద్వారా 10 ధాన్యపు బస్తాలను రవాణా చేయడానికి బస్తా 1కి 50 రూ॥లు చొప్పున రవాణాచేయవచ్చు. ట్రాక్టర్ యజమాని బస్తా 1కి 20 రూ॥లు చొప్పున వసూలుచేస్తాడు. ట్రాక్టర్ 30 నుండి 40 బస్తాలను రవాణా చేయగలదు. లారీ ఒకేసారి 150 నుండి 170 బస్తాలను బస్తా 1కి 10 రూ॥లు చొప్పున రవాణా చేస్తుంది. ఉదాహరణకు నయాపేట్‌లో ఉన్న హోల్‌సేల్ వ్యాపారి ధాన్యాన్ని 100-120 కి.మీ. దూరంలో ఉన్న జిల్లా కేంద్రానికి రవాణా చేయడానికి ట్రక్ఆపరేటర్ బస్తా 1కి రూ.50 చొప్పున వసూలు చేస్తాడు. ట్రక్ ఆపరేటర్‌లు 500 కి.మీ.లు వస్తువులను రవాణా చేయడానికి టన్ను 1కి రూ.800-1000 లు వసూలు చేస్తున్నారు.

ఆ గ్రామంలో ధాన్యాన్ని పండించే ముగ్గురు రైతులు ఉన్నారు. వారి దిగుబడి వరుసగా 25, 50, 75 బస్తాలు. వీరు తమ ఉత్పత్తులను 25 కి.మీ.లు దూరంలో గల వ్యవసాయ మార్కెట్ కమిటీవద్ద అమ్మడానికి ఇష్టపడుతున్నారు. ఇప్పుడు వారి ధాన్యాన్ని పట్టణానికి రవాణా చేయడానికి మీరు ఇచ్చే సూచనలు ఏమిటి? ఎందుకు?


చిత్రం-10.2 జంతువుల రవాణా

**రవాణా కార్యకలాపాలు - ఉపాధి:**

ప్రతి బస్సు నడవడానికి డ్రైవరూ, కండక్టరూ తప్పనిసరి. రవాణా వాహనాల నిర్వహణకు వందల, వేల మంది మనుషులు అవసరం. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ 64,000 మంది ఉద్యోగులతో 10,000 బస్సులను నడుపుతుంది. ఈ ఉద్యోగులు అకౌంట్ల నిర్వహణ, బస్సుల రిపేర్లు, బస్ డిపోలలో పని మొదలైన పనులలో నిమగ్నమై ఉంటారు. మరికొంత మంది బస్ స్టేషన్‌లలో బస్ పాస్‌లు, టిక్కెట్లు అమ్మేవారిగా, టికెట్ తనిఖీ అధికారులుగా విధులు నిర్వహిస్తూంటారు.

తెలంగాణ రోడ్లపైన తిరిగే కోటి వాహనాలలో ఇంచుమించుగా 3/4 వంతు వాహనాలు ద్విచక్ర వాహనాలే. పెట్రోల్/డీజల్ బంకులు, రిపేరింగ్ షాపులు, వాహనాలను అమ్మే షాపులు, విడిభాగాలను అమ్మే షాపులు మొదలయినవి రవాణావ్యవస్థ సమర్థంగా నడవడానికి తోడ్పడతాయి.

◆ మీకు తెలిసిన రెండు ప్రదేశాల మధ్య కింద పేర్కొన్న వివిధ రకాల బస్సులలో ప్రయాణించడానికి పట్టే సమయం, వసూలు చేసే ఛార్జీల వివరాలను కనుక్కోండి.

| బస్సు రకం | చార్జీ | ప్రయాణించడానికి తీసుకొనే సమయం |
|---|---|---|
| పల్లెవెలుగు / గ్రామణి | | |
| ఎక్స్‌ప్రెస్ | | |
| డీలక్స్ | | |

SCERT, TELANGANA

- ఇక్కడ పేర్కొన్న వివిధ బస్సుల ఛార్జీలు వివిధ రకాలుగా ఉండటం న్యాయమేనని మీరు భావిస్తున్నారా? కారణాలు ఏమిటి?
- ఛార్జీలు భిన్నంగా ఉండటంతోపాటు, సౌకర్యాలు, ప్రయాణ సమయం వంటి విషయాలలో కూడా భిన్నత్వం ఉంది. ఎలా అయితేనేమి, మీ ఉద్దేశంలో ఎక్కువమంది ప్రజలు ఏ విధంగా ప్రయాణించడానికి ఇష్టపడతారు? మీరు సౌకర్యాలను పెంచే అధికారివయినట్లయితే, ఏ రకమైన బస్సులకు ప్రాధాన్యం ఇస్తారు?

**రవాణా సేవలు, ఎంపిక:**

రవాణా సౌకర్యాల లభ్యతమీదా, రవాణా చార్జీలను భరించగలిగే స్థాయిమీదా ప్రజలు ఉపయోగించే రవాణా పద్ధతి ఆధారపడి ఉంటుంది. ఒక్కొక్కసారి వివిధ రకాల రవాణా సాధనాలను ఉపయోగించే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు బెంగళూరు వెళ్లడానికి బస్సు, రైలు లేదా విమాన మార్గాలు ఉన్నాయి. శతాబ్దాల కాలంనుండి, దూరదేశాలు వెళ్లడానికి లేదా వస్తువులను తీసుకువెళ్లడానికి, తీసుకురావడానికి ఓడలు చాలా ముఖ్యరవాణా సాధనం. రవాణాపరంగా చవకైనప్పటికీ కూడా కొద్దిమంది మాత్రమే ఓడలలో ప్రయాణిస్తున్నారు. ఎక్కువగా వస్తువులు ఓడల ద్వారా రవాణా అవుతున్నాయి.



*చిత్రం-10.3 రవాణా వ్యవస్థ - నాడు, నేడు*

పట్టణాలలో రవాణా సాధనాల ఎంపిక విభిన్నంగా ఉంటుంది. మీలో కొంతమంది పాఠశాలకు బస్సులో, మరికొంతమంది నడిచి వస్తున్నారు. ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు, ఆఫీసులలో పనిచేసేవారు, గృహాల్లో, షాపులలో పనిచేసేవారు రవాణావ్యవస్థపైన ఆధారపడిఉన్నారు. ప్రతి నగరంలో బస్సులవంటి ప్రజారవాణావ్యవస్థ ఉండక పోవచ్చు. అందువల్ల ప్రజలు తమతమ సొంత వాహనాలపైన లేదా అద్దె వాహనాలైన ఆటో రిక్షా, టాక్సీ లాంటి రవాణా సాధనాలపైన ఆధారపడతారు.



*చిత్రం-10.4 రైల్వే కార్మికులు*

రవాణా వ్యయం అధికంగా ఉంటే ప్రజలు ఒకచోటి నుండి మరొకచోటికి వెళ్లలేరు. ఉదాహరణకు, ఒక ప్రదేశంలో వేతనాలు ఎక్కువగా లభిస్తుంటే, తక్కువ వేతనం ఉండే ప్రాంతంలోని ప్రజలు ఎక్కువ వేతనం లభించే ప్రాంతాలకు వెళ్లడానికి ఇష్టపడతారు. రవాణావ్యయం అధికంగా ఉంటే, ప్రజలు ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి ఇష్టపడరు.

అల్పాదాయవర్గాలు తమతమ ఆదాయాలలో అధికభాగాన్ని రవాణా నిమిత్తం ఖర్చు చేయడంవల్ల వారికి ప్రయాణవ్యయం ఎక్కువవుతుంది. నడవటం, సైకిల్ తొక్కడం వంటివి ఎక్కువ దూరాలు ప్రయాణించడానికి కష్టంగా ఉంటాయి. పెద్ద నగరాలలో ప్రజలు నడవడానికి, సైకిల్ తొక్కడానికి ప్రత్యేకమైన మార్గాలుంటాయి. అయితే కాలిబాటలు (ఫుట్‌పాత్‌లు) ఉన్నప్పటికీ వ్యాపారులు వాటిని ఆక్రమించుకుంటున్నారు. చక్రాల కుర్చీలో ప్రయాణించే

వారు ఫుట్‌పాత్ ఉపయోగించాలి. కానీ రోడ్డు కంటే ఫుట్‌పాత్ కొన్నిసార్లు చాలా ఎత్తులో ఉండి వాళ్లు కూడా ఇతర మోటారు వాహనాలతోపాటు ప్రమాదకర ప్రయాణం చేయవలసివస్తుంది.

- ఉమర్, ఇబ్రహీం ఒకే స్కూల్‌లో ఒకే తరగతి చదువుతున్నారు. వాళ్లు వేరువేరు ప్రదేశాలలో నివసిస్తున్నప్పటికీ వాళ్ల ఇంటికీ, పాఠశాలకు మధ్య దూరం 3 కి.మీ.లు. ఇబ్రహీం పాఠశాలకు సిటీబస్‌లో, ఉమర్ పాఠశాల బస్సులో వస్తారు. వీరిద్దరూ వేరువేరు వాహనాలమీద రావడానికి వాళ్ల కుటుంబాలకు ఏ ఏ అంశాలు కారణాలయి ఉండవచ్చు?

**జనాభారద్దీ, కాలుష్యం:**

ఈరోజుల్లో చాలా నగరాల్లో జనం రద్దీ, విపరీతమైన ట్రాఫిక్ ఉంటున్నాయి. నగరాలలో మంచి ప్రజా రవాణా వ్యవస్థ లేకపోయి-నట్లయితే ప్రజలు సొంతంగా వాహనాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఫలితంగా పట్టణాలలో పెరిగిన వాహనాలను క్రమబద్ధీకరిం-చడానికి ట్రాఫిక్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు, రోడ్ల వెడల్పు చేయడం వంటి చర్యలను తీసుకోవాలి. దీన్ని మనం ఒక ఉదాహరణ ద్వారా అవగాహన చేసుకుందాం. 1981 – 2001 సంవత్సరాల మధ్య ఆరు పెద్ద పట్టణాలలో నివసించే జనాభా రెండింతలు పెరగగా మోటారువాహనాల సంఖ్య అదే కాలంలో ఎనిమిదింతలు పెరిగింది.

మోటారు సైకిళ్లు, వాహనాల వినియోగం గణనీయంగా పెరగటంవల్ల పెట్రోల్, డీజిల్‌వాడకం విపరీతంగా పెరిగి గాలి కాలుష్యం పెరుగుతోంది. కాలుష్యాన్ని తగ్గించడానికి పెట్రోలియం ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించాలి. తక్కువ ఖర్చుతో ఎక్కువమందిని రవాణా చేయగల ప్రజా రవాణా వ్యవస్థ ద్వారా కాలుష్యాన్ని కొంతవరకు తగ్గించవచ్చు.

**సురక్షిత ప్రయాణం:**

ఈ రోజుల్లో ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంది. రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయాలు అల్పాదాయకుటుంబాలవారిమీద తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. రోడ్డు ప్రమాదాలలో మరణించేవారిలో, గాయపడేవారిలో ఎక్కువమంది సైకిల్‌మీద ప్రయాణించేవారు, పాదచారులు లేదా కాలిబాటలమీద నివసించేవారు. ప్రమాదాలు అనేవి రోడ్ల మీదనేగాకుండా ఇతర రవాణా మార్గాలలో కూడా జరుగుతున్నాయి. రోడ్-రైలు మార్గాలు కలిసే చోట రైలు కాపలా గేటు ఉంటుంది. రైలు వెళ్లేటప్పుడు వాహనాలు రైలుపట్టాలపైకి రాకుండా గేటు వేస్తారు. రైలు వెళ్ళిన తరవాత గేటు తీస్తారు.




చిత్రం-10.5 పర్వత ప్రాంతాలలో ప్రయాణించే రైలు-ఊటీ

కాని కొన్నిచోట్ల రోడ్డు-రైలు మార్గాలు కలిసేచోట ఇటువంటి గేట్లు లేనప్పుడు, రైలుపట్టాలు దాటేటప్పుడు రైళ్లరాకను రెండువైపులా గమనించి దాటాలి, లేకుంటే ప్రమాదాలు జరుగుతాయి.

**రోడ్డు భద్రతా వారోత్సవాలు:**

దేశంలోని రోడ్డు రవాణా శాఖ ప్రతి సంవత్సరం మొదటి వారంలో రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా అది ట్రాఫిక్ నియమాలను

SCERT TELANGANA

ఏ విధంగా పాటించాలో ప్రజలకు తెలియజేస్తుంది. ప్రభుత్వ సంస్థలైన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వంటివి (టి.ఎస్.ఆర్.టి.సి.) డ్రైవర్లకు భద్రతతో కూడిన డ్రైవింగ్‌లో శిక్షణ కార్యక్రమాలను, చర్చాకార్యక్రమాలను నిర్వహిస్తుంది. వీరు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం వంటి కార్యక్రమాలు నిర్వహించడమేగాక ట్రాఫిక్ నియమాలను పాటించడంలోను, క్షేమంగా ప్రయాణించడంలోను మార్గదర్శకత్వాన్ని అందిస్తారు. మనం ప్రయాణించే రోడ్డు, రైలు, జల, వాయురవాణా మార్గాలలో ఏదయినప్పటికీ ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా భద్రతా నియమాలను పాటించాలి. ఇలా పాటిస్తే ప్రయాణంలో ప్రమాదాలను, మరణాలను తగ్గించవచ్చు.


చిత్రం-10.6 :విశాఖపట్టణం ఓడరేవు

- మీకు దగ్గరలోని ట్రాఫిక్ పోలీసు లేదా డ్రైవింగ్ స్కూలు లేదా డ్రైవింగ్ లైసెన్స్ గల వ్యక్తిని సంప్రదించండి. డ్రైవర్లు ఏ విధంగా శిక్షణ తీసుకుంటారో చర్చించండి. డ్రైవింగ్ స్కూల్‌లో ప్రదర్శించే విషయాలను గుర్తించండి.
- రోడ్లను ఉపయోగించడంలో పాటించవలసిన మౌలిక నియమాలను చర్చించండి, రోడ్డుమీద ఏవిధంగా సురక్షితంగా ప్రయాణించాలో చర్చించండి. పాటించవలసిన ట్రాఫిక్ నియమాలను చార్టుమీద రాసి మీ తరగతి గదిలో ప్రదర్శించండి.

**కీలకపదాలు:**

1. సురక్షిత ప్రయాణం
2. రోడ్డుమార్గాలు
3. వాయుమార్గాలు
4. జలమార్గాలు
5. రైలు మార్గాలు
6. జాతీయరహదారులు
7. రాష్ట్రరహదారులు
8. గ్రామీణ రహదారులు
9. పట్టణ రహదారులు
10. సరిహద్దు రహదారులు
11. తె.రా.రో.ర.సం. (T.S.R.T.C.)
12. రద్దీ

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) వ్యవసాయ వస్తువుల ఉత్పత్తికి రవాణావ్యవస్థ ఏవిధంగా అత్యవసరమో ఉదాహరణలతో వివరించండి.
2) రైళ్లకంటే బస్సులు ఏవిధంగా భిన్నమైనవో వివరించండి.
3) గ్రామాలకు రవాణాసౌకర్యాల కల్పన ఎందుకు ముఖ్యమైనది?
4) అంతర్జాతీయ వ్యాపారంలో జలమార్గాల ప్రాధాన్యాన్ని వివరించండి.
5) రవాణామార్గాలను దేశపు జీవనాడులని ఎందుకు అంటారు?
6) ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయిన వస్తువుల రవాణా వ్యయం పెరిగినట్లయితే ఏం జరుగుతుంది? ఉదాహరణలతో వివరించండి.
7) ప్రమాదాల నివారణకు సంబంధించిన కొన్ని నినాదాలు రాయండి.
8) వాహనాల అధిక వినియోగం వలన అధిక రద్దీ ఏర్పడుతున్నది, దీన్ని నివారించుటకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి?
9) తెలంగాణ రాష్ట్ర out line పటం గీసి హైదరాబాద్‌ను గుర్తించండి.

W5P2R5

**చర్చ :** రోడ్డు ప్రమాధాలు-నివారణోపాయాలు గురించి పోలీస్ ఇన్‌స్పెక్టర్/కానిస్టేబుల్ చేత విద్యార్థులకు ప్రదర్శన ఇప్పించండి/ చర్చ నిర్వహించండి.

**ప్రాజెక్ట్ పని :** రవాణావ్యవస్థలో పనిచేసే ఒక డ్రైవరును ఇంటర్వ్యూ చేయండి. వారి పని ప్రమాదాలు మొదలయిన విషయాలు తెలుసుకొని నివేదిక రాయండి.

SCERT, TELANGANA

పాఠం **11**

Z4U9X4

# కొత్త రాజ్యాలు - రాజులు

## మొదటిభాగం

7వ శతాబ్దం తర్వాత చాలా కొత్త రాజవంశాలు పుట్టుకొచ్చాయి. 7-12 శతాబ్దాల మధ్య కాలంలో భారత ఉపఖండ వివిధ ప్రాంతాల్లో పాలించిన ముఖ్య రాజవంశాలను పటం-1లో చూడవచ్చు.

- గూర్జర ప్రతిహారులు, రాష్ట్రకూటులు, పాల, చోళుల, చహమను(చౌహాను)ల రాజ్యాలను గుర్తించండి.
- వారి నియంత్రణలోని ప్రాంతాలు నేడు ఏ రాష్ట్రాలలో ఉన్నాయో గుర్తించగలరా?




*పటం-1 ఉత్తర, మధ్య, తూర్పు భారతదేశంలోని ముఖ్యమైన రాజవంశాలు - సా.శ. 700-1100*

### కొత్త రాజవంశాల పుట్టుక:

భారత ఉపఖండంలో 7వ శతాబ్దం నాటికి వివిధ ప్రాంతాల్లో అనేకమంది భూస్వాములు, ముఖ్యులైన యుద్ధ యోధులు ఉన్నారు. అప్పటి రాజులు తరచుగా వీరిని తమ సామంతులుగా గుర్తించారు. తమ సామంతులు తమకు కానుకలు తేవాలని, వారి ఆస్థానాల్లో ఉండాలనీ, సైనిక సహాయం అందించాలని ఆ రాజులు ఆశించేవారు. సామంతులకు అధికారం, సంపద లభించిన క్రమంలో తమకు తామే మహా సామంతులుగా, మహా మండలేశ్వరులుగా (ఒక ప్రాంతానికి లేదా పరిధికి గొప్ప దేవుడు) ప్రకటించుకొన్నారు. కొన్నిసార్లు వారు తమ ప్రభువుల నుండి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నారు.

దక్కను ప్రాంతంలో రాష్ట్రకూటులకు సంబంధించిన ఇటువంటి ఉదాహరణ కనిపిస్తుంది. రాష్ట్రకూటులు మొదట కర్ణాటకలోని చాళుక్యులకు సామంతులుగా పనిచేశారు. 8వ శతాబ్దం మధ్యలో రాష్ట్రకూటులలో ముఖ్యుడైన దంతిదుర్గుడు చాళుక్య ప్రభువును ఓడించి 'హిరణ్యగర్భ' (బంగారు గర్భం) అనే సంస్కారవిధి నిర్వహించాడు. దీనిని నిర్వహించి, తాను పుట్టుకతో క్షత్రియుడు కాకున్ననూ, క్రతువుతో పునర్జన్మ పొందుతానని భావించాడు.

- నేటి రోజుల్లో పాలకులు కావడానికి ఏదేని ఒక వర్ణంలో పుట్టి ఉండడం ప్రధానమని భావిస్తున్నారా?

మరికొన్ని సందర్భాలలో సంపన్న కుటుంబాల వారు వారి సైనిక శక్తిని రాజ్యాలు ఏర్పరచుకోవడానికి ఉపయోగించారు. కదంబ మయూరశర్మ, గూర్జర ప్రతిహార హరిశ్చంద్రుడు బ్రాహ్మణులైనప్పటికీ వారి సంప్రదాయ వృత్తులను వదిలిపెట్టి ఆయుధాలను చేతబట్టి, కర్ణాటక, రాజస్థాన్‌లలో రాజ్యాలను స్థాపించారు.



*చిత్రం: 11.1 రాష్ట్రకూటుల కాలంనాటి ఎల్లోరాలోని 15వ నెంబర్ గుహలోని విష్ణువును నరసింహునిగా చూపుతున్న చిత్రం.*

### ప్రశస్తి - భూదానాలు:

శాసనాలలో మొదట పేర్కొనే భాగాన్ని ప్రశస్తి అంటారు. ప్రశస్తులలో పాలకుల కుటుంబాలు, వారి పూర్వపు రాజుల గురించి, వారు ఏ కాలానికి చెందిన వారో, వారి ఘనతలను, విజయా- లను ఎలా చాటుకునేవారో తెలుపుతాయి. పరిపాలనలో సహకరించే బ్రాహ్మణ పండితులు వీటిని రాసేవారు. పాలకులు తమ విజయాలను, పరాక్రమాలను ఎలా వర్ణించుకునేవారో వీటి ద్వారా తెలుస్తుంది.

SCERT TELANGANA

**నాగభట్టు విజయాలు:**

చాలామంది రాజులు తమ విజయాలను ప్రశస్తిలలో వర్ణించేవారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో సంస్కృత లిపిలో లభించిన ఒక ప్రశస్తి ప్రతిహార రాజైన నాగభట్టు విజయాలను ఈ కిందివిధంగా వర్ణిస్తుంది:

*ఆంధ్రరాజులు, సైంధవులు (సింధు) విదర్భ (మహారాష్ట్రలోని ఒకభాగం), కళింగ (ఒడిశాలోని కొంతభాగం) రాజులు తాను యువరాజుగా ఉన్నప్పుడే తన ముందు మోకరిల్లారు.*

*అతడు చక్రాయుధు (కనోజ్ పరిపాలకుడు)నిపై విజయం సాధించాడు. అతడు వంగ (బెంగాల్‌లో భాగం), అనార్త (గుజరాత్‌లో భాగం), మాళవ (మధ్యప్రదేశ్‌లో భాగం), కిరాట (వనవాసులు), తురుష్క (టర్కులు), వత్స, మత్స (ఉత్తర భారత రాజ్యాలు) రాజులను ఓడించాడు.*

పటం-1లో పై శాసనంలో పేర్కొన్న ప్రాంతాలను గుర్తించండి.



***చిత్రం-11.2: సా.శ 9వ శతాబ్దంనాటి పాలకుల భూదాన తామ్రఫలకల గుచ్ఛం కొంత సంస్కృతంలో, కొంత తమిళంలో రాయబడిన ఈ తామ్రపత్రాలపై రాజముద్రలు వేసి అధికారికంగా ధృవీకరించారు.***

రాజులు బ్రాహ్మణులకు మరియు తమకు సేవలు అందించిన ఇతరులకు తరచుగా భూదానాలు చేసేవారు. ఈ దానాలు రాగి ఫలకాలపై నమోదుచేసి, దానగ్రహీతలకు ఇచ్చేవారు.

కాశ్మీర్‌ను పాలించిన రాజుల చరిత్రపై 12వ శతాబ్దంలోనే అసాధారణమైన పెద్ద సంస్కృత పద్యం ఉంది. దీనిని కల్హణుడు రాశాడు. అతడు శాసనాలు, రాతప్రతులు, పూర్వచరిత్రలు దృష్టాంతాల వంటి వివిధ వనరులను తన రచనలకు వినియోగించాడు. కాని ప్రశస్తిల రచయితలవలే కాక రాజులను, వారి విధానాలను తరచుగా విమర్శించేవాడు.

**భూమితో ఏమి ఇచ్చేవారు?**

చోళుల భూదానపత్రం గురించి తమిళంలో పేర్కొన్న భాగం:

*మేము ఈ భూమి సరిహద్దులను మట్టికట్టలతో, పొదలు నాటి గుర్తించాం. ఈ భూమి పండ్లచెట్లు, నీరు, భూమి, ఉద్యానవనం, చెట్లు, బావులు, ఖాళీ స్థలాలు, పచ్చిక బయళ్ళు, ఒక గ్రామం, పుట్టలు, వేదికలు, కాలువలు, గుంతలు, నదులు, ఒండ్రుభూమి, చెరువులు, ధాన్యాగారాలు, చేపల చెరువులు, తేనెపట్టులు, లోతైన సరస్సులు కలిగి ఉన్నది.*

*ఈ భూమి స్వీకరించేవారు దీనిపై పన్నులు వసూలు చేస్తారు. ఇతడు న్యాయమూర్తులు విధించే జరిమానాలను, తమలపాకులపై పన్ను, నేతగుడ్డలపై, వాహనాలపై పన్నును వసూలు చేస్తాడు. అతడు కాల్చిన ఇటుకలతో పెద్ద గదులను పై అంతస్తులతో నిర్మించవచ్చు, చిన్న, పెద్ద బావులను తవ్వించవచ్చు, చెట్లను, పొదలను నాటవచ్చు. నీటిపారుదలకు అవసరమైతే కాలువలు నిర్మించవచ్చు. అతడు నీరు వృధాకాకుండా కట్టలు నిర్మించాలి.*

SCERT, TELANGANA

- ఈ శాసనంలో పేర్కొన్న నీటిపారుదలకు ఉపయోగపడే వనరుల జాబితా రాసి వాటిని ఏ విధంగా ఉపయోగించారో చర్చించండి.

**రాజ్యాలలో పరిపాలన:**

ఈ కొత్త రాజులలో ఎక్కువగా మహారాజాధిరాజ (గొప్పరాజు, రారాజు), త్రిభువన చక్రవర్తి (ముల్లోకాలకు రాజు) మొదలైన గంభీరమైన బిరుదులను కలిగి ఉండేవారు. కానీ వారు కొన్ని సందర్భాల్లో సామంతులు, రైతుసంఘాలు, వ్యాపారస్థులు, బ్రాహ్మణుల సంఘాలతో అధికారాన్ని పంచుకొనేవారు.

ప్రతి రాజ్యంలో రైతులు, పశుపోషకులు, చేతివృత్తుల వారి నుండి, వ్యాపారుల నుండి ఉత్పత్తి చేసిన మరియు అమ్మిన దానిలో భాగం తీసుకొనేవారు. భూమి మొత్తం రాజుదైనందున, దానికి చెల్లించిన అద్దెగా దీనిని భావించేవారు. వ్యాపారుల నుంచి పన్నులు కూడా వసూలు చేసేవారు.

పన్నుల రూపంలో వచ్చిన వనరులను పరిపాలనకు, దేవాలయాల నిర్మాణానికి, కోటల నిర్మాణానికి వినియోగించేవారు. యుద్ధాల ద్వారా పొందిన కప్పంను వ్యాపార మార్గాల అభివృద్ధికి వెచ్చించేవారు.

పన్నుల వసూలుకై పాలకుల కుటుంబాల నుండి అధికారులను నియమించేవారు. వీరి నియామకం తరచుగా వంశపారంపర్యంగా జరిగేది. సైన్యం విషయంలో కూడా ఇదే పద్ధతిని కొనసాగించేవారు. చాలా సందర్భాల్లో రాజుల దగ్గరి బంధువులే ఈ పదవుల్లో కొనసాగేవారు.

- ఈ రకమైన పరిపాలన ప్రస్తుత పరిపాలన విధానం కంటే ఏవిధంగా భిన్నమైనది?

**సంపదకోసం సంగ్రామం:**

ఒక్కొక్క రాజవంశం ఒక ప్రత్యేక ప్రాంతంలో స్థిరపడింది. అదే సమయంలో వారు ఇతర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తెచ్చుకొనే ప్రయత్నం చేశారు. గంగా నదీలోయ ప్రాంతంలోని కనోజ్ ఒక ప్రత్యేకమైన ప్రాంతం. ఈ ప్రాంతంపై నియంత్రణకోసం గూర్జర ప్రతిహారులు, రాష్ట్రకూటులు, పాలవంశపు రాజులు అనేక శతాబ్దాలుగా పోరాడారు. ఈ సుదీర్ఘ సంఘర్షణలో మూడు పక్షాలు పాల్గొన్నాయి కాబట్టి దీనిని చరిత్రకారులు "త్రైపాక్షిక పోరాట"మన్నారు.

- పటం-1 పరిశీలించి పాలకులు కనోజ్, గంగానదిలోయ ప్రాంతాన్ని తమ ఆధీనంలో ఉంచుకోవాలని కోరుకోవడానికి గల కారణాలు ఏమిటో చెప్పండి?

**మహమూద్ గజనీ :**

సా.శ. 997 – 1030 వరకు అఫ్ఘనిస్తాన్‌ను పాలించిన గజనీ మధ్య ఆసియా, ఇరాన్, భారత ఉపఖండ వాయవ్య ప్రాంతాలకు తన రాజ్యాన్ని విస్తరించాడు. అతడు ఉత్తర భారతదేశంపై అనేక సార్లు దాడి చేసి గుజరాత్‌లోని సోమనాథ ఆలయంతో సహా సంపన్న దేవాలయాలను విధ్వంసం చేసి సంపదను దోచుకున్నాడు. మహమూద్ దోచుకున్న సంపదలోని చాలా భాగంతో గజనీలో రాజధాని నగరం నిర్మించాడు.

ఆక్రమించిన ప్రాంతాల ప్రజల గురించి చాలా విషయాలు తెలుసుకోవడంలో మహమూద్ గజనీ ఆసక్తి కనబరచేవాడు. అల్‌బిరూనీ అనే పండితునికి భారత ఉపఖండం గురించి రచనలు చేసే పనిని అప్పగించాడు. 'కితాబ్ అల్ హింద్' అని పిలువబడే ఈ అరబిక్ గ్రంథం చరిత్రకారులకు ఒక ఆధారమయింది. దీనిని రాయడానికి అల్‌బిరూనీ సంస్కృతపండితులను సంప్రదించాడు.

SCERT, TELANGANA

**చహమనులు (చౌహానులు):**

తరువాత కాలంలో చౌహానులుగా పిలువబడిన చహమనులు ఢిల్లీ, అజ్మీర్ ప్రాంతాలను పాలించారు. వారు పశ్చిమం, తూర్పువైపు రాజ్యవిస్తరణ చేయటానికి ప్రయత్నం చేశారు. గుజరాత్‌లోని చాళుక్యులు, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని గహద్వాలులు చౌహానులను వ్యతిరేకించారు. ఆఫ్ఘన్‌కు చెందిన మహమ్మద్ ఘోరీని 1191లో చౌహాన్ వంశస్థుడైన మూడవ పృథ్వీరాజ్ (1168-1192) ఓడించాడు. కాని 1192లో పృథ్వీరాజ్ ఘోరీ చేతిలో ఓడిపోయాడు.


- పటం-1 చూడండి. చహమనులు తమ రాజ్యాన్ని ఎందుకు విస్తరింపజేయాలనుకున్నారు? చర్చించండి.

రెండవభాగం

## చోళులు

ఇప్పుడు దక్షిణ భారతదేశం గురించి తెలుసుకుందాం.

దక్షిణ భారతదేశంలో సమగ్రంగా రాసిన చరిత్రలో చోళుల పాలన ఒకటి. వారు పరిపాలనపరంగా ఎలా విజయాలు సాధించారో తెలుసుకుందాం.




*పటం-2: చోళ సామ్రాజ్యం, పొరుగు రాజ్యాలు*

**ఉరయూర్ నుంచి తంజావూరు వరకు**

చోళులు అధికారంలోకి ఎలా వచ్చారు? ముత్తరాయర్‌గా పిలువబడే ఒక చిన్న ముఖ్య కుటుంబం కావేరీ డెల్టా ప్రాంతంపై అధికారం చేజిక్కించుకొంది. వారు కాంచీపురాన్ని పాలించే పల్లవులకు సామంతులు. 9వ శతాబ్ది మధ్యలో ఉరయూర్‌కు చెందిన పురాతన చోళవంశస్థుడైన విజయాలయుడు, ముత్తరాయర్‌కు చెందిన డెల్టా ప్రాంతాన్ని ఆక్రమించుకొన్నాడు. ఆయన తంజావూరు పట్టణాన్ని మరియు నిశుంభసూదిని దేవతకు దేవాలయాన్ని నిర్మించాడు.

SCERT, TELANGANA



*చిత్రం-11.3: గంగైకొండ చోళపురం దేవాలయం గుడి పైకప్పు వాలును గమనించండి. గుడి బయట గోడలను పెద్ద పెద్ద రాతి శిలలతో అలంకరించిన తీరును కూడా గుర్తించండి.*

విజయాలయుని తరవాత వచ్చిన రాజులు పొరుగు రాజ్యాలను ఆక్రమిం- చుకోవడంతో వీరి రాజ్య పరిమాణం, అధికారం పెరిగాయి. పాండ్య, పల్లవ ఉత్తర దక్షిణ ప్రాంతాలు వీరి రాజ్యంలో అంతర్భాగమయ్యాయి. చోళులలో అతి శక్తిమంతుడుగా పేరున్న మొదటి రాజరాజు సా.శ. 985లో అధికారంలోకి వచ్చి ఈ ప్రాంతాలను తన ఆధీనంలోనికి తెచ్చుకున్నాడు. సామ్రాజ్య పరిపాలనను పునర్వ్యవస్థీకరించాడు. మొదటి రాజరాజు కుమారుడైన మొదటి రాజేంద్రుడు తన తండ్రి విధానాలను కొనసాగించి గంగానదీలోయ, శ్రీలంక, ఆగ్నేయాసియా ప్రాంతాలను ఆక్రమించాడు. దీనికోసం నౌకాదళాన్ని అభివృద్ధిపరిచాడు.

## అద్భుత దేవాలయాలు – కాంస్య శిల్పకళ

మొదటి రాజరాజు, మొదటి రాజేంద్రుడు తంజావూరులో గంగైకొండ చోళపురంలో నిర్మించిన పెద్ద దేవాలయాలు అద్భుత నిర్మాణానికి, శిల్పకళకు నిదర్శనాలు.

చోళులు నిర్మించిన దేవాలయాలు ప్రజలు వాటి చుట్టుపక్కల స్థిరపడడానికి కేంద్రాలయ్యాయి. ఇవి చేతివృత్తుల ఉత్పత్తులకు కేంద్రమైనాయి. పాలకులు, ఇతరులు సమర్పించిన భూములతో దేవాలయాలు సంపన్నమైనాయి. దేవాలయంలో పనిచేసే పూజారులు, పూలదండలు తయారుచేసేవారు, వంటవారు ఆలయాన్ని శుభ్రంచేసేవారు. సంగీత వాద్యకారులు, నాట్యకత్తెలు మొదలైన వారి పోషణకోసం ఈ భూములలో పండిన పంటలు ఉపయోగపడేవి. దేవాలయాలు కేవలం పూజా కేంద్రాలుగా మాత్రమే కాకుండా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక జీవన కేంద్రాలుగా వెలిశాయి.



*చిత్రం-11.4: చోళ కాలంనాటి కాంస్య శిల్పం. ఈ శిల్పాన్ని ఎంత జాగ్రత్తగా అలంకరించారో గమనించండి.*

దేవాలయాలతో అనుబంధమైన చేతి వృత్తిపని వారు చాలావరకు ప్రత్యేకమైన కాంస్య విగ్రహాలు తయారు చేసేవారు. చోళుల కాంస్య విగ్రహాలను ప్రపంచంలో అందమైన వాటిగా పరిగణించారు. అనేక విగ్రహాలు దేవతలవికాగా కొన్ని భక్తులవి కూడా ఉన్నాయి.

## వ్యవసాయం – నీటిపారుదల:

వ్యవసాయంలో నూతన అభివృద్ధి చర్యలు చేపట్టడం ద్వారానే చోళులు చాలా విజయాలు సాధించగలిగారు (పటం-2 చూడండి). కావేరీనది బంగాళాఖాతంలో కలిసేముందు చిన్న చిన్న పాయలుగా విడిపోవడాన్ని గమనించండి. ఈ పాయలు తరచుగా ఉప్పొంగి వాటి తీరాలను సారవంతం చేసేవి. ఈ ప్రాంతంలో పండే పంటలకు, ముఖ్యంగా వరి పంటకు కావలసిన నీరు ఈ పాయలు అందించేవి.

SCERT, TELANGANA



*చిత్రం-11.5: తమిళనాడులోని సా.శ 9వ శతాబ్దంనాటి పంట కాలువలకు పోయే నీటిని నియంత్రించే తూము*

తమిళనాడులోని ఇతర ప్రాంతాల్లో అంతకుముందే వ్యవసాయం అభివృద్ధి చెందినప్పటికీ, 5, 6 శతాబ్దాల మధ్యకాలంలోనే పెద్ద మొత్తంలో విస్తరించింది. కొన్ని ప్రాంతాల్లో అడవులు నరకాల్సివచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో నేలను చదును చేయవలసి వచ్చింది. డెల్టా ప్రాంతాల్లో వరదలు నివారించడానికి కట్టలుకట్టి, పొలాలకు నీరందించడానికి కాలువల నిర్మాణం చేశారు. చాలా ప్రాంతాల్లో సంవత్సరానికి రెండు పంటలు కూడా పండించేవారు.

చాలా సందర్భాల్లో పంటలకు కృత్రిమంగా నీరు అందించవలసి వచ్చేది. నీటి పారుదలకై వివిధ పద్ధతులను ఉపయోగించేవారు. కొన్ని ప్రాంతాల్లో బావులు తవ్వారు. మరికొన్ని ప్రాంతాల్లో వర్షపునీటిని నిల్వచేయడానికి పెద్ద చెరువులు నిర్మించారు.

నీటి పారుదల సౌకర్యాల విస్తరణలో ప్రణాళిక, వనరులు వంటి వాటి నిర్వహణ, నీటిని ఎలా పంపిణీ చేయాలనే అనేక అంశాలు ఇమిడి ఉంటాయనే విషయం గుర్తుంచుకోవాలి. అనేకమంది పాలకులు, గ్రామాలలోని ప్రజలు కూడా ఈ కార్యక్రమాలలో ఆసక్తిగా పాల్గొనేవారు.

## సామ్రాజ్య పరిపాలనా విధానం

ఆనాటి పరిపాలన వ్యవస్థ ఎలా ఉండేది?రాజుకు సహకరించడానికి మంత్రి మండలి ఉండేది. అతనికి బలమైన సైన్యం, నౌకాదళం ఉండేది. రాజ్యమును మండలాలుగా విభజించేవారు. ఈ మండలాలను తిరిగి వలనాడులు, నాడులుగా విభజించేవారు.

రైతుల స్థిరనివాసాలను 'ఊరు' అనేవారు. ఇవి నీటి పారుదల, వ్యవసాయ విస్తరణతో సుసంపన్నమైనవి. ఇలాంటి 'ఊరు'లు కొన్ని కలిసి 'నాడు'గా ఏర్పడేవి. గ్రామసభ, నాడులు పరిపాలనా సంబంధ వ్యవహారాలేకాక న్యాయపరిపాలన, పన్నులు వసూలు కూడా చేసేవి.

వెల్లాల కులానికి చెందిన సంపన్నులైన రైతులు చోళుల ప్రభుత్వంలో 'నాడు'లకు సంబంధించిన పాలనా వ్యవహారాలు చూసేవారు. చోళరాజులు ధనవంతులైన భూస్వాములకు మువ్వేందవేలన్ (ముగ్గురు రాజులకు సేవలనందించే రైతు లేదా వేలన్), అరయ్యార్ (ముఖ్యుడు) లాంటి గౌరవ సూచక బిరుదులనిస్తూ కేంద్ర స్థాయిలో రాజ్యానికి సంబంధించిన ముఖ్యమైన బాధ్యతలు అప్పగించేవారు.

SCERT, TELANGANA

**భూమి రకాలు**

భూములలో రకాలను చోళుల శాసనాలు ఈ విధంగా పేర్కొన్నాయి:

*వెల్లన్‌వాగై:* బ్రాహ్మణేతర రైతులకు చెందిన భూమి.

*బ్రహ్మదేయ:* బ్రాహ్మణులకు బహుకరించిన భూమి.

*శాలభోగ:* పాఠశాల నిర్వహణకు ఉపయోగించే భూమి.

*దేవాదాన, తిరునామత్తుక్కని:* దేవాలయాలకు బహుకరించిన భూమి.

*పళ్లిచ్ఛందం:* జైన సంస్థలకు విరాళమిచ్చిన భూమి.

బ్రాహ్మణులు తరచుగా భూదానాలను లేక బ్రహ్మదేయాలను స్వీకరించడాన్ని మనం చూశాం. ఫలితంగా దక్షిణభారత దేశంలోని ఇతర ప్రాంతాలమాదిరి కావేరీనదీ లోయలో కూడా బ్రాహ్మణులు స్థిరపడ్డారు.

ప్రతి బ్రహ్మదేయం పేరుగాంచిన బ్రాహ్మణ భూస్వాములచే కూడిన సభ సంరక్షణలో ఉండేది. ఈ సభలు చాలా సమర్థవంతంగా పనిచేసేవి. వీరి నిర్ణయాలను శాసనాలపై, తరుచుగా దేవాలయాల గోడలపై నమోదు చేసేవారు. 'నగరం' అనే వర్తక సంఘాలు కూడా పరిపాలనా వ్యవహారాలలో సందర్భానుసారంగా పాల్గొనేవి.

'సభ' ఏ విధంగా నిర్వహించేవారో తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలోని ఉత్తరమేరూర్ శాసనం పేర్కొంది. సభలో నీటిపారుదల వసతులకు, తోటలు, దేవాలయాలు మొదలైన వాటిని సంరక్షించడానికి ప్రత్యేక కమిటీలు ఉండేవి. ఈ కమిటీలకు అర్హులయిన సభ్యుల పేర్లు చిన్న తాటాకుల ముక్కలపై రాసేవారు. ఈ ముక్కలన్నింటిని ఒక కుండలో వేసి ఒక చిన్న బాలునితో ఒక్కొక్క ముక్కను ఒక్కొక్క కమిటీ కోసం తీయించేవారు.

**శాసన విషయాలు:**

సభలో ఎవరు సభ్యులుగా ఉండేవారు? ఉత్తర మేరూర్ శాసనం కిందివిధంగా తెలియజేస్తోంది:

*సభ్యులుగా కొనసాగాల్సిన వారందరు విధిగా పన్ను చెల్లించే భూమిని కలిగిఉండాలి.*

*వారు సొంత ఇల్లు కలిగి ఉండాలి. వారి వయస్సు 35-70 సంవత్సరాల మధ్య ఉండాలి. వేదాల గురించి తెలిసి ఉండాలి. వారు పాలనా విషయాలు బాగా తెలిసినవారై ఉండి, నిజాయితీగా ఉండాలి.*

*ఎవరైనా గత మూడు సంవత్సరాలుగా ఏదైనా కమిటీ సభ్యుడుగా కొనసాగితే అతడు మరొక కమిటీ సభ్యుడు కాకూడదు. గతంలో లెక్కలు చూపని వారుకాని, వారి బంధువులుగాని ఎన్నికల్లో పోటీ చేయకూడదు.*

- ఈ సభలో మహిళలు పాల్గొనేవారా? ఈ కమిటీ సభ్యులను లాటరీ ద్వారా ఎన్నుకోవడం ఉపయోగకరమేనా?

రాజులు, శక్తివంతుల గురించి శాసనాలు తెలియచేస్తుండగా 12వ శతాబ్దానికి చెందిన తమిళభాషలోని పెరియపురాణం సామాన్యుల గురించి తెలియచేస్తుంది.

*అదనూరు గ్రామ పొలిమేరల్లో పులయులు తాటాకుల గుడిసెల్లో నివసిస్తూ వ్యవసాయ కూలీలుగాను, దాసులుగానూ జీవనం కొనసాగిస్తున్నారు. వారి గుడిసెల గడపలు తోలు ముక్కలతో కప్పి ఉన్నాయి. ఇంటి ముందు కోడిపిల్లలు తిరుగుతున్నాయి, నల్లని ఇనుప కడియాలను ధరించిన పిల్లలు ఎగురుతూ, దూకుతూ చిన్న పిల్లలతో ఆడుతూ ఉన్నారు.*

SCERT, TELANGANA

మరుదు (అర్జున) చెట్ల నీడలో, ఒక మహిళ తన శిశువును తోలుఛాపపై పడుకోబెట్టింది. మామిడి చెట్ల కొమ్మలకు దప్పులు వేలాడదీసి ఉన్నాయి. కొబ్బరిచెట్టు నీడలో కుక్క పిల్లలు ఉన్నాయి. కోడిపుంజులు సూర్యోదయానికి ముందే కూయడంతో పులయ్యార్‌లు వారి దినసరి పనులను ప్రారంభిస్తారు. కంజీచెట్టు కింద అలల వంటి కురులతో పులయ్యా మహిళలు పాటలు పాడుతూ వడ్లు దంచుతున్నారు.

- గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమాలను వివరించండి.

**కీలకపదాలు :**

| | | |
|---|---|---|
| 1) సామంతులు | 2) దేవాలయం | 3) నాడు |
| 4) సభ | 5) రాజ్యం | 6) సుల్తాను |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1) త్రిపక్ష పోరాటంలో పాల్గొన్న వారు ఎవరు?
2) చోళ సామ్రాజ్యంలో 'సభ' అనే కమిటీకి సభ్యులుగా ఎంపిక కావడానికి గల అర్హతలేమిటి?
3) చహమనా వంశస్థుల ఆధీనంలో ఉన్న రెండు ముఖ్య నగరాలేమిటి?
4) రాష్ట్రకూటులు ఎలా శక్తివంతులయ్యారు?
5) ప్రజల అంగీకారం పొందడానికి కొత్త రాజ్యాలు ఏమి చేశాయి?
6) తమిళ ప్రాంతంలో ఎలాంటి నీటిపారుదల పనులను అభివృద్ధి చేశారు?
7) చోళుల దేవాలయాలతో అనుబంధమైన కార్యక్రమాలేమిటి?
8) ఉత్తరమేరూర్‌లోని ఎన్నికలు ప్రస్తుత పంచాయతీరాజ్ ఎన్నికలతో ఎలా విభేదిస్తున్నాయి?
9) ప్రాచీన దేవాలయాల చిత్రాలు సేకరించి, ఆల్బం తయారు చేయండి.
10) 'వ్యవసాయం - నీటి పారుదల' అంశం కింద ఉన్న మొదటి రెండు పేరాలు చదివి, వ్యాఖ్యానించండి.

V1C6L4

**ప్రాజెక్టు పని :**

1) పటం-1 పరిశీలించి, తెలంగాణలో ఏవైనా రాజ్యాలు ఉన్నాయేమో కనుక్కోండి.
2) ఈ పాఠంలో చూసిన దేవాలయాలను, మీ పరిసర ప్రాంతాలలో నేటి దేవాలయాలతో పోల్చి గమనించిన పోలికలు, భేదాలకు ప్రాధాన్యతనిస్తూ వివరించండి.
3) ప్రస్తుతం వసూలు చేస్తున్న పన్నుల గురించి విపులంగా తెలుసుకోండి. ఇవి నగదు, శ్రమరూపాన లేక వస్తు రూపాలలో ఉన్నాయా?

SCERT, TELANGANA

పాఠం 12

# ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావం - కాకతీయులు

N9T8I2

పల్నాటి వీరులైన బ్రహ్మనాయుడు, బాలచంద్రుడు, అరవై ఆరుగురు యోధులను గురించి, వారి ధైర్యసాహసాలు, వీరోచితమైన పోరాటాలను గురించి అనేక వీరగాథలను, కథలను మీరు వినే ఉంటారు. సమ్మక్క, సారక్క జాతరలలో కూడా పాల్గొని ఉంటారు. వారు గిరిజన తెగల హక్కుల రక్షణకోసం నాటి రాజుల సైన్యాలతో యుద్ధాలు చేశారు. పశువుల కాపరుల రక్షణకోసం, హక్కులకోసం నెల్లూరు రాజులతో పోరాటం చేసిన కాటమరాజు కథలను విని ఆనందించి ఉంటారు.

- మీ తల్లిదండ్రుల ద్వారా, పెద్దల ద్వారా పల్నాటి వీరుల కథల గురించి, సమ్మక్క సారక్కల గురించి, కాటమరాజు కథల గురించి తెలుసుకోండి. తరగతిలో చర్చించండి.

ఈ కథలన్నీ సా.శ. 1000 నుండి 1350 కాలానికి చెందినవి. ఈ కాలం మన చరిత్రలో చాలా ముఖ్యమైనది. గత అధ్యాయాలలో, భారతదేశంలో నూతన పాలకవర్గాలు ఎలా ఆవిర్భవించాయో తెలుసుకున్నాం. వివిధ తెగలు, వేటాడేవారు, పశువుల కాపరుల దశనుండి వ్యవసాయం చేసే స్థాయికి ఎలా ఎదిగారో చూశాం. వీరు యోధులుగా గుర్తింపు పొంది, పశుపోషకులతో, వ్యవసాయదారులతో గ్రామాలలో స్థిరనివాసాలను ఏర్పరచడం ద్వారా, చిన్న రాజ్యాలు స్థాపించారు. రాజ్యస్థాపన, విస్తరణ చేయాలనే కోరిక ఉన్న యోధులు, రాజులు నిరంతరం యుద్ధాలలో మునిగితేలేవారు. ఇలాంటి పరిస్థితుల్లోనే వరంగల్లులోని కాకతీయులు రాజ్యస్థాపన చేశారు.

ఇదే కాలంలో మొదటి తెలుగు గ్రంథాలను రాశారు. మొదటి తెలుగు పద్యకావ్యంగా భావించే శ్రీమదాంధ్ర మహాభారతాన్ని రాసిన కవిత్రయం - నన్నయ, తిక్కన, ఎర్రాప్రెగడ సా.శ. 1000-1400 సంవత్సరాల మధ్య కాలానికి చెందినవారు.

నాటి రాజులు, రాణులు, సామంత పాలకులు, నాయకులు, రైతులు, పశుపోషకులు, వర్తకుల కార్యకలాపాల గురించిన సమాచారాన్ని మనకు ఎన్నో శాసనాల (బయ్యారం, వేయిస్తంభాల గుడి, నాగులపాడు, పిల్లలమర్రి, పాలంపేట, కొండపర్తి మరియు బూత్‌పూర్) ద్వారా, సంస్కృతం, తెలుగులో రాయబడిన గ్రంథాల ద్వారా



*చిత్రం-12.1 వరంగల్లులో కాకతీయ రాజులు నిర్మించిన స్వయంభూ శివాలయ కీర్తి తోరణ ప్రవేశద్వారం*

SCERT, TELANGANA

తెలుస్తుంది. వీటిలో కొన్ని గ్రంథాలు కాకతీయుల పాలనా-కాలంలోనివి. విద్యానాథుడు వ్రాసిన ప్రతాపరుద్ర యశోభూషణం వీటిలో ఒకటి. మరికొన్ని గ్రంథాలు చాలా కాలం తరవాత రాయబడ్డాయి. అలాంటి వాటిలో వినుకొండ వల్లభరాయుని 'క్రీడాభిరామం', ఏకామ్రనాథుని 'ప్రతాపరుద్ర చరిత్ర' ముఖ్యమైనవి.

- పై వివరాల ఆధారంగా కాకతీయ రాజులను గురించి తెలిపే రెండు ఆధారాలను తెలపగలరా?

శాసనాలు, సాహిత్యాధారాల ప్రకారం కాకతీయ వంశం మూలపురుషుడు దుర్జయ. కాకతీయులు తెలుగు భాషను గౌరవించి, ఆస్థాన భాషగా గుర్తించారు. నాటి శాసనాలు చాలా వరకు తెలుగు భాషలో వేయించారు. తెలుగుకు ఇచ్చిన ప్రాధాన్యం వల్ల వీరిని 'ఆంధ్రరాజులు'గా కీర్తించారు. తెలుగు భాష మాట్లాడే ప్రస్తుత కోస్తా ప్రాంతం, తెలంగాణా ప్రాంతం, రాయలసీయ ప్రాంతాన్ని ఒకే ఛత్రం కిందికి తెచ్చారు. ఈవిధంగా కాకతీయులు తెలుగు భాష మాట్లాడే ప్రాంతాల సమైక్యతకు కృషి చేశారు. ఈ కృషి వల్ల తెలుగు ప్రజల విశ్వాసం చూరగొన్నారు. వారు చేసిన సేవలు చిరస్మరణీయమయినవిగా నేటికీ ప్రశంసలు అందుకొంటున్నాయి.

**కాకతీయ రాజులలో ముఖ్యులు :**

రెండో ప్రోలరాజు (సా.శ.1116-1157)

రుద్రదేవుడు (సా.శ.1158-1195)

గణపతిదేవుడు (సా.శ.1199-1262)


రుద్రమదేవి (సా.శ.1262-1289)

రెండవ ప్రతాపరుద్రుడు (సా.శ.1289-1323)

కాకతీయులు మొదటగా కర్నాటకను పాలించిన రాష్ట్రకూటులు, చాళుక్యుల వద్ద సైనికులుగా, సామంతులుగా ఉంటూ తమ రాజ్య స్థాపనను ప్రారంభించారు. వీరు మొదటగా గ్రామోద్యోగులైన గ్రామ పెద్ద ('రట్టడి')గా నియమితులైనారు. తమ సైనిక నైపుణ్యంతో, శక్తియుక్తులతో ప్రభువులను మెప్పించి సైన్యాధిపతులు, సామంతుల స్థాయికి ఎదిగారు. అనంతరం తెలంగాణ ప్రాంతంలోని అనుమకొండను పొందారు. పశ్చిమ చాళుక్యుల పతనానంతరం కాకతీయులు స్వతంత్ర పాలకులుగా ఆవిర్భవించారు.

రుద్రదేవుని పాలన (1158- 1195) కాలంలో రాజధాని అనుమకొండ (హనుమకొండ) నుంచి ఓరుగల్లు (నేటి వరంగల్లు)కు మార్చాడు. కొత్త రాజధాని నగరాన్ని ప్రణాళికాబద్ధంగా నిర్మించి పెరిగే జనాభాకు కావలసిన వసతితోపాటు సౌకర్యాలు కల్పించి, అవసరాలు తీర్చడానికి విశాలమైన కోటను నిర్మించాడు, చెరువు తవ్వించాడు, అనుమకొండ పట్టణంలో వేయిస్తంభాల దేవాలయాన్ని కూడా నిర్మించాడు.

**పటం-1 : ఓరుగల్లు కోట**




***ఓరుగల్లు కోట*** పటం చూడండి. బయటి కోటగోడ నాలుగు ద్వారాలు కలిగి వ్యవసాయ భూములకు, అనేక చెరువులకు రక్షణగా ఉంది. ఈ కోటలోనే చేతివృత్తులవారైన బుట్టలు అల్లేవారి గుడిసెలున్నాయి. వీటిని దాటిన తర్వాత కందకం, ఆ పక్కనే మట్టితో నిర్మించిన కోటగోడను చేరవచ్చు.

కోట మధ్యకు చేరడానికి ఇంకా ముందుకు వెళ్ళినట్లయితే మరో కందకాన్ని ఆనుకొని రాతికోట నిర్మించబడింది. ఈ కోట మధ్యలోనే రాజధాని, నగర భవనాలు, రాజాంతఃపుర నివాసాలున్నాయి. దీనికి నాలుగు

SCERT, TELANGANA

వైపులా అంటే తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణాలుగా ద్వారాలు ఉన్నాయి. ప్రతి ద్వారం గుండా కోట మధ్యకు చేరడానికి రోడ్డు ఉంది. ఇక్కడే వారు నిర్మించిన స్వయంభూ శివాలయం కూడా ఉంది. ఈ దేవాలయానికి కూడా నాలుగు వైపులా ద్వారాలు నిర్మించారు.

ఓరుగల్లు నగరాన్ని వివిధ వాడలుగా విభజించారు. ఒక్కో వాడలో ఒక్కో రకమైన వృత్తిపని వారు నివసించేవారు.

- మీ గ్రామం లేదా పట్టణ రేఖాచిత్ర పటం గీసి, ఓరుగల్లు పటంతో పోల్చండి.
- ఆధునిక నగరాలు / పట్టణాలకూ, నాటి ఓరుగల్లు నగరాల మధ్య మీరు గమనించిన ముఖ్య భేదాలు ఏమిటి?
- పటంలో ఇచ్చిన స్కేలు ఆధారంగా, ఓరుగల్లు బయటి కోట వెడల్పు తూర్పు నుంచి పడమరకు ఎంత ఉందో కనుక్కోండి.
- రాతికోట లోపలివైపు ఉత్తరంనుంచి దక్షిణానికి వెడల్పు ఎంతో కనుక్కోండి.
- మీరు ఎప్పుడైనా వరంగల్లు నగరానికి వెళ్ళినట్లయితే మీరు చూసినవి, మీ తరగతిలోని మిత్రులకు వివరించండి.
- స్వయంభూశివుడు కాకతీయుల వంశ దైవం. కోట మధ్యలో రాజభవనాలు లేదా అంగళ్లు నిర్మించకుండా దేవాలయాన్నే ఎందుకు నిర్మించారని భావిస్తున్నారు?

కాకతీయులు శక్తిమంతులైన పాలకులైన తర్వాత చాలామంది నాయకులు కాకతీయుల ఆధిపత్యాన్ని అంగీకరించారు. కాకతీయులు తమ సామంత పాలకుల మీద విదేశీయులదాడులను నియంత్రించడంతో పాటుగా తాము చేసే దండయాత్రల్లో సామంతులను కూడా భాగస్వాములను చేశారు. పరిస్థితులను బట్టి సామంతులు స్వతంత్ర కాంక్షతో తిరుగుబాటు చేయగా, కాకతీయులు ఆ తిరుగుబాట్లను అణచడానికి సైన్యాన్ని పంపేవారు.



*చిత్రం-12.2: గుర్రపు స్వారీ చేస్తున్న రాణి రుద్రమదేవి*
*(హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించిన ఆధునికశిల్పం)*

## రుద్రమదేవి


మీరు ఎప్పుడైనా అత్యంత ధైర్యసాహసాలు గల మహిళా పాలకురాలైన రుద్రమదేవి గురించి విన్నారా? ఆమె తన శక్తిసామర్థ్యాలతో ప్రతి ఒక్కరిని మెప్పించి దిగ్విజయంగా పాలనా వ్యవహారాలను నిర్వహించారు. ప్రఖ్యాత కాకతీయ వంశానికి చెందిన రుద్రమదేవి ఓరుగల్లు (నేటి వరంగల్లు) రాజధానిగా పరిపాలించారు. సా.శ.1262 నుండి 1289 వరకు సుమారు 27 సంవత్సరాల పాటు చక్కటి పరిపాలన చేసారు. మన దేశంలో మహిళాపాలకులు చాలా అరుదు. రాణి రుద్రమదేవికి కొద్దికాలంముందే సుదూరంలో ఉన్న ఢిల్లీని రజియా సుల్తానా అనే మహిళ పరిపాలించారు. ప్రభువర్గాలకు చెందిన వారు స్త్రీపరిపాలన ఇష్టం లేక ఆమెను పాలకురాలిగా అంగీకరించక తుదముట్టించారు. ప్రముఖ ఇటాలియన్ యాత్రికుడైన మార్కోపోలో రుద్రమదేవి రాజ్యాన్ని సందర్శించి, ఆమె పరిపాలన, ధైర్యసాహసాలను కొనియాడాడు. ఆమె పురుషుల దుస్తులు

SCERT, TELANGANA

ధరించి నిర్భయంగా, సునాయాసంగా గుర్రాల స్వారీ చేసేవారని పేర్కొన్నాడు. నాటి శాసనాలలో రుద్రమదేవి 'రుద్రదేవ మహారాజు'గా కీర్తించబడింది. రజియా సుల్తానా లాగా రుద్రమదేవి కూడా తన తండ్రి పాలనాకాలంలోని ముఖ్యమైన నాయకుల వ్యతిరేకతను ఎదుర్కొన్నప్పటికీ వాటిని విజయవంతంగా అణచివేసింది. రుద్రమదేవి, ఆమె మనుమడైన ప్రతాపరుద్రుడి పాలనలో చెలరేగిన అనేక సామంత తిరుగుబాట్లను నియంత్రించడానికి పలు చర్యలు తీసుకొన్నారు. కాని రుద్రమదేవి సామంతులలో ఒకరైన కాయస్థ అంబదేవుడు తిరుగుబాటు చేయగా నల్గొండ జిల్లాలోని చందుపట్లలో జరిగిన యుద్ధంలో ఆమె ప్రాణాలు కోల్పోయింది.



*చిత్రం-12.3 వరంగల్లు లోపలి మట్టికోట భాగం, కుడివైపు కందకం*



*చిత్రం-12.4 పైనుంచి చూస్తే కనిపించే లోపలి రాతికోట తూర్పు ప్రవేశద్వారం వంక దారి, బయటి ఆవరణ కుడివైపున నగరానికి ప్రవేశించే రాజమార్గం*

COPY - TELANGANA

## నాయంకర విధానం:

రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు నైపుణ్యంగల అనేక యోధులను, శక్తిమంతులైన సామంత కుటుంబాల నుంచే కాకుండా, రాజభక్తిగల నాయకులను ప్రోత్సహించడానికి ఉన్నతస్థానం కల్పిస్తూ 'నాయక' బిరుదుతో నియామకం చేసుకొనేవారు. వీరి సేవలకు ప్రతిఫలంగా అనేక గ్రామాలలో శిస్తు వసూలు చేసుకొనే హక్కు కల్పించారు. ఈ గ్రామాలనే వారి 'నాయంకరలు'గా వ్యవహరించేవారు. వీటిపైన వచ్చే ఆదాయంతో నాయకుడు నిర్దేశించిన సైన్యాన్ని రాజు సేవకోసం పోషించేవాడు. ఇటువంటి గ్రామాలపై నాయకులకు శిస్తు వసూలు చేసుకొనే హక్కు శాశ్వతంగా ఉంచకుండా, తరచుగా కొత్త ప్రదేశాలకు మార్చేవారు. రాజుకు లేదా రాణికి విశ్వాసమున్నంత కాలం నాయకులు పదవిలో కొనసాగేవారు. రాజుకు వ్యతిరేకంగా జరిగే నాయకుల తిరుగుబాట్లను అణచడంలోను వీరు పాల్గొనేవారు. ఈ నియమాల ఆధారంగా రూపొందినదాన్నే నాయంకర విధానంగా పిలుస్తారు.



*చిత్రం-12.5 శివుడికి అంకితం చేసిన గొప్ప దేవాలయాల అవశేషాలు*

రుద్రమదేవి పాలనాకాలంలోని ఒక నాయకుడు వేయించిన శాసనంలోని కొంత భాగాన్ని చదవండి:

*"సా.శ. 1270 సం॥ సంక్రాంతి పర్వదిన సందర్భంగా, కాకతీయ రుద్రదేవ మహారాజు ప్రవేశద్వార సంరక్షకుడైన బొల్లినాయకుడు, 10 కొలతలు గల భూమిని కళ్యాణకేశవ దేవాలయ సేవకులకు క్రంజ గ్రామంలో తన స్వీయ నాయంకర పరిధిలోని భూమిని తన రాజైన రుద్రదేవ మహారాజుల గౌరవార్థం దానమిచ్చాడు."*

- బొల్లినాయకుడు రుద్రమదేవిని "రుద్రదేవ మహారాజు" అని ఎందుకు పిలిచాడు?

## వ్యవసాయాభివృద్ధి-దేవాలయాల నిర్మాణం :

కాకతీయులు చెరువులు, బావులు నిర్మించడంద్వారా పెద్ద మొత్తంలో భూమిని సాగులోకి తెచ్చారు. రాజకుటుంబీకులు, సామంతులతో పాటు, సమాజంలోని ధనిక వర్గంవారైన వ్యాపారస్థులు, వృత్తిపనివారు చెరువులు నిర్మించడం ద్వారా వ్యవసాయాభివృద్ధికి దోహదపడ్డారు. ఈవిధంగా మిట్ట పల్లాలతో కూడిన తెలంగాణా, రాయలసీమలలో వ్యవసాయ భూములు పెద్ద మొత్తంలో విస్తరించడానికి కృషి చేశారు.

కాకతీయులు పెద్ద మొత్తంలో విరివిగా దానాలు ఇవ్వడం ద్వారా దేవాలయాలను విస్తృత స్థాయిలో నిర్మించారు. రాజకుటుంబాలలోని ముప్పమాంబ, మైలమ్మ వంటి స్త్రీలు దేవాలయాల నిర్మాణానికి అధికంగా

*చిత్రం-12.6 రామప్ప గుడి*



SCERT, TELANGANA

భూములను దానాలు చేశారు. ఇతర సంపన్నవర్గాల స్త్రీలు కూడా దేవాలయాల అభివృద్ధికి భూదానాలతో పాటు, చెరువులు, గోవులు, నగదు, బంగారు ఆభరణాలు మొదలయినవి దానమిచ్చారు. దీనివల్ల నాటి సమాజంలో మహిళలకు ఆస్తులు, ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయులు వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడం వల్ల వ్యవసాయ ఉత్పత్తులు పెరగడమే కాకుండా పన్నుల రూపేణా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరింది.



*చిత్రం-12.7 శ్రీ అహిత గజకేసరి - కాకతీయుల కాలం నాటి బంగారు నాణెం*

**వ్యాపారం :**

నాటి పాలకులు, రాజులు, సామంత నాయకులు ఎక్కువగా తమ ఆదాయపు వనరులను వర్తకంమీద విధించే పన్నుల ద్వారా సమకూర్చుకునేవారు. ప్రత్యేకంగా విదేశీ వాణిజ్యం చేసే వర్తకులు ఓడరేవుల దగ్గర చెల్లించే సుంకాలు రాజ్య ఆదాయంలో అధిక భాగంగా ఉండేవి. కిందఇచ్చిన కాకతీయ గణపతిదేవుని కాలం నాటి మోటుపల్లి శాసనంద్వారా మరింత సమాచారం తెలుసుకుందాం.



*చిత్రం-12.8 మోటుపల్లి అభయ శాసనం*

*"గణపతిదేవుడు వేయించిన ఈ అభయశాసనం, విదేశీ వాణిజ్యం, ఖండాంతర వాణిజ్యం చేసే వర్తకులకు రక్షణ కల్పించింది. గతంలోని రాజులు తుఫానుల్లో ఓడలు కొట్టుకుపోయినప్పటికీ బలవంతంగా సుంకాలు వసూలు చేసేవారు. వ్యాపారుల బంగారం, ఏనుగులు, గుర్రాలు, ఆభరణాలు మొదలైనవి స్వాధీనం చేసుకొనేవారు. ఇలాంటి పరిస్థితుల నుండి వర్తకులకు రక్షణ కల్పిస్తూ, విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తూ మేం మా పేరు ప్రతిష్ఠల కోసం, పుణ్యం కోసం కరుణతో కేవలం నామమాత్రపు సుంకాలను విధిస్తున్నాం"* అని పేర్కొన్నారు.

ఈ శాసనంలో విదేశీ వ్యాపారం చేసే వివిధ వస్తువులపై వసూలు చేసే సుంకాలను వివరించారు.

- గతపాలకులు విదేశీ వ్యాపారం చేసే వర్తకులతో ఎలా వ్యవహరించేవారు?
- గణపతిదేవుడు వర్తకులకు ఎలాంటి అభయమిచ్చాడు?
- గణపతిదేవుడు విదేశీవర్తకులకు ఎందుకు భద్రత కల్పించాడు?

ఇటలీ యాత్రికుడైన మార్కోపోలో మోటుపల్లి రేవులను సందర్శించి ఇక్కడ నుండి వజ్రాలు, సాలెగూడుమాదిరి సన్నని నేత బట్టలు విదేశాలకు ఎగుమతి అయ్యేవని, వీటిని ధరించడానికి మోజుపడని విదేశీ రాజులు, రాణులు గానీ నాడు లేరని తెలిపాడు.

**కాకతీయుల పాలన - ముగింపు :**

సుమారు సా.శ.1190 ప్రాంతంలో ఢిల్లీ కేంద్రంగా కొత్త రాజ్యం స్థాపించబడింది. వీరు ఢిల్లీ సుల్తాన్‌లుగా పిలవబడ్డారు. వీరు టర్కిస్తాన్ నుండి వచ్చి రాజ్యస్థాపన చేశారు. వీరు శక్తివంతమైన సైన్యాన్ని ఏర్పరచుకొని ఉత్తరభారతదేశంలో అనేక రాజ్యాలపై ఆధిపత్యం సాధించి, దక్కన్‌వైపు కూడా తమ దృష్టిని మరల్చారు. సుల్తాన్ మహ్మద్‌బీన్ తుగ్లక్ కాకతీయ రాజ్యంపై దండయాత్ర చేసి ప్రతాపరుద్రుడిని యుద్ధంలో ఓడించాడు. దీంతో సా.శ.1323 సంవత్సరంలో కాకతీయ వంశ పాలన ముగిసింది.



SCERT, TELANGANA

కొంతకాలం తర్వాత కర్ణాటకలో రెండు కొత్త రాజ్యాలైన బహమనీ రాజ్యం, విజయనగర రాజ్యం అవతరించాయి. వాటి గురించి తరువాత పాఠంలో చదువుకుందాం.

**కులం అడ్డుగోడలను ఛేదించిన పల్నాటి వీరుల కథ :**

పల్నాటి వీరుల చరిత్రను సుమారు 14వ శతాబ్దం చివరిలో శ్రీనాథుడు రచించాడు. నాటి కాలంలోని యోధులు అవగాహనతో కలిసికట్టుగా బాధ్యతలు ఎలా నిర్వహించారో ఇది తెలుపుతుంది. ఇందులో ప్రధానపాత్రదారుడైన బాల చంద్రునికి నమ్మకస్తులైన, విభిన్న నేపథ్యాలు కలిగిన అనుచరులచే ఒక యుద్ధబృందం ఉండేది. అందులో ఒకతను బ్రాహ్మణుడు, మిగతావారు కమ్మరి, కంసాలి, చాకలి, కుమ్మరి, మంగలి వంటి వివిధ వృత్తులకు సంబంధించిన వారు. వీరు ఎంతో బాధ్యతగా అన్నదమ్ములుగా మెలిగేవారు. యుద్ధానికి వెళ్ళే ముందు బాలచంద్రుడి తల్లి ఈ సోదరుల కోసం స్వయంగా ఆహారాన్ని తయారు చేసేది. కాని వివిధ పాత్రలలో వడ్డించేది (మట్టి, ఆకు, కంచు మొదలైన పాత్రలు). ఈ వివక్షత బాలచంద్రుడికి నచ్చలేదు. యుద్ధవీరులకు కులంతో పనిలేదని బాలచంద్రుడు అంటాడు. నాటి ఆచారవ్యవహారాలను తిరస్కరిస్తూ తమ ఉమ్మడివిధికి గుర్తింపుగా 'సోదరు'లందరూ ఒకరి పాత్రలోనిది మరొకరు తిన్నారు.

**కీలకపదాలు:**

1) యోధులు　　2) నాయంకర విధానం　　3) సామంత　　4) చేతివృత్తుల వారు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

F5K4Q9

1) నాటి కాలంలోని యోధులను, ఆధునిక కాలంలోని సైన్యంతో పోల్చుతూ, వారిమధ్య మీరు గమనించిన భేదాలను తెల్పండి?
2) కాకతీయ రాజులు, సామంతులు వ్యవసాయాభివృద్ధికోసం చెరువులు తవ్వించారు. వాళ్ళు ఇప్పుడు పరిపాలన చేస్తే ఏమి చేసేవారు?
3) కాకతీయులు సామంతులను నియంత్రించడానికి లేదా అదుపులో ఉంచడానికి ఎలాంటి విధానాలు అవలంబించారు?
4) కాకతీయులు శక్తివంతమైన సామంత కుటుంబాల నుండి నాయకులను ఎందుకు నియమించలేదు?
5) ఆ కాలంలో స్త్రీలకు పరిపాలన ఎందుకు కష్టతరంగా ఉండేది? నేటి పరిస్థితులు తేడాగా ఉన్నాయా? ఎలా?
6) ఆనాడు శక్తివంతమైన వారు స్వంత భూములను కలిగి, ఇతర రైతుల నుండి, వర్తకుల నుండి, వృత్తి పనివారల నుండి సుంకాలు లేదా శిస్తు వసూలు చేసేవారు. నేడు శక్తివంతమైన వారు ఇలా చేయగలరా? కారణాలు తెలపండి.
7) 'నాయంకర విధానం' అంశం చదివి, వ్యాఖ్యానించండి.
8) 'స్త్రీలు కూడా పరిపాలనా సంబంధమైన వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించగలరు'– దీనిని నీవెలా సమర్థిస్తావు? ఎందుకు?

**ప్రాజెక్టుపనులు :**

1) ఏవైనా మూడు చరిత్ర వృత్తాంతాలను ప్రదర్శించడానికి క్లుప్తంగా నాటికలు తయారు చేయండి.
2) మీ గ్రామం/పట్టణం ఆవిర్భావం/పుట్టుక కథనాలు సేకరించండి. ప్రదర్శించండి.
3) మీ ప్రాంతంలోని పురాతన దేవాలయాన్ని సందర్శించి, దానిని ఎప్పుడు, ఎవరు నిర్మించారో కనుక్కోండి. అక్కడేమైనా శాసనాలున్నాయేమో చూడండి.

SCERT, TELANGANA

పాఠం 13

T5R7F8

# విజయనగర రాజులు

**యోధులు, సామంతరాజులు గ్రామాలను ఎలా తమ ఆధీనంలోకి తెచ్చుకున్నది వాటిని కాకతీయులు తమ ఆధీనంలోకి తీసుకొని విశాల సామ్రాజ్యాన్ని ఎలా స్థాపించారో గత పాఠ్యాంశములో తెలుసుకున్నాం. ఢిల్లీ సుల్తాన్‌లు వరంగల్లును జయించడంతో కాకతీయ సామ్రాజ్యం అస్తమించింది. అనంతరం ఔత్సాహిక యోధులైన నాయకులు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. అదే విజయనగర సామ్రాజ్యం లేదా కర్ణాటక సామ్రాజ్యంగా పిలవబడింది.**

విజయనగరం అంటే విజయాల నగరం అని అర్థం. కర్ణాటకలో తుంగభద్ర నది ఒడ్డున ఈ నగరాన్ని నిర్మించారు. దీనిని విద్యారణ్య స్వామి ఆశీస్సులతో సా.శ.1336 లో హరిహరరాయలు, బుక్కరాయలు స్థాపించారు. విజయనగర రాజులు విరూపాక్ష దేవుడిని కొలిచేవారు. విజయనగర సామ్రాజ్యం 300 సంవత్సరాలకు పైగా వర్ధిల్లింది. కాని ఒకే కుటుంబం పరిపాలించలేదు. హరిహరబుక్కరాయల తర్వాత సంగమ, సాళువ, తుళువ, అరవీటి వంశాలు ఒకరి తర్వాత మరొకరు పరిపాలించారు. అందులో కొందరు చక్రవర్తులు కన్నడ భాష మాట్లాడేవారు. కాని కృష్ణదేవరాయలు తెలుగు భాషకు సముచిత ప్రాధాన్యతనిచ్చాడు.

తుంగభద్ర నదికి ఉత్తరంగా కొన్ని కొత్త రాజ్యాలు వెలిశాయి. అవే బహమనీ రాజ్యాలు. మొదటగా ఇది మహా సామ్రాజ్యం. దాని ముఖ్య పట్టణం గుల్బర్గా. అనంతరం, సా.శ.1489–1520 కాలంలో ఐదు చిన్న రాజ్యాలుగా విడిపోయింది. వీటిలో బీజాపూర్, గోల్కొండ పెద్ద రాజ్యాలుగా అవతరించాయి. అందులో ఎక్కువ భాగం నేటి కర్ణాటక, తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ఉంది. ఈ రాజ్యాలను ఇరాన్, అరేబియా నుండి వచ్చిన సుల్తాన్‌లు, యోధులు పరిపాలించారు. ఈ రాజ్యాలన్నీ నిరంతరం యుద్ధాలు చేస్తూ, తమ రాజ్య విస్తరణకు ప్రయత్నించాయి. వీరు స్థానిక యోధులను, నాయకులను నియమించుకున్నట్లు గత అధ్యాయంలో చదువుకున్నాం. వారి ద్వారా గ్రామాలలో రైతులు, వ్యాపారస్తుల దగ్గర నుండి శిస్తు వసూలు చేసేవారు, గ్రామాలను అదుపులో ఉంచుకునేవారు.

**విజయనగర రాజులలో ముఖ్యులు**

హరిహరరాయలు (సా.శ.1336–1357)
మొదటి బుక్కరాయలు (సా.శ.1357–1377)
రెండవ హరిహరరాయలు (సా.శ.1377–1404)
రెండవ దేవరాయలు (సా.శ.1426–1446)
సాళువ నర్సింహరాయలు (సా.శ.1486–1491)
శ్రీకృష్ణదేవరాయలు (సా.శ.1509–1529)
అచ్యుతరాయలు (సా.శ.1529–1542)
అలియరామరాయలు (సా.శ.1543–1565)
వెంకటపతిరాయలు (సా.శ.1585–1614)

SCERT, TELANGANA

**మనకు ఎలా తెలుసు?**

విజయనగర చరిత్ర గురించి సమకాలీన గ్రంథాలు, రాతప్రతులు, శాసనాలు, నాడు నిర్మించిన భవనాలు, నిత్యజీవిత పరిపాలన, సామాజిక సంస్థలు అందించిన వివరాల ఆధారంగా తెలుసుకోవచ్చు. పలు దేశాల నుండి వచ్చిన పర్యాటకులలో ఇటలీ యాత్రికుడైన నికోలో కోంటి విజయనగరాన్ని సా.శ.1420 సంవత్సరంలో మొదటగా సందర్శించాడు. అబ్దుల్ రజాక్ అనే పర్షియన్ వర్తకుడు సా.శ.1443, పోర్చుగీసు యాత్రికులైన డొమింగో పెయిజ్ సా.శ.1520, న్యూనిజ్ సా.శ.1537లో సందర్శించి రాసిన రచనల ద్వారా విజయనగర చరిత్రకు సంబంధించిన విలువైన సమాచారం తెలుస్తోంది.

**విజయనగర పట్టణం :**

విజయనగర పట్టణాన్ని తుంగభద్ర నది ఒడ్డున నిర్మించారు. ఇక్కడ ప్రాచీన విరూపాక్ష, పంపాదేవి ఆలయాలు కలిసి ఉంటాయి. అబ్దుల్ రజాక్ తెలిపిన ప్రకారం నగరం ఏడు వలయాలతో ఏర్పడి, కోట గోడలు కలిగి ఉంది. అందులో కొన్ని కోటల నిర్మాణాన్ని పురావస్తు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

పోర్చుగీసు సందర్శకుడు పెయిజ్ నగరాన్ని ఇలా వర్ణించాడు. "రాజులు దుర్భేధ్యమైన కోట గోడలు, గోపురాలతో నగరాన్ని నిర్మించినట్లు తెలిపాడు. ఇలాంటి పటిష్టవంతమైన గోడలు మరెక్కడా లేవు. అందమైన భవనాలను కోట లోపల వరుసగా నిర్మించారు. విశాలమైన వీధులలో, అందమైన భవనాలలో ముత్యాలు, వజ్రాల వ్యాపారం జరిగేది. ప్రపంచంలోని అన్ని రకాల వస్త్రాలు అమ్మేవారు. సాయంత్రం పూట గుర్రాలు, కూరగాయలు, పండ్లు, కలప వస్తువుల సంత జరిగేది."

- కూరగాయలు, పండ్లు, గుర్రాలను సాయంత్రం ఎందుకు అమ్మేవారు?



**చిత్రం-13.1**
**తిరుమల దేవాలయంలో ప్రతిష్ఠించిన శ్రీకృష్ణదేవరాయలు మరియు ఇరువురు భార్యల కంచు విగ్రహాలు**

పురావస్తు శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం నగరం నాలుగు భాగాలుగా విభజించబడింది. మొదటి భాగంలో గుట్టలపైన ఆలయాలు నిర్మించారు. రెండవ భాగంలో పంట భూములు, కాల్వలు, మూడవ భాగంలో అంత:పుర భవనాలు, రాజ భవనాలు, ముఖ్య నాయకుల నివాసాలు, నాల్గవ భాగంలో సామాన్య ప్రజలు నివసించేవారు. ప్రతి విభాగాన్ని వేర్వేరుగా చూపించే పటం కింద ఉంది.

- విజయనగరం, వరంగల్లు పట్టణాల మధ్య భేదాలను, పోలికలను గుర్తించండి.

SCERT, TELANGANA




*పటం-1 : విజయనగర పట్టణం*

- ఆధునిక నగరాలలో ఈ రకమైన కోటగోడలు ఎందుకు నిర్మించడం లేదు?

**సైన్యం – సైనిక అధికారులు :**

యుద్ధాలలో శక్తివంతమైన సైనికులు ఎలా పోరాడుతున్నారో మీరు విని, చదివే ఉంటారు.

- దేశాల సైన్యాన్ని ఏది శక్తివంతం చేస్తుందని మీరు భావిస్తున్నారు?
- ఆధునిక సైనికులు వాడే ఆయుధాలు, యుద్ధ సామాగ్రి ఏవి?

మనమిప్పుడు విజయనగర రాజుల కాలంలో ఉపయోగించిన యుద్ధ సామాగ్రి గురించి తెలుసుకుందాం.

విజయనగర రాజులు సైనిక శక్తిని బలోపేతం చేయడానికి పెద్ద మొత్తం ఖర్చు చేశారు. అరేబియా, ఇరాన్ దేశాల నుండి మేలి రకం గుర్రాలను పశ్చిమ తీరంలోని ఓడల ద్వారా దిగుమతి చేసుకున్నారు. సైనికులను నియమించుకున్నారు. కోట గోడలు పటిష్టవంతంగా నిర్మించారు. రెండవ దేవరాయలు ముస్లిం పోరాట యోధులను నియమించి వారికి నూతన యుద్ధతంత్రాలు నేర్పించాడు. వారికి సైనిక శిబిరంలో మసీదులు కూడా నిర్మించాడు. ఆ రోజుల్లోనే తుపాకులను, ఫిరంగులను ప్రవేశపెట్టాడు. విజయనగర రాజులు తమ బలగాలతో వాటిని అందుబాటులోకి తెచ్చుకున్నారు. భారతదేశంలోనే ఆధునిక అశ్వదళం, సైనిక దళాలను రెండింటిని కలిపి ఒక శక్తివంతమైన సైన్యాన్ని ఏర్పరిచాడు.

- ఆ రోజుల్లో వేగవంతంగా కదలడానికి అశ్వదళాలను ఉపయోగించారు. వాటి స్థానంలో నేడు వేటిని ఉపయోగిస్తున్నారు?
- ఏనుగులు నిదానంగా కదులుతూ శత్రు శిబిరాలలో దాడులు చేయడంలో శక్తివంతమైనవి. ప్రస్తుతం వాటి స్థానంలో ఏమి ఉన్నాయి?

**సైనిక దళాల నాయకుడు–అమరనాయకుడు :**

మొత్తం రాజ్యాన్ని సైనిక అధికారులే పరిపాలనా నియంత్రణ చేసేవారు. వారు ఎవరు, వారు ఏమి చేసేవారో మనం ఇప్పుడు తెలుసుకుందాం. పోర్చుగీసు యాత్రికుడైన డోమింగో పెయిజ్ శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగరం సందర్శించినప్పుడు పేర్కొన్న విషయాన్ని చదవండి.

"రాజు వద్ద గల లక్షల కొద్ది బలమైన సైన్యంలో 35,000 అశ్వదళం, ఏ సమయంలోనైనా, ఎక్కడైనా యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండేవారట. అందువల్ల ఆయన అంటే ఇతర రాజులకు భయం.

"ప్రభువు వర్గం నుండే సైనికదళ అధికారులను నియమించేవారు. వీరికి రాజ్యంలోని పట్టణాల మీద, నగరాల మీద, గ్రామాల మీద విస్తృతమైన అధికారం ఉండేది. వీరిలో కొందరు లక్షల కొద్దీ బంగారు నాణాలు పన్నులుగా వసూలు చేసుకొనేవారు. మరికొందరు రెండు

SCERT, TELANGANA



చిత్రం-13.2 హజార రామాలయంలో రాతి రథం

వందల, మూడు వందల, ఐదు వందల, వేయి చొప్పున నాణాలను వసూలు చేసుకొనేవారు. సైనిక దళాధిపతి నిర్వహించే సైన్యం ఆధారంగా (పదాతి, అశ్వదళ, గజ) బంగారు నాణాల వసూళ్ళను రాజు నిర్ణయించేవాడు. ఇటువంటి సొమ్మును నాయకుడు పదాతి దళాలు, గుర్రాలు, ఏనుగుల పోషణకోసం ఖర్చు పెట్టేవారు. ఏ సమయంలోనైనా వీటిని యుద్ధానికి సంసిద్ధంగా నిలిపేవారు. ఇదే కాకుండా రాజుకు వార్షిక చెల్లింపులు, బహుమానాలు సమర్పించుకునేవారు. దళాధిపతులు, నాయకుల సైన్యంతో పాటు రాజుకి సొంతసైన్యం తోడుండేది. వీరికి రాజే జీతభత్యాలు చెల్లించేవాడు.”

పై విషయాల ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులివ్వండి:

- శ్రీకృష్ణదేవరాయలు అంటే ఇతరులకు ఎందుకంత భయం?
- విజయనగర సామ్రాజ్యంలో గ్రామాలను, పట్టణాలను ఎవరు నియంత్రించేవారు?
- అందరూ సమానంగా ఆదాయం పొందేవారా?
- నాయకులు పొందిన గ్రామాల ఆదాయం నుండి ఎలాంటి ప్రతిఫలాలు రాజులకు చెల్లించేవారు?
- నాయకుల సైన్యంపైనే రాజు ఆధారపడేవాడా?

సైనిక దళాధిపతులను నాయకులుగా కూడా నియమించేవారు. వీరినే అమరనాయకులుగా పిలిచారు. వీరికి 'అమరం'పైన ఆదాయం వసూలు చేసే బాధ్యతను అప్పజెప్పేవారు. అమరం అంటే నిర్ణీత ప్రాంతంపై రెవెన్యూ శిస్తు వసూలు చేసే అధికారం. అంటే వీరికి ఇచ్చిన గ్రామాలు, పట్టణాల నుండి రెవెన్యూ వసూలుచేసుకొని, ఉపయోగించుకొనే అధికారం ఉంటుంది. అంతేకాకుండా ఆదాయంతో సైనిక దళాలను పోషించే బాధ్యత కూడా వీరికి ఉండేది. వీరి ఆధీన ప్రాంతాలపై పరిపాలన, న్యాయపరమైన అధికారాలను కలిగి ఉండేవారు. నేరస్థులకు చట్టపరమైన కఠిన శిక్షలు అమలు చేసే అధికారం కూడా వీరికిఉంది. ఇది నాటి ఢిల్లీ సుల్తానుల పరిపాలనకు దగ్గరగా ఉండేది. వారు కూడా 'ఇక్తా'ల అధికారులైన 'అమీర్'లకు రెవెన్యూ వసూలు చేసుకునే అధికారం కల్పించారు.

చాలా మంది అమరనాయకులు తెలుగు వీరులే. వీరు సొంత గ్రామాలనుండి లేదా వారి బంధువుల నుండి సైనికులను నియమించుకొని శిక్షణ ఇచ్చేవారు. ఈ సైనికులు రాజు కంటే నాయకులకే విధేయులై ఉండేవారు. శక్తివంతమైన నాయకులైన సాళువ నర్సింహ లేదా నరసనాయకుడు విశాల భూభాగంపై అధికారాన్ని పొంది కొన్ని సందర్భాలలో విజయనగర రాజులకు సవాలుగా నిలిచేవారు. ఒకవేళ రాజు చనిపోతే రాజ్యాన్ని శక్తివంతమైన నాయకులు తమ చేతుల్లోకి తీసుకొని తమనితాము రాజుగా ప్రకటించుకొనేవారు.

SCERT, TELANGANA

**మనమిప్పుడు పోల్చుదాం :**

మీరు చోళ రాజుల గురించి చదివారు. వారు భూమి శిస్తును మండళ్ళ ద్వారా ఎలా వసూలు చేశారనేది తెలుసుకున్నారు. కాని విజయనగర సామ్రాజ్యం అమరనాయకులతో సైనికంగా బలపడింది. గ్రామాలు, పట్టణాలు మొత్తం వీరి అజమాయిషీలోనే ఉండేవి.

- నేటి గ్రామాలలో అమరనాయక వ్యవస్థ ఉండి ఉంటే దాని ప్రభావం ఎలా ఉండేది? మీ తరగతిలో చర్చించండి.
- మన దేశంలో నేడు గ్రామ/పట్టణ పరిపాలన ఎలా నిర్వహిస్తున్నారో 6వ తరగతిలో చదివారు. దీనిని విజయనగర పాలనతో పోల్చండి. భేదాలను తెలపండి.

**శ్రీకృష్ణదేవరాయలు : గొప్పపాలకుడు.**

శ్రీకృష్ణదేవరాయలు సా.శ.1509 నుండి 1529 వరకు పరిపాలించాడు. బహమనీ సుల్తానులు, గజపతులకు (ఒడిషా) వ్యతిరేకంగా విజయనగర సైన్యాన్ని విజయవంతంగా నడిపించిన గొప్ప యోధుడు. ఇతనికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాలలోని నాయకులను అణచివేశాడు. ఈవిధంగా సామ్రాజ్యంపై ఆధిపత్యం సంపాదించాడు. ప్రత్యేకంగా దక్షిణ ప్రాంతం, కృష్ణా నది తూర్పు తీర ఓడరేవులపై నియంత్రణ సాధించాడు.

ఇదే సమయంలో పశ్చిమ తీరంలో గోవాలో పోర్చుగీసువారు ఓడరేవులవద్ద స్థావరాలు ఏర్పరచుకొని నియంత్రణ సాధించారు. కృష్ణదేవరాయలు వీరితో స్నేహపూర్వక సంబంధాలు నెలకొల్పాడు. ప్రత్యేకంగా గుర్రాలు, పేలుడు సామాగ్రిని వారి నుండి పొందడానికి ఇలా చేశాడు. తన సైన్యంలో పోర్చుగీసు దళాలను చేర్చుకున్నాడు. వారితో దళాలను కూడా ఏర్పాటు చేశాడు.

ప్రతి సంవత్సరం విజయదశమి నాడు పెద్ద ఎత్తున పండుగ జరిగేది. సైనిక దళ ప్రదర్శన నిర్వహించేవారు. ఇది పెద్ద ఎత్తున సైనిక కవాతుతో ముగిసేది. ఆ రోజున అమరనాయకులు, ప్రముఖులు, చక్రవర్తికి కానుకలు, కప్పం చెల్లించేవారు. కృష్ణదేవరాయలు తమ సామ్రాజ్యంలో గల దేవాలయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించేవారు. వారు స్వయంగా తిరుపతి, శ్రీశైలం, అహోబిలం సందర్శించేవారు. చాలా దేవాలయాలకు పెద్ద మొత్తంలో విరాళాలు సమర్పించేవారు.

శ్రీకృష్ణదేవరాయల శాసనాలలో పేర్కొన్న విధంగా అనేక యుద్ధాలలో విజయం పొంది లభించిన ధనరాశులను దక్షిణ భారతదేశంలోని పెద్ద పెద్ద దేవాలయాలకు పంచిపెట్టాడు. ఈ దేవాలయాలలో ఇతని



*చిత్రం-13.3 హజార రామాలయం కుడ్యఫలకం : దీని ఆధారంగా నీవు ఒక కథ రాయగలవా?*



*చిత్రం-13.4 కాంచీపురంలోని ఏకాంబరేశ్వర ఆలయ గోపురం*

గౌరవార్థం 'రాయగోపురం' అనే ఎత్తయిన ఆలయ ముఖద్వారాలను నిర్మించారు. ఈ రకమైన దానశీలత వల్ల దక్షిణ భారతదేశంలోని ప్రజలలో అతని పేరు చిరకాలంగా గుర్తుంచుకునేటట్లు చేసింది. విజయనగర పట్టణంలో కూడా కొన్ని సుందర దేవాలయాలను నిర్మించాడు.

శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా తెలుగు సాహిత్యంలో కవి. అతడు 'అండాళ్' అనే తమిళ భక్త కవయిత్రి జీవితం ఆధారంగా 'ఆముక్తమాల్యద' గ్రంథం రాశాడు. వీరికాలంలో అల్లసాని పెద్దన, ధూర్జటి, తెనాలి రామకృష్ణుడు, ముక్కు తిమ్మన, పింగళి సూరన, రామరాజ భూషణుడు, మాదయగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు వంటి "అష్ట దిగ్గజాలు" రాయల కొలువును అలంకరించారు.


శ్రీకృష్ణదేవరాయలు వారసులైన అచ్యుతదేవరాయ, ఆళియ రామరాయల కాలంలో విజయనగర రాజుల ప్రాబల్యం మరింతగా పెరిగింది. వీరు బహమనీ సుల్తానుల రాజ్య వ్యవహారాలలో జోక్యం చేసుకొన్నారు. వీరి నిరంతర జోక్యం ఫలితంగా ఆందోళన చెందిన ఐదుగురు బహమనీ సుల్తానులు సా.శ.1565లో ఏకమై రక్కసి తంగడి యుద్ధం లేదా తళ్లికోట యుద్ధంలో రామరాయలను ఓడించి, విజయనగర పట్టణాన్ని దోచుకొని సర్వనాశనం చేశారు. అనంతరం వచ్చిన వారసులు రాజధానిని తిరుపతికి సమీపంలోని చంద్రగిరికి తరలించారు. కాని పూర్వ వైభవాన్ని సాధించలేకపోయారు. కొంత ప్రాంతాన్ని సుల్తానులు ఆక్రమించుకోగా మిగిలిన భూభాగాలపై నాయకులు స్వతంత్ర రాజులుగా ప్రకటించుకున్నారు.

**గోల్కొండ కుతుబ్‌షాహీలు-1512-1687**

| కుతుబ్‌షాహి - కాలక్రమ పట్టిక | |
|---|---|
| కులీ కుతుబ్ షా | (1512-1543) |
| జంషెడ్ కులీ | (1543-1550) |
| ఇబ్రహీం కుతుబ్ షా | (1550-1580) |
| మహ్మద్ కులీ కుతుబ్ షా | (1580-1612) |
| మహ్మద్ కుతుబ్ షా | (1612-1626) |
| అబ్దుల్లా కుతుబ్ షా | (1626-1672) |
| అబుల్ హసన్ తానాషా | (1672-1687) |

తెలంగాణ ప్రాంతంలోని కాకతీయ సామ్రాజ్యం గురించి, మనం ఇంతకు ముందు పాఠంలో చదివాం. కాకతీయ సామ్రాజ్యం అంతమైన తరువాత కొందరు సామంతరాజులు స్వతంత్ర రాజ్యాలను స్థాపించారు. వాటిలో రాచకొండ, దేవరకొండ వెలమ రాజ్యాలు చాలా బలమైనవి. ఇవి విజయనగర చక్రవర్తుల, బహుమని సుల్తాన్‌ల అధికారాన్ని సవాలు చేశాయి. తెలంగాణా ప్రాంతంలో బహమని సుల్తాన్‌ల గవర్నర్ అయిన కులీకుతుబ్‌షా 1512లో స్వతంత్రాన్ని ప్రకటించుకొని, గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యాన్ని స్థాపించాడు. కులీకుతుబ్‌షా వరంగల్, కొండపల్లి, ఏలూరు, రాజమండ్రి కోటలను ఆక్రమించుకొని తన పరిపాలనను విస్తరించాడు. గోల్కొండ రాజ్యంలో తెలంగాణ ప్రధాన భాగంగా ఉండేది. ఆయన తర్వాత వచ్చిన రాజులు 1687 వరకు పరిపాలించారు.

SCERT, TELANGANA




*పటం-2 : కుతుబ్ షాహీ సామ్రాజ్యం*

సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్ షా (1550-80) తెలుగు సాహిత్యాన్ని పోషించి బ్రాహ్మణులను, దేవాలయాలను ఆదరించాడు. సింగరాచార్యులు, అద్దంకి గంగాధరుడు, కందుకూరు రుద్రకవి మరియు పొనగంటి తెలగనార్యులకు ఇబ్రహీం కుతుబ్‌షా పోషణ లభించింది. ఇబ్రాహీం కుతుబ్‌షా కాలంలోని ప్రముఖ తెలుగు కవులు. వీరు ఇబ్రాహీం కుతుబ్‌షాను మల్కిభరాముడని ప్రశంసించారు. కాకతీయ రాజులవలె పెద్దఎత్తున, నీటి పారుదల సౌకర్యాలు కల్పించాడు. ప్రతాపరుద్రుని వద్ద సేవలందించిన కాకతీయ సైన్యంలోని ప్రముఖులను తన సేవలలోకి తీసుకున్నాడు. వ్యవసాయ రంగంలో వారికి స్వతంత్ర ప్రతిపత్తినిచ్చాడు. కోటల నిర్వహణ బాధ్యతలను వారికే అప్పగించాడు.

అనతికాలంలోనే కుతుబ్ షాహి పాలకులు ప్రాంతీయ జీవావరణాన్ని అర్థం చేసుకుని తెలంగాణ ముఖ్య భాగంలో వ్యవసాయ ఆధారాన్ని విస్తృత పరచటానికి కాకతీయ సాగునీటి విధానాన్ని కొనసాగించాలని అనుకున్నారు. రాజధాని గోల్కొండలో నివసిస్తుండటం వల్ల ఇబ్రహీం కుతుబ్ షా పాలనలో 1562లో హుస్సేన్ సాగర్ చెరువు నిర్మించారు. దాని రేఖాచిత్ర తయారీ (డిజైన్)లో సహకరించిన సూఫి సంతు హజరత్ హుస్సేన్ షా వాలి పేరు మీద దానికి ఆ పేరు పెట్టారు. అది మూసి నది నీటితో నిండి ఉండి, సంవత్సరం పొడవునా నీరు ఉండే కృత్రిమచెరువు. అది హైదరాబాదుకి ప్రధాన మంచినీటి వనరుగా మారింది. ఇబ్రహింపట్నం దగ్గర మరొక చెరువుని కూడా అతడు నిర్మించాడు. మూసి నదిపైన అతడు నిర్మించిన 'పురానా పుల్' (పాత వంతెన) కూడా చాలా ప్రఖ్యాతి పొందింది.

ఇబ్రహీం కుమారుడైన మహ్మద్ కులీ గొప్ప భవన నిర్మాత. హైదరాబాద్ నగరాన్నీ ప్రణాళిక బద్ధంగా

SCERT, TELANGANA

నిర్మించాడు. హైదరాబాదు నగరానికి మీర్ మోమిన్ అస్తరాబాది వాస్తుశిల్పి. కులి కుతుబ్‌షాకి వజీరుగా చార్మినార్‌కి, దానితోపాటు కొత్త రాజధాని రేఖా పటాలు గీయటంలో అతడు ముఖ్య పాత్ర పోషించాడు. ముహమ్మద్ కులీ కుతుబ్‌షా మక్కా మసీద్, జమా మసీద్‌లను నిర్మించాడు. మక్కాలోని అతి పెద్ద మసీదు నమూనాలో దానిని నిర్మించాడు.


చిత్రం-13.5 చార్మినార్

మక్కానుంచి తెచ్చిన మట్టితో కులీ కుతుబ్‌షా ఇటుకలు తయారు చేయించి వాటిని మసీదులోని మధ్య గోపుర నిర్మాణానికి ఉపయోగించాడు. కాబట్టి మసీదుకి ఆ పేరు వచ్చింది. మసీదులోని ఒక గదిలో ప్రవక్త మొహ్మద్ వెంట్రుకలు కూడా ఉన్నాయి. హైదరాబాదుకి ప్రఖ్యాత చిహ్నంగా మారిన చార్మినార్‌ని కూడా ముహమ్మద్ కులీ కుతుబ్ షా కట్టించాడు. ఈయన పర్షియా మరియు ఉర్దులో మంచికవి. ఈయన కృషి వలననే దక్కనీ ఉర్దు, గ్రాంథిక భాష స్థాయి పొందినది.

హయత్ బక్షీ బేగం ముహమ్మద్ కులీ కుతుబ్ షా కూతురు. హైదరాబాదుకి సమీపంలోని హయత్‌నగర్‌లో ఆమె హయత్ బక్షీ మసీదు కట్టించింది. ఆమెని మా సాహెబా అని పిలిచేవాళ్ళు. ఈమె పేరుపై కానమ్ ఆగా అనే ఆవిడ తలాబ్ నూ సాహిబా అనే చెరువు తవ్వించింది. కాలక్రమంలో మాసాబ్ చెరువు (మాసాబ్ ట్యాంక్)గా రూపాంతరం చెందింది.

అబ్దుల్లా కుతుబ్‌షా కవిత్వము, సంగీతం పట్ల మక్కువ గలవాడు. పదకవితలు రాసే క్షేత్రయ్యను ఆహ్వానించి సత్కరించాడు. అబుల్ హసన్ తానీషా కుతుబ్ షాహీ వంశంలో చివరివాడు. ఈయన కంచెర్ల గొపన్నను పాల్వంచ తాలుకాకు తహసిల్దార్‌గా నియమించాడు. ఇతనినే రామదాసుగా పిలుస్తారు. రామదాసు ప్రజాధనాన్ని భద్రాచలంలో శ్రీరాముని దేవాలయ నిర్మాణానికి ఉపయోగించాడని, శ్రీరాముడు, సీత, లక్ష్మణులకు నగలు చేయించి రామదాసు ప్రజాధనాన్ని మళ్ళించాడనే అభియోగంపై తానీషా ఆయన్ని జైలులో బంధించాడు. వాస్తవాలను గ్రహించిన తానీషా రామదాసును బంధవిముక్తిడిని చేశాడు.

కుతుబ్ షాహీల కాలంలో గోల్కొండ ప్రపంచ వ్యాప్తంగా వజ్రాలకు ప్రఖ్యాతిగాంచినది. వీరి పాలనలోనే మచిలీపట్నం, ప్రధాన ఓడరేవుగా ఉండేది. ఆగ్నేయాసియా, చైనా, పర్షియా, అరేబియా, యూరప్‌లతో వ్యాపారం సాగేది. కోస్తా ప్రాంతం నుండి గోల్కొండకు ఒంటెలు, బంగారం, వెండి, వంటివి వేర్వేరు దేశాల నుండి దిగుమతి అయ్యేవి.

హైదరాబాదులోని ప్రఖ్యాత గోల్కొండ కోటకి దగ్గరలో ఇబ్రహీంబాగ్‌లో కుతుబ్ షాహి పాలకుల ఏడు సమాధులు ఉన్నాయి. పెర్షియన్ హిందూ శైలిల మేళవింపుతో ఈ సమాధులు ఒక ప్రత్యేక భవన నిర్మాణ శైలిని కనబరుస్తాయి. మొఘల్ చక్రవర్తి అయిన షాజహాన్ కుతుబ్ షాహి సమాదుల నిర్మాణశైలికి అబ్బురపడి తాజ్ మహల్‌ని పాలరాతితో కట్టించాడు. కుతుబ్ షాహి సమాధులు అద్భుత పనితనంతో చెక్కిన రాళ్ళతో కట్టారు. వీటి చుట్టూ విశాలంగా తీర్చిదిద్దిన తోట ఉంది.

ఇబ్రాహిం కుతుబ్ షా కాలం నుండే సుసంపన్నమైన ఈ రాజ్యాన్ని ఆక్రమించుకోవాలని మొగలులు కన్నేశారు. చివరికి ఔరంగజేబు నాయకత్వంలో 1687లో గోల్కొండ కోటను ఆక్రమించుకొన్నాడు.

మొగలులు కుతుబ్ షాహీలను కలుపుకొని పోకుండా, స్థానికులను అధికారం నుండి తొలగించి బయటి వారిని నియమించారు. ఈ ప్రాంతం నుండి అధిక పన్నులు

SCERT, TELANGANA

వసూలుకై ఒప్పంద శిస్తు వసూలు పద్ధతిని అమలు చేశారు. దీని ప్రకారం వేలం పాటలో అత్యధికంగా పాడిన వ్యక్తికి పన్నువసూలు చేసే హక్కు ఉండేది. వీరిలో సాధారణంగా స్థానికంగా శక్తివంతులు లేదా వడ్డీ వ్యాపారులు ఉండేవారు. వీరు రైతులను, చేతి వృత్తుల వారిని అణచివేసి అధిక ఆదాయం పొందేవారు. దీనితో ప్రజలు నిరాశకు గురయ్యారు. దీనితో పాటు కరువు కాటకాల వలన ప్రజలు ఇతర ప్రాంతాలకు వలసలు వెల్లడం వలన జనాభా తగ్గింది.

*చిత్రం-13.6 గోల్కొండ కోట*



- కుతుబ్‌షాహీ రాజ్యం పటం చూసి గోల్కొండ, మచిలీపట్నం, భద్రాచలంలను గుర్తించండి.
- గోల్కొండ రాజ్యం మొగలుల పాలన తొలి రోజులలో క్షీణ దశలో ఉండి, తరువాత ఆర్థికంగా ఎందుకు ఎదిగిందని భావిస్తున్నావు?
- గోల్కొండ రాజుల కాలంలోని ప్రసిద్ధి చెందిన వజ్రపు గనులు, వాటి వర్తక వివరముల గురించి తెలుసుకోండి.

**కీలకపదాలు:**

1. అమరనాయక
2. అమీర్
3. ఇక్తా
4. పురావస్తు శాస్త్రవేత్తలు
5. రాయగోపురం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

X6H7W1

1) విజయనగర రాజులు ఓరుగల్లు మాదిరి పట్టణం మధ్యలో నివసించకుండా ప్రత్యేకంగా ఎందుకు నివసించారు?
2) అమరనాయకులు ఎందుకు శక్తివంతులుగా ఉన్నారు?
3) కాకతీయుల పాఠంలోని నాయంకరులు, ఈ పాఠంలోని అమరనాయకుల మధ్య భేదాలు, పోలికలు వివరించండి.
4) విజయనగర సైన్యం పశ్చిమ కోస్తా దిగుమతులపై ఎందుకు ఆధారపడి ఉంది?
5) శ్రీ కృష్ణదేవరాయలు తన రాజ్య బలోపేతానికి శత్రువులతో యుద్ధాలు చేశాడు. ఆ పట్టికను తయారుచేయండి.
6) తెలుగు సాహిత్యానికి విజయనగర రాజులు చేసిన సేవ ఎలాంటిది?
7) భారతదేశ పటంలో ఈ కింది ప్రాంతాలను గుర్తించండి.
   అ. హంపి ఆ. బీజాపూర్ ఇ. తిరుపతి ఆ. గోలకొండ ఉ. కంచి ఊ. తుంగభద్ర నది
8) తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన వివిధ రాజ్యాలను గూర్చి చర్చించండి.
9) గోల్కొండను పాలించిన కుతుబ్‌షాహిల వాస్తుశిల్ప, కళాపోషణను వివరించండి.

SCERT, TELANGANA

పాఠం 14

# మొగల్ సామ్రాజ్యం

P7D5E9


సా.శ. 1526లో బాబరు భారతదేశంపై దండెత్తడంతో మొగలుల పేరుతో ఒక కొత్త వంశం పాలన ప్రారంభమైంది. వారు సా.శ.1550 నుండి సా.శ.1707 మధ్య కాలంలో సామ్రాజ్యాన్ని స్థాపించి ఢిల్లీ మొదలుకొని భారత ఉపఖండమంతా మొగలులు తమ సామ్రాజ్యాన్ని విస్తరింపజేశారు. వీరి పరిపాలనా ఏర్పాట్లు, పాలనా విధానం, వాస్తు కళలు మొదలైనవి వీరి తదనంతరం కూడా చాలా కాలం వరకు రాజులను, వారి పరిపాలనా పద్ధతులను ప్రభావితం చేశాయి. ప్రస్తుతం స్వాతంత్ర్య దినోత్సవం రోజు భారత ప్రధానమంత్రి జాతిని ఉద్దేశించి ప్రసంగించే ఎర్రకోట మొగల్ చక్రవర్తుల నివాసమే.



జహాంగీర్ చిత్రం ఉన్న నాణెం

## మొగలులు ఎవరు ?

మొగలులు మధ్య ఆసియాలోని ఉజ్బెకిస్తాన్, మంగోలియా దేశాలకు చెందినవారు. మొట్టమొదటి మొగల్ చక్రవర్తియైన బాబర్ (1526–1530), ఇతర రాజ్యాల దండయాత్రల వల్ల పూర్వీకుల నుండి సంక్రమించిన సింహాసనాన్ని వదిలిరాక తప్పలేదు. చాలా కాలం సంచారంచేసి చివరకు సా.శ.1504లో కాబూల్‌ను వశపరచుకున్నాడు. 1526 లో ఢిల్లీ సుల్తాన్ ఇబ్రహీం లోడిని ఓడించి ఢిల్లీ, ఆగ్రాలను ఆక్రమించుకున్నాడు.



చిత్రం-14.1 ఎర్రకోట

SCERT TELANGANA

## ముఖ్యమైన మొగల్ చక్రవర్తులు - దండయాత్రలు, సంఘటనలు



**బాబర్ (సా.శ.1526-1530)**(ఎడమ)

సా.శ.1526లో ఇబ్రహీం లోడిని ఓడించి ఢిల్లీ, ఆగ్రాలను నియంత్రణలోకి తెచ్చుకొని రాజ్యస్థాపన చేశాడు.



(కుడి)**హుమయూన్ (సా.శ.1530-1556)**

హుమయూన్‌ను షేర్‌ఖాన్ ఓడించి, ఇరాన్‌కు తరిమేశాడు. ఇరాన్‌లో హుమయూన్ సఫావిద్ షా సహాయాన్ని పొందాడు. హుమయూన్ తిరిగి క్రీ.శ.1555లో ఢిల్లీని ఆక్రమించుకొన్నాడు. కాని తరువాత సంవత్సరంలోనే ఓ ప్రమాదంలో మరణించాడు.





**అక్బర్ (సా.శ.1556-1605)**(ఎడమ)

అక్బర్ చక్రవర్తి అయ్యేనాటికి అతని వయస్సు కేవలం 13 సంవత్సరాలే. అక్బర్ బెంగాల్, మధ్య భారతదేశాన్ని, రాజస్థాన్, గుజరాత్‌లను అతి కొద్దికాలంలోనే ఆక్రమించగలిగాడు. ఆ తర్వాత అతను ఆఫ్ఘనిస్తాన్, కాశ్మీర్, దక్కన్ పీఠభూమిలోని పలు ప్రాంతాలను ఆక్రమించాడు. పటం.1లో అతని సామ్రాజ్య విస్తరణను చూడండి.

(పైన)**జహంగీర్ (సా.శ.1605-1627)**

అక్బర్ ప్రారంభించిన దండయాత్రలు కొనసాగించాడు. పెద్ద ఆక్రమణలు ఏమీ జరపలేదు.

**షాజహాన్ (సా.శ.1627-1658)** (ఎడమ క్రింద)

దక్కన్ ప్రాంతంలో మొగలుల రాజ్య విస్తరణ కొనసాగించాడు. ఇతను సామ్రాజ్యంలోని స్థానిక ప్రభువుల, పాలకుల తిరుగుబాట్లను ఎదుర్కొన్నాడు. సా.శ.1657-1658లో సింహాసనం కోసం అతని కుమారుల మధ్య తీవ్ర సంఘర్షణలు జరిగాయి. ఔరంగజేబు తన ముగ్గురు సోదరులను ఓడించి చంపివేశాడు. షాజహాన్‌ను బందీ చేయడంతో శేషజీవితం ఆగ్రా జైలులో గడపవలసి వచ్చింది.



**ఔరంగజేబు (సా.శ.1658-1707)**(కుడి)

అస్సాంపై గెలుపు సాధించాడు. ఆఫ్ఘనిస్తాన్ మొదలుకొని అస్సాం, రాజస్థాన్, పంజాబ్, దక్కన్ మొదలగు యావత్ సామ్రాజ్యంలో అనేక తిరుగుబాట్లను ఎదుర్కొనవలసి వచ్చింది. గురుతేజ్ బహదూర్, గోవింద్‌సింగ్, శివాజీలు, తన కుమారుడైన అక్బర్ అతనికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవనెత్తారు. శివాజీ స్వతంత్ర మరాఠా సామ్రాజ్య స్థాపనలో సఫలీకృతుడయ్యాడు. ఔరంగజేబు సా.శ.1685లో బీజాపూర్‌ను, సా.శ.1687లో గోల్కొండను ఆక్రమించుకొన్నాడు. ఇతని మరణానంతరం సింహాసనం కోసం కుమారుల మధ్య సంఘర్షణలు ప్రారంభమైనాయి.



SCERT TELANGANA


**ఇతర రాజులతో మొగలుల సంబంధాలు :**

ఆనాడు భారతదేశమంతటా అనేక చిన్న చిన్న రాజ్యాలను స్థానిక రాజులు, పాలకులు పాలిస్తుండేవారు. మొగలులు వారిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించారు. వారు పాత రాజులను, పూర్వ రాజ్యాల పరిపాలన కొనసాగించేందుకు అనుమతించారు. వీరి ద్వారానే రెవెన్యూశిస్తు వసూలు చేయించేవారు. సామ్రాజ్యంలోని రాజ్యాల మధ్య యుద్ధాల నివారణకు చక్రవర్తి ఎప్పుడూ తన సైన్యంతో సిద్ధంగా ఉండేవాడు.

వీరి అధికారాన్ని అంగీకరించని రాజులపై నిరంతరం యుద్ధాలు చేయడం ద్వారా వారిని అదుపులో ఉంచారు. మొగలులు బలపడిన తరువాత చాలా మంది ఇతర రాజులు కూడా తమ సార్వభౌమత్వాన్ని వదిలి వారితో సత్సంబంధాలు ఏర్పరుచుకున్నారు. కొందరు రాజపుత్రులు మొగలులతో వివాహ సంబంధాలను కూడా ఏర్పరుచుకున్నారు. కాని కొంత మంది దీనిని వ్యతిరేకించారు. చిత్తోడ్‌కు చెందిన సిసోడియా రాజపుత్రులు చాలా కాలం పాటు మొగలుల అధికారాన్ని గుర్తించలేదు. తమ చేతిలో ఓడిన రాజులను కూడా గౌరవించి వారి భూభాగాల్ని మొగలులు తిరిగి అప్పగించేవారు. మొగలుల ముఖ్య ఉద్దేశం ఓడించడమే గాని శత్రువులను అవమానించడం కాదు. ఈ సమతుల్యత యొక్క ప్రభావం అనేక మంది రాజులపై బడింది. రాజకీయ వ్యూహంలో భాగంగా మొగలులు స్థానిక రాజకుమార్తెలను వివాహమాడారు. జహంగీర్ తల్లి రాజపుత్రరాజైన అంబర్ (నేటి జైపూర్) రాకుమార్తె. షాజహాన్ తల్లి రాజపుత్రులైన జోథ్‌పూర్ యువరాణి.

**మన్సబ్‌దార్లు, జాగీరుదార్లు :**

మొగల్ సామ్రాజ్యం బాగా విస్తరించడంతో పలు ప్రాంతాల నుండి ప్రజలను వివిధ ఉద్యోగాలలో నియమించారు. వీరిలో తురుష్కులు, ఇరానియన్‌లు, భారత ముస్లింలు, ఆఫ్ఘన్లు, రాజపుత్రులు, మరాఠాలు, ఇతరులు ఉన్నారు. వీరందరికి ఉద్యోగాలను కల్పించి మన్సబ్‌దార్లుగా భర్తీ చేసుకొని సైనిక హోదా కల్పించారు. వీరంతా చక్రవర్తి




పటం-1 : 1605లో అక్బర్ పాలించిన ప్రాంతం

SCERT, TELANGANA



*చిత్రం-14.2 మన్సబ్‌దారు సైనిక యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం*

ప్రత్యక్ష ఆధీనంలోనే ఉండేవారు. వీరు చక్రవర్తి భవంతిని కాపాడే బాధ్యతలు, ఓ ప్రాంతాన్ని పరిపాలించే బాధ్యతలు, కొత్త రాజ్యాలపై దండయాత్ర బాధ్యతలు లేక తిరుగుబాట్లను అణచివేసే బాధ్యతలు నిర్వహించేవారు.

ఈ మన్సబ్‌దార్లు ఎలాంటి సొంత నిర్ణయాలు తీసుకోకుండా, కేవలం చక్రవర్తి అభీష్టం మేరకు నడుచుకొనే విధంగా ఒక పరిపాలనా పద్ధతిని అభివృద్ధిపరిచారు. విజయనగర ప్రభువుల సామంతులుగా ఉన్న నాయక రాజులు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని చక్రవర్తిని సైతం ధిక్కరించే స్థాయిలో ఎలా బలపడ్డారో మీకు జ్ఞాపకం ఉండే ఉంటుంది. దీనిని నివారించడానికి మొగలులు ప్రతి రెండు లేదా మూడు సంవత్సరాలకు, వీరిని ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంత మన్సబ్‌దార్లుగా బదిలీ చేసేవారు. కాబట్టి ఏ మన్సబ్‌దారు కూడా స్థిరంగా ఒకే ప్రాంతంలో ఉండేవారు కాదు, వారు బలపడే అవకాశం కూడా ఉండేది కాదు.

మన్సబ్‌దారు నిర్ణీత సంఖ్యలో గుర్రపు రౌతులను, అశ్వికదళాన్ని పెంచి పోషించే బాధ్యతను కలిగి ఉండేవాడు. ప్రతి మన్సబ్‌దారు తన అశ్వికదళాన్ని సమీక్షించడానికి తీసుకువచ్చి వాటిని నమోదు చేయించి గుర్రాలకు ముద్రలను వేయించి జీతభత్యాలు పొందేవారు.

ఒక మన్సబ్‌దారు కుమారుడు మన్సబ్‌దారు కాలేడు. అంటే ఇది వంశపారంపర్యం కాదన్నమాట. మన్సబ్‌దారు కుమారుడు మన్సబ్‌దారు కాగలడో లేదో చక్రవర్తి మాత్రమే నిర్ణయిస్తాడు. అంతేకాక మన్సబ్‌దారు మరణానంతరం అతని యావత్ ఆస్తిని కూడా చక్రవర్తి జప్తు చేసుకొనేవాడు.

జాగీర్ల నుండి వచ్చే ఆదాయాల నుండి మన్సబ్‌దార్లు వారి జీతాలను తీసుకొనేవారు. ఇవి విజయనగర కాలపు "అమరనాయక" విధానాలను పోలి ఉంది. కాని అమరనాయక రాజుల మాదిరిగా చాలా మంది మన్సబ్‌దార్లు తమ జాగీర్లను పరిపాలించేవారు కాదు. అక్కడ నివసించే వారు కూడా కాదు. కేవలం తమ జాగీర్ల ద్వారా వచ్చే పన్నుల బకాయిలను మాత్రమే వసూలు చేసి చక్రవర్తికి పంపేవారు. వారి సేవకులు వసూలు చేస్తుంటే మన్సబ్‌దార్లు మాత్రం తమ పనులలో నిమగ్నమై ఉండేవారు. జాగీర్ పరిపాలనను చక్రవర్తిద్వారా నేరుగా నియమితులైన అధికారులు చూసుకొనేవారు. నిర్ణయించిన పరిమితి కన్నా ఎక్కువగా పన్నులు కట్టనవసరం లేదని రైతులకు ఈ అధికారులు అభయమిచ్చేవారు. ఈ జాగీర్లు కూడా ప్రతి రెండూ లేక మూడేళ్ళకు నిరంతరంగా ఒకరి నుండి మరొకరికి బదిలీ అవుతుండేవి.



SCERT, TELANGANA

అక్బర్ కాలంలో కూడా మన్సబ్‌దార్ల జీతానికి సరిపోయే విధంగా ఈ జాగీర్లను జాగ్రత్తగా లెక్కించి నిర్ణయించసాగారు. ఔరంగజేబు పరిపాలనా కాలంలో మన్సబ్‌దార్ల సంఖ్యను ఎక్కువగా పెంచాడు. కాని జాగీర్లను పొందడానికి చాలా కాలం వేచి చూడాల్సి వచ్చేది. పర్యవసానంగా జాగీర్ల కొరత ఏర్పడేది. దీని ఫలితంగా చాలా మంది జాగీరుదార్లు వారికి జాగీరు లభించినప్పుడు ఎంత వీలైతే అంత భారీగా వసూళ్ళకు పాల్పడేవారు. ఔరంగజేబు చివరి దశలో ఈ అక్రమ వసూళ్ళను ఆపలేకపోయాడు. ఫలితంగా రైతులు చాలా ఇబ్బందులకు గురి కావలసి వచ్చింది.

### జబ్త్ మరియు జమిందార్లు :

మొగల్ పాలకులకు ప్రధాన ఆదాయ వనరు వ్యవసాయ ఉత్పత్తులపై వేసే పన్ను. అక్బర్ ఆర్థికమంత్రి అయిన తోడర్‌మల్లు సా.శ.1570–1580 సంవత్సరాల మధ్యలో ఏ ప్రాంతం ఎంత వరకు పంటలు పండించడానికి యోగ్యమైనదో, ఏయే ప్రాంతాలలో ఏయే పంటలు పండిస్తారో, వాటి ధరలు వంటి వాటి మీద జాగ్రత్తగా సర్వేలను చేయించాడు. దీన్ని ఆధారం చేసుకొని ప్రతి పంటకు నగదు రూపంలో ఎంత పన్ను చెల్లించాలో నిర్ణయించాడు. ప్రతి ప్రాంతాన్ని రెవెన్యూ బ్లాకులుగా నిర్ణయించి, ప్రతి బ్లాకుకు ప్రత్యేక శిస్తు పట్టిక ఏర్పాటు చేసి కట్టవలసిన పన్నులు నిర్ణయించారు. ఈ రెవెన్యూ విధానాన్ని 'జబ్త్'గా వ్యవహరిస్తారు. మొగలుల పరిపాలనలో అధికారులు సర్వే చేసిన ప్రాంతాలలో ఈ పద్ధతి సాధ్యపడింది. కాని గుజరాత్, బెంగాల్ లాంటి ప్రాంతాల్లో ఇది సాధ్యపడలేదు.

చాలా ప్రాంతాల్లో గ్రామ పెద్ద ద్వారా రైతులు పన్నులు చెల్లించేవారు. పన్నులు వసూలు చేసి చెల్లించడానికి మధ్యవర్తులుగా సుముఖంగా ఉన్న స్థానిక పెద్దలు, పలుకుబడి గల ముఖ్యులు మొగలుల కాలంలో జమీందార్లుగా వ్యవహరించారు. వీరు చక్రవర్తి ద్వారా



1

2

*చిత్రం–14.3.1 లంచం తీసుకొంటున్న లంచగొండి అధికారి 14.3.2 పేదరైతులను శిక్షిస్తున్న పన్ను వసూలుదారు*

నియమింపబడేవారు కాదు. వంశపారంపర్యంగా తండ్రి నుండి కొడుకుకు అధికారాలు, బాధ్యతలు సంక్రమించేవి. వీరు సొంత బలగాలను పోషించుకునేవారు. భూమి శిస్తును వసూలు చేసినందుకు జమీందార్లకు శిస్తులో వాటా లభించేది. వీరు మొగల్ అధికారులతో గ్రామస్తుల తరపున సంప్రదింపులు జరపడానికి ప్రతినిధులుగా వ్యవహరించేవారు.

మరికొన్ని ప్రాంతాలలో వీరు అత్యంత శక్తివంతులై ఉండేవారు. మొగలుల పాలనలోని దోపిడి విధానాలు తిరుగుబాటుకు దారితీసాయి. కొన్నిసార్లు కులాల ఆధారంగా జమీందార్లు, రైతుల మధ్య సన్నిహిత సంబంధాలు కొనసాగి ఒక్కోసారి మొగల్ అధికారానికి ఎదురు తిరిగేవారు. ఇలాంటి జమీందార్ల తిరుగుబాట్లు 17వ శతాబ్ది చివరలో మొగల్ సామ్రాజ్య స్థిరత్వానికి సవాలుగా మారాయి.

- మన్సబ్‌దార్, జమీందార్‌కు మధ్యనున్న భేదాలేమిటి?
- చక్రవర్తి ఆధీనంలో ఎవరుంటారు?
- నాయక, మన్సబ్‌దార్ స్థానాలను పోల్చండి.

SCERT TELANGANA

## అక్బర్ విధానాలు :

అక్బర్ ప్రవేశపెట్టిన విధానాలన్నీ అక్బర్ మిత్రుడు, ఆస్థాన సభ్యుడైన అబుల్ ఫజల్ రాసిన 'అక్బర్ నామా' అనే పుస్తకంలో విస్తారంగా చర్చించబడినాయి. సా.శ. 1570 అక్బర్ ఫతేపూర్ సిక్రిలో (ఆగ్రాకు సమీపాన) నివసిస్తున్నప్పుడు మతం పట్ల చర్చ జరపడానికి ముస్లిం పండితులను, హిందూ పండితులను, రోమన్ క్యాథలిక్కులను, జొరాష్ట్రియన్లను ఆహ్వానించేవారు. ప్రజల విభిన్న సాంప్రదాయాలన్నా, మత విశ్వాసాలన్నా అక్బర్‌కు చాలా ఆసక్తి ఉండేది. విభిన్నమైన విశ్వాసాలు గల వారిని ఒక చోటుకు చేర్చాలని అక్బర్ తలచేవాడు. 'సుల్హ్-ఇ-కుల్' (ప్రపంచ శాంతి) అనే భావన అతని మనస్సులో మెదిలింది. ఇలాంటి సహనంతో కూడిన భావన ఇతని పాలనా కాలంలో భిన్న మతస్థుల మధ్య వివక్షత చూపే పద్ధతిని లేకుండా చేసింది. ఏదో ఒక పద్ధతి పట్ల లేక విశ్వాసం పట్ల కాక నీతి, నిజాయితీ, సమ న్యాయం, శాంతి వంటి యావత్ ప్రపంచానికి అన్వయించే సిద్ధాంతాలు ప్రవేశపెట్టాలని అక్బర్ సంకల్పించాడు. సుల్హ్-ఇ-కుల్ పద్ధతి ఆధారంగా రాజ్యపాలన అమలుపరచడంలో అక్బర్‌కు అబుల్ ఫజల్ సహాయపడ్డాడు. చక్రవర్తి ఏదో ఒక మతం, వర్గం, సాంఘిక స్థితి, కులం సంబంధాలకు అతీతంగా తన రాజ్య ప్రజలందరి క్షేమం కోసం పనిచేశాడు. జహంగీర్, షాజహాన్‌లు కూడా ఈ సిద్ధాంతాలు అవలంభించి పరిపాలించారు. కాని ఔరంగజేబు ఈ పద్ధతి నుండి వైదొలగి 'సున్నీ' ముస్లిం వర్గాన్ని అభిమానించసాగాడు. ఇతర మత ప్రజలు ఈ విషయం పట్ల తీవ్ర ఆందోళనకు గురైనారు.



చిత్రం-14.4 ఇబాదత్‌ఖానాలో వివిధ మత పెద్దలతో చర్చలు జరుపుతున్న అక్బర్

**సుల్హ్-ఇ-కుల్ :**

అక్బర్ కుమారుడైన జహంగీర్ సుల్హ్-ఇ-కుల్ గురించి ఇలా అన్నాడు:

*"ఈ విశాల దైవ కరుణలో అందరికి చోటు ఉంది. ఈ రాజ్యంలో అన్ని దిశలలో పరిమితి ఉంది. చుట్టూ సముద్రం తప్ప వేరే లేదు. ఇతర నమ్మకాలు, మతపెద్దలకూ మతస్థుల వారికీ నివాసముంది. మత వివక్షతకు దారేలేదు. సున్నీలు, షియాలు ప్రార్థనల కోసం ఒక మసీదులో కలిస్తే, క్రైస్తవులు, యూదులు చర్చిలో కలుస్తారు. అతను స్థిరంగా ప్రపంచ శాంతి (సుల్హ్-ఇ-కుల్) విధానాలను అవలంభించాడు."*

## 17వ శతాబ్దం తర్వాత మొగల్ సామ్రాజ్యం :

పరిపాలనా, సైనిక సామర్థ్యంతో మొగల్ సామ్రాజ్యం ఆర్థిక, వ్యాపార రంగాలలో మంచి అభివృద్ధి సాధించిందని చెప్పవచ్చు. విదేశీ యాత్రికులు, ప్రసిద్ధి చెందిన సంపన్న దేశమని వర్ణించారు. కాని సంపదతో పాటుగా దారిద్ర్యాన్ని కూడాచూసి వీరు బాధపడ్డారు. ఈ తారతమ్యాలు అబ్బురపరిచేవిగా ఉన్నాయి. షాజహాను 20వ పాలనా సంవత్సరంలో రాసిన అధికార పత్రం కింది విషయాలు తెలియజేస్తోంది: సామ్రాజ్యంలో మొత్తం మన్సబ్‌దార్లు 8,000 మంది ఉండగా వారిలో ఉన్నత శ్రేణికి చెందిన మున్సబుదారులు కేవలం 445 మంది మాత్రమే, అంటే 5.6 శాతం మాత్రమే. కాని వీరికి, వీరి ఉద్యోగులకు ఆదాయంలో 61.5 శాతం జీతభత్యాలు చెల్లించేవారట.

### సర్దార్ సర్వాయి పాపన్న



వరంగల్ జిల్లాకు చెందిన సర్వాయి పాపన్న తెలంగాణాలో మొఘలుల పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశాడు. ఈయన ఔరంగజేబు కాలంలో జీవించాడు.వెనుకబడిన, అణగారిన వర్గాల పేదల అభివృద్ధికోసం కృషి చేశాడు.

పాపన్న మొగలుల పరిపాలన నుండి తెలంగాణ ప్రాంతాన్ని సా.శ. 1687-1724 మధ్య ఆక్రమించుకొని వరంగల్ జిల్లాలో ఖిలాషాపూర్ కోటను నిర్మించి, దానిని రాజధానిగా చేసుకొన్నాడు.

మొగలుల అరాచకాలను అణచివేతను గమనించి, గొప్ప సైన్యాన్ని తయారు చేసి గెరిల్లా పద్ధతుల్లో శిక్షణ నిచ్చాడు.

పాపన్న నల్గొండ జిల్లాలోని భువనగిరి, కొలనుపాక, వరంగల్ జిల్లాలోని తాటికొండ, చేర్యాల, కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, హుజురాబాద్‌లోని కోటలను నియంత్రించాడు. తన పరిపాలనలో రాజ్యాన్ని విస్తరించడానికి సర్వాయిపేటలో తన మొదటి కోటను నిర్మించాడు. తాటికొండ, వేములకొండ, షాపురంలలో కూడా కోటలు కట్టించాడు. తాటికొండలో ప్రస్తుతమున్న 'చెక్‌డ్యాం' పాపన్న పరిపాలనాకాలంలో నిర్మించబడడం, ఒక పాలకుడిగా తన ఆధీనంలో ఉన్న ప్రాంతం యొక్క అభివృద్ధి పట్ల ఆయనకుగల దృష్టికోణానికి నిదర్శనం.

సుబేదార్లు, జమీందార్లు, భూస్వాములపై, గెరిల్లా దాడులు చేసి, యుద్ధానికి మరియు సైన్యానికి కావలసిన ధనాన్ని పోగుచేశాడు. పాపన్న యొక్క ప్రజాదరణకు సంబంధించిన వార్తలు ఔరంగజేబుకు చేరడంతో పాపన్నను అణచివేయమని రుస్తుమ్ దిల్‌ఖాన్‌కు సలహాఇచ్చాడు. రుస్తుమ్ దిల్‌ఖాన్, మొదటగా ఖాసీంఖాన్‌ను పంపించి పాపన్నతో పోరాటం చేసి, షాపురం కోటను ఆక్రమించుకోమన్నాడు. పాపన్న ఖాసింఖాన్‌ను ఓడించి చంపేశాడు. దీనితో రుస్తుం దిల్‌ఖాన్ స్వయంగా యుద్ధానికి దిగాడు. ఈ యుద్ధం దాదాపు 3 నెలలు సాగింది. చివరికి, రుస్తుం దిల్‌ఖాన్ యుద్ధం నుండి పారిపోయాడు. కాని పాపన్న తన స్నేహితుడు, అనుయాయుడైన సర్వన్నను కోల్పోయాడు.



సా.శ. 1707లో ఔరంగజేబు చనిపోయిన తర్వాత దక్కను సుబేదార్ అయిన కంబక్షఖాన్ దక్కన్‌పై నియంత్రణ కోల్పోవడం ప్రారంభమైనది. ఈ బలహీనమైన పరిపాలనను పాపన్న గమనించి, వరంగల్ కోటపై ఏప్రిల్ 1, 1708లో దాడిచేసి ఆక్రమించారు. తాటికొండ వద్ద, తర్వాత ఖిలాషాపురం వద్ద చాలాకాలం యుద్ధం జరిగింది. అక్కడి నుండి పాపన్న తప్పించుకున్నాడు. సా.శ. 1712లో అతన్ని పట్టుకొని శిరచ్ఛేదం చేశారు.

SCERT TELANGANA

మొగల్ చక్రవర్తులు వారి మనసబ్‌దార్లు ఆదాయంలో ఎక్కువ భాగాన్ని జీతాలకు, రోజువారీ అవసరాలకు, వస్తువుల కొనుగోలుకు వినియోగించేవారు. ఈ ఖర్చుల ద్వారా వస్తువులు సరఫరా చేసే రైతులు, చేతి వృత్తుల వారు ఉపాధి పొందేవారు. కాని నిరుపేదలకు దీని వల్ల ఎలాంటి లబ్ధి చేకూరేది కాదు. అదనపు పనిముట్ల కోసం పెట్టుబడి పెట్టే స్థోమత లేనందున వీరికి రెక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి ఉండేది.

ఇందుకు విరుద్ధంగా ధనవంతులైన రైతులు, చేతివృత్తుల వారు సామ్రాజ్యంలో విశేషంగా లబ్ధిపొందేవారు.

17వ శతాబ్దం చివరలో విపరీతమైన సంపద, వనరుల మీద మొగల్ అధికారుల ఆధిపత్యం ఉండడంతో వీరు శక్తివంతమైన వర్గంగా మారారు. మొగల్ చక్రవర్తి అధికారం క్రమంగా తగ్గే కొద్ది ప్రాంతీయ రాజ్యాలు కొన్ని ప్రాంతాల్లో బలపడటం ప్రారంభమైంది. వారు చిన్న చిన్న సొంత రాజ్యాలతో పాటు హైదరాబాద్, అవధ్ లాంటి రాజ్యాలను స్థాపించడం మొదలుపెట్టారు. చివరలో ఢిల్లీ చక్రవర్తిని తమ ప్రభువుగా అంగీకరించి కొనసాగించినప్పటికీ, 18వ శతాబ్దంలో ఈ రాజ్యాలు స్వతంత్ర రాజ్యాలుగా అవతరించాయి.

### హైదరాబాద్ అసఫ్ జాహీలు 1724–1948

| అసఫ్‌జాహీ–కాలక్రమపట్టిక | |
|---|---|
| నిజామ్–ఉల్–ముల్క్(మొదటి నిజామ్) | (1724–1748) |
| నాసర్ జంగ్ – | (1748–1751) |
| ముజఫర్ జంగ్ – | (1751–1751) |
| సలాబత్ జంగ్ – | (1751–1762) |
| నిజామ్–అలిఖాన్ (2వ నిజాం) | (1762–1803) |
| సికందర్ జా (3వ నిజాం) | (1803–1829) |
| నాసిర్–ఉద్–దౌలా (4వ నిజాం) | (1829–1857) |
| అఫ్జల్–ఉద్–దౌలా (5వ నిజాం) | (1857–1869) |
| మీర్ మహబూబ్ అలీఖాన్ (6వ నిజామ్) | (1869–1911) |
| మీర్ ఉస్మాన్ అలీఖాన్ (7వ నిజాం) | (1911–1948) |

1720ల్లో మొగల్ చక్రవర్తుల ప్రాబల్యం బలహీనపడడంతో వారి సామంతులు స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు. అందులో ఒకరు దక్కన్ సామంతుడు చిన్ ఖులిచ్ ఖాన్. ఇతనినే నిజామ్–ఉల్–ముల్క్ అని కూడా అంటారు. 1724లో హైదరాబాద్ రాష్ట్రంలో ఆసఫ్‌జాహి వంశపాలనను ఇతడు స్థాపించాడు. నిజామ్–ఉల్–ముల్క్ 24 సంవత్సరాల పాటు పరిపాలించాడు (1724–48). అసఫ్ జాహి పాలకులలో పదిమంది రాజులు 1724 నుండి 1948 వరకు పరిపాలించారు. వీరిలో ఏడుగురు రాజులకు మాత్రమే నిజాం అనే బిరుదును మొఘలులు ఇచ్చారు. నాసర్ జంగ్, ముజఫర్ జంగ్, సలాబత్ జంగ్ లకు నిజాం బిరుదును ఇవ్వలేదు. హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడానికి నిజాము రాజులు నిరంతరం మరాఠా, మైసూరు పాలకులతో పోరాడుతూ ఉండేవారు. ఈ కారణాల వలన వారు స్వాతంత్ర్యాన్ని కోల్పోయి బ్రిటిష్ వారిపై ఆధార పడవలసి వచ్చింది.

బ్రిటిష్ అధికారుల ప్రభావంలో వాళ్ళు వలసవాద ఆధునికీకరణను చేపట్టారు. హైదరాబాదు సంస్కృతిని బ్రిటిష్ వాళ్ళు ఎంతో ఇష్టపడ్డారు. 19వ శతాబ్దం చివరి భాగంలో హైదరాబాదు అభివృద్ధి పంథాను చేపట్టింది. 1853 నుంచి 1883 మధ్య నిజాం రాజులకు సాలార్ జంగ్ దివాన్ (Prime Minister) గా ఉన్నాడు. అతడు వలసవాద అభివృద్ధి పథకాలను ఆహ్వానించాడు. (ఇతని గురించి మీరు తరువాతి పాఠంలో తెలుసుకొంటారు).


సాలార్ జంగ్

ఆరవ నిజాం అయిన మీర్ మహబూబ్ ఆలి ఖాన్, అతని కాలంలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టారు. అసిఫియా గ్రంథాలయం, విక్టోరియా స్మారక అనాథశాల, మహబూబియా బాలికల పాఠశాలలను అతని కాలంలోనే, నిర్మించారు. 1908లో మూసి నది వరదలలో

SCERT, TELANGANA

హైదరాబాదు ప్రజలకు అండగా నిలిచాడు. వరద సహాయ కార్యక్రమాలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాడు, భగవంతునికి ప్రార్థనలు చేశాడు, బాధితులకు ఆశ్రయం కల్పించాడు. పరిపాలనలో ఉదారవాద సంస్కరణల కొరకు ప్రజా ఉద్యమాలు జరుగుతున్నప్పటికి ఏడవ నిజాము భూస్వామ్య అధికార స్వరూపాన్ని కాపాడటానికి కృతనిశ్చయంతో ఉండెను. (ఇతని గురించి మీరు 8వ తరగతిలో తెలుసుకొంటారు).

**కీలకపదాలు:**

| | | |
|---|---|---|
| 1. మన్సబ్‌దారు | 2. జాగీర్దారు | 3. జబ్త్ |
| 4. శిష్టవర్గం | 5. జమీందార్ | 6. సుల్హ్-ఇ-కుల్ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1) మన్సబ్‌దారు, అతని జాగీర్‌కు మధ్యగల సంబంధమేమిటి?

2) మొగల్ పరిపాలనలో జమీందార్ పాత్ర ఏమిటి?

3) మతాచార్యులతో జరిపిన చర్చల ప్రభావం అక్బర్ పాలనా నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం చూపింది?

4) మొగల్ సామ్రాజ్యంలో ఓడిన రాజులను వారి వారి రాజ్యాలలో ఎందుకు కొనసాగనిచ్చారు?

5) మొగలులు విశాల సామ్రాజ్యాన్ని అదుపు చేయడంలో 'సుల్హ్-ఇ-కుల్' విధానం ఎలా ప్రాధాన్యతను సంతరించుకుంది?

6) 'జబ్త్ మరియు జమీందార్' పేరాను చదివి, వ్యాఖ్యానించండి.

7) మొగల్ చక్రవర్తుల సమాచారాన్ని సేకరించి, పట్టికలో రాయండి.

S3R9Q1

| క్ర.సం. | చక్రవర్తి పేరు | పాలనా కాలం | ముఖ్యాంశాలు |
|---|---|---|---|
| 1 | | | |
| 2 | | | |
| 3 | | | |
| 4 | | | |
| 5 | | | |
| 6 | | | |

SCERT TELANGANA

పాఠం 15

# భారతదేశంలో బ్రిటిష్ సామ్రాజ్య స్థాపన

P4L2J2


సమర్థవంతమైన మొగలు పాలకులలో ఔరంగజేబు చివరివాడు. నేడు భారతదేశంగా వున్న విశాల భూభాగంపై అతడు ఆధిపత్యాన్ని సాధించాడు. సా.శ.1707లో ఇతని మరణానంతరం మొగలుల సుబేదార్లు, పెద్ద జమీందార్లు ప్రాంతీయ రాజ్యాలను ఏర్పరచుకోవడం ఆరంభించారు. ఫలితంగా దేశంలో అనేక బలవత్తరమైన ప్రాంతీయ రాజ్యాలు ఏర్పడేసరికి ఢిల్లీ కేంద్రంగా పాలించడం కష్టతరమైపోయింది.

సా.శ.18వ శతాబ్దం ద్వితీయార్థం నాటికి, బ్రిటిష్ వారి రూపంలో కొత్త అధికార కేంద్రం తెరపైకి వచ్చింది. బ్రిటిష్‌వారు చిన్న వ్యాపారస్తులుగా మనదేశం వచ్చిన విషయం మీకు తెలుసా? అలాంటిది వారు ఇంత విశాలమైన దేశానికి యజమానులు ఎలా కాగలిగారు?

SCERT, TELANGANA

### తూర్పు ఇండియా కంపెనీ :

సా.శ.1600 సంవత్సరంలో తూర్పు ఇండియా కంపెనీ రాయల్ చార్టరు ద్వారా ఇంగ్లాండ్ పాలకురాలైన మొదటి ఎలిజబెత్ రాణి I నుండి గుత్తాధికారాన్ని పొంది వర్తకం ప్రారంభించింది. దీని ప్రకారం ఇంగ్లాండ్‌లోని ఏ ఇతర వ్యాపార కంపెనీ కూడా తూర్పు ఇండియా కంపెనీతో పోటీకి రాకూడదు. ఈ ఒప్పందం ద్వారా కంపెనీకి సముద్రాల అవతల కొత్త భూభాగాలలో వస్తువులను చౌకగా కొని, యూరప్‌లో అధిక ధరలకు అమ్మే అవకాశం దొరికింది. ఈ కంపెనీకి ఇతర ఆంగ్లేయ కంపెనీల వారితో వ్యాపార పోటీగాని, భయంగాని లేకుండాపోయింది.



*చిత్రం-15.1 లండన్‌లోని ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రధాన కార్యాలయం*

### వ్యాపార లావాదేవీలు :

తూర్పు ఇండియా కంపెనీ ప్రధానంగా వర్తకం ద్వారా లాభాలను పొందే వ్యాపార సంస్థ. తక్కువ ధరకు



చిత్రం-15.2
వాస్కోడిగామా

వస్తువులను కొని ఎక్కువ ధరకు అమ్మేవారు. ఆ రోజుల్లో వ్యాపార సంస్థలు తమ మధ్య పోటీ లేకుండా చూసుకొని అధిక లాభాలను గడించేవి.

అయితే ఇతర యూరప్ దేశాల వారిని తూర్పు దేశాల వ్యాపారంలోకి రాకుండా చార్టరు నిలువరించలేక పోయింది. బ్రిటిష్ వారి మొదటి నౌక ఆఫ్రికా పశ్చిమ తీరం గుండా ప్రయాణించి, గుడ్‌హోప్ అగ్రం దాటి హిందూ మహాసముద్రంలోకి ప్రవేశించే సమాయానికే, పోర్చుగీసు వారు భారతదేశ పశ్చిమభాగాన గోవాలో తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పోర్చుగీసు నావికుడైన వాస్కోడిగామా సా.శ. 1498 లో భారతదేశానికి సముద్రమార్గాన్ని కనుగొన్నాడు. 17వ శతాబ్దం ఆరంభంలోనే డచ్ దేశస్థులు కూడా హిందూ మహాసముద్ర తీరాన వ్యాపారం చేయటానికి గల అవకాశాలను అన్వేషించనారంభించారు. ఇంతలోనే ఫ్రెంచి వ్యాపారులు కూడా వచ్చి చేరారు.

సమస్య ఏమిటంటే అన్ని కంపెనీల వారు ఒకే రకమైన వస్తువులను కొనటానికి ఆసక్తి చూపించారు. భారతదేశంలో తయారయ్యే నాణ్యమైన పత్తి, సిల్క్‌కు యూరప్‌లో బాగా డిమాండ్ వుంది. లవంగాలు, మిరియాలు, యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటికి కూడా మంచి గిరాకీ వుంది. యూరోపియన్ కంపెనీల మధ్య పోటీ ఆయా వస్తువుల ధరలను అనివార్యంగా పెంచింది. పోటీ పెరిగిన ఈవ్యాపారాన్ని కాపాడుకోవటానికి సైన్యం, కోటలు అవసరమైనాయి. కోటలు కట్టి స్థావరాలను ఏర్పరుచుకొనే ప్రయత్నాలు, లాభసాటి వ్యాపారాన్ని కొనసాగించటం స్థానిక పాలకులతో ఘర్షణలకు దారితీశాయి.

**ఆయుధాలు ధరించిన వ్యాపారులు :**

భారతదేశంతో వ్యాపారం చేయటానికి యూరప్ వ్యాపారులు తమ సొంత కంపెనీలను ఏర్పరచుకున్నారు. బ్రిటిష్ వ్యాపారస్తులు ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీని, ఫ్రెంచి వ్యాపారస్తులు ఫ్రెంచి ఈస్ట్ ఇండియా కంపెనీని ఏర్పాటు చేసుకున్నారు. భారతదేశంలో వ్యాపారాన్ని హస్తగతం చేసుకోవటానికి ఈ రెండు కంపెనీలు అనేక సంవత్సరాలు పోరాటాలు చేసాయి. ఇద్దరు ఒకరినొకరు తరిమి కొట్టాలని ప్రయత్నించారు. వారి పోరాటాలకు మద్దతుగా ఇంగ్లాడు, ఫ్రాన్సుల నుండి సైన్యాలను దింపుకున్నారు. ఆయా దేశాల రాజులు కూడా తమతమ కంపెనీలకు మద్దతు తెలిపి పలు విధాలుగా సహకరించారు. ఆ కంపెనీలు భారతదేశంలో భూమిని సంపాదించి స్వంతంగా కోటలు కట్టుకొని ఒకరిపై ఒకరు యుద్ధాలు చేసారు.



*చిత్రం-15.3, 1676 నాటి మచిలీపట్నం తైలవర్ణచిత్రం*

CERT, TELANGANA

వ్యాపారంలో లాభాల ద్వారా వారి వద్ద పోగుపడిన సంపద బ్రిటిష్ పరిశ్రమలను అభివృద్ధిపరచటానికి ప్రపంచాధిపత్యం స్థాపించడానికి దోహదపడింది. ఈ కాలంలోనే ఇంగ్లాడుతో పాటు, యూరోపియన్ దేశాలైన స్పెయిన్, పోర్చుగల్, ఫ్రాన్స్, హాలెండ్, జర్మనీ వంటి దేశాలు ఉత్తర, దక్షిణ అమెరికాలలో, ఆఫ్రికా, ఆసియా ఖండాలలో తమతమ వలసలను సంపాదించాయి. ఈ వలసలు యూరప్ దేశాలకు అధికారాన్ని, సంపదను అందించాయి.

ఈ వ్యాపారస్తులను సైన్యాన్ని నిర్వహించటానికి, కోటలు కట్టుకోటానికి, యుద్ధాలు, సైనికశక్తి ద్వారా తమ రాజ్యాలలో ఆర్థిక శక్తిగా ఎదగటానికి అనుమతించటం ఎంత ప్రమాదమో మొగలు చక్రవర్తులు, స్థానిక రాజులు, నవాబులు క్రమంగా గుర్తించారు.

మొగలు చక్రవర్తులు బలంగా ఉన్నంతకాలం యూరప్ కంపెనీలకు వారి సైనిక శక్తిని భారతదేశంలో స్థాపించటం సాధ్యపడలేదు. షాజహాను, ఔరంగజేబు కాలంలో అనేక సార్లు ఈ యూరప్ కంపెనీలు పోరాడి ఓడినాయి. ఔరంగజేబు మరణించిన కొంతకాలానికి వివిధ సామంతరాజులు స్వతంత్రులుగా తమ సంస్థానాలను పాలించటం ప్రారంభించారు. ఆ విధంగా బెంగాల్, అవధ్ (లక్నో), హైదరాబాదు ప్రాంతాలు మొగలు రాజులను తమ చక్రవర్తిగా నామమాత్రంగా గుర్తిస్తూ వారే స్వతంత్రంగా వ్యవహరించారు.

మొగలు సామ్రాజ్యం చిన్న చిన్న రాజ్యాలుగా ముక్కలవగానే ఈ కంపెనీల వారు తమ అధికారానికి బాటలువేశారు. వారితో ఎక్కువ వ్యాపారం చేయాలని రాజులు, నవాబులు భావించినప్పటికీ ఆ కంపెనీలు పెంచుకుంటున్న సైనిక శక్తిని నిలువరించటానికి స్థానిక రాజులు యత్నించారు.



*చిత్రం-15.4 బెంగాల్ పాలకుడిగా రాబర్ట్ క్లైవ్‌కు మొగలు చక్రవర్తి షా ఆలం హక్కు కల్పిస్తున్న దృశ్యం*

ఉదాహరణకు సా.శ. 1764 సంవత్సరంలో ఆర్కాట్ (ఉత్తర తమిళనాడు) నవాబు అయిన అన్వరుద్దీన్ ఖాన్ ఫ్రెంచి సైన్యానికి వ్యతిరేకంగా తన సైన్యాన్ని పంపించాడు. కాని నవాబు పెద్ద సైన్యాన్ని ఫ్రెంచి వారి చిన్న సైన్యం ఓడించడం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. అంటే చిన్న యూరప్ సైన్యం పెద్ద భారతసైన్యాన్ని ఓడించిందన్నమాట. ఈ విజయంతో యూరప్ వర్తకులకు సైనిక శక్తితో భారతదేశంలో తాము తలచుకున్నది సాధించగలం అనే ధైర్యం కలిగింది.

సా.శ. 1700 సంవత్సరంలో భారత పాలకుల సైన్యాలకంటే యూరప్ సైన్యాలు ఎలా భిన్నమైనవి? యూరప్ సైనికులు మంచి శిక్షణ పొంది, ఎక్కువ జీతాలను క్రమం తప్పకుండా పొందుతున్నారు. వారికి మంచి ఫిరంగులు, తుపాకులు ఉన్నాయి. వారు ప్రతిరోజు కవాతు చేస్తుండేవారు. ఆ విధమైన నిరంతర శిక్షణ వల్ల యూరప్ సైన్యంలో చేరిన భారతీయ సైనికులు కూడా యుద్ధంలో మంచి నైపుణ్యాన్ని ప్రదర్శించేవారు.

SCERT, TELANGANA

### భారత రాజ్యాలలో పెరుగుతున్న యూరప్ వారి జోక్యం :

వ్యాపారంలో లాభాలను పెంచుకోవడానికి సైన్యాన్ని కంపెనీవారు ప్రయోజనకరంగా వినియోగించుకున్నారు. ఇద్దరు భారత రాజులు కొట్లాడుకుంటుంటే వీరు ఒకరి పక్షం వహించి ఆ పోరాటాలలో భాగస్వాములయ్యేవారు. వారి సైన్యాన్ని ఒక పక్షానికి మద్దతుగా పంపి ఎదుట వారిని ఓడించేవారు. ఇందుకు ప్రతిఫలంగా తమ వ్యాపారానికి కావలసిన అనేక రాయితీలను గెలిచిన రాజు నుండి పొందేవారు. భారతదేశ రాజులు సైన్య సహకారం పొందినందుకు 'బహుమానం'గా కంపెనీలకు పెద్ద మొత్తాలలో నగదును ముట్టచెప్పేవారు. తమ వ్యాపారాన్ని మరింత వృద్ధిపరచుకోవటానికి కంపెనీలకు ఈ నగదు ఉపయోగపడేది.

ఇందుకు ఉదాహరణ: ముజఫర్ జంగ్‌ను దక్కన్ నవాబును చేసినందుకుగాను, ఫ్రెంచి ఈస్ట్ ఇండియాకంపెనీ గవర్నరైన డూప్లేకు పాండిచ్చేరి వద్ద కొంత భూభాగాన్ని, మచిలీపట్నాన్ని ఇచ్చాడు. అంతేకాకుండా కంపెనీకి 50 వేలు, ఫ్రెంచి సైన్యానికి 50 వేలు, డూప్లేకు సంవత్సరానికి లక్ష రూపాయలు, 20 లక్షల విలువచేసే జాగీరును ఇచ్చాడు.


దీనితో కంపెనీలు స్థానిక పాలకుల నుండి వారి రాజ్యాలలోని చిన్న చిన్న భూభాగాలను 'బహుమతులు'గా తీసుకోవటం ప్రారంభించారు. వారు ఆ భూభాగాలలోని గ్రామాలు, పట్టణాల నుండి భూమి శిస్తు వసూలుచేయటం మొదలుపెట్టారు. ఈ డబ్బును తమ వ్యాపారానికి, తమ సైన్యాన్ని పెంచుకోటానికి, పోషించటానికి వాడేవారు.

భారతదేశంలో ఆధిపత్యానికై జరిగిన పోరులో నెమ్మదిగా ఫ్రెంచి కంపెనీపై ఇంగ్లీషు కంపెనీ విజయం సాధించింది.

### కంపెనీ అధికార దుర్వినియోగం :

బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి 'బహుమానాలు' ఇవ్వటం, వారిసైన్యం ఖర్చులను భరించటం చాలా కష్టమని త్వరలోనే భారతదేశ రాజులు గుర్తించారు. కంపెనీ చేసే ఇతర పనులు కూడా ఈ రాజులకు చికాకు కలిగించాయి.

కొందరు భారత పాలకులు తమ వద్ద కొన్న చాలా వస్తువులపై పన్ను మినహాయింపు ఇచ్చారు. దీనిని వారు అవకాశంగా తీసుకొని దుర్వినియోగపరిచారు. ఉదాహరణకు కంపెనీ ఉద్యోగులు తమ సొంత వ్యాపారం ప్రారంభించి ఆ వస్తువులను కంపెనీ వస్తువులుగా చూపి పన్ను ఎగవేసేవారు.



చిత్రం-*15.5* స్థానిక పడవలు సరుకులను ఓడల నుండి మద్రాసు తీరానికి చేర్చుతున్న *1867* నాటి విలియం సింప్సన్ యొక్క వర్ణచిత్రం

ఈ విధంగా కంపెనీ సంపద పోగుపడటమే కాకుండా దానిలో పనిచేసే ఉద్యోగులు కూడా డబ్బును పోగేసుకొని తమ దేశాలకు సంపన్నులుగా తిరిగివెళ్లారు. కంపెనీ వ్యాపారానికి భారతీయ వ్యాపారులు, శేట్‌లు సహకరించారు. వీరు కూడా తమ వస్తువులను కంపెనీ వస్తువులుగా చూపి పన్ను మినహాయింపు పొందారు.



SCERT, TELANGANA

ఈ విధంగా కంపెనీలు స్థానిక రాజ్యాల ఆదాయాన్ని మోసపూరితంగా లూటీ చేసారు, దోచుకున్నారు. కంపెనీ తన సైనిక శక్తిపట్ల ఎంతో గర్వపడేది. చేతివృత్తులవారిని తమ సరుకును తక్కువ ధరకు అమ్మేలాగా కంపెనీవారు వత్తిడిచేసేవారు. తమ అధీనంలోని ప్రాంతాలలోని రైతులను పిండి దారుణమైన శిస్తులను వసూలుచేసేవారు. ఆ పీడనకు పాలకులు వ్యతిరేకిస్తే ఆంగ్లేయులు పోరాటాలకు దిగేవారు. అవసరమైతే ఆ రాజులను తొలగించి, వ్యాపారానికి సహకరిస్తూ అడుగులకు మడుగులొత్తే వారినే రాజులుగా నియమించేవారు.

- వ్యాపారం చేసేవారికి సరుకులను కొనటానికి డబ్బు అవసరం. భారతదేశంలో బ్రిటిష్ వారి వ్యాపారానికి డబ్బు లభించిన మూడు మార్గాలను రాయండి.
- ఆంగ్లేయుల నుండి భారతీయ రాజులు ఏమి ప్రయోజనాలు పొందారు?

**ఆంగ్లేయుల పాలన - అమలు:**

భారతదేశాన్ని పూర్తిగా, స్వేచ్ఛగా తమ వ్యాపారానికి వాడుకోవాలంటే తామే పాలకులం కావాలనే భావన ఆంగ్లేయులలో క్రమంగా ప్రారంభమైంది. అందుకే వారు రాజులను, నవాబులను తొలగించి తామే పాలించటం మొదలుపెట్టారు.

సా.శ. 1757 సంవత్సరంలో ప్లాసీ వద్ద జరిగిన యుద్ధంలో ఆంగ్లేయులు బెంగాల్ నవాబు సిరాజుద్దౌలాను ఓడించి, బెంగాల్‌లో తమ పాలనను ప్రారంభించారు. భారతదేశ చరిత్రలో ప్లాసీ యుద్ధం ఒక ముఖ్య ఘట్టం. ఆ తరువాతనే ఆంగ్లేయులు అనేక చిన్న, పెద్ద రాజ్యాలను ఆక్రమించటం ప్రారంభించారు.


సా.శ. 1765-68 సంవత్సరాల మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాలను (నేటి కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, ప్రకాశం, గుంటూరు) తమకు అప్పగించవలసిందిగా హైదరాబాదు నిజాంను ఈస్ట్ ఇండియా కంపెనీవారు ఒత్తిడి చేసి హస్తగతం చేసుకున్నారు. ఈ ప్రాంతాన్ని కంపెనీ మద్రాసు ప్రాంతపు 'ఉత్తర సర్కారులు'గా పిలిచేవారు. ఇందుకు ప్రతిఫలంగా నిజాంకు అందుబాటులో ఆంగ్లేయుల సైన్యాన్ని ఉంచుతామని అంగీకరించారు. కాని వాస్తవానికి ఈ సైన్యాలు నిజాంకు సహాయం చేయటం కంటే అతనిని అదుపు చేయటానికి ఎక్కువగా ఉపయోగపడ్డాయి.


బ్రిటిష్‌వారి కుట్రలను, కుతంత్రాలను గమనించిన చాలా మంది రాజులు, నవాబులు వారికి వ్యతిరేకంగా పోరాడారు. అలా పోరాడిన వారిలో మైసూరుకు చెందిన హైదర్ అలీ, టిప్పుసుల్తాన్‌లు, మరాఠీ సర్దారైన మహాదిజీ సింధియా, నానా ఫడ్నవీస్ మొదలైన వారున్నారు. కాని అవి చిన్న రాజ్యాలైనందున ఒకదాని తర్వాత మరొకటి ఆంగ్లేయుల వశమైనాయి.


ఈ పోరాటాలలో బ్రిటిష్ వారి విజయాలకు సహకరించిన గవర్నర్ జనరల్‌లలో రాబర్ట్ క్లైవ్, వారన్ హేస్టింగ్స్, వెల్లస్లీ మొదలైనవారు ముఖ్యులు. క్రమేణా, భారతదేశ భూభాగంలో చాలా వరకు ఆంగ్లేయుల ప్రత్యక్ష పాలన కిందకు రాసాగింది. చాలా ప్రాంతాలలో రాజులు, నవాబులు పాలిస్తున్నప్పటికీ వారు బ్రిటిష్ వారి సార్వభౌమత్వం కిందనే పనిచేయసాగారు. 'రెసిడెంట్' అని పిలువబడే ఒక ఆంగ్లేయ అధికారిని రాజుల, నవాబుల రాజ్యాలలో నియమించి బ్రిటిష్ ప్రభుత్వం వారిపై ఒక కన్నేసి ఉంచేది.

- భారతదేశంతో వ్యాపారం చేస్తున్న ఈస్ట్ ఇండియా కంపెనీ వారు మన దేశాన్ని ఎందుకు పాలించాలని భావించారు?

SCERT, TELANGANA




**భారతదేశంలో బ్రిటిషు అధికార వ్యాప్తిని చూపుతున్న పటాలు.**

- పై పటాలను పరిశీలించి నేటి భారతదేశ రాజకీయ పటంతో పోల్చండి. ప్రతి పటంలో బ్రిటిష్ పాలన కింద లేని ప్రాంతాలను గుర్తించండి.
- 1857 నాటికి ఆంగ్లేయుల పాలన ఎంత వరకు విస్తరించింది? పక్క పటాన్ని పరిశీలించి ఆనాటికి ఇంకా భారతీయ రాజుల ఆధీనంలో వున్న రాజ్యాల జాబితాను తయారుచేయండి.

SCERT, TELANGANA

### ఆంగ్లేయుల పాలనపట్ల అసంతృప్తి :

ఆంగ్లేయులు తమ పాలనను స్థాపించటానికి అనేక మంది రాజులతో, నవాబులతో పోరాడారు. రాబోయే పాఠాలలో వారి పాలన గురించి, విధానాల గురించి మరింత నేర్చుకుంటారు. వారు భారత ప్రజల నుండి నిరంతరం వ్యతిరేకతను ఎదుర్కొన్నారు.

బ్రిటిష్ వారికి అనుకూలంగా వున్న రాజ కుటుంబాలను అధికారంలో ఉంచటం లేకపోతే తొలగించటం వంటి చర్యల వల్ల రాజ కుటుంబాలు ఆంగ్లేయులను వ్యతిరేకించాయి.

అధిక పన్నులు వేయటం, నిర్దాక్షిణ్యంగా పన్నులు వసూలు చేయటం వంటి చర్యల వల్ల, నిరంతరం భయం గుప్పిట్లో ఉండి, పన్నులు చెల్లించలేకపోతే భూములు పోతాయేమోనని భయపడిన రైతులు, భూ యజమానులు కూడా తిరుగుబాట్లు చేశారు.

ఆంగ్లేయులు అమలు జరుపుతున్న కొత్త నియమాలు, చట్టాల వల్ల అడవిపై తమ హక్కును కోల్పోతున్న గిరిజన తెగలు తిరుగుబాటు చేశాయి. రాబోయే పాఠాలలో దీని గురించి మీరు మరింత నేర్చుకుంటారు.

ఆంగ్లేయులు తమను క్రైస్తవులుగా మార్చుతారని హిందువులు, ముస్లింలు భయపడ్డారు.

1857లో కొన్ని నెలలపాటు జరిగిన పోరాటంలో ఆంగ్లేయులు మొత్తం ఉత్తర భారతంలో తమ ఆధిపత్యాన్ని కోల్పోయారు. ఈ తిరుగుబాటును భారత సిపాయిలే ప్రారంభించారు. తరువాత రాజ కుటుంబాలు కూడా వీరితోపాటు పోరాటంలో కలిసాయి. రైతులు, గిరిజనులు, భూయజమానులు, చేతివృత్తుల వారు కూడా ఈ తిరుగుబాటుతో జతకలిశారు. తిరుగుబాటులో పాల్గొన్న రాజ కుటుంబీకులలో పీష్వా దత్తపుత్రుడైన నానా సాహెబ్, అతని సైన్యాధిపతి తాంతియా తోపే, అవధ్ యొక్క రాణి మరియు ఝాన్సీకి చెందిన ఝాన్సీ లక్ష్మీబాయి ఉన్నారు. ఉమ్మడి శత్రువును హిందూ ముస్లింలు కలిసి ఎదిరించారు.

---

### 1857 తిరుగుబాటు :

***స్థలం: మీరట్ మిలటరీ కంటోన్‌మెంట్, బ్రిటిష్ సైనిక స్థావరం***

***తేది: 10-5-1857 ఆదివారం.***

సూర్యాస్తమయం కాబోతుండగా బ్రిటిష్ అధికారులపై భారత సిపాయిలు కాల్పులు మొదలుపెట్టారు. భారతదేశ రాజులను ఓడించి, వారి సామ్రాజ్యాలను ఆంగ్లేయులు జయించటానికి సహాయపడిన సైనికులే ఈ తిరుగుబాటు చేశారు. వారు ఆంగ్లేయుల ప్రవర్తనతో విసుగు చెందారు. వారికి జీతాలు సకాలంలో అందేవి కాదు. వారికి బ్రిటిష్ సైనికులతో సమానంగా గౌరవం దక్కటంలేదు. వీటికి పరాకాష్ఠగా, సిపాయిలకు ఇచ్చిన కొత్త రైఫిళ్లలో వాడే తూటాలకు ఆవు, పందికొవ్వు పూసి వుందనీ, వాటిని నోటితో కొరికి ఉపయోగించటమంటే తమ మత విశ్వాసాలు దెబ్బ తినటమని భావించారు. ఇటువంటి అనుమానంతోనే 1857 మార్చిలో కలకత్తా దగ్గరలోని బారక్‌పూర్‌లో కూడా తిరుగుబాటు జరిగింది. కానీ మీరట్‌లో జరిగిన తిరుగుబాటు చాల పెద్దది. ఆ రోజు సైనికులు తమ అధికారులపై కాల్పులు జరిపి అంతటితో ఆగకుండా అదే రాత్రి ఢిల్లీ వైపు సాగిపోయారు.


**చిత్రం 15.6**

1) తూటాను విప్పడానికి పేపర్ సీల్‌ను నోటితో కొరుకుతున్న సిపాయి

2) రైఫిల్లో తుపాకి మందు నింపుతున్న సిపాయి


3) కాగితంలో చుట్టిన తూటాను తుపాకిలో అమర్చుతున్న సిపాయి




SCERT, TELANGANA

***స్థలం: మీరట్ పట్టణం***
***తేది: ఆదివారం రాత్రి, సోమవారం***
***10, 11 మే-1857***




*చిత్రం-15.7 1857 నాటి మీరట్‌లో సిపాయిల తిరుగుబాటు దృశ్యం*

సిపాయిల తిరుగుబాటు వార్త దావానలంలా మీరట్‌లో వ్యాపించింది. పట్టణమంతా ఆగ్రహావేశాలతో ఊగిపోయింది. ప్రజావాహిని బజారుల గుండా పయనించి ఆంగ్లేయుల బంగ్లాలపై దాడి చేసింది. ఆ జన సమూహంతో పోలీసులు కూడా జతకలిశారు. అప్పటికే ఆంగ్లేయుల బంగ్లాలకు నిప్పంటించారు. చాలమంది ఆంగ్లేయులను చంపారు.

***స్థలము: ఢిల్లీ, ఎర్రకోట***
***తేది: సోమవారం, 11-5-1857***

ఒక్క రోజులోనే మీరట్ సిపాయిలు యమునా నదిని దాటి ఢిల్లీ చేరారు. వారు మొగల్ చక్రవర్తి బహదూర్‌షా జాఫర్‌ను నిర్బంధించిన ఎర్రకోటలోకి ప్రవేశించారు. బహదూర్‌షా జాఫర్‌ను చక్రవర్తిగా ప్రకటించి అతనిని బ్రిటిష్ సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడానికి అంగీకరించమని ఒప్పించారు. "ఆంగ్లేయులను పారద్రోలండి, మొగలుల పాలనను తిరిగితెండి" అని తిరుగుబాటుదారులు స్పష్టంగా పిలుపునిచ్చారు.



*చిత్రం-15.8 బల్లకట్టుపై యమునా నదిని దాటుతున్న సిపాయిలు - 1857 నాటి ఢిల్లీ దృశ్యం*

**తిరుగుబాటు వ్యాప్తి :**

ఈ పిలుపు అందిన వెంటనే, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా దేశంలోని అనేక ప్రాంతాలలో తిరుగుబాట్లు వెల్లువెత్తాయి. ఆలీఘర్, మెయిన్‌పురి, బులంద్‌షహర్, అట్టక్, మధుర కంటోన్మెంట్లలోని సిపాయిలు తిరగబడ్డారు. ఆంగ్లేయులు గజగజ వణికిపోయారు. వారిప్పుడు క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.



*చిత్రం-15.9 ఆంగ్లేయులతో పోరాడుతున్న రాణి ఝాన్సీ లక్ష్మీబాయి*

అప్పుడు కేవలం 45 వేల మంది బ్రిటిష్ అధికారులు, సైన్యం మాత్రమే భారత దేశంలో వున్నారు. వీరికి వ్యతిరేకంగా 2 లక్షల 32 వేల మంది భారతీయ సైనికులు ఇంగ్లీషువారి సైన్యంలో వున్నారు! ఈ సిపాయిలందరూ తిరగబడ్డారు. ఇక ఆ పట్టణాలలోని ఆంగ్లేయుల ఆస్తులను, ప్రాణాలను ఎవరు కాపాడగలరు? ఆంగ్లేయుల సైన్యంలోని భారతీయులు ఇప్పుడు నమ్మదగినవారు కారు. ఈ పరిస్థితులలో చాల మంది బ్రిటిష్ సైనికులు తమ కుటుంబాలను కాపాడుకోవటానికి వెనుకడుగువేసారు. అందువల్ల తిరుగుబాటును వెంటనే అణచలేకపోయారు. అది ఒక చోటు నుండి మరోచోటికి వ్యాపించసాగింది.


*చిత్రం-15.10*
**నానాసాహెబ్**

బ్రిటిష్‌వారి చేతిలో రాజ్యాలు పోగొట్టుకున్న రాజకుటుంబాలు చాలా వరకు తిరుగుబాటులో చేరాయి. వారిలో ఆవధ్ మాజీ నవాబు, మరాఠీ పీష్వా నవాబు మరియు నానాసాహెబ్ వున్నారు. తిరుగుబాటు చేసిన సైన్యాలు, దేశ వివిధ ప్రాంతాల్లో వున్న పాలకులు ఢిల్లీ వైపు సాగిపోయారు. ఆంగ్లేయులను పారద్రోలడానికి, వారి వారి ప్రాంతాలలో వారి పాలనను తిరిగి స్థాపించడానికి ప్రజలు వారికి సహకరించారు.

వలస పాలన కింద అనేక బాధలు అనుభవించిన హైదరాబాదు ప్రజలు నిశ్శబ్దంగా లేరు. 1857 తిరుగుబాటు సమయంలో బ్రిటిష్‌కి వ్యతిరేకంగా హైదరాబాదు రాష్ట్రంలో పోరాడిన విప్లవకారులలో తుర్రెబాజ్‌ఖాన్ ఒకడు. అతడు మౌల్వి అల్లావుద్దీన్ మద్దతుతో ఆరువేల మంది ప్రజలను కూడ గట్టుకుని కోఠిలో ప్రస్తుత మహిళ కళాశాల అయిన బ్రిటిష్ రెసిడెన్సీ మీద దాడి చేశాడు. బ్రిటిష్‌కి నిజాం మద్దతు ఇచ్చిన కాలంలో అతడు తిరుగుబాటు చేశాడు. అయినప్పటికీ ఉద్యమం అణిచివేయబడింది, అతడు ఉరితీయబడ్డాడు.




- తిరగబడుతున్న భారతీయు లందరినీ మొగలు సామ్రాజ్య భావన ఎందుకు ఐక్యపరిచింది? చర్చించండి.
- మీరు దేనినైనా వ్యతిరేకించితే, దాని స్థానంలో ప్రత్యామ్నాయం ఉండాలి. మీ అనుభవం నుండి ప్రత్యామ్నాయ అవసరం గురించి ఆలోచించండి.

SCERT TELANGANA

## తిరుగుబాటులో ప్రతి గ్రామం :


ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో గ్రామ గ్రామానికి వీధి వీధికి తిరుగుబాటు జ్వాలలు వ్యాపించాయి. రైతులు, జమీందారులు ఆయుధాలు తీసుకొని ఇంగ్లీష్ వారిని, వారి అధికారులను తరిమికొట్టారు. బ్రిటిష్ ప్రభుత్వానికి పన్ను కట్టకుండా ఆపుచేశారు, రైలు మార్గాలను ధ్వంసం చేసారు. పోలీసు స్టేషన్లను తగలబెట్టారు. టెలిగ్రాఫ్ వైర్లను తెంచివేసి, తంతి-తపాలా కార్యాలయాలను నేలమట్టం చేశారు. ఆంగ్లేయులు ఇండియాలో కొత్తగా ప్రవేశపెట్టిన వీటిని చిన్నాభిన్నం చేశారు. ఆంగ్లేయుల ఓటమే, భారతీయుల్లో రోజురోజుకి ధైర్యం నింపి ఆంగ్లేయులతో మరింత పోరాడగలం అనే విశ్వాసాన్ని నింపింది.

తిరుగుబాటుదారులు వడ్డీ వ్యాపారుల ఇళ్ళను లూటీ చేసి వారి వద్ద వున్న దస్తావేజులను కాల్చివేశారు. అప్పటివరకూ ఈ వడ్డీ వ్యాపారులు బ్రిటిష్ చట్టాలను అడ్డంపెట్టుకొని గ్రామాలలో పెత్తనం చెలాయించారు.

## తిరుగుబాటు అణచివేత :

తిరుగుబాటు ఇంతగా విజయం సాధించినప్పటికీ, బ్రిటిష్ వారు క్రమేణా పరిస్థితిని తమ అదుపులోకి తెచ్చుకున్నారు.

తిరుగుబాటుదారులు ధైర్యంగా పోరాడారు కాని వారిలో రెండు ముఖ్యమైన బలహీనతలున్నాయి. ప్రతి ప్రాంతం, పట్టణంలో తిరుగుబాట్లు అన్నీ వేరువేరుగా జరిగాయి. వారు ఐక్యంగా పోరాడలేదు. వారిలో ప్రణాళికాయుతమైన ఐక్యపోరాటం లేదు. అందువలన



*చిత్రం-15.11 తిరుగుబాటుదారులను ఉరితీస్తున్న దృశ్యం*

ఆంగ్లేయులు ప్రతిప్రాంతంలోని తిరుగుబాట్లను ఒకదాని తర్వాత ఒకటిగా పరిష్కరించుకుంటూ వచ్చారు.

తిరుగుబాటుదారులకు ఆధునిక ఆయుధాల కొరత ఉండేది. వారికి కావలసిన తుపాకులు, ఫిరంగులు, తుపాకి మందు, తూటాలు, భారతదేశం బయట నుండి తెచ్చుకోవలసి వచ్చేది. అందువల్ల తిరుగుబాటుదార్లు పాత తుపాకులు, బాణాలు, ఈటెలు, కత్తులతో పోరాడవలసి వచ్చింది. ఆధునిక ఆయుధాలతో ఈ కత్తులు, కటారులు ఎంతకాలం పోరాడగలవు?

అయినప్పటికి తిరుగుబాటు వ్యాపించిన వేగం చూసి బ్రిటిష్‌వారు భయపడ్డారు. అందుకే తిరుగుబాటును అణచిన దగ్గరల్లా వారు మహాక్రూరంగా వ్యవహరించారు. తిరుగుబాటుదారులను అమానుషంగా చంపి వారి శవాలను గ్రామాలలోని చెట్లకు ఉరితీసి, గ్రామీణులు తిరుగుబాటుచేస్తే ఎంత తీవ్ర పరిణామాలుంటాయో అర్థమయ్యేలా చేశారు.

కొందరు తిరుగుబాటుదార్లను మరఫిరంగుల ముందుకట్టి ఆ ఫిరంగులను పేల్చి, వారి శరీరాలను ముక్కలు ముక్కలుగా చేసేవారు. శరీరం తునకలై గాలిలో వెదజల్లబడేది. చాలమంది తిరుగుబాటుదారులు ఆంగ్లేయులకు దొరకకుండా ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి పోయి దాక్కొనేవారు. కొందరు నేపాల్ వంటి ప్రదేశాలకు కూడా పోయి దాక్కున్నారు.

బహదూర్‌షా జఫర్ చక్రవర్తిని దూర ప్రాంతమైన రంగూన్‌కు తరలించారు. చివరి మొగలు చక్రవర్తియైన ఆయన అక్కడే మరణించాడు. బ్రిటిష్ వారిని ఎదిరించిన పెద్ద తిరుగుబాటే 1857 తిరుగుబాటు. ఈ తిరుగుబాటును అణిచిన తర్వాత వారి ఆధిపత్యం మరింత బలపడి మరో 90 సంవత్సరాలపాటు పరిపాలన కొనసాగింది.

- సరైన జవాబులను గుర్తించండి.
  - ఎ) 1857 తిరుగుబాటుదారులు మొగలుల పాలనను ................ (తొలగించాలని/ప్రతిష్టించాలని) కోరుకున్నారు.
  - బి) తమ సైన్యంలో ఎక్కువమంది .............. (యూరప్ వారు/భారతీయులు) ఉండటం బ్రిటిష్ సైన్య బలహీనత .



SCERT TELANGANA

◆ తిరగబడిన భారత సైన్యాల బలహీనతలు ఏమిటి?

**తిరుగుబాటు అనంతరం :**

1857 తిరుగుబాటును అణచటానికి ఆంగ్లేయులకు సంవత్సర కాలానికిపైగా పట్టింది. ఈ కాలంలో వారి విధానాలను చాలా వరకు మార్చుకున్నారు. కొత్త విధానాలను అవలంబించారు. 1858లో విక్టోరియా రాణి ముఖ్యమైన ప్రకటన చేసింది. భారతదేశాన్ని భారతీయ రాజులే పాలిస్తారని ఆమె ప్రకటించింది. దీనితో ఆంగ్లేయులు తమను అధికారం నుండి తొలగిస్తారనే భయం లేకుండా భారతీయ పాలకులు తమ పాలన కొనసాగించారు.

ఈ విధంగా ఆంగ్లేయులు రాజ కుటుంబాలతో మంచి స్నేహ సంబంధాలను నెలకొల్పుకున్నారు. అదే విధంగా జమీందారులకు కూడా వారి ఆస్తులు కాపాడతామని చెప్పి వారికి కావలసిన రాయితీలను ఇచ్చారు.

భారతీయుల మత విశ్వాసాలలో బ్రిటిష్ ప్రభుత్వం జోక్యం చేసుకోదని, పాత సాంప్రదాయాలను కొనసాగిస్తుందని పండిట్‌లకు, మౌల్వీలకు హామీ ఇచ్చారు. భారతీయులను ప్రభుత్వంలోకి తీసుకుంటామని వాగ్దానం చేశారు. 1857లో తమ భారత సామ్రాజ్యాన్ని గుంజుకోవడాన్ని ఆంగ్లేయులు కళ్లారా చూశారనేది వాస్తవం. అందుకే భారతదేశ సంపన్నుల మద్దతు పొందటానికి అవసరమయ్యే అన్ని రాయితీలు ఇచ్చి తమపాలన కొనసాగించే ప్రయత్నాలన్నీ ఆంగ్లేయులు చేశారు.



*చిత్రం 15.12 బహదూర్ షా జఫర్, అతని కుమారులను అరెస్టు చేస్తున్న కెప్టెన్ హడ్సన్. మొగల్ వంశంలో ఔరంగజేబు తర్వాత పాలించిన వారు పేరుకే పాలకులు, శక్తి వంతులు కారు. 1857 తిరుబాటు సమయంలో బహదూర్ షా జఫర్ పాలకుడు. ఈస్ట్ ఇండియా కంపెనీ ఈ తిరుగుబాటును అణచివేసి వెంటనే బహదూర్‌షా జఫర్ ను బలవంతంగా పదవీచ్యుతున్ని చేసి, అతని కుమారులను కూడా చంపివేయడం జరిగింది.*

**హైదరాబాద్ స్టేట్–బ్రిటీషువారు**

మిగతా రాజ్యాల వలనే హైదరాబాద్ కూడా ఇంగ్లీషు తూర్పు ఇండియా కంపెనీ ఆధీనములోకి వచ్చినది. బ్రిటీషువారు తమ రెసిడెంట్‌ను హైదరాబాద్‌లో ఉంచి నిజాం రాజ్యం పరిపాలనను పూర్తిగా పరిశీలిస్తూ ఉండేవారు. నిజాం రాజు తన ప్రధాన మంత్రిని (దివాన్) నియమించడానికి రెసిడెంట్ యొక్క సలహాను బ్రిటీషు గవర్నర్ జనరల్ అనుమతిని పొందవలసి ఉండేది. అన్ని శాఖలను బ్రిటీషువారు ఎంపిక చేసిన (ICS) భారత సివిల్ సర్వీస్ అధికారులు ఆధిపత్యం వహించేవారు. ఈ విధంగా బ్రిటీషువారు నిజాం రాజ్యాన్ని పూర్తిగా తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారు. బ్రిటీషువారు ఇతర ప్రాంతాలలో అనుసరించే పరిపాలనా పద్ధతులు విధానాలు నిజాం రాజ్యంలో క్రమంగా పాటించేటట్లు ఒత్తిడి చేశారు.

ఒక వేళ నీవు హైదరాబాద్ వెళ్ళినట్లయితే నీవు అక్కడ ప్రసిద్ధి చెందిన సాలార్‌జంగ్ మ్యూజియం చూడగలవు. అందులో హైదరాబాద్ దివాన్ అయిన సాలార్‌జంగ్ సేకరించిన వివిధ రకాల వస్తువులు ఉన్నాయి. ఆయన అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టాడు. హైదరాబాద్ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఆయన చాలా దోహదపడినాడు. రాజ్యాన్ని, 'సుబా'లుగా జిల్లాలుగా, విభజించి,

TELANGANA

పాత దేశ్‌ముఖ్‌లను తొలగించాడు. రెవెన్యూ సాగు ధనాన్ని రద్దు చేసి, ప్రత్యామ్నాయంగా జిల్లా అధికారులచే, రైతుల నుండి ప్రత్యక్షంగా పన్నులు వసూలు చేశాడు. న్యాయ సంస్కరణలో భాగంగా, సుప్రీంకోర్టును, హైకోర్టును, జిల్లా కోర్టులను ఏర్పాటు చేశాడు. సివిల్ క్రిమినల్ కోర్టులను వేర్వేరుగా ఏర్పాటు చేశాడు.

రవాణా సౌకర్యాలు మెరుగు పరచుటకు రైలు, రోడ్డు మార్గాలను సాలార్‌జంగ్ అభివృద్ధి పరిచాడు. హైదరాబాద్ నుండి వాడి, మద్రాస్ నుండి షోలాపూర్, మద్రాస్ నుండి బొంబాయిలకు ముఖ్యమైన రైలు మార్గాలు వేశాడు. 1855లో చాదర్‌ఘాట్‌లో దార్-ఉల్-ఉలూమ్ వంటి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలు, 1870లో సిటి కాలేజీ, దక్కన్ ఇంజనీరింగ్ కాలేజి మరియు మదరాసా-ఇ-ఆలియాని స్థాపించాడు. ఈ సంస్కరణలు దేశం మొత్తంలో హైదరాబాద్, ఆధునిక రాజ్యంగా ఆవిర్భవించుటకు తోడ్పడినాయి.

**కీలకపదాలు:**

1. రాయల్ చార్టర్
2. సుబేదారు
3. గుత్తాధిపత్యం
4. డిమాండ్
5. జాగీరు
6. కంటోన్మెంట్
7. వలసలు
8. మౌల్వీలు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1) యూరోపియన్ వ్యాపార కంపెనీలు ఇండియాలో సైన్యాన్ని ఎందుకు పోషించాయి? కంపెనీల వ్యాపారంలో ఈ సైన్యాలు ఎటువంటి పాత్ర పోషించాయి?

V6G7W5

2) 1700, 1800 సంవత్సరాలలో భారతసైన్యాలను యూరపుసైన్యాలు ఎలా ఓడించాయి?

3) 1857 తిరుగుబాటుకు సంబంధించిన వివరాలను సేకరించి, కింది పట్టికలో నమోదు చేయండి.

| క్ర.సం. | తిరుగుబాటులో పాల్గొన్నవారు | తిరుగుబాటుకు దూరంగా ఉన్నవారు |
|---|---|---|
| | | |

4) 1857లో తమ మత విశ్వాసం దెబ్బతిన్నదని భావించిన సైనికులెవరు? వారు అలా ఎందుకు భావించారు?

5) 1857లో బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా ప్రజలు ఎలా తిరగబడ్డారు?

6) 1857లో తిరగబడ్డ ప్రజలు ఏమి సాధించాలని కోరుకున్నారు?

7) తిరుగుబాటుదారుల ఏ డిమాండ్లను పరిష్కరిస్తానని రాణీ విక్టోరియా 1858 ప్రకటనలో హామీ ఇచ్చింది?

8) మొగలులు భారతదేశంలో అధికారంలోకి రావటానికి, బ్రిటిష్‌వారు అధికారంలోకి రావటానికిగల పోలికలు, భేదాలు ఏమిటి?

9) వాస్కోడిగామా పోర్చుగల్ నుండి భారతదేశానికి చేసిన సముద్ర ప్రయాణమార్గాన్ని పటంలో గుర్తించండి.

10) "విదేశీ దురాక్రమణలను నివారించడానికి ఐక్యత అవసరం" - దీనిపై ఒక లఘుటీక రాయండి.

11) ఆంగ్లేయుల పాలనపట్ల నీ అసంతృప్తిని సొంత మాటల్లో రాయండి.

SCERT, TELANGANA

పాఠం 16

# రాష్ట్ర శాసనసభ - చట్టాల తయారీ

C7Z7U6

**ఇంత వరకు మనం ప్రజలు తమ ప్రజాకార్యకలాపాలను ఎలా నిర్వహించుకున్నారో - వారు ఎలా పాలించబడినారో, ఎలా పాలించారో చదువుకున్నాం. గత సంవత్సరం మనం చిన్నవైన గిరిజన సమాజాలు వారి కార్యకలాపాలను చర్చలు, సమావేశాల ద్వారా ఎలా నిర్వహించారో గ్రామ పెద్ద నిర్ణయాలు ఎలా చేసేవారో చదివాం. రాజ్యాలు, సామ్రాజ్యాలలో రాజులు, అధికారులు వీటిని ఎలా నిర్వహించేవారో అధిక భూభాగంపై, రాజ్యాలపై ఆధిపత్యం కోసం ఎలా యుద్ధాలు చేసేవారో తెలుసుకున్నాం. యోధులు, సామంతులు ప్రజలను ఎలా నియంత్రించారో, తమకు ఇష్టం వచ్చినట్లు పన్నులు ఎలా వసూలు చేశారో, పెద్ద భవనాలను నిర్మించడానికి ఆ ఆదాయం ఎలా వినియోగించారో, ప్రజాప్రయోజనార్థం చెరువులు, కాలువలు, దేవాలయాలు, మసీదులు ఎలా నిర్మించారో తెలుసుకున్నాం. బ్రిటిష్ వారు మన దేశంలో అధికారాన్ని ఎలా స్థాపించారో, మన దేశవనరులను ఎలా దోచుకున్నారో, మన ప్రజలు వారిని ఎలా ఎదుర్కొన్నారో మనం చదివాం.**

ఇప్పుడు మనకు రాజులు, యోధులు లేరు. 70 ఏళ్ల క్రితమే మనం బ్రిటిష్ వారి నుండి స్వాతంత్ర్యం పొందాం. మనల్ని మనం ఎలా పరిపాలించుకుంటున్నాం? పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, ఉన్నతాధికారుల గురించి మీకు తెలిసే ఉంటుంది. వారు ప్రాచీన కాలం నాటి రాజుల వంటి వారా? వారు వారికి ఇష్టమైనవి చేస్తారా? చేయరు. ఆధునిక ప్రభుత్వాలు చట్టాల ప్రకారం నడుస్తాయి. చట్టాలకు ఎవరూ అతీతులు కారు. చట్టాలకనుగుణంగా మంత్రులు, అధికారులు, వ్యవహరించాలి. కాని ఆ చట్టాలను ఎవరు, ఎలా తయారుచేస్తారు? అవి పాలకుల కోరికల ప్రకారం తయారౌతాయా? కాదు. వాటిని శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు చేస్తారు. ఈ సంస్థలు చట్టాలు ఎలా తయారుచేయాలో భారత-రాజ్యాంగం సూచిస్తుంది. ఈ రాజ్యాంగ నియమాల ప్రకారమే చట్టాలు తయారుచేస్తారు. ఈ పాఠంలో రాష్ట్ర శాసన సభలో చట్టాలు ఎలా తయారు చేస్తారో విపులంగా చదువుదాం.



*చిత్రం - 16.1 తెలంగాణ అసెంబ్లీ భవనం*

SCERT, TELANGANA

ఇక్కడ ఒక వార్తాంశం ఉంది. దానిలో ఏం చెప్పారో అర్థంచేసుకోడానికి ప్రయత్నిద్దాం.

ఆంధ్రప్రదేశ్ ధూమపాన నిషేధం, ఆరోగ్య పరిరక్షణ చట్టం : 2002.

**బహిరంగ ప్రదేశాలలో పొగతాగడాన్ని నిషేధించే బిల్లు ఆమోదం**

(మా ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాదు, మార్చి 27 :

బహిరంగ ప్రదేశాలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్రభుత్వ ఆఫీసులు, ప్రభుత్వ వాహనాలలో పొగతాగడాన్ని నిషేధిస్తూ బుధవారంనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ చట్ట ఉల్లంఘనకు పాల్పడినట్లయితే 100 రూపాయల నుండి 1000 రూపాయల వరకు జరిమానా కూడా విధించడానికి అవకాశం కల్పించింది.

దీనికి సంబంధించి ప్రతిపక్ష సభ్యులు ఈ కింది సూచనలను చేశారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల దూరంలో సిగరెట్ల అమ్మకాన్ని నిషేధించడం, 18 ఏళ్ల లోపువాళ్ళకు సిగరెట్లు అమ్మడాన్ని నిషేధించడం, సిగరెట్ల అమ్మకాల ప్రకటనలమీద నిషేధం విధించడం వంటి సూచనలను చేశారు. మరికొందరు ఇది పొగాకు రైతుల, కిళ్లీ దుకాణాదారుల జీవితాల మీద ప్రభావాన్ని చూపిస్తుందని వాదించారు. మంత్రి వారి అనుమానాలను కొట్టిపారేశారు.

సిగరెట్లు ప్రజల ఆరోగ్యం మీద చూపే దుష్ప్రభావాలవల్ల, నవంబర్ 2, 2001 నాడు సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ చట్టం చేయడం అవసరమని మంత్రి చెప్పారు. బహిరంగ ప్రదేశాలలో, ప్రభుత్వ సంస్థలలో, ప్రభుత్వ వాహనాలలో పొగతాగడం నిషిద్ధం, పొగతాగగూడదు అనే బోర్డులను ఉంచడానికి సంబంధించిన, సెక్షన్‌లు 5, 6, 10లను ఉల్లంఘిస్తే అటువంటి వారికి 100 రూపాయల జరిమానా, రెండో తప్పుకు 200 రూపాయల నుంచి 500 రూపాయల వరకు జరిమానాను విధించి శిక్షించవచ్చు.

***(మార్చి 27, 2002 'ద హిందు' ఆంగ్లదినపత్రికనుంచి తీసుకొన్నది).***

- వార్తాపత్రికలు ఎప్పుడూ పెద్దవాళ్లే చదువుతారనే ఊహతో రాస్తారు. కాబట్టి ఈ కింది పదాలకు అర్థాలను తెలుసుకుందాం. నిషేధించడం, కొట్టిపారేయడం, అనుమానాలు/సందేహాలు, నేపథ్యంలో, ఉల్లంఘించడం.
- పై వార్తాకథనాన్ని అనుసరించి ఈ కింది ఖాళీలను పూరించండి:

  1) బహిరంగ ప్రదేశాలలో పొగతాగడాన్ని నిషేధించడానికి ...... ప్రవేశపెట్టారు. (బిల్లు, సంప్రదాయం, చట్టం, నిబంధన).

  2) ధూమపాన (పొగతాగడం) నిషేధంలో ఈ కిందివాటిని చేర్చలేదు. ................. (పనిచేసే చోటు, ప్రభుత్వవాహనాలు, ప్రయివేటు తోటలు, బస్‌స్టాండు).

  3) సుప్రీంకోర్టు ఆదేశాలను ............. చేయడానికి ఈ చట్టం చేసారు (నిశ్శబ్దం, దండించడానికి, అనుసరించడానికి, తిరస్కరించడానికి).

  4) ఈ బిల్లును ప్రవేశపెట్టినది .................. (సుప్రీంకోర్టు, మంత్రులు, కలెక్టరాఫీసు, శాసనసభ).

- ప్రతి ఒక్కరికీ ఈ బిల్లును గురించి ఒకే అభిప్రాయం ఉందని ఈ వార్తాంశం సూచిస్తోందా?
- ఈ చట్టాన్ని ఉల్లంఘించినవాళ్ళకు ఎటువంటి శిక్షలు విధిస్తారని ఈ వార్త పేర్కొంది.

ప్రతి రాష్ట్రంలో చట్టసభలు ఏర్పాటుచేసుకోవడానికి భారత రాజ్యాంగం వీలుకల్పించింది. ప్రతిరాష్ట్రం గవర్నర్, ఒకటి లేదా రెండు సభలతో కూడిన చట్టసభలు కలిగి ఉంది. దేశంలోని రాష్ట్రాలలో చట్టసభలు ఏకసభ లేదా





SCERT TELANGANA

ఉభయసభలు కలిగిఉన్నాయి. దిగువసభను శాసనసభ అని, ఎగువ సభను శాసన మండలి అని అంటారు. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలలో మాత్రమే రెండు సభలున్నాయి.


**శాసనసభ:**

రాష్ట్రానికి చట్టాలు చేయడంలో ఈ సభ చాలా కీలకమైనది. రాష్ట్ర సంక్షేమంకోసం అనేక నిర్ణయాలను తీసుకోటంలో, విధానాల రూపకల్పనలో, వాటి అమలులో రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యత వహిస్తాయి. రాష్ట్ర శాసన సభ్యులను పంచాయతీ సభ్యులలాగే రాష్ట్ర శాసన సభ్యులను కూడా ప్రజలే ఎన్నుకుంటారు.

ప్రతి రాష్ట్ర శాసనసభ సాధారణంగా ఐదు సంవత్సరాల కాలపరిమితి కలిగివుంటుంది. కొన్ని సందర్భాలలో కాలపరిమితికన్నా ముందే గవర్నర్ రద్దుచేయవచ్చును. అదేవిధంగా జాతీయ అత్యవసర పరిస్థితులలో ఒక సంవత్సరం చొప్పున దీని కాలపరిమితిని పార్లమెంటు పొడిగించవచ్చు.

రాష్ట్ర శాసన సభ ప్రతిసంవత్సరం కనీసం రెండుసార్లు సమావేశమవ్వాలి. రెండు సమావేశాల మధ్యకాలం ఆరు నెలలకు మించకూడదు.

SCERT TELANGANA



పటం 2 : తెలంగాణ శాసన సభ నియోజకవర్గాలు

| తెలంగాణలో ఉభయసభలు ఉన్న రాష్ట్ర శాసనసభ చట్టాలు చేస్తుంది. | | |
|---|---|---|
| **సభ** | **పేరు** | **సంక్షిప్త పేరు** |
| శాసనసభ | శాసన సభ్యుడు | ఎమ్.ఎల్.ఎ. |
| శాసనమండలి | శాసనమండలి సభ్యుడు | ఎమ్.ఎల్.సి. |

**శాసనసభా నియోజకవర్గం:**

శాసనసభ సభ్యులు ఒక్కొక్కరు ఒక్కొక్క నియోజకవర్గం నుండి ఎన్నికవుతారు. రాష్ట్రంలో ఈ నియోజకవర్గాల సంఖ్య అక్కడి జనాభామీద ఆధారపడి ఉంటుంది. ఈ విధంగా మన రాష్ట్రంలో 119 నియోజకవర్గాలున్నాయి. తెలంగాణలో ఒక్కొక్క నియోజకవర్గంలో సుమారు 1,70,000 మంది ఓటర్లు ఉన్నారు. 18 సంవత్సరాలు దాటిన స్త్రీ, పురుషులందరికీ ఓటు హక్కు ఉంది. వీరు తమ పేర్లను తాము నివసించే ప్రాంతంలో ఓటర్లుగా నమోదుచేసుకుంటారు. ఒక నియోజకవర్గంలోని ఓటర్లందరూ ఓటువేసి తమ ప్రతినిధిని అసెంబ్లీకి ఎన్నుకుంటారు.

ఒక్కొక్క నియోజకవర్గంలో అనేక గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఉంటాయి. హైదరాబాద్‌వంటి పెద్ద నగరం పదమూడు నియోజకవర్గాలుగా విభజింపబడి ఉంది. తెలంగాణ పటాన్ని చూడండి. ఎక్కువ జనాభా ఉన్న జిల్లాలలో ఎక్కువ నియోజక వర్గాలు, తక్కువ జనాభా ఉన్న జిల్లాల్లో తక్కువ నియోజకవర్గాలు ఉండడం మనం గమనించవచ్చు.


**ఎం.ఎల్.ఎ ఎన్నిక:**

సాధారణంగా రాష్ట్ర శాసనసభ ఎన్నికలు ప్రతి 5 సంవత్సరాలకొకసారి జరుగుతాయి. ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాలలో ఈ ఎన్నికలను నిర్వహిస్తుంది. శాసనసభకు పోటీచేయదలుచుకున్నవారు ఈ ఎన్నికలలో పోటీచేస్తారు. అనేక రాజకీయ పక్షాలు తమ అభ్యర్థులను ఎన్నికలలో నిలబెడతాయి. ఏ రాజకీయ పక్షానికీ చెందనివారు కూడా స్వతంత్ర అభ్యర్థులుగా నిలబడవచ్చు. వీరిని "స్వతంత్ర అభ్యర్థులు" అని అంటారు. ఈ ఎన్నికలలో పోటీ చేయడానికి అర్హతలు : భారతదేశపౌరులై ఉండాలి, 25 సంవత్సరాల వయస్సు దాటి ఉండాలి. ఎలాంటి లాభదాయకమైన ప్రభుత్వ పదవులలో ఉండరాదు. చట్టం నిర్దేశించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

ఎన్నికలలో రాజకీయపక్షాలు ప్రధానపాత్రను పోషిస్తాయి. అన్ని రాజకీయ పక్షాలూ తమ ఎన్నికల ప్రణాళికా పత్రాన్ని (Election manifesto) ప్రకటిస్తాయి. అంటే తాము ఏ ఏ కార్యక్రమాలను భవిష్యత్తులో చేపడతారో, ఏఏ వాగ్దానాలను తమ నియోజకవర్గ ప్రజలకు చేస్తారో వివరిస్తారు. అభ్యర్థులు, వారిని బలపరిచేవారు సభలను నిర్వహిస్తూ లేదా ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని చేపడతారు.

- మీ ప్రాంతంలోని, మీ రాష్ట్రంలోని రాజకీయ పక్షాల పేర్లు, వాటి గుర్తుల జాబితాను తయారుచేయండి.
- మీ జిల్లానుండి ఎన్నికల్లో మీరు పోటీ చేసేటట్లయితే ప్రజలకోసం ఎటువంటి ఎన్నికల కార్యాచరణ ప్రణాళికను (మానిఫెస్టో) తయారుచేస్తారు?
- ఎన్నికలలో పాల్గొనాలంటే పెద్దమొత్తంలో డబ్బు ఖర్చుచేయాల్సి వస్తుందని, ఇది ధనవంతులకు మాత్రమే సాధ్యమని కొంతమంది భావిస్తున్నారు. దీనితో మీరు ఏకీభవిస్తారా?
- కేవలం డబ్బున్న వ్యక్తులు మాత్రమే ఎన్నికలలో పోటీచేస్తే శాసనసభలో తీసుకునే నిర్ణయాలను అది ఎలా ప్రభావితం చేస్తుంది?


SCERT, TELANGANA




చిత్రం – 16.2

- ఎన్నికల కమిషన్ ప్రచురించిన కేలెండరులో ముద్రించిన చిత్రాలు 16.2 లో ఉన్నాయి. అవి దేశంలో విభిన్న కాలాలలో ఎన్నికలకు సంబంధించిన విభిన్న అంశాలను తెలియజేస్తున్నాయి. దీని ఆధారంగా గత కొన్ని సంవత్సరాలనుండి వస్తున్న మార్పులను మీ తల్లిదండ్రులతోను, ఉపాధ్యాయులతోను చర్చించండి.

ఎన్నికల రోజున ప్రజలు ఒకరి తరవాత మరొకరు ఓటు వేస్తారు. పోలింగ్ బూత్ అధికారి ఓటర్ల గుర్తింపు కార్డు (Identity Card) పరిశీలిస్తారు. సాధారణంగా ఓటర్లందరికీ ఎన్నికల కమీషన్ గుర్తింపు కార్డులను జారీచేస్తుంది. ఈ కార్డులను ఆ అధికారికి చూపించాలి. ఓటర్లు తాము ఎవరికి ఓటువేసేది చెప్పగూడదు. ఓటు చాలా రహస్యంగా వేయాలి. ఎన్నికల సంఘం ఓట్లు వేయడానికి బ్యాలెట్ బాక్సులను గాని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లను గాని ఉపయోగిస్తుంది.




చిత్రం – 16.3

మాదిరి ఓటరు గుర్తింపు కార్డు & మాదిరి ఇ.వి.యమ్.

- ఓటును రహస్యంగా ఉంచాలని ఎందుకు భావిస్తున్నారు?
- మీ తల్లిదండ్రులకిచ్చిన ఫోటో గుర్తింపు కార్డును పరిశీలించి మీ వివరాలతో గుర్తింపు కార్డును తయారుచెయ్యండి.

SCERT TELANGANA

ఎన్నికల రోజున ఓటు వేశాక ఓట్ల లెక్కింపునాడు ఈ ఓట్లన్నిటినీ లెక్కపెట్టి ఎక్కువ ఓట్లు వచ్చిన వ్యక్తిని గెలిచినట్టుగా ప్రకటిస్తారు.

- ఒక నియోజక వర్గంలో సుమారు 1,50,000 మంది ఓటర్లు ఓటు వేశారని భావిద్దాం. వివిధ అభ్యర్థులకు వచ్చిన ఓట్లను ఈ కింద ఇచ్చారు. వీరిలో ఎవరు గెలిచినట్లు ప్రకటిస్తారు?

| | | |
|---|---|---|
| ఎల్లమ్మ | – | 45,000 |
| రాఘవులు | – | 44,000 |
| నరసింహ | – | 16,000 |
| గులాం మహమ్మద్ | – | 20,000 |
| బాదెయ్య | – | 15,000 |
| పూజ | – | 10,000 |

- గెలిచిన అభ్యర్థులు తమ నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలకు, అవసరాలకు తగ్గట్టు ఏమేరకు ప్రాతినిధ్యం వహిస్తారని భావిస్తున్నారు?

  మీ టీచరు సహాయంతో తెలుసుకోండి.

- మీ నియోజకవర్గం పేరు ........................
- మీ జిల్లాలోని ఏవైనా ఇతర మూడు నియోజక వర్గాలను గుర్తించండి.

  ................, ................, ................

- మీ శాసనసభ్యుని పేరు ....................
- మీ జిల్లాలో రిజర్వ్ అయిన నియోజకవర్గాలను గుర్తించండి.
- గత ఎన్నికలలో మీ కుటుంబంలో ఎవరెవరు ఓటువేశారు? ....................

  ............., ..................,

### ప్రభుత్వం ఏర్పాటు:

ఎన్నికల తరవాత ఏం జరుగుతుంది? పట్టిక-1 చూడండి. శాసనసభ ఎన్నికల తర్వాత ఫలితాలను చూపిస్తుంది.

రాజకీయ పార్టీ- ఎ 75 స్థానాలను గెల్చుకోగా మొత్తం స్థానాలలో సగంకన్నా ఎక్కువ స్థానాలను గెల్చుకున్న పార్టీకి మెజారిటీ/ఆధిక్యం వచ్చినట్లు భావించవచ్చు. ఏవైనా చట్టాలు చేయవలసి వచ్చినప్పుడు సగంపైగా సభ్యులు దాన్ని సమర్థించే వీలు ఉంటుంది.

మెజారిటీవచ్చిన పార్టీ (పై పట్టిక ప్రకారం రాజకీయ పార్టీ- ఎ) సభ్యులు తమలో ఒకరిని నాయకుడిగా ఎన్నుకుంటారు. గవర్నరు ఆ నాయకుణ్ణి రాష్ట్ర ముఖ్యమంత్రిగా నియమిస్తారు. తమ పార్టీ శాసనసభ్యుల/శాసనమండలి సభ్యులలోనుంచి కొందరిని ముఖ్యమంత్రి మంత్రులుగా ఎంపికచేస్తారు. ఈ మంత్రులు, ముఖ్యమంత్రితో కలిసి కేబినెట్ లేదా మంత్రిమండలిగా ఏర్పడతారు. ఈ మంత్రిమండలి/కేబినెట్‌నే ప్రభుత్వం అని కూడా పిలుస్తారు. చట్టాలను, అభివృద్ధి పథకాలను అమలుచేయడానికి, శాసన సభలో కొత్త చట్టాలను చేసి అమలుచేయడానికి ఈ మంత్రిమండలి బాధ్యత వహిస్తుంది.

| పట్టిక-1 | రాజకీయపక్షం | ఎన్నికయిన అభ్యర్థుల సంఖ్య |
|---|---|---|
| 1. | రాజకీయ పార్టీ- ఎ | 75 |
| 2. | రాజకీయ పార్టీ- బి | 17 |
| 3. | రాజకీయ పార్టీ- సి | 10 |
| 4. | రాజకీయ పార్టీ- డి | 07 |
| 5. | రాజకీయ పార్టీ- ఇ | 06 |
| 6. | రాజకీయ పార్టీ- ఎఫ్ | 04 |
| | మొత్తం | 119 |

SCERT, TELANGANA

◆ ఎన్నికల ఫలితాల పట్టిక-1ను చూడండి. ఇది వేరే రాష్ట్రానికి చెందిన 119 నియోజకవర్గాల సమాచారం. వీటిలో ఏ రాజకీయపక్షం ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి ఉంటుందో తెలపండి.




తెలంగాణ ఎన్నికల సంఘం వారి వెబ్‌సైట్
http://ceotelangana.nic.in/

◆ ఉదాహరణకు ఎన్నిక తరువాత పట్టిక-3లో చూపించిన విధంగా రాజకీయ పక్షాలు స్థానాలను గెలుచుకొని ఉంటే ప్రభుత్వాన్ని ఎలా ఏర్పాటుచేయవచ్చో మీ టీచర్‌తో చర్చించండి.

| పట్టిక-3 | రాజకీయపక్షం | ఎన్నికయిన అభ్యర్థుల సంఖ్య |
|---|---|---|
| 1. | రాజకీయ పార్టీ- Abcd | 45 |
| 2. | రాజకీయ పార్టీ- Mnop | 33 |
| 3. | రాజకీయ పార్టీ- Wxyz | 26 |
| 4. | రాజకీయ పార్టీ- Stuv | 15 |
| | **మొత్తం** | **119** |

ఏ కారణంవల్ల అయినా ఏ పార్టీకయినా సగంకంటే ఎక్కువ మెజారిటీ రానప్పుడు రెండు, లేదా అంతకన్నా ఎక్కువ రాజకీయపక్షాలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తాయి. దాన్ని సంకీర్ణ ప్రభుత్వం అంటారు.

**మంత్రిమండలి:**

మంత్రిమండలిలోని సభ్యులకు ముఖ్యమంత్రి వివిధ శాఖలను కేటాయిస్తారు. ఒకరిని ఆర్థికశాఖామంత్రిగా, మరొకరిని విద్యాశాఖామంత్రిగా లేదా గృహమంత్రిగానో (Home Minister) నియమిస్తారు. తమ శాఖలకు సంబంధించి మంత్రులు విధాన నిర్ణయాలను (Policies) నిర్దేశిస్తారు. ఈ విధానాలను నియమ నిబంధనల ప్రకారం ఆయా శాఖల అధికారులు అమలుచేస్తారు. ఈ విధి విధానాలను, ప్రణాళికలను తయారుచేసి చట్టసభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసేవరకు మంత్రివర్గం బాధ్యత వహిస్తుంది. చట్టసభ ఆమోదం పొందిన తరవాత ఆ శాఖాధికారులు ప్రభుత్వ విధానాలను, ప్రణాళికలను అమలుపరచడానికి అవసరమైన నిబంధనలను, విధివిధానాలను రూపొందించి అమలుపరుస్తారు.

సాధారణంగా తమ తమ శాఖల విధివిధానాలను ఆ మంత్రులు స్వతంత్రంగా నిర్ణయించినా కీలకమైన నిర్ణయాలను మాత్రం మంత్రిమండలి సభ్యులందరూ కలిసి నిర్ణయిస్తారు. కాబట్టి ఏదైనా తప్పు జరిగితే దానికి ఆ మంత్రివర్గమంతా ముఖ్యమంత్రితో కలిసి బాధ్యతవహిస్తుంది. అదే విధంగా మంచి నిర్ణయాలు చేసినప్పుడు కూడా ఆ గొప్పతనాన్ని అందరి సమష్టి కృషిగా భావిస్తారు.

**రాష్ట్ర శాసనసభ:**

శాసనసభ్యులు అందరూ కలిసి తమలో ఒకరిని సభకు అధ్యక్షులుగా (స్పీకర్) ఎన్నుకుంటారు. ఈయన సభలను సమావేశపరుస్తారు. ఈయన/ఈమె సభలో ఏ ఏ సమస్యలను ఎవరు ఎప్పుడు ప్రవేశపెట్టాలి, ఎవరి తరవాత ఎవరు మాట్లాడాలి వంటి విషయాలను నిర్ణయిస్తారు. తన నిర్ణయాలను అతిక్రమించి వ్యవహరించే వాళ్లను దండించే అధికారం అధ్యక్షుడికి ఉంది.

పైన పేర్కొన్నట్లు ప్రభుత్వం చేసే అన్ని చట్టాలూ, విధానాలు , విధించే పన్నులు అసెంబ్లీ ఆమోదం పొందాలి.

SCERT, TELANGANA

ఆమోదించేముందు అసెంబ్లీ సభ్యులు ఆయా అంశాలను లోతుగా చర్చించి తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తారు. లాభనష్టాలను లోతుగా చర్చిస్తారు. ఈ చర్చలన్నీ టి.వి. ద్వారా, పత్రికలద్వారా ప్రజలకు తెలియవస్తాయి.

శాసనసభ్యులు తమ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు సభదృష్టికి తీసుకువస్తారు. సంబంధిత మంత్రులు ఆయా సభ్యులు అడిగిన సమస్యలకు అవసరమయితే విచారణ జరిపి సమాధానాలు ఇస్తారు. మంత్రులు వ్యక్తిగతంగాను, ముఖ్యమంత్రితో సహా మంత్రిమండలి సభ్యులు సమష్టిగాను శాసనసభ్యులు సభలో అడిగే ప్రశ్నలకు సమాధానాలిచ్చే బాధ్యత వహిస్తారు. ఒకవేళ మంత్రి ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే, ప్రతిపక్షసభ్యులు మంత్రిని రాజీనామా చేయమని ఒత్తిడి చేస్తారు.

**చట్టాలు చేయటం (Making of Law):**

శాసన సభలు చట్టాలను ఏవిధంగా చేస్తాయి? సాధారణంగా శాసనసభలో సంఖ్యాబలం ఉన్న అధికారపక్షం చట్టాలు చేస్తుంది. కొన్నిసార్లు ఏ పార్టీ సభ్యుడైనా ఒక చట్టం చేయమని సభలో ప్రతిపాదించవచ్చు, అయితే అధిక సభ్యుల మద్దతు పొందితే అది సభ ఆమోదం పొందుతుంది. చట్టాలు ఎలా రూపొందించబడతాయో వివరంగా చూద్దాం.

సభ ఆమోదం పొందకముందు చట్టాన్ని 'బిల్లు' అంటారు. ఉభయసభల ఆమోదం పొందిన బిల్లు, గవర్నర్ ఆమోదం కూడా పొందిన తర్వాత చట్టంగా మారుతుంది. దాన్ని శాసనసభ చేసిన శాసనం (Act) అంటారు.

బిల్లురూపంలో సభలో ప్రవేశపెట్టి సంబంధిత మంత్రి సవివరంగా వివరిస్తారు. ఇక్కడ చాలా లోతుగా చర్చ

**తెలంగాణ శాసన మండలి:**

2014 వరకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్‌లు ఒకే రాష్ట్రంగా ఉండేవి. ఆంధ్రప్రదేశ్ చట్టసభలో రెండు సభలుండేవి. రెండవదానిని శాసన మండలి అంటాం. ఇది 1958 లో ఏర్పాటుచేయబడి 1985 వరకు పనిచేసి మళ్లీ 2007లో ఏర్పాటై పనిచేస్తోంది. ఇది శాశ్వతసభ. తెలంగాణ శాసన మండలిలో 40 మంది సభ్యులు కలరు. ఈ సభ్యులను ఆరు సంవత్సరాల కాలానికి ఎన్నుకుంటారు. వీరిలో 1/3 వంతు సభ్యులు ప్రతి రెండు సంవత్సరాలకు సభ్యత్వ విరమణ చేస్తారు. వీరినే శాసనమండలి సభ్యులు (MLC) అని అంటారు. ఈ సభకు పోటీ చేయడానికి భారత పౌరులై ఉండాలి, 30 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. ఎలాంటి లాభదాయకమైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పదవులను కలిగి ఉండకూడదు. ఇంతేగాక పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

- 1/3 వ వంతు అంటే 14 మందిని శాసన సభ్యులు ఎన్నుకొంటారు.
- 1/3 వ వంతు, అంటే 14 మంది స్థానిక సంస్థలైన పంచాయితీలు, మునిసిపాలిటీల నుండి ఎన్నికయిన వాళ్ళు ఎన్నుకొంటారు.
- 1/12వ వంతు అంటే ముగ్గురిని (3) పట్టభద్రులు ఎన్నుకొంటారు.
- 1/12వ వంతు అంటే ముగ్గురిని (3) ఉపాధ్యాయులు ఎన్నుకొంటారు.
- 1/6వ వంతు అంటే ఆరుగురిని (6) గవర్నరు నామినేట్ చేస్తారు.

రాష్ట్రంలో ఏ చట్టం చేయాలన్న రెండు సభల ఆమోదం తప్పనిసరి.

**గవర్నరు:** రాష్ట్ర గవర్నరును భారతదేశ రాష్ట్రపతి నియమిస్తారు. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పనిచేసేలా చూడడం గవర్నరు బాధ్యత. గవర్నరు ముఖ్యమంత్రిని రాజ్యాంగబద్ధంగా నియమిస్తాడు, మంత్రి మండలి సభ్యులనుమాత్రం ముఖ్యమంత్రి సలహాప్రకారం నియమిస్తారు. భారతరాజ్యాంగం గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలలో కార్యనిర్వహణాధికారాలను కల్పించింది.

**ప్రస్తుతం మన రాష్ట్ర గవర్నరు ఎవరు?**

SCERT, TELANGANA

**రిజర్వేషన్ల పద్ధతి:**

దళితులు, ఆదివాసీలు వంటి బలహీన వర్గాల ప్రజలు ఎన్నికలలో పోటీచేసి గెలవడం చాలా కష్టంతో కూడుకున్న పని. ఈ వర్గాలనుండి అతి కొద్దిమంది మాత్రమే పోటీచేసి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. షెడ్యూల్డ్‌కులాలవారి, తెగలవారి ప్రాతినిధ్యానికున్న ప్రాముఖ్యాన్ని గుర్తించిన భారతరాజ్యాంగం వీరికి కొన్ని ప్రత్యేక నియోజకవర్గాలను కేటాయించింది.

తెలంగాణ అసెంబ్లీలో రిజర్వ్ చేసిన నియోజకవర్గాల సంఖ్య:

| | | |
|---|---|---|
| మొత్తం నియోజక వర్గాల సంఖ్య | : | 119 |
| షెడ్యూల్డ్ కులాల వారికి కేటాయించిన నియోజకవర్గాల సంఖ్య | : | 19 |
| షెడ్యూల్ తెగల వారికి కేటాయించిన నియోజకవర్గాల సంఖ్య | : | 12 |
| ఆంగ్లో ఇండియన్ నియామకం | : | 01 |

- స్త్రీలకు కూడా ఈవిధంగా రిజర్వేషన్లు కల్పించాలని చాలామంది అంటున్నారు. దీని మీద మీ అభిప్రాయం ఏమిటి?

జరుగుతుంది. ప్రతిపక్ష శాసనసభ్యులవైపునుంచి తీవ్ర అభ్యంతరాలు ఎదురౌతాయి. ఒక్కొక్కప్పుడు వారు సలహాలు, సూచనలు ఇస్తారు. అధికార, ప్రతిపక్ష శాసన సభ్యులతో ఒక కమిటీవేసి సలహాలను, మార్పులను అధ్యయనం చేయమంటారు. మార్పులు చేర్పులు జరిగిన తరవాత ఆ బిల్లు కేబినెట్ ఆమోదం పొంది, అసెంబ్లీ/విధానసభ ముందుకు ఓటింగ్‌కు వస్తుంది. 50 శాతంకంటే ఎక్కువమంది ఆమోదం పొందిన తర్వాత ఆ బిల్లును రెండో సభ అయిన విధాన పరిషత్తులో ప్రవేశ పెడతారు. విధాన-పరిషత్తు కూడా ఆమోదిస్తే, దాన్ని గవర్నర్ ఆమోదం కోసం పంపిస్తారు. గవర్నర్ ఆమోదం పొందిన తరవాత ఆ బిల్లు చట్టంగా లేదా శాసనంగా మారి, గెజిట్‌లో అచ్చువుతుంది.

**చట్టసభలో చర్చలు:**

ఉదాహరణగా ఊహాజనిత శాసన సభలో చర్చలు ఎలా జరుగుతాయో చూద్దాం.

**శాసనసభ్యుడు (1) :** గౌరవనీయులైన అధ్యక్షా! గత మూడు సంవత్సరాలుగా వర్షాభావ పరిస్థితులవల్ల నా నియోజక వర్గంలోని భూగర్భజలాల మట్టాలు బాగా తగ్గిపోయాయి. ప్రభుత్వం దీనిగురించి ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. దీనికి తోడు బోరుబావుల సంఖ్య కూడా పెరిగిపోయింది. ఈ విషయంలో ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారో భూగర్భజలశాఖామంత్రిగారు వివరించాల్సిందిగా కోరుతున్నాను.

**శాసనసభ్యుడు (2) :** ఔను. అధ్యక్షా! నా నియోజకవర్గంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. అధికారుల పనితీరు సంతృప్తికరంగా లేదు. నీళ్లకోసం ప్రజలు మైళ్ల దూరాలకి నడిచిపోవాల్సి వస్తోంది.



చిత్రం - 16.4

SCERT, TELANGANA

**శాసనసభ్యుడు (3) :** మాన్యులైన అధ్యక్షా! చెరువుకట్టలను గట్టిపరచడానికి తగిన నిధులను సమకూర్చాలి, పూడిక తీయించాలి, వర్షాకాలంలో కురిసే వాన నీటిని నిలవ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలి. చెరువు కట్టలకు గండిపడకుండా చెరువు గట్లమీద చెట్లను పెంచాలి.

**శాసనసభ్యుడు (4):** మాన్యఅధ్యక్షా! పరిస్థితుల గురించి ప్రభుత్వానికి తెలుసు. ఇంకా నష్టం జరగకుండా ప్రభుత్వం తగిన ముందుజాగ్రత్త చర్యలను చేపట్టాలి. నీటి నిలవలు తగ్గినందువల్ల ఇబ్బంది పడుతున్న మండలాలను గుర్తించాలి.

**శాసనసభ్యులు (5) :** గౌరవ అధ్యక్షా, ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వ చర్యలను అభినందిస్తూ నిర్మాణాత్మక సలహాలనివ్వవలసిందిగా కోరుతున్నాను. వారు అనవసరంగా ప్రభుత్వాన్ని విమర్శించగూడదు. నా నియోజకవర్గంలో కొండవాలులో కట్టలను నిర్మించినందువల్ల భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వాధికారులు కూడా ప్రజలకు అందుబాటులోనే ఉన్నారు.

**శాసనసభ్యుడు (6) :** గౌరవ అధ్యక్షా! నా నియోజక వర్గంలో పారిశ్రామిక సంస్థలు వ్యర్థ, కలుషిత జలాలను నదిలోకి వదులుతున్నందువల్ల ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతోంది. ప్రభుత్వం ఈ విషయంలో ఏమి చర్యలు తీసుకుంటున్నదో తెలపవలసినదిగా కోరుతున్నాను. మంచినీటి సమస్యకూడా అధికంగా ఉంది.

**మంత్రి :** మాన్య అధ్యక్షా! ప్రజల ఆరోగ్యంమీద ప్రభుత్వానికి చాలా శ్రద్ధ ఉంది. కరువు పీడిత మండలాలలో నివారణ చర్యలను, జలరక్షణ చర్యలన్నిటిని తీసుకుంటోంది. చెరువులను అభివృద్ధిచేయడం, చెట్లు నాటించడం, అక్రమ ఇసుక తవ్వకాలను నిషేధించడం వంటి చర్యలను తీసుకున్నాం. గౌరవసభ్యుల సూచనలన్నిటిని పరిగణనలోకి తీసుకుంటాం. అలాగే ఈ పథకాలన్నీ సక్రమంగా అమలుచేయడానికి గౌరవ సభ్యుల మద్దతును కూడా కోరుతున్నాం.

- మీరే శాసనసభ్యులై ఉంటే పై సమస్యకు ఎలా స్పందిస్తారు?
- అధికార పక్షం, ప్రతిపక్ష శాసనసభ్యుల పాత్రల మధ్యగల తేడా ఏమిటి?

పిల్లల భద్రతను పరిరక్షించుటకు భారత ప్రభుత్వం రెండు ప్రత్యేక చట్టాలను చేసింది. అవి 1) బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2012 (POCSO Act - 2012). ఈ చట్టం బాలలకు సంక్షేమము మరియు భద్రత కల్పిస్తుంది.

2) బాల నేరస్తుల న్యాయచట్టం, 2015. ఈ చట్టం బాల నేరస్తులకు పరిరక్షణ మరియు న్యాయరక్షణను (అనాథలు, ఇతరులు) కల్పిస్తుంది. వారికి విద్యా, వైద్యం, పౌష్టిక ఆహారం మరియు కౌన్సిలింగ్ అందించి సమాజంలో వారికి నిర్మాణాత్మక పాత్రను నిర్వహించునట్లు సహాయపడుతుంది.

**కీలకపదాలు:**

1) మానిఫెస్టో

2) కేబినెట్

3) స్పీకర్

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) ప్రజల జీవితానికి సంబంధించి ఏ ఏ విషయాలలో చట్టాలు చేయవచ్చు?

2) మీ పాఠశాల, పాఠశాల విద్యాశాఖకు సంబంధించినది. మీ పాఠశాలకు వర్తించే కొన్ని చట్టాలను తెలపండి. (విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్, తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సంఘం).

Y1A1X1

3) 6-14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరూ బడిలో చదువుకోవాలనే చట్టం ఉంది. ఈ చట్టం అమలుకు ఏ చర్యలు తీసుకోవాలి? మీ టీచరు సహాయంతో చర్చించండి.

SCERT, TELANGANA

4) పేజి నెం. 154లోని 'చట్టాలు చేయటం' ఉపశీర్షిక క్రింద గల పేరా చదవండి. కింది ప్రశ్నకు జవాబులు రాయండి.

ఒకవేళ మీరు తెలంగాణ శాసనసభ్యులైతే ఏ సమస్యను గురించి లేదా ఏ విషయాన్ని గురించి చట్టం చెయ్యాలనుకుంటున్నారు? ఎందుకు? ఉదాహరణతో వివరించాలి.

5) పురబ్‌గర్ అనే పేరుగల రాష్ట్రంలోని శాసన సభలో 368 సభ్యులున్నారని అనుకుందాం. ఎన్నికల తరవాత వివిధ పార్టీల బలాబలాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

| | | | |
|---|---|---|---|
| పార్టీ-ఎ - | 89 | పార్టీ-బి - | 91 |
| పార్టీ-సి - | 70 | పార్టీ-డి - | 84 |
| ఇతరులు - | 34 | మొత్తం - | 368 |

**పై పట్టికను జాగ్రత్తగా పరిశీలించి ఈ కింది ప్రశ్నలకు సమాధానాలు చెప్పండి:**

ఎ) ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటానికి తగిన మెజారిటీ రావాలంటే కనీసం ఎన్ని సీట్లను పొందిఉండాలి?

బి) ఈ ఎన్నికల ఫలితాల ఆధారంగా అత్యధిక స్థానాలను గెలిచిన ఒకేఒక పార్టీ ఏది?


సి) ఈ ఎన్నికల్లో ఎన్నికయిన అతిపెద్ద పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయగలదా? లేనిపక్షంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయటానికి ఇతర ప్రత్యామ్నాయాలు ఏమిటి?

డి) ఒకే పార్టీతో ఏర్పాటుచేసిన ప్రభుత్వానికీ సంకీర్ణ ప్రభుత్వానికీ తేడా ఏమిటి?

6) ప్రస్తుతం మనదేశంలో కొన్ని రాష్ట్రాలు మాత్రమే ద్విసభా విధానాన్ని కలిగిఉన్నాయి. అవి ఏమిటి?

7) పటం-1 ఆధారంగా మీ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పేర్లను గుర్తించి, మీ జిల్లా పటంలో రాయండి.

8) పాఠ్యాంశ విషయం ఆధారంగా కింది చిత్రాలకు ఊహాత్మక సంభాషణలు రాయండి.



SCERT, TELANGANA

పాఠం 17

T1B6L8

# జిల్లాలో చట్టాల అమలు

గత పాఠంలో చట్టాలు ఎలా చేస్తారో, సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలను ఎలా రూపొందిస్తారో తెలుసుకున్నాం. మరి ఇవి ఎలా అమలుజరుగుతున్నాయి? ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులే వీటిని అమలుపరుస్తుంటారని మీరు భావిస్తున్నారా? ఇప్పుడు ఈ పనులు ఎలా అమలు జరుగుతున్నాయో తెలుసుకుందాం. కింది అంశాలను మీ తోటి విద్యార్థులతో చర్చించండి.

1) ప్రాజెక్టులు, కాలవల నిర్మాణం
2) ఇండ్లకు విద్యుత్తు సరఫరా
3) చౌకధరల దుకాణం నిర్వహణ
4) రైలురవాణా
5) రూపాయి నోట్ల ముద్రణ (కరెన్సీ ముద్రణ)
6) ప్రజలనుంచి పన్నుల వసూలు
7) బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలలందరికి చదువు
8) భారతదేశ సరిహద్దుల రక్షణ
9) దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించడం, వారి అభ్యున్నతికి పథకాలను అమలుపరచడం.
10) దొంగతనాల నివారణ, ప్రజల ఆస్తుల రక్షణ

- ఇంకా ఇవికాక, మీరు చాలారకాలుగా ప్రభుత్వం నిర్వహిస్తున్న విధులను గురించి వినిఉంటారు. వాటిలో కొన్నింటిని గుర్తించి మీ తోటి విద్యార్థులతో చర్చించండి.

మనం కిందటి పాఠంలో, ప్రభుత్వంలోని వివిధ శాఖలు వివిధ కార్యక్రమాలను నిర్వహించడం చూశాం. ఈ శాఖలన్నీ మంత్రుల ఆధీనంలో ఉంటాయి. ఈ ప్రభుత్వ శాఖలలోని ఎంతోమంది అధికారులు మంత్రుల ఆదేశాలను అమలుపరుస్తుంటారు. ఈ అధికారులలో కొంతమంది రాష్ట్ర రాజధాని హైదరాబాదులో విధులను నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదేశాలు రాష్ట్రమంతటా అమలుపరచడానికి చర్యలు తీసుకుంటారు. అలాగే మొత్తం రాష్ట్రాన్ని పరిపాలనా సౌలభ్యంకోసం వివిధ జిల్లాలుగా విభజించారు. జిల్లాలలో ప్రతి ప్రభుత్వశాఖ తన కార్యాలయాన్ని ఏర్పరిచి చట్టాలను, ప్రభుత్వ పథకాలను అమలుపరుస్తూ ఉంటాయి. తెలంగాణలో 31 జిల్లాలు ఉన్నాయి.


- మీ జిల్లా పేరు ఏమిటి? దాని ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

SCERT, TELANGANA

ప్రతి జిల్లాకూ వివిధ శాఖల పనుల సమన్వయానికి ఒక జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ ఉంటారు. మనం ఇప్పుడు జిల్లా కలెక్టర్ మెజిస్ట్రేట్ నిర్వహించే వివిధ పనులను తెలుసుకుందాం.

### నల్లవరం జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్:

నల్లవరం జిల్లా ఒక ఊహాజనితమైన జిల్లాగా ఇక్కడ తీసుకున్నాం. ఆ జిల్లాలో ఈ కింద తెలిపిన మండలాలు ఉన్నాయి. అవి గారిపల్లి, మల్లేపల్లి, నర్సాపేట, గుర్తూరు, నల్లవరం. జిల్లా కలెక్టర్ కార్యాలయం నల్లవరం పట్టణంలో ఉంది.




*చిత్రం-17.1 నల్లవరం జిల్లా*

మనీషా నాగ్లే నల్లవరం జిల్లా కలెక్టర్. ఈమె ప్రతి రోజు ఉదయం 10.30 గంటలకు తన కార్యాలయానికి వస్తారు. ఈరోజు ఉదయం 11.30 గంటలకు వివిధ విభాగాధిపతులతో సమావేశం ఉండటంతో అధికారులందరూ వచ్చారు. జిల్లా కలెక్టరు మెజిస్ట్రేట్ సమీక్ష నిర్వహిస్తూ శాఖాధిపతుల నుంచి గతనెలలో వారివారి శాఖలలో సాధించిన ప్రగతిని తెలుసుకుంటున్నారు. అలాగే కార్యక్రమాల నిర్వహణలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సమావేశం మధ్యాహ్నం 2.00 గంటల వరకు జరిగింది.

సమావేశానంతరం మనీషా నాగ్లే తన కార్యాలయంలో ఉన్న ఫైళ్లను పరిశీలిస్తూ అవసరమైన చోట తన అభిప్రాయాలను, ఆదేశాలను రాశారు. మొత్తం అన్ని శాఖల ఫైళ్లు పూర్తయ్యే సరికి సమయం మధ్యాహ్నం 3.00 గంటలయింది. ప్రతి రోజూ మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.30 గంటల వరకు జిల్లాలోని వివిధ మండలాల నుండి తమసమస్యలను చెప్పుకోడానికి వచ్చిన ప్రజలను కలుసుకుంటారు.

మల్లేపల్లి మండలం నుండి కొంతమంది రైతులు వారి గ్రామంలోని సాగునీటి విషయమై చర్చించడానికి వచ్చారు. వారి గ్రామంలోని చెరువులు గత రెండు సంవత్సరాల నుండి ఎండిపోవటంవల్ల పంటలు పండటంలేదు. అందువల్ల వారు తీసుకున్న రుణాలను మాఫీ చేయించుకోడానికి, చెరువు కట్టలను బాగు చేయించడానికి కలెక్టరు వద్దకు వచ్చారు. వారి సమీప గ్రామంలోని చెరువు కట్టలను బాగుచేయించారని అదే విధంగా వారి గ్రామంలోని చెరువు కట్టలను మరమ్మతు చేయించి నీటిసమస్య తీర్చాలని కోరారు.

రైతుల సమస్యలను మనీషా నాగ్లే పూర్తిగా విని వారి గ్రామం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వర్షాభావ ప్రాంతాల లిస్టులో లేనందువల్ల రుణాలను మాఫీచేయటం కుదరదని వివరించారు. అయితే "మీరు మీ సంబంధిత ఎమ్.ఎల్.ఎ.ను కలుసుకొని మీ సమస్యలను వివరించమ"ని సూచన చేశారు. సాగునీటిశాఖ ద్వారా గ్రామంలోని చెరువు కట్టలను బాగుచేయిస్తానని ఆమె వారికి హామీ ఇచ్చింది.

మరునాడు ఉదయం 5.00 గంటలకు నరసాపేట మండలం నుంచి ఒక ఫోన్‌కాల్ వచ్చింది. నరసాపేట పట్టణంలో జిన్నింగ్ మిల్‌లో నిలవ ఉంచిన పత్తి తగులబడుతోంది. స్థానిక ప్రజలు మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. అగ్నిమాపక శాఖవారు అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెస్తున్నారు. మంటలు పక్క ప్రాంతాలకు వ్యాపించకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. మనీషా నాగ్లే వెంటనే నరసాపేట బయలుదేరుతూ జిల్లా పోలీసు సూపరింటెండెంటును, వైద్యాధికారిని తనతోపాటు రావాలని వారికి ఫోన్ చేసారు.

కలెక్టరు ఉదయం 7.00 గంటలకు నరసాపేటలో జిన్నింగ్ మిల్లుకు చేరుకుని అక్కడ పరిస్థితులను

SCERT, TELANGANA




*చిత్రం-17.2 పత్తి జిన్నింగ్ పరిశ్రమలో జిల్లా కలెక్టరు*

పరిశీలించారు. పెద్దమొత్తంలో నిలవ చేసిన పత్తి మంటలలో కాలిపోయింది. మంటలు అదుపులోకి వచ్చాయి. మున్సిపల్ చైర్‌పర్సన్, పోలీసు అధికారులు కూడా అక్కడకు వచ్చారు. అక్కడకు వచ్చిన అధికారులకు ఎంత నష్టం జరిగిందో అంచనావేయమని కలెక్టర్ ఆదేశించారు. పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ ఈ ప్రమాదంవల్ల ఇద్దరు కార్మికులకు తీవ్రగాయాలు అయ్యాయని, వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించామని కలెక్టర్ గారికి చెప్పారు. ప్రమాద స్థలాన్ని ఆనుకొని ఉన్న కొన్ని ఇండ్లు కూడా కాలిపోయాయని చెప్పారు.

మనీషా ఈ ప్రమాదంలో కాలిపోయిన ఇంటి యజమానులకు 10 వేల రూపాయల పరిహారాన్ని ప్రకటిస్తూ ఈ ప్రమాదానికి కారణాలను కనుక్కోవడానికి విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చింది. ప్రమాదంలో గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు కార్మికులకు ఒక్కొక్కరికి 20 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం కలెక్టర్ ప్రకటించారు.

ఆమె తిరిగివస్తూ పట్టణ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. పట్టణంలోని అన్ని రోడ్లూ ఆక్రమణకు గురికావటం, పాదచారులకు ఉద్దేశించిన మార్గంలో కూడా వ్యాపారస్తులు ఆక్రమించుకొని షాపులు నిర్మించుకోటంవల్ల అగ్నిమాపక యంత్రం ప్రమాద స్థలానికి చేరుకోవటంలో ఆలస్యం అయిందని ఆమె గమనించింది. చట్టవిరుద్ధంగా ఇంటి యజమానులు, కార్యాలయాలు వారి సరిహద్దు గోడలను పెంచుకోటంవల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోంది. దీనిపైన కఠిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని తదుపరి జరగబోయే సమీక్ష సమావేశంలో తనకు నివేదిక అందజేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించింది. తదుపరి ఎంతో చీకటి పడిన తరువాత నల్లవరం పట్టణాన్ని చేరుకున్నారు.

ఇప్పుడు మనం చర్చించిన నల్లవరం జిల్లా ఒక ఊహాజనిత జిల్లా. నల్లవరం జిల్లా కలెక్టరు నిర్వహించిన విధంగా అన్ని జిల్లాల్లో కలెక్టర్లు విధులు నిర్వహిస్తుంటారు.

- ఋణాల మాఫీ గురించి, రైతులు జిల్లా కలెక్టర్‌కు ఏ విధంగా వివరించారు?
- ఈ సంఘటనలో ఏయే ఇతర అధికారులను పేర్కొన్నారు.
- పై సన్నివేశంలో పేర్కొన్న అనధికారులు ఎవరు?

**తహశీల్దార్ (మండల రెవెన్యూ అధికారి), గ్రామ రెవెన్యూ అధికారి:**

నల్లవరం జిల్లా వివిధ మండలాలుగా విభజించి ఉండటం మీరు గమనించవచ్చు. ఒక మండలంలో కొన్ని గ్రామాలు ఉంటాయి. మీ జిల్లా పటంలో వివిధ మండలాలను, గ్రామాలను పరిశీలించండి. జిల్లా కేంద్రంలో మాదిరిగా మండల కేంద్రంలో మండల అభివృద్ధి, రెవెన్యూ, విద్య, వ్యవసాయ కార్యాలయాలతో పాటు వివిధ కార్యాలయాలు ఉంటాయి.

- మీ మండలాన్ని జిల్లాపటంలో గుర్తించండి.
- మీ జిల్లాలో ఉన్న ఇతర మండలాలు గుర్తించండి.

SCERT, TELANGANA

ఇతర కార్యక్రమాలతోపాటుగా భూమికి సంబంధించిన రికార్డులు నిర్వహించటం కూడా ప్రభుత్వ కర్తవ్యం. మీరు ఏదైనా గ్రామంలోగాని లేదా సొంత స్థలంలోగానీ నివసిస్తూంటే అది మీ సొంతమని తెలిపే భూమి రికార్డులను మీ తల్లిదండ్రుల వద్ద చూడవచ్చు. దేశంలోని మొత్తం భూభాగాన్ని లెక్కించి, ఆ వివరాల రికార్డులను సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలలో ఉంచుతారు. అలాగే భూమికి సంబంధించిన పట్టాలను యాజమాన్యపు హక్కు కలిగిన ప్రజల వివరాలు, అందులో పండే పంటలు, చెరువులు, నీటి పారుదల విధానం, బావులు, సరిహద్దులు, రోడ్లు, కొండలు ఇలా వివిధ రకాలయిన వివరాలు పటంలో ఉంటాయి. ఈ రకమైన ధ్రువీకరణ పత్రాలు ఎంతో ఉపయోగకరమైనవి. ఎవరి మధ్యనైనా భూమికి సంబంధించి, సరిహద్దులకు సంబంధించి వివాదాలు తలెత్తినప్పుడు ఈ పటాల ద్వారా, రాతపూర్వక ధ్రువీకరణ పత్రాల ద్వారా వివాదాలను పరిష్కరించవచ్చు. అంతేకాకుండా ఎవరైనా తమ భూమిని అమ్మినా లేదా ఇతరులవద్దనుంచి కొన్నా వాటి వివరాలను నమోదుచేయవలసి ఉంటుంది. అటవీ సంబంధిత భూములు, ఏవిధమైన వ్యవసాయం చేయకుండా ఉండి పశువుల మేతకు ఉపయోగిస్తున్న భూముల పటాలతో కూడిన వివరాలు కూడా ఉంటాయి. అందువల్ల ఎవరైనా ఇతరుల భూములను లేదా ప్రభుత్వ భూమిని ఆక్రమించినా వారిని వెంటనే ఖాళీ చేయించవచ్చు.



చిత్రం-17.3 భూమి రికార్డులతో గ్రామ రెవెన్యూ అధికారి

గ్రామస్థాయిలో విలేజ్ రెవెన్యూ అధికారి, మండల స్థాయిలో తహశీల్దారు (మండల రెవెన్యూ అధికారి) భూసంబంధిత రికార్డుల వివరాలకు బాధ్యత వహిస్తారు. దీనికోసం 'మీ సేవ' సేవలను వినియోగించుకుని వివిధ రకాల ధృవపత్రాలను జారీ చేస్తారు. అలాగే వారు ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని నమోదుకు, రేషన్ కార్డుల జారీకి బాధ్యత వహిస్తారు.

## చట్టాలను ఏ విధంగా అమలు చేస్తారు?

దీన్ని మనం అర్థంచేసుకోవాలంటే మనకు ముందు చట్టం అంటే ఏమిటో తెలియాలి. వెనకటి పాఠ్యాంశంలో మనం నీటి వనరుల ప్రాముఖ్యాన్ని, వ్యవసాయ అభివృద్ధికి దాని ఆవశ్యకతను గురించి తెలుసుకున్నాం. మనకు ద్వీపకల్ప నదులు, అటవీ ప్రాంతాలు ఉన్నాయి. తెలంగాణలో చాలా ప్రాంతాల్లో నీటికోసం 1500 అడుగుల వరకు బోరు బావులను తవ్వుతున్నారు. ఇలానే కొనసాగితే రాబోయే కాలంలో బోరుబావుల ద్వారా సాగునీరు, మంచినీరు లభించటం కష్టతరమే.

## ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, చెట్ల రక్షణ చట్టం, 2002

రాబోయే తరాలవారి జీవితావసరాల పరిరక్షణకూ, వారి అభివృద్ధికి ఈ వనరులను కాపాడాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2002 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, చెట్ల రక్షణ చట్టాన్ని చేసింది. ఈ చట్టం 19-04-2002 నుండి అమలులో ఉంది. ఈ చట్టంలోని కొన్ని ముఖ్యాంశాలు ఇవి:

SCERT, TELANGANA

ఎ. బోరుబావులను, బావులను తవ్వడానికి మండల రెవిన్యూ అధికారి దగ్గర అనుమతి తీసుకోవాలి.

బి. అనవసరమైన పోటీని నివారించడానికి బావుల తవ్వకంలో నిర్ణీతమైన లోతును, దూరాన్ని పాటించాలి.

సి. వర్షపు నీరు వృథాకాకుండా పరిరక్షణకు చర్యలు తీసుకోటం.

డి. పారిశ్రామిక సంస్థలు తప్పనిసరిగా వ్యర్థజలాలను శుద్ధిచేసి తిరిగి ఉపయోగించుకోవాలి.

ఇ. మంచినీటి పరిరక్షణకు చర్యలు తీసుకోటం.

ఎఫ్. భూగర్భజలాలు తగ్గిన ప్రాంతాలలో నదుల నుంచి ఇసుక తవ్వడం నిషిద్ధం.

జి. సామాజిక అడవుల పెంపకాన్ని విస్తృత పరచటం.

హెచ్. చెట్లను అనుమతి లేకుండా నరకగూడదు. అనుమతి లేకుండా చెట్లను నరికితే అందుకు రెండు చెట్లను విధిగా పెంచాలి.

ఈ చట్టం అమలుకు రాష్ట్రప్రభుత్వం ఒక అథారిటీని ఏర్పాటు చేసింది. దీనిపేరు వాటర్ లాండ్ అండ్ ట్రీస్ ప్రొటెక్షన్ అథారిటి (WALTA). మీరు ఈ చట్టం అమలును జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ కింది అంశాలు తెలుస్తాయి. ప్రభుత్వంలోని వివిధ శాఖలు సంయుక్తంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. మీరు అటవీ శాఖను గమనిస్తే ఈ శాఖ అటవీరక్షణద్వారా నీటి వనరుల లభ్యతను పెంచుతుంది. అలాగే పరిశ్రమల శాఖ నీరును కలుషితం చేయకుండా చర్యలు తీసుకుంటుంది.

కాబట్టి మనం ప్రభుత్వ శాఖలోని వివిధ అధికారులు 'WALTA' చట్టం అమలుకు బాధ్యత వహిస్తున్నారు. వాటిని పట్టికలో కింది విధంగా చూపవచ్చు.

| శాఖ | విషయం |
|---|---|
| భూగర్భ జల వనరులశాఖ | బోరుబావుల నమోదు, ఇసుక తవ్వకం, నీటివనరుల లభ్యత ప్రాంతాల వర్గీకరణ మొదలైనవి. |
| మున్సిపల్ పరిపాలన, పట్టణ అభివృద్ధి శాఖ | వర్షపు నీరు పరిరక్షణ, చెట్లు నాటడం, కొత్త భవనాల నిర్మాణాలకు అనుమతి. |
| గనులు, భూగర్భశాఖ | నీటి స్థలాలలో ఇసుక తవ్వకం నియంత్రణ. |
| అటవీశాఖ | చెట్లు నరకడానికి ముందస్తు అనుమతి. |

ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలు అయితే ఏం జరుగుతుంది? దిగువ సమస్యలను పరిశీలించి ఏ శాఖ ఏ విధంగా తమ బాధ్యతలు నిర్వహించాలో మూల్యాంకనం చేస్తూ, ఒకటి కంటే ఎక్కువ శాఖలు కూడా పాల్గొనవలసి ఉంటుందేమో పరిశీలించండి.

- వ్యవసాయం చేసుకొనే సత్యవతి కొత్తగా బోరుబావి తవ్వించాలని తలచింది. కాని ఆమె తవ్వించాలనుకున్న స్థలం పక్కనే వేరేవాళ్ళ బోరుబావి ఉంది. ఆమె ఏ రకమైన నిబంధనలు పాటించాలి?
- పద్మనాభం నూతన భవనాన్ని నిర్మించాలనుకున్నాడు. అందుకు తన ఇంటికి సమీపంలోని నదినుంచి ఇసుక తీసుకొని రావాలనుకున్నాడు. ఇందుకోసం ఎవరి అనుమతి కావాలి ?
- అప్పారావు ఒక కాంట్రాక్టరు. అతడు అటవీప్రాంతంలో రాతిగనుల తవ్వాకాన్ని ప్రారంభించాలనుకున్నాడు. ఏ శాఖల నుండి అనుమతి పొందాలి.

SCERT, TELANGANA

మనలాంటి ప్రజాస్వామిక దేశాలన్నింటిలో ప్రజలు ఎన్నుకొన్న ప్రతినిధులు మరియు ప్రభుత్వం నియమించిన అధికారులు వివిధరకాల పాత్రలను పోషిస్తున్నారు. గతంలో ప్రజల జీవితాలను శాసించిన రాజులు, పూజారులకంటే ఇది భిన్నమైనది. అయితే సమాజంలోని అసమానతలు, వివక్షత వంటివి అంతరించిపోలేదు. వీటి నిర్మూలనకు కృషి చేయాలి.

**కీలకపదాలు:**

1. మెజిస్ట్రేట్
2. తహశీల్దార్
3. చట్టాల అమలు
4. వి.ఆర్.ఓ
5. జిన్నింగ్

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) జిల్లా కలెక్టరు మెజిస్ట్రేటు నిర్వహించే వివిధ కార్యక్రమాలను రాయండి.

2) కింద ఇచ్చిన స్టేట్‌మెంట్‌లను సరిచేయండి.

ఎ) ఎన్నికయిన ప్రజాప్రతినిధుల ద్వారా చట్టం అమలు అవుతుంది.

బి) మండలానికి కలెక్టరు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.

సి) మండల అధికారి జిల్లాకు సంబంధించిన మొత్తం సమస్యలను తీరుస్తారు.

డి) తహసీల్దార్ (మండల రెవెన్యూ అధికారి) భూమికి సంబంధించిన రికార్డులు నిర్వహిస్తూంటారు.

3) పేజీ నెం.160 లోని 'తహశీల్దార్ గ్రామరెవెన్యూ అధికారి' పేరాలు చదివి, కింది ప్రశ్నకు జవాబు రాయండి. భూమికి సంబంధించిన రికార్డులను గ్రామస్థాయిలోను, మండల స్థాయిలోను ఎందుకు భద్రపరుస్తున్నారు? ఈ గ్రామ, మండల రెవెన్యూ అధికారుల ముఖ్యమైన విధులు ఏమిటి?

4) గత రెండు అధ్యాయాలలో చట్టాల తయారీ, వాటి అమలు గురించి తెలుసుకున్నాం. వారివారి పాత్రను కింద పట్టికలో నమోదు చేయండి. ($AS_1$)

ఎ) ఎన్నికలలో పోటీచేయవచ్చు.

బి) ప్రభుత్వంలోని వివిధ శాఖలలో భాగస్వాములు.

సి) చట్టాల తయారీలో బాధ్యత వహిస్తారు.

డి) చట్టాల అమలులో బాధ్యత వహిస్తారు.

ఇ) సాధారణంగా 5 సంవత్సరాలకు ఒకసారి ఎన్నికవుతారు.

ఎఫ్) వివిధ పనుల నిమిత్తం ఉద్యోగంలో నియమితులవుతారు.

| శాసన సభ్యులు | పాలనాధికారులు |
|---|---|
| | |
| | |
| | |

SCERT, TELANGANA

5) మనీషా నాగ్లే గురించి మరొక సంక్షిప్త వివరణను జాగ్రత్తగా చదివి కింది పాఠ్యాంశాల ఆధారంగా పోల్చండి. పాఠ్యాంశం-14 “మన్సబ్‌దార్లు, జాగీర్‌దార్లు”, పాఠ్యాంశం-13 “సైనిక దళాల నాయకులు - అమరనాయకులు” ఆధారంగా కింది పట్టిక పూరించండి.

మనీషా నాగ్లే గత ఐదు నెలలుగా నల్లవరం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె జిల్లా కలెక్టర్‌గా రాకముందు రాష్ట్ర రాజధానిలో ప్రజా ఆరోగ్య మంత్రిత్వశాఖలో ఉపకార్యదర్శిగా పనిచేసింది. ఆమెకు మరో జిల్లా కలెక్టర్‌గా లేదా మళ్ళీ రాష్ట్ర రాజధాని సచివాలయానికి బదిలీ అయ్యే అవకాశం కూడా ఉంది. ఆమె భారత ప్రభుత్వ ఉద్యోగి. వీరిలో కొందరు తరచుగా ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ పనులు చేయుటకై వెళ్లవలసి ఉంటుంది. మనీషానాగ్లే వంటి అధికారులందరూ ప్రభుత్వం నిర్వహించే పరీక్షలద్వారా నియమించబడతారు.

| అంశం | ప్రభుత్వ ఉద్యోగులు | అమర నాయకులు | మన్సబ్‌దార్లు |
|---|---|---|---|
| నియామక విధానం | | | |
| వేతనాల చెల్లింపు | | | |

6) మీ జిల్లా పటంలో మీ మండలానికి ఉన్న సరిహద్దు మండలాలకు రంగులు వేయండి.

చర్చ : చట్టాలు-అమలు గురించి రెవెన్యూ అధికారులతో (తహశీల్దారు/ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్/గ్రామ రెవెన్యూ అధికారి) విద్యార్థుల ముఖాముఖి నిర్వహించండి.

**ప్రాజెక్టు పని:**

1. మీ పాఠశాల ఉపాధ్యాయులను లేదా వేరే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను ఇంటర్వ్యూ చేయండి. ఆమె/ఆయన నియామకం ఏ విధంగా జరిగింది? ఆమె/ఆయన ఏ ప్రభుత్వ శాఖాధికారికి రిపోర్టుచేస్తారు? ఆమె/ఆయనకు బదిలీలు ఉంటాయా? ఆమె/ఆయన ఏవిధంగా పదోన్నతి పొందుతారు? లేదా శిక్షణపొందుతారు? ఆమె/ఆయన జీతభత్యాలకు ఎవరు బాధ్యతవహిస్తారు? ఆమె/ఆయనకు పనిలో ఏమైనా సమస్యలు ఉంటే ఎవరికి ఫిర్యాదుచేసుకోవాలి?
2. పాఠశాలలో నమోదు సంఖ్యను పెంచటం, మధ్యాహ్న భోజనం అమలు లేదా ఇతర వేరే నూతన కార్యక్రమాల అమలులో వారి అనుభవాలు ఏమిటి?

సేకరించిన సమాచారం ఆధారంగా తరగతి గదిలో వివరించండి.

SCERT , TELANGANA

పాఠం 18

# కులవివక్ష - సమానత్వానికై పోరాటం

D2S1V6

కులవివక్ష మనదేశంలో అసమానతకు చెందిన ఒక ప్రధాన రూపాన్ని సృష్టించింది. అనేక శతాబ్దాలుగా ప్రజలు కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. మన రాజ్యాంగం కూడా దీనిని రూపుమాపటానికి కృషిచేస్తోంది. కులవివక్ష రూపుమాపడం మన ప్రభుత్వాల ప్రధాన ఆశయాల్లో ఒకటి. కుల వ్యవస్థ ఎలా పనిచేస్తుందో, కులపరమైన అసమానతలను తొలగించటానికి తీసుకుంటున్న చర్యలేమిటో తెలుసుకుందాం.

మన దేశంలో చాలా మంది తాము ఏదో ఒక కులానికి చెందిన వారమని అనుకుంటుంటారు. వారు తమ పేర్లతో పాటు కులాల పేర్లను కూడా కలిపి పెట్టుకుంటారు. సాధారణంగా ఒక కులానికి చెందిన వారు కొన్ని సామాన్య ఆచారాలను, ఒక ప్రత్యేక దేవతను ఆరాధించడం వంటివి పాటిస్తారు. కులనియమాలను పాటించే చాలా మంది వారి కులంలోని వారినే వివాహం చేసుకుంటారు. ప్రాచీన కాలంలో ఒక కులానికి చెందిన వారు ఒకే వృత్తిని చేసేవారు. నేడు ఈ పరిస్థితి వేగంగా మారుతోంది. ఆ విధంగా కుల వ్యవస్థ కొన్ని వర్గాల ప్రజల మధ్య బంధాలను సృష్టిస్తే మరికొన్ని వర్గాల వారిని వేరుచేస్తుంది.

- ఈ అంశాలు మీ ప్రాంతంలో ఎంత వరకు నిజమనిపిస్తున్నాయి? అవి ఎంత వరకు మారాయో మీ తరగతిలో చర్చించండి.

కుల వ్యవస్థ మన సమాజంలో అనేక అసమానతలను, వివక్షను పెంచింది. ఇది ఎలా జరుగుతుందో చూద్దాం.


ప్రజలు తమ జీవనాధారం కోసం బోధన, వడ్రంగం, కుండల తయారీ, నేతపని, చేపలు పట్టడం, వ్యవసాయం చేయడం వంటి వివిధ రకాల పనులలో నిమగ్నమవుతారు. కొన్ని రకాల పనులు ఇతర పనుల కంటే ఎక్కువ విలువైనవిగా భావిస్తున్నారు. శుభ్రం చేయడం, బట్టలు ఉతకడం, జుట్టు కత్తిరించడం, చెత్తతీసివేయడం వంటి పనులను తక్కువ విలువైనవిగా చూస్తూ, ఆ పనులు చేసే వారిని అపవిత్రులుగా, మురికివారుగా చూస్తున్నారు. కులవ్యవస్థలో ఈ విశ్వాసమే ప్రధానమైనది. సమాజంలో కుల వ్యవస్థ అనే నిచ్చెన పై భాగంలో కొందరిని, వారికి దిగువన మరికొందరిని చూపించారు. ఈ నిచ్చెన పై భాగంలో ఉన్న వారిని ఉన్నత కులాల వారిగా, గొప్పవారిగా చూపించారు. అదే నిచ్చెనలో దిగువ చూపిన వారిని అప్రాధాన్యులుగా, అంటరానివారిగా పిలిచారు. అంటరానివారిని వారికి కేటాయించిన పనులకు మాత్రమే అనుమతిస్తూ ఇతర పనులలోకి వెళ్ళకుండా కుల నియమాలను విధించారు. ఉదాహరణకు కొన్ని వర్గాల వారిని చెత్త తీసుకెళ్లడానికి, చనిపోయిన జంతువులను తొలగించడానికి మాత్రమే అనుమతించేవారు. కాని వారిని ఉన్నత కులాల వారి ఇంటిలోకి ప్రవేశించడానికి గాని, గ్రామ బావి నుండి నీరు తోడుకోవడానికి గాని, దేవాలయాల్లో ప్రవేశించడానికి అనుమంతించేవారు కాదు. వారి పిల్లలను పాఠశాలల్లో ఇతర కులాలకు చెందిన పిల్లల పక్కన కూర్చోనిచ్చేవారు కాదు. ఎగువ కులాల

SCERT, TELANGANA

వారు అనుభవించే హక్కులను అంటరానివారు అనుభవించటానికి అవకాశం ఇచ్చే వారు కాదు.

- ప్రజల మధ్య కుల వ్యవస్థ ఏ విధమైన అసమానతలను పెంచుతుందని భావిస్తున్నారు?

చదువుకోవడం, తాము కోరిన ఉద్యోగాలను చేయడం వంటి వాటికి కొంత మందిని అనుమతించకపోతే వారు వివక్షకు గురిఅవుతున్నారని చెప్పవచ్చు. భారతదేశపు గొప్ప నాయకులలో ఒకరైన డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్ 1901 సంవత్సరంలో, 9 సంవత్సరాల వయసులో కులవివక్షను అనుభవించిన ఒక సంఘటనను చూద్దాం. ఆయన ఒకసారి కోరెగావ్‌లో ఉంటున్న తన తండ్రిని కలవడానికి తన సోదరులతో కలిసి వెళ్ళాడు. అది ఇప్పుడు మహారాష్ట్రలో ఉంది.



**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్**
**(1891-1956)**
**భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులు, మొట్టమొదటి భారతదేశ న్యాయశాఖా మంత్రి**

"చాలాసేపు వేచిఉన్నాం. కాని మా వైపు ఎవరూ రాలేదు. ఒక గంట తరువాత రైల్వేస్టేషన్ మాస్టర్ మా వద్దకు వచ్చి టికెట్లు అడిగారు. మీరెందుకు వేచియున్నారని అడిగారు. మేం కోరెగావ్ వెళ్ళాలి. మా కోసం మా నాన్నగారు లేదా అతని సేవకుడు గాని రావాలి. కాని ఎవరూ రాలేదు. అక్కడికి ఎలా వెళ్ళాలో మాకు తెలియదు. మేం మంచి దుస్తులు ధరించిఉన్నాం. మా దుస్తులు లేదా మాట్లాడే భాషవల్ల మమ్మల్ని అంటరానివారి పిల్లలని ఎవరూ గుర్తించలేదు. స్టేషన్ మాస్టర్ మమ్మల్ని బ్రాహ్మణ పిల్లలుగా భావించి తాకారు. అందరిలాగానే స్టేషన్ మాస్టర్ మీరెవరని ప్రశ్నించారు. వెంటనే మేం మహర్లమని (బాంబే ప్రెసిడెన్సీలో "మహర్" ఒక అంటరాని కులంగా భావించబడేది) చెప్పగానే అతడు నిర్ఘాంతపోయాడు. అతని ముఖం ఒక్కసారిగా మారిపోయింది. తనముఖంలో కనబడే వికర్షణా భావనలను నివారించుకోలేక పోయాడు. వెంటనే మేం అతని గదికి దూరంగా మొదట నిలబడిన స్థలానికి వెళ్లాం. సూర్యాస్తమయం కావస్తోంది కాని మా నాన్నగారుగాని, అతని సేవకుడు గాని రాలేదు. మేం బయలు దేరినప్పటి సంతోషం, ఉత్సాహమంతా కలవరంతో బాధగా మారింది.

అరగంట తర్వాత ఆ స్టేషన్ మాస్టర్ తిరిగి మా వద్దకు వచ్చి మీరేం చేయాలనుకుంటున్నారని అడిగారు. ఒక ఎడ్ల బండి గనుక అద్దెకు లభిస్తే దానిమీద, లేదా దూరం లేకుంటే నడిచైనా వెళ్లగలం అన్నాను. అక్కడ అద్దెకు వెళ్లే ఎడ్ల బండ్లు చాలా ఉన్నాయి. బండ్ల వారి వద్దకు వెళ్లి అడిగినా మేం మహర్లం కావడం వల్ల ఎవరూ కలుషితం కావడానికి గాని, అంటరాని వారిని ఎక్కించుకున్నామని అనిపించుకోవడానికి గాని సంసిద్ధంగా లేరని చెప్పారు. మేం రెండింతల డబ్బు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా అది పని చేయదని తెలిసింది. మా తరపున మాట్లాడదామనుకున్న స్టేషన్ మాస్టర్ ఏమి చేయాలో తోచక నిశ్శబ్దంగా ఉండిపోయాడు."

**మూలం :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచనలు, ఉపన్యాసాలు భాగం-12 వసంత మూన్, బొంబాయి విద్యా విభాగం, మహారాష్ట్ర.

- పిల్లలు డబ్బులు ఇవ్వజూపినప్పటికీ బండివాడు నిరాకరించాడు. ఎందుకు?
- రైల్వేస్టేషన్‌లో ప్రజలు అంబేద్కర్, అతని సోదరుల పట్ల ఎందుకు వివక్ష చూపారు?

SCERT TELANGANA

- పిన్న వయసులో ఉన్న డాక్టర్ అంబేద్కర్ తాము మహర్ కులస్థులని చెప్పినప్పుడు స్టేషన్ మాస్టర్ ప్రతిచర్యను చూసి ఎలాంటి అనుభూతిని పొందాడని మీరు భావిస్తున్నారు?
- మీరు ఎప్పుడైనా వివక్షకు గురయ్యారా? లేదా అలాంటి సందర్భాన్ని చూశారా?
- ఇది మిమ్మల్ని ఎలా ఆలోచింపజేసింది?

ప్రజలు ఒక చోటు నుండి మరొక చోటుకి సులభంగా వెళ్లలేకపోతే ఎంత కష్టంగా ఉంటుందో ఊహించండి. ఎవరైనా మిమ్మల్ని అంటరానివారిగా చూస్తే, అందరూ తాగేనీరు వారు తాగడానికి అనుమతించకపోతే మీకెంత అవమానం, బాధ కలుగుతుందో ఆలోచించండి.

ఒక చోటు నుండి మరొక చోటుకు ఎద్దుల బండిలో డబ్బు చెల్లించి వెళతామని పిల్లలు కోరినప్పటికీ అవకాశం లభించలేదని ఈ చిన్న సంఘటన ద్వారా తెలుస్తోంది. రైల్వేస్టేషన్‌లో ఉన్న ఎడ్లబండ్ల వాళ్లందరూ ఈ పిల్లలను తీసికెళ్ళడానికి తిరస్కరించారు. వారు వివక్షా పూర్వకంగా వ్యవహరించారు. ఈ ఘటన వల్ల కుల వివక్ష దళితులను ఆర్థిక కార్యకలాపాల నుండి నిరోధించడమే కాకుండా వారికి గౌరవాన్ని, హుందాతనాన్ని పొందకుండా చేస్తుందని స్పష్టంగా తెలుస్తుంది.

**పాఠశాలలో వివక్షకు ఒక ఉదాహరణ :**

ఓం ప్రకాశ్ వాల్మీకి ఒక ప్రముఖ దళిత రచయిత. జూఠన్ అనే తన స్వీయచరిత్రలో ఇలా రాశాడు: "మిగతా వారి నుండి నేను చాలా దూరంగా నేలమైన కూర్చుండేవాడిని. నేను కూర్చున్న చోటు వరకు చాప ఉండేది కాదు. కొన్ని సమయాల్లో తలుపు దగ్గరగా అందరి వెనక కూర్చోవలసి వచ్చేది. కొన్నిసార్లు నన్ను అకారణంగా కొట్టేవారు." ఓంప్రకాశ్ 4వ తరగతిలో ఉన్నప్పుడు ప్రధానోపాధ్యాయుడు అతడిని పాఠశాల, ఆటస్థలం శుభ్రపరచమని చెప్పాడు. ఆ సంఘటన గురించి అతను ఇలా రాసాడు: "ఆటస్థలం చాలా విశాలమైనది. చిన్నగా ఉన్న నాకు అదంతా శుభ్రం చేయడం వల్ల వెన్నులో నొప్పి వచ్చేది. ముఖమంతా దుమ్ముతో నిండిపోయేది. దుమ్ము నోట్లోకి కూడా పోయేది. నా తరగతిలోని మిగతా విద్యార్థులందరూ చదువుకుంటుండగా నేను ఊడుస్తుండేవాడిని. ప్రధానోపాధ్యాయుడు తన గదిలో కూర్చుని నన్ను గమనించేవాడు. మంచినీరు తాగడానికి కూడా నన్ను అనుమతించేవాడు కాదు. రోజంతా ఊడ్చాను. తలుపులు, కిటికీలు పాఠశాలలోని అన్ని గదులను శుభ్రంచేశాను. నేనీపనులు చేస్తుండగా ఉపాధ్యాయులు, విద్యార్థులు చూస్తుండేవారు." ఓం ప్రకాశ్‌తో పాఠశాలను, మైదానాన్ని మరో రెండు రోజులు ఊడ్పించారు. ఓంప్రకాశ్ తండ్రి ఒకనాడు అటుగా వెళ్తూ తన కొడుకు ఊడుస్తూ ఉండటం చూసాడు. అతడు ఓం ప్రకాశ్ చేయి పట్టుకొని వెళ్ళిపోతూ ఉపాధ్యాయులందరితో ఇలా అన్నాడు: " మీరు ఉపాధ్యాయులు... కాబట్టి వదిలి వేస్తున్నాను... కాని దీన్ని మీరు గుర్తుంచుకోండి... ఇతడు సరిగ్గా ఇక్కడే... ఈ పాఠశాలలోనే చదువుతాడు. ఈయన ఒక్కడే కాదు, ఈయన వెనుక చాలామంది వచ్చి చదువుకుంటారు."

- ఓం ప్రకాశ్ వాల్మీకిని ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు ఎందుకు అసమానంగా చూశారని భావిస్తున్నారు?
- మీరే ఓం ప్రకాశ్ వాల్మీకి అని ఊహించుకోండి. ఆ పరిస్థితులలో మీరే ఉంటే ఏమి చేసేవారో నాలుగు వాక్యాలలో రాయండి.

వ్యక్తులను సమానంగా చూడకపోతే వారి హోదాకు ఆటంకం కలుగుతుంది. ఓం ప్రకాశ్ వాల్మీకితో ప్రధానోపాధ్యాయుడు వ్యవహరించిన తీరువల్ల అతని గౌరవం దెబ్బతిన్నది. పాఠశాల అంతా ఊడిపించడానికి అతన్ని ఎంపిక చేయడానికి అతని కులమే కారణం. అతని తోటి వారు, ఉపాధ్యాయులు అతని గౌరవాన్ని గాయపరిచి, అతను ఇతర విద్యార్థుల కంటే తక్కువ అని భావించేలా



SCERT, TELANGANA

వ్యవహరించారు. ఓం ప్రకాశ్ వాల్మీకి పిల్లవాడుగా ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి పెద్దగా ప్రయత్నించక పోవచ్చు. కాని తన కొడుకు ఊడ్వడం చూసి అతని తండ్రి ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి ఈ అసమానతను గురించి ఎదిరించాడు.

నేడు అనేక మంది ఉపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థులందరిలో సమానత్వం, నాణ్యత పెంచడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేస్తున్నారు. వారు దళిత విద్యార్థులను చదువుకోవడానికి మాత్రమే కాకుండా అతిథులను స్వాగతించడం, ప్రార్థనా కార్యక్రమం నిర్వహించడం మరియు ముఖ్యమైన వేడుకలలో ప్రసంగాలు చేయడం వంటి అన్ని పాఠశాల కార్యక్రమాలలో పాల్గొనడాన్ని ప్రోత్సహిస్తున్నారు. అటువంటి ఉపాధ్యాయులు పిల్లలందరూ కలసి కూర్చొని భోజనం చేసేలా మరియు ఆహారం, నీరు వితరణ చేసేలా ప్రయత్నిస్తారు.

- మీ పాఠశాలలో గాని లేదా మీకు దగ్గరలో గల పాఠశాలల్లో గాని అలాంటి ఉపాధ్యాయుల కృషిని చూశారా? ఎలాంటి అనుభవాలను పొందారో మొత్తం తరగతిలో పంచుకోండి.

**ఎప్పుడు ఇలాగే ఉండేదా?**

కాదు. ఒకప్పుడు కుల వ్యవస్థ ఉండేది కాదు. మనం గిరిజన తెగలు, ఆహారసేకరణకై వేటాడిన వారి జీవితాలను చూసాం. వారికి ఆ కాలంలో ఏ కుల వ్యవస్థ లేదు. వేదకాలం తరువాత వర్ణ వ్యవస్థ ఏర్పడి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. ఆ తరువాత కాలంలో వివాహం, కలిసితినడం మొదలైన వాటిపై పరిమితులు విధించడం, అంటరానితనం మొదలైన కొత్త ఆచారాలు ఏర్పడ్డాయి. దిగువ కులాల వారు ఎగువ కులాల వారికి సేవలు చేస్తూ, వారి పట్ల విధేయులై ఉండాలని చెప్పారు. మీరు 11, 12 పాఠాలలో చదివినట్లుగా తెలంగాణతో పాటు, భారతదేశమంతటా ఇలాంటి భావనలు వ్యాపించాయి. ఇలా వ్యాపించిన భావనలను చాలా మంది విమర్శించారు. పుట్టుక ద్వారా కొందరు గొప్పవారుగా ఉండటం అనే విషయాన్ని తాత్వికులైన బుద్ధుడు, మహావీరుడు, రామానుజాచార్యులు, బసవన్న, కబీరు, వేమన వంటి వారు విమర్శించారు. పుట్టుక లేదా వృత్తితో సంబంధం లేకుండా, అందరూ మంచిపనులు చేయవచ్చని, మోక్షాన్ని సాధించవచ్చని బోధించారు. వీరి గురించి మీరు రాబోయే పాఠాలలో విపులంగా చదువుతారు.

**సమానత్వానికై పోరాటం :**

బ్రిటిషు రాజ్యస్థాపన, దానికి వ్యతిరేకంగా ప్రారంభమైన పోరాటాల గురించి మీరు చదివారు కదా! బ్రిటిషు పాలన నుండి స్వాతంత్ర్యం పొందడానికి ఎలా పోరాటం చేశారో, అలాగే అనేకమంది సమానత్వం కోసం కూడా పోరాటం చేశారు. దళితులు, స్త్రీలు, గిరిజనులు, రైతులు వారి జీవితంలో అనుభవించిన అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు.

19, 20 శతాబ్దాల్లో అనేక మంది సంఘ సంస్కర్తలు స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం, వ్యక్తిగౌరవం, ఆర్థిక న్యాయం ఆధారంగా ఒక కొత్త సమాజాన్ని రూపొందించడానికి ప్రయత్నం చేశారు. వారిలో జ్యోతిరావు గోవిందరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, పెరియార్ ఇ.వి. రామసామి నాయకర్, శ్రీనారాయణ గురు, అయ్యంకాలి మొదలైనవారు ముఖ్యులు. వీరిలో కొందరి గురించి 8వ తరగతిలో తెలుసుకుంటాము.

వలస పాలనాకాలంలో తెలంగాణ ప్రాంతంలో కూడా సామాజిక సమీకరణ ఉద్యమాలు ఉద్భవించాయి. పి.వెంకటస్వామి, ఈశ్వరి బాయి, టి.యన్.సదాలక్ష్మి, సి.యస్.ఎతిరాజన్, అరిగెరామస్వామి, యం.వెంకటస్వామి, బి.యస్.వెంకట్రావు మొదలైన ప్రముఖులు ఇటువంటి ఉద్యమాలలో పాలుపంచుకొన్నారు. వారిలో ఒకరి గురించి ఇక్కడ తెలుసుకుందాం.



SCERT, TELANGANA

**బి.యస్.వెంకట్రావు (1896-1953)**

రావు సాహెబ్‌గా పిలువబడే బాతుల వెంకట్రావు హైద్రాబాద్‌లోని ఘాస్‌మండి అనే ప్రాంతంలో జన్మించాడు. ఆయన తండ్రి బాతుల సాయన్న యూరోపియన్ల వద్ద ఇంటిపని చేసేవాడు. తొమ్మిదవ తరగతి వరకు చదివిన బి.యస్.వెంకట్రావు తెలుగుతో పాటు ఆంగ్లం, ఉర్దు, పర్షియన్ మరియు మరాఠి భాషల యందు పండితుడు. నిజాం ప్రభుత్వంలో ప్రజాపనుల శాఖలో చేరకముందు ఆయన పూనాలో శిల్పిగా పనిచేశాడు. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం ప్రభుత్వంలో అత్యున్నత స్థానాలను అధిరోహించాడు.

అణగారిన వర్గాలపై అంటరానితనం యొక్క ప్రభావం తెలిసి ఉన్నందున అంటరానితనాన్ని రూపు మాపడానికి ఆయన నిర్ణయించుకున్నాడు. ఈ లక్ష్య సాధన కొరకు ఆయన యం.గోవిందరాజులు మరియు యం.వెంకటస్వామి సహకారంతో 1922లో ఆదిద్రావిడ సంఘాన్ని స్థాపించారు. దేవదాసి విధానాన్ని రూపుమాపడం, దళితులలో ఐక్యత తీసుకురావడం ఈ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యాలు. తరువాత ఏప్రిల్ 1927లో ఆదిహిందు మహాసభను స్థాపించాడు. ఒక దశాబ్దం తరువాత పూనాలో జరిగిన ప్రభావవంతమైన చర్చల అనంతరం కులవివక్షతపై దళిత యువతను చైతన్యవంతులను చేసే ఉద్దేశ్యంతో అంబేద్కర్‌వాదుల యువజన సంఘం (Youth league of Ambedkarites) అనే సంస్థను స్థాపించాడు. తరువాత కాలంలో అది హైదరాబాద్ రాష్ట్ర అణగారిన వర్గాల సంఘంగా (Hyderabad State depressed classes association) మారింది.

ఈ సంఘ నాయకులు వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ చిన్న చిన్న సమావేశాలను ఏర్పాటు చేస్తూ కులపరమైన అణిచివేత, ఇతర ప్రాంతాలలో జరుగుతున్న కుల విముక్తి ఉద్యమాలు, దళిత రక్షణ కొరకు ఐక్యత మొదలగు విషయాలపై దళితులలో చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేశాడు. వారిలో కొందరు దళితులలో మూఢనమ్మకాలను పారద్రోలడానికి మతపరమైన సంస్కరణలను ప్రచారం చేశారు.

వారు ఘాస్‌మండి ప్రాంతంలో ఇళ్ళు మరియు గ్రంథాలయం నిర్మించి ఆ ప్రాంతానికి "ఆదినగర్" అని పేరు పెట్టాడు. హైదరాబాద్ పట్టణంలో దళితుల కొరకు 18 దేవాలయాలను నిర్మించాడు. బి.యస్.వెంకట్రావు దళితులకు చేస్తున్న సేవను గుర్తించిన డా॥ బాబా సాహెబ్ అంబేద్కర్ 1936లో జరిగిన బొంబాయి ప్రెసిడెన్సీ మెహర్ సమావేశానికి ఆయనను ఆహ్వానించాడు. ఈ సమావేశంలో డా॥ బి.ఆర్.అంబేద్కర్ ప్రతిపాదనలను సమావేశానికి హాజరైన పదివేల మంది ప్రజలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

ఏప్రిల్ 1, 1947న హైదరాబాద్ అసెంబ్లీలో పాలయంపిల్లై ప్రవేశపెట్టిన తీర్మానం పై చర్చ జరిగిన తరువాత అణగారిన వర్గాల అభ్యున్నత కొరకు 20 లక్షల రూపాయలు మంజూరు చేయాలని మండలి అధ్యక్షునికి విన్నవిస్తూ తీర్మానించాడు. కాని వెంకట్రావు ప్రతిపాదించిన సవరణల ఫలితంగా ప్రధానమంత్రిని కోటి రూపాయల నిధి మంజూరు చేయవలసిందిగా కోరాడు. దానికి అనుగుణంగా నిజాం రాజు అణగారిన వర్గాల సంక్షేమ నిధి క్రింద కోటి రూపాయలు మంజూరు చేశాడు. నిజాం రాజు "ఖుర్షు-ఇ-దక్కన్" అనే బిరుదుతో ఆయనను గౌరవించాడు.

1952 సం॥లో బి.యస్.వెంకట్రావ్ రాష్ట్ర శాసన సభ ద్వారా రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యాడు.

**స్వాతంత్ర్యం తర్వాత సమానత్వం**

1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినపుడు మన దేశంలో గల అనేక రకాల అసమానతల గురించి నాయకులు ఆలోచించారు. దేశాన్ని పాలించడానికి గల నియమాలు తెలిపే భారత రాజ్యాంగాన్ని రాసిన వారందరూ నాటి సమాజంలో ఆచరణలో ఉన్న వివక్షను, దానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను గురించి తెలిసినవారే. డాక్టర్ అంబేద్కర్ వంటి నాయకులు దళితుల హక్కుల కోసం పోరాటాలు చేశారు.

SCERT, TELANGANA

వీరంతా భారతీయులందరినీ సమానంగా చూడటానికి రాజ్యాంగంలో లక్ష్యాలు పొందుపరచారు. ఈ సమానత్వ భావన భారతీయులందరినీ కలిపి ఉంచుతుంది. ప్రతి ఒక్కరు సమాన హక్కులను, అవకాశాలను కలిగి ఉండాలి. అంటరానితనం ఒక నేరం. కాబట్టి దీనిని చట్టబద్ధంగా రద్దు చేశారు. ప్రజలు తమకు ఇష్టమైన పనిని చేయడానికి స్వేచ్ఛ కల్పించారు. ప్రభుత్వ ఉద్యోగాలు వివక్ష లేకుండా అందరూ పొందుతున్నారు. దీనితో పాటు భారతరాజ్యాంగం పేద, బలహీన వర్గాల ప్రజలందరికీ సమానత్వపు హక్కు సాధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకొనే బాధ్యతను ప్రభుత్వంపై ఉంచింది.

సమానత్వం సాధించడానికి ప్రభుత్వం రెండు విధాలుగా ప్రయత్నం చేస్తుంది. ఒకటి చట్టాలు చేసి అమలుపరచడం, రెండవది ప్రభుత్వ పథకాల ద్వారా అణగారిన వర్గాల వారి అభ్యున్నతికి కృషి చేయడం. సమానత్వం కోసం ప్రభుత్వం అనేక చట్టాలు చేసి, ప్రతి ఒక్కరి హక్కులను కాపాడే ప్రయత్నం చేస్తుంది. చట్టాలతో పాటు ప్రభుత్వం అనేక పథకాల ద్వారా అనేక శతాబ్దాలుగా అసమానతకు గురవుతున్న అనేక మంది అభివృద్ధి కోసం ప్రయత్నిస్తోంది. చాలా మందికి గతంలో లేని గొప్ప అవకాశాలను ఈ పథకాలు కల్పిస్తున్నాయి.

ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో మధ్యాహ్న భోజన పథకం ఒకటి. ఈ పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెడతారు. ఈ పథకం భారతదేశంలో మొదటగా తమిళనాడు రాష్ట్రంలో ప్రారంభించారు. 2001 సంవత్సరంలో సుప్రీం కోర్టు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకాన్ని ఆరు నెలల్లోగా ప్రారంభించాలని ఆదేశించింది. ఈ పథకం అనేక సానుకూల ఫలితాలనిచ్చింది. ఎక్కువ మంది పేద పిల్లలు పాఠశాలల్లో చేరడం, ప్రతి రోజు పాఠశాలకు రావడం ప్రారంభమయింది. గతంలో భోజనానికి విద్యార్థులు ఇంటికి వెళ్లి మధ్యాహ్నం పాఠశాలకు వచ్చే వారు కాదని, ప్రస్తుతం ఈ పథకం వల్ల విద్యార్థుల హాజరు పెరిగిందని ఉపాధ్యాయులంటున్నారు. విద్యార్థులు భోజనానికి ఇంటికి వెళ్ళినపుడు వారి తల్లులు, వారి వారి పనులు ఆపి పిల్లలకు భోజనం పెట్టాల్సి వచ్చేది. కాని ప్రస్తుతం ఆ అవసరం లేదు. ఎగువ, దిగువ కులాల పిల్లలు పాఠశాలలో కలిసి భోజనం చేయడం వల్ల కుల దురభిమానం తగ్గింది. తెలంగాణలోని దాదాపు అన్ని గ్రామీణ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మహిళా స్వయం సహాయక బృందాల వారే తయారు చేస్తున్నారు. వారిలో చాలా వరకు అణగారిన వర్గాలు, కొన్ని చోట్ల దళిత మహిళలు వంట చేస్తున్నారు. ఈ పథకం ఖాళీ కడుపుతో బడికి వచ్చి, చదువుపై ఏకాగ్రత నిలుపలేని పేద విద్యార్థుల ఆకలిని తీరుస్తుంది.

- ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలేమిటి?
- ఈ పథకం సమానత్వాన్ని ఎలా సాధిస్తుందని భావిస్తున్నారు?

ప్రభుత్వ పథకాలు సమానత్వ అవకాశాలను పెంచడంలో కీలకపాత్ర పోషిస్తున్నా ఇంకా చేయాల్సింది చాలాఉంది. మధ్యాహ్న భోజన పథకం వల్ల పేద విద్యార్థుల నమోదు, హాజరు పెరిగినప్పటికీ, ధనవంతుల పిల్లలు చదువుకునే పాఠశాలలకు, పేద పిల్లలు చదువుకునే పాఠశాలలకు మధ్య చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. ఓం ప్రకాశ్ వాల్మీకి వంటి పిల్లలు ఇంకా నేటికి అనేక పాఠశాలల్లో వివక్షకు గురౌతూనే ఉన్నారు. ప్రజలు వివక్ష గురించి ఇంకా ఆలోచించాల్సి ఉంది.

దీనికి ప్రధాన కారణం మన వైఖరి. అయితే వైఖరుల్లో మార్పులు చాలా నిదానంగా వస్తాయి. వివక్ష చట్ట వ్యతిరేకమని తెలిసినా, ప్రజలు కులం, మతం,





SCERT TELANGANA

వైకల్యం, ఆర్థికస్థితి, లింగవివక్ష ఆధారంగా అసమానతలను కొనసాగిస్తున్నారు. ప్రజలు ఆత్మన్యూనతా భావం లేకుండా ప్రతి ఒక్కరిని గౌరవ మర్యాదలతో చూడటం అనేది వస్తే వైఖరి మారుతుంది. ప్రజాస్వామ్య సమాజంలో సమానత్వాన్ని సాధించడం ఒక నిరంతర పోరాటం. వ్యక్తిగతంగా, సామాజికంగా ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేస్తే సమానత్వాన్ని సాధించడం సాధ్యమవుతుంది.

**కీలకపదాలు:**

1) అస్పృశ్యత
2) పథకాలు
3) రాజ్యాంగం
4) జీవితచరిత్ర

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1) ఒక పొరపాటు చేసినందుకు గాను శిక్షించడానికి, వివక్షతో చూడటానికి మధ్యగల తేడా ఏమిటి? అంబేద్కర్ బాల్యంలో శిక్షంచబడినాడా? లేదా వివక్షకు గురయ్యాడా?

R2Y4K5

2) మన సమాజంలో ఎన్నో కులాలు ఉన్నప్పటికి, వారిలో సమానత్వం ఎప్పుడు కనబడుతుంది.

3) మన రాజ్యాంగం అంటరానితనాన్ని నిర్మూలించి, దీనిని ఒక నేరంగా ప్రకటించింది. ఇది ఆచరణలో పూర్తిగా నిర్మూలించబడిందని మీరు భావిస్తున్నారా?

4) కులపరమైన అసమానతలు తొలగించడానికి పాఠశాల ఎలా దోహదపడుతుంది?

5) సమానత్వం సాధించడానికి ............ కల్పిస్తున్నాయి (పేజి నెం. 170 లోని) పేరాను చదివి వ్యాఖ్యానించండి.

### ప్రాజెక్టు పనులు

1. మీ ప్రాంతంలోని ఒక ప్రభుత్వ పథకాన్ని గురించి తెలపండి. ఆ పథకం ఎందు కొరకు? అది ఎవరి ప్రయోజనానికి ఉద్దేశించింది?

2. మీ తల్లిదండ్రులతో మాట్లాడి వారి బాల్యంలో కుల వ్యవస్థ ఎలా ఉండేదో, క్రమంగా ఏయే మార్పులు చోటుచేసుకున్నాయో, ఏవి కొనసాగుతున్నాయో తెలుసుకొని తరగతి గదిలో చర్చించండి. ఒక నివేదిక తయారుచేసి ప్రదర్శించండి.

SCERT, TELANGANA

పాఠం 19

# జీవనాధారం - పట్టణ కార్మికుల పోరాటాలు

E6C9V9

9వ పాఠంలో మనం కాగితం పరిశ్రమలో పనిచేసే కార్మికుల గురించి చదివాం. ఆనంద్ వంటి కార్మికులు ఎక్కువ జీతాలు, బోనస్ (కంపెనీ లాభాల్లో భాగం), భవిష్య నిధి, ఇతర అలవెన్సులు పొందుతున్నారు. ఆరోగ్య పరిరక్షణ, గృహ వసతి వంటి సదుపాయాలు కూడా వారికి ఉన్నాయి. భారతదేశంలోని కార్మికులందరిలో వీరు ఒక చిన్న భాగం మాత్రమే. అదే కాగితం పరిశ్రమలో ఉమర్, పుష్ప వంటి మరొక రకం కార్మికులున్నారు. వీరికి జీతాలు తక్కువ. ఇతర అలవెన్సులు, వసతులు ఉండవు. మన దేశంలో చాలా మంది కార్మికులు ఉమర్, పుష్ప వంటి వారే. కార్మికులు తమ యజమానులతో చర్చలు జరపడం ద్వారా సంఘాలు, చట్టాల ద్వారా తమ సమస్యలను ఎలా పరిష్కరించుకొంటారో ఈ పాఠంలో తెలుసుకుందాం. ఇందులో ఒక సంఘం గురించి కూడా తెలుసుకుందాం.

ప్రజల ఆసక్తులను బట్టి ప్రభుత్వాలు చట్టాలు చేస్తాయని మనం ఇదివరకు తెలుసుకొన్నాం. పొలాల్లో, ఫ్యాక్టరీల్లో ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమం కోసం చట్టాలు చేస్తారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పరిశ్రమలు చట్టాలను అమలు చేసి, కార్మికులకు మెరుగైన జీతాలు ఇవ్వాలి. ఈ చట్టాలను అమలు చేసే బాధ్యత కార్మిక శాఖపై ఉంది. చట్టాలను సరిగా అమలు చేయకపోతే కార్మికులు కోర్టుల్లో కేసులు వేస్తారు. పరిశ్రమలు శాశ్వత ఉద్యోగుల సంక్షేమాన్ని మాత్రమే పరిరక్షిస్తూ, దినసరి, కాంట్రాక్టు కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు.

ప్రభుత్వ అనుమతి పొందని పరిశ్రమలు కూడా అనేకం ఉన్నాయి. అలాంటి కొన్ని పరిశ్రమల్లో కార్మికుల స్థితిగతులు ఎలా ఉన్నాయో చూద్దాం.

### శాశ్వత కార్మికులు :

హైదరాబాద్‌కు 30 కి.మీ.ల దూరంలో రంగారెడ్డి జిల్లాలో కొత్తూరు పట్టణంలో (నూతన పారిశ్రామిక పట్టణం) ప్రారంభమైన రెండు ఫ్యాక్టరీల గురించి 2002లో నమోదు కాబడిన కింది ఇచ్చిన సమాచారాన్ని చదవండి.

*ఫైబ్రోటెక్స్ (Fibrotex) ఈ పేరు వాస్తవమైనది కాదు. 1976 సంవత్సరంలో ప్రారంభమైన ఒక భారీపరిశ్రమ. (పేరు వాస్తవమైనది కాదు.) ఇక్కడ ఫైబర్‌గ్లాస్ తయారుచేస్తారు. 2002లో ఈ ఫ్యాక్టరీలో మొత్తం 570 మంది కార్మికులు ఉండగా అందులో 140 మంది శాశ్వత కార్మికులు కాగా 60 మంది దినసరి కార్మికులు. వీరిని బదిలీ కార్మికులు అంటారు. అంటే శాశ్వత కార్మికులు పనికి హాజరుకాని సమయంలో వారికి బదులుగా వీరిని పనిలోకి తీసుకొంటారు. మరొక 300 మంది వరకు దినసరి కాంట్రాక్టుపై పనిచేస్తున్నారు.*

SCERT, TELANGANA

*(శాశ్వత కార్మికున్ని సరియైన కారణం లేకుండా, పరిహారం చెల్లించకుండా తొలగించలేరు. కాని ఇతర కార్మికులను సులభంగా తొలగించవచ్చు.)*

ఈ ఫ్యాక్టరీలో బలమైన కార్మిక సంఘం ఉంది. కంపెనీ విధానాలకు అనుగుణంగానే పనిచేసేందుకు ఇది కంపెనీ ప్రోత్సాహంతోనే ఏర్పడింది. కార్మికులు సంఘంలో క్రియాశీలకంగా పాల్గొనడం వల్ల త్వరలోనే ఇది బలమైన కార్మిక సంఘంగా అభివృద్ధి చెందింది. ఇది కార్మికులకు వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించటానికి యాజమాన్యంతో చర్చలు జరుపుతుంది.

ఒప్పందం ప్రకారం కార్మికులందరికీ వేతనాలు, వైద్య సదుపాయాలు Employees State Insurance (ESI ద్వారా), ప్రావిడెంట్ ఫండ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. పెద్ద ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు, చికిత్సా సెలవులు, పనిచేసే చోట సురక్షిత చర్యలు చేపట్టడం, రక్షిత మంచినీటి సదుపాయం, కార్మికుల పిల్లల చదువుకోసం అలవెన్సు, రవాణా సదుపాయం, సెలవుల్లో విహారయాత్రా అలవెన్సు (Leave Travel Allowance) వంటి సౌకర్యాలను కార్మిక సంఘాలు సాధించాయి. అవసరమైనప్పుడు ఫ్యాక్టరీ అప్పు ఇస్తుంది. కార్మికులు నివసించడానికి క్వార్టర్లు ఇస్తుంది. ఫ్యాక్టరీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్మికులకు శిక్షణ ఇప్పిస్తుంది. వస్తువుల నాణ్యత పెంచడానికి వారిని విదేశాలకు పంపి శిక్షణ ఇప్పిస్తుంది. ఒక నిర్ణీత కాలం ముగిసిన తర్వాత కాంట్రాక్టు కార్మికుల సర్వీసును క్రమబద్ధీకరించి, వారిని శాశ్వత కార్మికులుగా గుర్తించడానికి కార్మిక సంఘాలు యాజమాన్యంతో ఒప్పందం చేసుకొన్నాయి.

ఫైబ్రోటెక్స్ పరిశ్రమలోని కార్మికసంఘం చాలా క్రియాశీలమైనది. ఈ సంఘం ఎన్నో ఇతర పరిశ్రమల్లోని సంఘాలను మెరుగుపరచటానికి సహాయపడింది.

**కార్మిక సంఘం:**

కార్మికుల సంక్షేమాన్ని కాపాడడానికి వారితో ఏర్పడిన ఒక వ్యవస్థనే కార్మిక సంఘం అంటారు. కార్మికుడు ఒంటరిగా చర్చించి సాధించలేని సమస్యలను సమిష్టికృషితో సాధించగలడు. ఈ సంఘం ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చలు జరుపుతుంది. సంఘాలు తగిన వేతనాలు ఇప్పించటానికి, ఇతర సౌకర్యాలు సమకూర్చటానికి, పనిచేసే చోట అనుకూల పరిస్థితులు కల్పించటానికి ప్రయత్నిస్తాయి. సాంఘిక భద్రత, వైద్యవసతులు, గృహవసతి, ప్రావిడెంటు ఫండ్, పెన్షన్ వంటి సౌకర్యాలను కల్పించటానికి సభ్యులతో కలిసి పనిచేస్తాయి. యాజమాన్యం కార్మికులను వేధించినా, ఎవరైనా కార్మికులు అవసరాల్లో ఉన్నా వాటిని నెరవేర్చడం ఈ సంఘాల పని. చర్చలు జరపడం, న్యాయస్థానాల్లో కేసులు వేయడం, సమ్మె చేయడం, పనిని నిలిపివేయడం వంటి ప్రజాస్వామ్య పద్ధతులను ఆచరిస్తూ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తారు.

*ఫైబ్రోటెక్స్ పరిశ్రమలోని కార్మికుల జీతాలు (2002)*

| | |
|---|---|
| *శాశ్వత కార్మికులు* | *నెలకు రూ. 4,500–10,000* |
| *బదిలీ కార్మికులు* | *రూ. 3,000–4,000* |
| *కాంట్రాక్టు కార్మికులు (దినసరి కార్మికులు)* | *రోజుకు రూ. 58.00 (8 గంII పనికి)* |

SCERT, TELANGANA

శాశ్వత కార్మికులైన 140 మంది మాత్రమే ఎక్కువ ప్రయోజనాలు పొందుతున్నారు. బదిలీ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు 360 మంది తక్కువ జీతాలు, భవిష్యనిధి, ఇ.ఎస్.ఐ. వంటి కొన్ని ప్రయోజనాలను మాత్రమే పొందుతున్నారు.

- శాశ్వత కార్మికునికి బదిలీ కార్మికునికి మధ్యగల తేడా ఏమిటి?
- ఫైబ్రోటెక్స్ ఫ్యాక్టరీలో పనిచేసే ఒక దినసరి కార్మికుడు నెలలో 20 రోజులు పనిచేస్తే, అతనికి వచ్చే వేతనాన్ని లెక్కించి, శాశ్వత కార్మికుడు పొందే నెల వేతనంతో పోల్చండి.
- ఇ.ఎస్.ఐ., భవిష్యనిధి వంటి ప్రయోజనాలు పొందుతున్న ఒకరిద్దరు కార్మికులను తరగతికి ఆహ్వానించి వారికిగల ప్రయోజనాలు ఎలా లభించాయో, వాటి వివరాలను, అవి సాధించటానికి వారు అనుసరించిన విధానాలను గురించి సమాచారం సేకరించండి. ఈ విషయాలకు సంబంధించి మీ తల్లిదండ్రులను కూడా ఆహ్వానించవచ్చు.

**కె.ఆర్.ఎస్. మందుల ఫ్యాక్టరీ** (పేరు వాస్తవమైనది కాదు):

*ఈ ఫ్యాక్టరీ ఒక బహుళజాతి మందుల కంపెనీకి మందులను ప్యాక్‌చేసి ఇస్తుంది. ఇందులో పనిచేస్తున్న 118 మంది కార్మికులలో 104 మంది దినసరి కార్మికులే. కేవలం 14 మంది మాత్రమే శాశ్వత కార్మికులు. వీరిని రసాయనాలు కలుపడానికి, మందుపొడి తయారుచేయడం వంటి నైపుణ్యం అవసరమయ్యే పనుల్లో వినియోగిస్తారు. వీరికి నెలకు 1500 నుండి 2500 రూపాయల వరకు చెల్లిస్తారు. వీరికి ఉద్యోగ భద్రత ఉంటుంది. ఇ.ఎస్.ఐ., ఆరోగ్య భీమా, ప్రావిడెంట్‌ఫండ్ వంటివి వర్తిస్తాయి. మిగతా 104 మంది దినసరి కార్మికులు ప్యాకేజింగ్, లేబులింగ్ పనుల్లో ఉంటారు. ప్రతిరోజూ ఎందరు కార్మికులు అవసరమో అంత మందిని కాంట్రాక్టు పద్ధతిలో లేబర్ కాంట్రాక్టర్ తీసికొనివస్తాడు. 104 మందిలో 56 మంది స్త్రీలు. వీరంతా చుట్టు ప్రక్కల గ్రామాలనుండి వస్తారు. వీరు నిరక్షరాస్యులు. మహిళా కార్మికులు 12 గంటలు పనిచేస్తారు. రోజుకు రూ. 30 చెల్లిస్తారు. పురుషులు అంతే సమయం పనిచేసినా వారికి రూ. 42 చెల్లిస్తారు. ఇటువంటి ఫ్యాక్టరీలకు ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల ప్రకారం ఇది చాలా తక్కువ. యాజమాన్యాలు కార్మికులను సంఘాలు ఏర్పాటు చేసుకోనివ్వవు. ఏదైనా సంఘం ఏర్పాటు చేస్తే ఫ్యాక్టరీని మూసేస్తామని బెదరిస్తారు.*

ఈ రోజుల్లో అనేక కంపెనీలు ఇటువంటి విధానాలనే అవలంబిస్తూ శాశ్వత కార్మికుల సంఖ్యను తగ్గిస్తూ కాంట్రాక్టు కార్మికులు, దినసరి కార్మికుల సంఖ్యను పెంచుతున్నాయి.

- కె.ఆర్.ఎస్. మందుల ఫ్యాక్టరీలో కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేయటానికి ఎందుకు అనుమతించలేదు?
- శాశ్వత ఉద్యోగుల్లో కంటే కాంట్రాక్టు కార్మికుల్లోనే ఎక్కువ మంది స్త్రీలు ఎందుకు ఉన్నారని భావిస్తున్నారు?
- పురుషులతో సమానంగా పనిచేసిన మహిళలకు తక్కువ వేతనం చెల్లించడం సరియైనదే అని మీరు భావిస్తున్నారా?
- కార్మికులు విద్యావంతులైతే పరిస్థితులు భిన్నంగా ఉంటాయని అనుకుంటున్నారా?

SCERT, TELANGANA

**నిర్మాణరంగం - ఇటుకబట్టీలు:**



చిత్రం 19.1 నిర్మాణరంగ కార్మికులు

బిందాని, ఆమె భర్త, పది సంవత్సరాల కూతురు రంగారెడ్డి జిల్లాలోని ఒక గ్రామంలో ఇటుక బట్టీవద్ద పనిచేస్తారు. ఆమె కుటుంబంతో సహా ఒడిషా నుండి వచ్చి పనిచేస్తోంది. ఒడిషాలో ఆమెకు కొంత భూమిఉంది. అక్కడ ఆమె రు. 20,000 అప్పు తీసుకొంది. ఆ అప్పు తీర్చడానికి ఆ భూమిని అమ్మివేయాలనుకొంది. ఆ సమయంలో తెలంగాణకు చెందిన ఇటుక బట్టీలలో కార్మికులకు పనులు కల్పించే ఒక సర్దార్ వారిని కలిశాడు. రు. 10,000 అడ్వాన్సుగా ఇస్తానన్నాడు. దానితో కొంత అప్పు చెల్లించవచ్చు. కానివారు ఇటుకబట్టీ వద్ద 6 నెలలు పనిచేయాలి. దానికిగాను కొంత అదనపు డబ్బు చెల్లిస్తారు. ఒక గుడిసె ఇస్తారు. దానిలో నివసించవచ్చు. డిసెంబరు నుండి జూన్ వరకు పని ఉంటుంది. తర్వాత వారి ప్రాంతానికి వెళ్లిపోవచ్చు. ఈ విధంగా బిందాని కుటుంబం తెలంగాణకు వచ్చింది. తెలంగాణలోని ఇటుక బట్టీలలో ఒడిషా నుండి ఇలాంటివారు రెండు లక్షల మంది వరకు వచ్చి పనిచేస్తున్నారు. అలాగే వేలాది కుటుంబాలు తెలంగాణ నుండి తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు ఇటుక బట్టీల్లో పనిచేయడానికి వెళుతున్నారు.

బిందాని ఉదయం నాలుగు గంటలకే నిద్రలేచి వంటచేస్తుంది. రాత్రి 2 గంటల వరకు పనిచేసిన ఆమె భర్త ఇంకా నిద్రలోనే ఉంటాడు. బిందాని కూతుర్ని నిద్రలేపి ఇద్దరూ పనికి సిద్ధమౌతారు. వారు నీళ్లు తెచ్చి, ఇసుక, మట్టిని కలపవలసి ఉంటుంది. దీనితోనే ఇటుకలు తయారుచేస్తారు. వారు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు పనిచేస్తారు. తర్వాత టీ విరామం ఉంటుంది. ఆమె భర్త అప్పుడువచ్చి తనతో కలిసి పనిచేస్తాడు. మెత్తగా కలిపిన మట్టిని మూసల్లో (Mould) వేసి ఇటుకలు తయారుచేస్తారు. ఆ ఇటుకలను వారి కూతురు శుభ్రంచేసి వాటిపై ఆ కంపెనీ సీలు వేస్తుంది. తర్వాత ఎండబెట్టి ఎడ్లబండ్ల ద్వారా బట్టీకి పంపించి కాల్చుతారు. ఈ పని రాత్రి 2 గంటల వరకు కొనసాగుతుంది. బిందాని, ఆమె భర్త 14 నుండి 16 గంటలు పనిచేస్తారు. తయారైన ఇటుకల సంఖ్యనుబట్టి వారికి వేతనం ఇస్తున్నందున పని ఆపకుండా చేస్తారు. ప్రతి 1000 ఇటుకలకు వారికి రు. 108 చెల్లిస్తారు. అనారోగ్యానికి గురై పనికి రాకపోతే వారికి వేతనం ఉండదు. 6 నెలలపాటు రాత్రి, పగలు పనిచేస్తారు. బాగా అలసిపోయినప్పుడు, ఆరోగ్యం సహకరించనప్పుడు పనిచేయరు. వారు దాదాపుగా నూకలు, పప్పుతోపాటు అప్పుడప్పుడు కూరగాయలు తింటారు. 6 నెలలు పూర్తికాగానే తీసికొన్న అడ్వాన్సుకుగాను లెక్కచూసుకొని కొన్ని సందర్భాల్లో ఖాళీ చేతులతో వెళ్లిపోయేవారు. కొన్ని సార్లు నాలుగు, అయిదు వేల రూపాయలు తీసికెళ్లేవారు.

SCERT, TELANGANA

- సర్దారు వద్ద తీసికొన్న రు.10,000 చెల్లించడానికి వారికి ఎన్ని రోజుల సమయంపడుతుందో లెక్కించి చెప్పండి.
- బిందాని కుటుంబంలో ఒక్కొక్కరికి సగటున ఒక రోజు ఎంత లభిస్తుంది?
- ఇటుక బట్టీల్లో కార్మిక సంఘాలు ఎందుకు లేవు?
- ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులు సంఘాలు ఏర్పాటుచేసుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని మీరు అనుకుంటున్నారు?
- ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికుల స్థితిగతులు మెరుగుపరచడానికి ప్రభుత్వం ఎటువంటి సహాయక చర్యలు చేపట్టాలి?



*చిత్రం-19.2 పత్తి ఏరుతున్న మహిళా కార్మికులు*

- ఈ పనికి ఎటువంటి నైపుణ్యం అవసరం? ఆ నైపుణ్యాలు ఎలా పొందుతారు?
- వారు ఎందువల్ల దూరప్రాంతాల్లో, ఇతర రాష్ట్రాల్లో పనిచేయవలసి వస్తోంది?

దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఇటుక తయారీ మరియు ఇతర వృత్తులలో పనిచేస్తున్న కార్మికుల స్థితి ఇలాగే ఉంది. కాంట్రాక్టర్లు అడ్వాన్సు ఇవ్వడం, కార్మికులను దూర ప్రాంతాలకు తీసుకొనివెళ్లడం, భాష తెలియని చోటికి వెళ్లడం, రాత్రి పగలు కష్టపడటం, భార్యాపిల్లలతో వెళ్లి నెలల తరబడి పనిచేయడం జరుగుతూనే ఉంది. చాలా వరకు పిల్లలు చదువుకోవడంలేదు. కొందరు కట్టుబానిసలుగా జీవిస్తున్నారు. కొన్ని సమయాల్లో ప్రభుత్వం జోక్యం చేసికొని వారిని విడుదలచేస్తుంది. ఈ కట్టుబానిసలను ఇంటికి చేరుస్తుంది. ఇంటివద్ద మరొక అవకాశం లేకపోవడం వల్ల వేరొక బట్టీకి వెళ్లకతప్పడంలేదు. వారికోసం పోరాటం చేసే కార్మిక సంఘాలు లేవు. వారు వలసలుగా అనేక ప్రాంతాల్లో విస్తరించి ఉండడంవల్ల సంఘాలు దృష్టిపెట్టడంలేదు.

- ఇటుకల తయారీలో ఎటువంటి యంత్రాలు, సాధనాలు, వనరులు ఉపయోగిస్తారు?

**ప్రపంచ వ్యాప్తంగా కార్మికుల హక్కులు :**

మీరు 8వఅధ్యాయంలో చదివినట్లు పారిశ్రామిక విప్లవ కాలం నుంచి కార్మికులు హుందాగా జీవించడానికి, పారిశ్రామిక ఉత్పత్తిలో వారి వాటా పొందడానికి ఉద్యమిస్తున్నారు. వారు అనేక రకాల రక్షణలు, హక్కుల కోసం పోరాడారు.

వాటిలో కొన్ని....

**1. ఉత్పాదక, సురక్షిత ఉపాధి హక్కు :** ఈ హక్కువల్ల కార్మికులు వారి నైపుణ్యం, సామర్థ్యాన్ని అనుసరించి ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదంలేని పరిస్థితులలో పనిచేస్తారు.

**2. విశ్రాంతి తీసుకొనే హక్కు :** దీనివల్ల కార్మికులు పని ఎక్కువై అలసిపోతే, విశ్రాంతి తీసుకోవడానికి, సాంస్కృతిక, ఆసక్తిగల సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి సమయం ఉండటం.

**3. ఉద్యోగభద్రత హక్కు :** ఈ హక్కు ద్వారా కార్మికులు తమకు ఉపాధి ఉందని, దానితోనే తమ జీవితం

SCERT, TELANGANA

గడుస్తోందనీ, కావాలని తమను ఉద్యోగం నుండి ఎవరూ తొలగించరనీ తెలుసుకొంటారు. ఒక కంపెనీ ఒక కార్మికుడిని తప్పనిసరిగా తొలగించాలని భావిస్తే, అతనికి/ ఆమెకు తగిన నష్టపరిహారం చెల్లిస్తుంది.

**4. ఆదాయ భద్రత :** కార్మికులు తమ కుటుంబాల అవసరాలు తీర్చుకోవడానికి, వృద్ధాప్యంలో హుందాగా జీవించడానికిగాను పొదుపు చేసుకోవడానికి సరిపడినంత నెలసరి వేతనం పొందుతారు.

**5. పని భద్రత :** ఆరోగ్యం సరిగా లేనప్పుడు, ప్రమాదానికి గురైనప్పుడు తగిన వైద్య సహాయం పొందడంతోబాటు ఆ అనారోగ్య కాలానికి కూడా వేతనం చెల్లిస్తారు.

**6. నైపుణ్యం మెరుగుపరచుకోవటం :** కార్మికులు పనిచేస్తూ తాము చేసే పనిలో నైపుణ్యం సాధిస్తారు. సామర్థ్యం పెంచుకొంటారు.

**7. సామూహిక వ్యక్తీకరణ :** కార్మికులు సంఘాలను ఏర్పరచుకొని వారి సమస్యలను, అవసరాలను వ్యక్తిగతంగా తెలియజేయడం కంటే సామూహికంగా చెప్పడంవల్ల యాజమాన్యంతో భయంలేకుండా చర్చిస్తారు.

గత రెండువందల సంవత్సరాలుగా ప్రపంచంలో కార్మికులందరూ పోరాడి ఈ హక్కులకు గుర్తింపు తెచ్చినా అనేక ప్రాంతాల్లో అవి అమలుకావడం లేదు. అనేక దేశాల్లో ప్రభుత్వాలు వీటిని కనీస అవసరాలుగా గుర్తించి ఈ హక్కులు వారు అనుభవించే విధంగా చట్టాలు చేశాయి.

- ఈ పాఠంలోని శాశ్వత కార్మికులు, మందుల ఫ్యాక్టరీ, ఇటుక బట్టీలు గురించిన పేరాలను ఒకసారి చదవండి. కార్మికులు పొందుతున్న హక్కులు, ప్రయోజనాలను సూచించే బాక్సులో రంగులు వేయండి. ఒక రకమైన కార్మికులు మాత్రమే ఆ పరిశ్రమలో ఆ హక్కు లేక సౌకర్యం పొందితే బాక్సులో కొంత భాగం మాత్రమే రంగు వేయండి. ఏ హక్కు గానీ, ప్రయోజనం గానీ లేకుంటే ఆ బాక్సును కొట్టివేయండి.



*చిత్రం 19.3 కత్తులు సానపట్టేవారు*

| క్ర. సం. | హక్కులు | ఫైబ్రోటెక్స్ కంపెనీ | కె.ఆర్.ఎస్. మందుల కంపెనీ | ఇటుకల బట్టీ |
|---|---|---|---|---|
| 1. | ఉత్పాదక, సురక్షిత ఉపాధి హక్కు | | | |
| 2. | విశ్రాంతి తీసుకొనే హక్కు | | | |
| 3. | ఉద్యోగభద్రత హక్కు | | | |
| 4. | ఆదాయ భద్రత | | | |
| 5. | పని భద్రత | | | |
| 6. | నైపుణ్యం మెరుగుపరచుకోవటం | | | |
| 7. | సామూహిక వ్యక్తీకరణ | | | |

SCERT TELANGANA

## అసంఘటిత పని – పట్టణాల్లో కార్మికులు:

తెలంగాణలో, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో పట్టణాలు, నగరాలు పెద్దవిగా మారిపోతున్నాయి. ప్రజలు వేగంగా గ్రామాలనుండి పట్టణాలకు వలస వస్తున్నారు. పట్టణాల్లో సరిపడ శాశ్వతమైన పని లభించకపోవడంతో వారు అనేకరకాల కష్టమైనపనులు చేస్తున్నారు. అసంఘటిత రంగంలో దినసరి కార్మికులుగా మారుతున్నారు. వీరు కూరగాయలు అమ్మడం, బిస్కెట్లు, స్నాక్స్ అమ్మడం, టీ కొట్టులో పనిచేయడం, చిన్న ఫ్యాక్టరీల్లో పనిచేయడం, బట్టలుకుట్టడం, వాహనాల్లో సామాన్లు నింపడం, దింపడం, ధనికుల ఇండ్లల్లో పనిచేయడం వంటి అనేక పనుల్లో చేరుతున్నారు. బీడీలు, పాపడాలు తయారు చేయడం, ఎంబ్రాయిడరీ మొదలగు కుటీర ఉత్పత్తుల్లో పనిచేస్తున్నారు. ఇలాంటి చాలా పనులకు ప్రభుత్వ గుర్తింపు లేకపోవడం వల్ల దీనిని అసంఘటిత రంగం అంటారు. ఇటువంటి పనిని అసంఘటిత పని అంటారు.



*చిత్రం-19.4 కేబుల్ వేస్తున్న కార్మికులు*

వీటన్నింటికీ తక్కువ పెట్టుబడి, తక్కువ నైపుణ్యం అవసరం. వేతనం తక్కువ చెల్లిస్తారు. ఈ కార్మికులు అందరూ దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. కర్మాగారాలలో, కార్యాలయాలలో పనిచేసే శాశ్వత కార్మికులవలె ఉపాధి పొందలేక వీరిలో కొందరు ఏకకాలంలో అనేక పనులు చేస్తున్నారు. ఉదయం వార్తా పత్రికలు వేయడం, తర్వాత టీ కొట్టులో పనిచేయడం, రాత్రిపూట ఇండ్లల్లో వంటచేయడం వంటి పనులు చేస్తున్నారు. వీరికి విశ్రాంతిలేదు. పిల్లలు కూడా పనిచేయడంవల్ల చదువుకోవడం లేదు. ఆర్థిక సమస్యలు వచ్చినప్పుడు పిల్లలను చదివించడంపైన, ఆహారం, మందులు వంటి వాటిపై చేసేఖర్చులు తగ్గిస్తున్నారు. ఇన్ని చేసినా వారి అవసరాలు తీరడంలేదు. వారు బలవంతంగా స్నేహితులవద్ద, బంధువులవద్ద అప్పు చేయవలసి వస్తోంది. కొన్నిసార్లు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పుతీసుకొంటున్నారు. రుణభారం ఎక్కువై వారి వద్ద తప్పనిసరిగా పనిచేయవలసి వస్తోంది.

ఇటువంటి వారి హక్కుల కోసం పనిచేసే కార్మిక సంఘాలు దాదాపుగా లేవు. దేశంలో ఇలాంటి కార్మికుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గ్రామాల నుండి వలస రావడమే కాకుండా చాలా వరకు పాత పెద్ద ఫ్యాక్టరీలు,

SCERT, TELANGANA

మిల్లులు మూతపడటం కూడా ఒక కారణం. ఇలాంటి ఫ్యాక్టరీల్లోని కార్మికులు దినసరి కార్మికులుగా మారుతున్నారు.

ఈ సమస్యలన్నిటినీ పరిశీలించి గుజరాత్‌లోని కార్మికసంఘాలు ప్రపంచంలోనే అసంఘటిత రంగంలో అతి పెద్ద యూనియన్‌ను ప్రారంభించాయి. దాని గురించి తెలుసుకుందాం.

**స్వయం ఉపాధి మహిళా సంఘం (SEWA) (Self Employed Women's Association):**

1971లో అహ్మదాబాద్ బట్టల మార్కెటుకు బండ్లులాగే మహిళా వలసకార్మికులు వెళ్లి చేనేత కార్మికుల సంఘంను సంప్రదించి వారి గృహవసతి సౌకర్యం మెరుగుపరచుకోవడానికి సహాయం చేయమని కోరారు. ఇది భారతదేశంలో ప్రాచీన, పెద్ద సంఘం. మహాత్మాగాంధీ దీనితో కలిసి పనిచేశాడు. చేనేత కార్మికుల సంఘం వారి సహాయంతో 1971లో స్వయం ఉపాధి మహిళా సంఘం ఏర్పడి, 1972లో అది పూర్తి స్థాయి కార్మిక సంఘంగా రూపొందింది.

అప్పటి నుండి SEWA వివిధ వృత్తులలో పనిచేస్తున్న మహిళలతో నిరంతరం పనిచేస్తోంది. ఈ అసోసియేషన్‌కు ఖచ్చితమైన కార్మిక–యజమాని సంబంధాలు అనేవి లేవు. ఇది కేవలం కార్మికుల ఉనికి కోసం పనిచేస్తుంది. వారికి పెట్టుబడిలేదు. 5 రూపాయలు చెల్లించి ఏ మహిళా కార్మికురాలైనా సభ్యత్వం తీసికోవచ్చు. ఉద్యోగులైన మహిళలు తమ బాధలు పరిష్కరించుకోవడానికి, పని సంస్కృతి మెరుగుపరచుకోటానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి, వారివారి పనులు కొనసాగించుకోవడానికి దోహదపడింది. వీధుల్లో తిరిగి అమ్మేవారు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, కుటీర పరిశ్రమ ఉత్పత్తులు అమ్మేవారు, చేనేతవృత్తులవారు, కొత్త, పాత బట్టలు అమ్మేవారు, ఇండ్లలోపనిచేసేవారు, కుమ్మరివారు, బీడీలు, అగర్‌బత్తీలు అమ్మేవారు, పాపడాలు తయారుచేసేవారు, దుస్తులు అమ్మేవారు, వ్యవసాయకూలీలు, నిర్మాణరంగకూలీలు, కాంట్రాక్టు కార్మికులు, ఇస్త్రీ కార్మికులు, పశువుల కాపర్లు, ఉప్పుకార్మికులు, జిగురు సేకరించేవారు SEWAలో సభ్యులైనారు.



*చిత్రం 19.5 రోడ్డు మరమ్మత్తులు, నిర్మాణాలు*

SCERT TELANGANA

SEWA (Self Employee Women's Association) లో ఇప్పుడు 9 రాష్ట్రాల్లో 13 లక్షల సభ్యులు ఉన్నారు. సభ్యులకు బ్యాంకు సేవలందిస్తున్నారు. సహకార సంస్థలు నడుపుతూ ఆరోగ్యబీమా సౌకర్యం కల్పిస్తున్నారు. వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడంలో, మంచి వేతనాలు పొందడంలో SEWA సహాయంచేస్తుంది. తెలంగాణలో రోడ్డు పక్కన, మార్కెట్‌లో, వీధులలో కూరగాయలు అమ్మే వందలాది మంది స్త్రీల పరిస్థితులు మెరుగుపరచటానికి ఇటువంటి సంఘాలు ఎంతోకొంత ఉపయోగపడతాయని మీరు భావిస్తారా?

**కీలకపదాలు:**

1) పరిహారం
2) ప్రావిడెంట్ ఫండ్ (భవిష్యనిధి)
3) బదిలీ పనివారు
4) వేతనాలు
5) దినసరి కార్మికులు
6) ESI
7) శాశ్వత కార్మికులు

## మీ అభ్యసనాన్ని మెరుగుపరచుకోండి

1) ఇటుక బట్టీలో పనిచేసే ఒక కార్మికుని స్థితిని, పరిశ్రమలో పనిచేసే శాశ్వత కార్మికుని, కాంట్రాక్టు కార్మికుని స్థితితో పోల్చండి.

2) మీ ప్రాంతంలో దినసరి కార్మికులు, స్వయం ఉపాధికార్మికులు చేసే పనుల జాబితా రాయండి.

A2U6J9

3) విభిన్న కార్మిక సంఘాల జాబితారాసి కింది పట్టికను పూరించండి.

| క్ర.సం. | కార్మిక సంఘం పనిచేసే కంపెనీ | పని రకం | ప్రధాన సమస్యలు | పరిష్కారాలు |
|---|---|---|---|---|
| 1 | | | | |
| 2 | | | | |
| 3 | | | | |

4) కార్మిక సంఘ సభ్యునితో (లేదా నాయకునితో) మాట్లాడి/అతన్ని తరగతి గదికి ఆహ్వానించి అతని జీవిత చరిత్ర అడిగి తెలిసికోండి. ప్రత్యేకంగా అతడు/ఆమె ఎందుకు సంఘంలో చేరినారో తెలిసికోండి. సభ్యునిగా హక్కులు, బాధ్యతలేవో తెలిసికోండి.

5) కార్మికులు పనిచేసేచోట గల పరిస్థితులపై పిర్యాదుచేస్తూ మీ ప్రాంత కార్మికశాఖ అధికారి (లేబర్ ఆఫీసర్)కు లేఖ రాయండి.

SCERT, TELANGANA

పాఠం 20 Q3Q9Q5

# జానపదులు - మతం

**కిందఇచ్చిన ప్రశ్నలకు తరగతి గదిలో చర్చించండి.**

**1)** మీ ప్రాంతంలో ఏయే దేవతలను/దేవుళ్ళను ఆరాధిస్తారు?

**2)** మీ కుటుంబం గౌరవిస్తున్న ఏయే సన్యాసులను, బాబాలను, పీర్లను మీరు చూశారు?

**3)** ప్రజలు ఏయే జంతువులను, చెట్లను పూజిసారు?

**4)** ప్రజలు ఏయే విధాలుగా పూజిస్తారో మీకు తెలుసా?

**5)** దేవతలను ఎలా పూజిస్తారు, పూజలను ఎవరు నిర్వహిస్తారు?

**6)** దేవుళ్లను భక్తులు ఏయే భాషల్లో ఆరాధిస్తారు?

మీరు సాధారణంగా ఇలాంటి క్రింది సంభాషణలు విని ఉంటారు!

లక్ష్మి : ఈ మధ్యన మా పిల్లలు తరుచుగా అనారోగ్యం పాలవుతున్నారు.

సమ్మక్క : నా భర్త ఆరోగ్యం కూడా గత నెల నుండి బాగా లేదు.

ఎల్లమ్మ : ముత్యాలమ్మ దేవతకు కోపం వచ్చినట్లుంది. మనం ఆమెను ప్రసన్నం చేసుకోవాలి. అందుకోసం బోనాలు ఎత్తాలి. దేవతకు కోడిపుంజును బలి ఇవ్వాలి.

***

రామరాజు : మా అమ్మాయి చాలా నీరసంగా ఉంది. ఏమీ తినడంలేదు.

సురేష్ : మీరు పీర్‌బాబా దర్గాకు వెళ్ళవచ్చు కదా! అక్కడికి వెళ్ళి మౌల్వీతో తాయెత్తు కట్టమని అడగండి. మీ అమ్మాయి ఆరోగ్యం కుదుటపడుతుంది.

మనదేశంలోని చాలా మంది ప్రజలు పెద్ద చర్చిలలో, మసీదులలో, దేవాలయాలలో ప్రార్థనలు చేస్తారు. మరొక ప్రక్క ప్రజలు గ్రామదేవతలను కూడా పూజిస్తారు. ఈ ప్రసిద్ధి పొందిన దేవతలు ఎవరు? వీరు ఎలా, ఎప్పుడు, ఎవరితో పూజింపబడతారు?

గ్రామదేవతలు ఎందరో ఉన్నారు. వారిలో కొందరు కొన్ని ప్రత్యేక కులాలకు, గ్రామాలకు, కుటుంబాలకు చెందినవారు. సాధారణంగా పూజించబడే కొందరి దేవతల గురించి చదువుకుందాం.

**పోచమ్మ :**

తెలంగాణలో అత్యంత ప్రసిద్ధిచెందిన గ్రామ దేవత పోచమ్మ. దాదాపు ప్రతి ఊర్లో ఈమెకు గుడి ఉంది. ఈ గుడి రాముడు, శివుని గుళ్ళకు భిన్నంగా ఉంటుంది. గుడి నిర్మాణం ఆకర్షణీయంగా లేకుండా సాధారణంగా వేపచెట్టుని ఆనుకొని ఉంటుంది. దేవతామూర్తి రాయి రూపంలో ఉంటుంది. కొన్ని ఆధునిక పట్టణాలలో ఈ దేవాలయం వాస్తు శిల్పితో నిర్మించి విగ్రహం రూపంలో దేవత ప్రతిష్టించి ఉంటుంది.

SCERT, TELANGANA





*చిత్రం-20.1, 20.2 రెండు పోచమ్మ విగ్రహాలు*

గ్రామాలలో కొన్ని ప్రత్యేక సందర్భాలలో అన్ని కులాల ప్రజలంతా బోనాలు ఎత్తుకొని ఆ గుడికి వెళ్తారు. గుడి ప్రాంగణాన్ని, గుళ్ళోని దేవతను కడిగి శుభ్రం చేస్తారు. అక్కడ ప్రత్యేకించి పూజారి ఉండదు. ప్రజలు స్థానిక ఆచార సాంప్రదాయాలతో, పూలతో పూజిస్తారు. "తల్లీ మా పొలాల్ని కాపాడి, మంచి పంటను ఇవ్వు", "నా బిడ్డ అనారోగ్యంతో ఉంది. ఆమెను బాగుచెయ్యి", "తల్లీ, అంటు రోగాల నుండి, దుష్టశక్తుల నుండి మా కుటుంబాన్ని కాపాడు" అని మొక్కుకుంటారు, బోనం సమర్పిస్తారు. కొన్ని సందర్భాలలో కోళ్లను, గొర్రెలను కూడా సమర్పిస్తారు.



*చిత్రం-20.3 మైసమ్మ*

**మైసమ్మ :**

పశు సంపద కాపాడే దేవతగా ఈమెకు పేరుంది. పశువుల పాకలో ఒక గూడుకు సున్నంవేసి, "కుంకుమ"తో అలంకరించి దానిని "మైసమ్మగూడు"గా పిలుస్తారు. చాలా చోట్ల కట్టమైసమ్మను కూడా పూజిస్తారు. చెరువు కట్టమీద బండరాయి రూపంలో ఉండే ఈమెను నీటి దేవతగా కొలుస్తారు. ఆమెను కొలిస్తే చెరువు నిండా నీరు ఉంటుందని, ఆమె దయ వల్ల పంటలు పుష్కలంగా పండుతాయని ప్రజలు నమ్ముతారు.

**గంగమ్మ :**

ఈమెను నీటి దేవతగా కొలుస్తారు. సముద్రంలోకి వెళ్ళి చేపలుపట్టే మత్స్యకారులందరినీ కాపాడే దేవతగా ఈమె ప్రసిద్ధి చెందింది. పేదలను, అనాథలను కాపాడే దేవతగా నమ్ముతారు.

**ఎల్లమ్మ :**

"పోలేరమ్మ", "మరిడమ్మ", "రేణుక", "మహంకాళి", "జోగమ్మ", "సోమలమ్మ" మొదలైన పేర్లతో ఈమెను పిలుస్తారు. ఈమె గ్రామ పొలిమేరల్లో ఉండి ఊరును కాపాడుతుందని నమ్ముతారు. అంటురోగాల నుండి, దుష్టశక్తుల నుండి, కలరా లాంటి వ్యాధుల నుండి కాపాడమని ప్రజలు ప్రార్థిస్తారు.

TELANGANA



చిత్రం-20.4 ఎల్లమ్మ



చిత్రం-20.5 పోతరాజు

**పోతరాజు :**

తమ వ్యవసాయ భూముల్ని, పంటలను భయంకరమైన తెగుళ్ళ నుండి, దొంగల నుండి, జంతువుల నుండి పోతరాజు కాపాడతాడని తెలంగాణ రైతుల విశ్వాసం. వ్యవసాయదారులందరు సున్నం వేసిన బండరాయిని తమ పంట పొలాల్లో ఒక మూలన ఉంచుతారు. పోతరాజు పూజా విధానం మామూలుగా ఉంటుంది. సాధారణంగా పంటకోత సమయంలో ఈ దేవునికి పూజలు చేస్తారు. పెద్దమ్మ వంటి పేర్లు గల దేవతలు ఇతనికి సోదరీమణులు.

**బీరప్ప, కాటమరాజు :**

బీరప్ప, కాటమరాజులను గొర్రెలను పెంచేవారు, ఆవులను పెంచేవారు పూజిస్తారు. వీరు పశువులను, గొర్రెలను కాపాడే దేవుళ్ళు. మీరు బీరప్ప, అక్క మహాంకాళి కథను విన్నారా? బీరప్ప అనే పేద గొర్రెలకాపరి కామరతిని పెళ్లి చేసుకోవడానికి ఏ విధంగా పోరాడాడు? ఆ సమయంలో అతని అక్క ఏవిధంగా సహాయపడిందో మీకు తెలుసా? పశుపాలకులు పచ్చిక బయళ్ళలో పశువులను మేపుకునే హక్కుల గురించి నెల్లూరు రాజుతో కాటమరాజు ఏవిధంగా యుద్ధం చేసాడో మీకు తెలుసా?

- జానపద పండగలలో, గ్రామదేవతల పూజలలో మీరు పాల్గొని ఉంటారు. అలాగే శివుడు, విష్ణువు వంటి దేవాలయాలకు కూడా వెళ్లి ఉంటారు. ఈ పూజా విధానాలను పోల్చండి? ఈ ప్రదేశాలలోని పూజా విధానాలను సరిపోల్చి తరగతిలో చర్చించండి.

జానపద పండగలలో జంతుబలి ఒక సాధారణమైన ఆచారం. దీని వల్ల వేలాది పశువులు చనిపోతున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మతపరమైన కార్యక్రమాలలో జంతువులను, పక్షులను బలి ఇవ్వడాన్ని నిషేధించింది.

**సమాజంలో జానపద దేవతల పూజ :**

చాలా మంది జానపద దేవుళ్ళు, దేవతలు స్థానిక వీరులు. వారు ప్రజల కోసం పోరాడి చనిపోయారు. ప్రజలను కాపాడడానికి ప్రత్యేకమైన శక్తులు వారికి ఉన్నాయని, ఒకవేళ వారిని పూజించకపోతే కష్టాలను కలిగిస్తారని సాధారణ ప్రజల నమ్మకం. గిరిజన సమస్యల పరిష్కారంకోసం పోరాడిన జానపద నాయికా నాయకులలో సమ్మక్క, సారక్కలు ఉన్నారు. వారి గౌరవార్థం జాతర కూడా జరుగుతుంది.



SCERT, TELANGANA

## సమ్మక్క, సారక్క (మేడారం) జాతర :

జయశంకర్ జిల్లాలోని తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో గిరిజనులు ఈ జాతర జరుపుతారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి గిరిజన, గిరిజనేతర ప్రజలు ఈ జాతరలో పాల్గొంటారు. దాదాపు ఒక కోటి మంది జాతరకు హాజరవుతారు.

**కథ :** కాకతీయ రుద్రదేవుడి (మొదటి ప్రతాపరుద్రుడు) కి సమకాలీకుడైన “మేడరాజు” జగిత్యాల కేంద్రంగా పొలవాస రాజ్యాన్ని పాలిస్తుండేవాడు. అతని కూతురు సమ్మక్కను మేడారం సామంత పాలకుడు, పగిడిద్దరాజుతో వివాహంచేశాడు. వారికి సారాలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం. రుద్రదేవుడు తన రాజ్య విస్తరణలో భాగంగా మేడారంపై దండయాత్ర చేశాడు. పగిడిద్ద రాజు కుటుంబం మొత్తం, వారి తెగకు చెందిన స్త్రీ, పురుషులందరు భయంకర యుద్ధంలో పాల్గొన్నారు. వారందరు యుద్ధంలో చనిపోయారు. కాకతీయ సైన్యాలను “సంపెంగ వాగు” దాటనీయకుండా తన ఆఖరి శ్వాసవరకు పోరాడిన జంపన్న వీరమరణం పొందాడు. కాబట్టి దానికి “జంపన్న వాగు”



*చిత్రం-20.6 సమ్మక్క దేవతను ప్రతిష్ఠించిన గద్దె*



*చిత్రం-20.7 మేడారం జాతరలో ఒక దృశ్యం*

అని పేరు వచ్చింది. అదే బాటలో సమ్మక్క, సారక్క కాకతీయ సైన్యంతో పోరాడి వారి తెగను కాపాడటానికి ప్రాణత్యాగం చేశారు.

వారి సాహసాన్ని, త్యాగాన్ని నేటికీ కొనియాడుతూ వారి గౌరవార్థం మేడారం జాతరను గిరిజన ప్రజలంతా జరుపుకుంటున్నారు. మేడారం జాతర ప్రతి రెండు సంవత్సరాలకొకసారి జరుగుతుంది. ఇది మూడు రోజులు జరుగుతుంది. సమ్మక్క, సారక్కలు రూపంలేని దేవతలు, వారిని అడవి నుండి పెద్ద ఊరేగింపుతో పెట్టెలో తెచ్చి, అందంగా అలంకరించిన గద్దెపైన, చెట్టు కింద ప్రతిష్ఠిస్తారు. ఆ సమయంలో దేవతలు తమను ఆవహించినట్లుగా భక్తులు అనుభూతి చెందుతారు. ప్రజలు బెల్లంను “బంగారం”గా దేవతలకు సమర్పిస్తారు.

## మొహర్రం (పీరీలు), ఉర్సు :

చెడుకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన వారి గౌరవార్థం ముస్లింలు ప్రార్థనలు చేస్తారు. ఇరాక్‌లో జరిగిన కర్బలా యుద్ధంలో మహమ్మద్ ప్రవక్త మనమడు చనిపోయాడు. అతని జ్ఞాపకంగా ముస్లింలు మొహర్రం జరుపుకుంటారు. వెదురు బద్దలతో గుమ్మటం ఆకారం తయారుచేసి జట్టీ గుడ్డలు (మెరుపు), పూలు, ఎండుకొబ్బరి కుడుకలతో అలంకరించి, దానిపై భాగంలో నెలవంక లేదా చేతి ఆకారంలో పీరీల చిహ్నం తయారు చేస్తారు. ఉత్సవాల్లో భాగంగా ఊరేగింపు నిర్వహిస్తారు. దీంట్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొంటారు.

SCERT, TELANGANA



చిత్రం-20.8 అజ్మీర్ దర్గా



చిత్రం-20.9 జహంగీర్ పీర్ దర్గా

అదేవిధంగా ముస్లిం వలీల సమాధులు ఉన్నచోట, వారి వర్ధంతులను ఉర్సు ఉత్సవాలుగా జరుపుతారు. అధిక సంఖ్యలో ప్రజలు దర్గాలను దర్శిస్తారు. పూలను, చాదర్‌ను సమాధులపైవేసి, అక్కడ పాడే ఖవ్వాలీలను వింటారు. ఆ విధంగా చేస్తే ముస్లిం వలీల ఆశీర్వాదాలు లభిస్తాయని నమ్ముతారు. సంతానం, ఉద్యోగం కోరుకునేవారు దర్గాలకు వచ్చి ప్రార్థనలు చేస్తారు.

సూఫీ తత్వాన్ని ప్రచారం చేసిన గురువుల సమాధులపై దర్గాలు నిర్మిస్తారు. సూఫీ గురువుల సమాధులు, లేదా దర్గాలు తీర్థ స్థలాలుగా మారతాయి. అన్ని మతాల ప్రజలు వేలాదిగా ఇక్కడకు వస్తారు. సూఫీ గురువులకు అతీంద్రియ శక్తులుంటాయని ప్రజలు నమ్ముతారు. వారు అందరి ఇబ్బందులను తొలగిస్తారని, ఆరోగ్యాలు బాగుపరుస్తారని ప్రజల నమ్మకం.

### జహంగీర్ పీర్ దర్గా - మతసామరస్యానికి చిహ్నం

రంగారెడ్డి జిల్లాలోని కొత్తూరు మండలంలో జహంగీర్ పీర్ దర్గా ఉంది. అటవీ ప్రాంతంగా ఉండే ఇక్కడ 15వ శతాబ్ధం చివరిలో ఇరాక్ దేశానికి చెందిన సోదరులు సయ్యద్ గౌసుద్దీన్, సయ్యద్ బురానోద్దీన్ దైవ చింతనలో కొంతకాలం గడిపి అనంతరం చనిపోయినట్లు కథనం. వీరిద్దరి సమాధులపైన కొందరు భక్తులు చిన్న దర్గాను నిర్మించారు. 17వ శతాబ్దంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ఈ దర్గాను సందర్శించినప్పుడు దాని మహత్యాన్ని గుర్తించి ఇబ్రహీం అలీ అనే పండితుని ఖాజీగా నియమించాడని, ఆ ఖాజీనే జహంగీర్ పీర్ దర్గాను పర్యాటకదర్శినిగా తీర్చిదిద్దారని స్థానికులు చెబుతారు.

ప్రతిరోజు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుండి ఇక్కడికి అనేకమంది సందర్శకులు వస్తారు. ఇక్కడ జరిగే ప్రత్యేక పూజాకార్యక్రమాలకు గురు, ఆదివారాలలో దేశంలోని వివిధ రాష్ట్రాల సందర్శకులు వస్తారు. ప్రతిఏటా సంక్రాంతి పండుగ తర్వాత వచ్చే మొదటి గురువారం నుండి ఉర్సు ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయి. మొదటి రోజు గంధపు పూజ, రెండవ రోజు దీపారాధన, మూడవ రోజు ఖవ్వాలి నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలలో దేశ విదేశాల నుండి వేలాది హిందూ, ముస్లిం భక్తులు పాల్గొని పూలు, మిఠాయిలు, చాదర్లు సమర్పించడం వలన ఈ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా మారింది.

### బోనాలు :

తెలంగాణా రాష్ట్రంలో బోనాలు ప్రసిద్ధి చెందిన జానపద పండగ. ఇందులో దేవతలకు ఆహారాన్ని సమర్పించి, పూజించిన తరువాత కుటుంబ సభ్యులు తింటారు. అందంగా అలంకరించిన పువ్వులతో నిండిన కుండలను స్త్రీలు తలలపై పెట్టుకొని ఊరేగింపులో పాల్గొంటారు. దీన్నే ఘటం అంటారు. ఇత్తడి బిందెలు లేదా మట్టి కుండలను అన్నంతో నింపి, వేపాకులతో

SCERT, TELANGANA

అలంకరించి మహిళలు ఊరేగింపులో పాల్గొంటారు. పోతరాజులుగా పిలవబడే మగవారు నాట్యం చేస్తూ తోడువెళ్తారు. వీరు వేప ఆకులు పట్టుకొని కొరడా దెబ్బలు వేస్తూ ఊరేగింపు ముందు భాగంలో నడుస్తారు.



చిత్రం-20.10 బోనాలు

- మీరు ఎప్పుడైనా జాతరలలో, ఉర్సులలో, బోనాల పండుగల్లో పాల్గొని ఉంటే వాటి ముఖ్య లక్షణాల గురించి తరగతి గదిలో చర్చించండి.
- గ్రామ దేవతల పూజా విధానాలు, దేవాలయాల్లో, మసీదులలో జరిగే కార్యక్రమాలకు ఎలా భిన్నమైనవి?

**జానపద సాంప్రదాయాలు - ప్రాచీనత :**

ఇలాంటి గ్రామ దేవతలను ప్రాచీనకాలంలో కూడా పూజించేవారని అనేక చారిత్రక గ్రంథాల ద్వారా తెలుస్తోంది. నేటికి 2500 సంవత్సరాల క్రితం నాగులను, చెట్లను, యక్షిణి, యక్షులను పూజించేవారని తెలుస్తోంది. 14వ శతాబ్దం చివరిలో శ్రీనాథుడు రచించిన పల్నాటి వీర చరిత్ర కథ, పోతరాజు పూజ గురించి తెలుపుతుంది. వల్లభరాయుడు రచించిన క్రీడాభిరామంలో పల్నాటి వీరులు, వరంగల్‌లో మైలారదేవత, ఇతర మాతృదేవతల ఆరాధన గురించిన వర్ణనలున్నాయి.

గుళ్లు, చర్చిలు, మసీదులలో జరిగే పూజా విధానాల కంటే జానపద దేవతల ఆరాధన భిన్నంగా ఉంటుందని ఈపాటికి మీరు గమనించి ఉంటారు.

కులం, మతం, ఆర్థిక స్థితితో నిమిత్తం లేకుండా ఈ దేవతలను ప్రజలు పూజిస్తారు. ఉదాహరణకు, ముస్లిం రైతులు కూడా జానపద దేవతల పూజలో పాల్గొంటారు. అదే విధంగా అన్ని మతాల ప్రజలు దర్గాలకు వెళ్లి సన్యాసుల ఆశీర్వాదం తీసుకుంటారు. వారు దర్గాలకు వెళ్లి భక్తితో చెట్లకు, గోడలకు దారాలు కట్టి, తమ సమస్యలు తీరిస్తే మొక్కులు చెల్లిస్తారు. దర్గాలకు వెళ్ళి దుష్టశక్తులు తొలగడానికి తాయెత్తులు కట్టమని పీర్జాదీలను ప్రార్థిస్తారు.

**జానపద దేవతలు, ఉన్నత మత సంప్రదాయాల కలయిక**

భారతదేశంలో వివిధ రకాల ప్రజలు, వారి మతాల మధ్య నిరంతరం సంబంధాలు ఉండేవి. ఫలితంగా వివిధ సాంప్రదాయాల కలయిక జరిగింది. ఆ విధంగా జానపదుల పూజా విధానాలను, వారి విజ్ఞతను ఉన్నత మతాలు ఆచరిస్తున్నాయి. అలాగే ఉన్నత మతాలకు చెందిన నమ్మకాలను జానపదులు పాటిస్తున్నారు.

ఈ విధంగా ఉన్నత మత సాంప్రదాయాల వారుకూడా రావి చెట్టును, నాగులను, మాతృదేవతలను పూజిస్తారు. ఉన్నత పౌరాణిక మతంలోకి నాగులు, జంతువులు, చెట్లు, పక్షులు వచ్చి చేరాయి. మెల్లమెల్లగా బుద్ధుడు, శివుడు, విష్ణు, దుర్గ వంటి దేవతల పూజలో భాగంగా గ్రామదేవతలను కూడా పూజించసాగారు. నాగులను, సింహాలను, నందిని, చెట్లను కూడా పూజించడం ప్రారంభించారు.

ఇస్లాంలో ఇది మరో రూపం ధరించింది. ఇస్లాం ఉన్నత మత సాంప్రదాయం దేవుడొక్కడే అని, అతడే 'అల్లా' అని నమ్మకం కలిగి ఉంది. గ్రామీణ ప్రాంతంలోని ముస్లింలలో కొందరు దర్గాలలో, సూఫి సన్యాసులను విశ్వసించడం, ఆరాధించడం మొదలు పెట్టారు. అలా చేస్తే వారి సమస్యలు తీరతాయని నమ్మకం. దీనితో అన్ని మతాల ప్రజలు పాల్గొనే దర్గాలకు, ఉర్సులకు తీర్థయాత్రలనే బలమైన సంప్రదాయం ఏర్పడింది.

**జానపద విజ్ఞత, ఉన్నత మతం:**

సామాన్య ప్రజానీకం నుండి వచ్చిన కబీర్, యోగి వేమన, అనేకమంది సూఫీ సన్యాసులు లోతైన తాత్విక,

SCERT, TELANGANA

మత సంబంధ ఆలోచనలను వెలిబుచ్చారు. వీరు కూడా ఉన్నత మతాలు చెప్పిన తాత్విక ఆలోచనలను, సామాన్య ప్రజల ఆలోచనా విధానాలతో కలగలిపారు. నేటికి 300 సంవత్సరాల క్రితం నివసించి తెలుగులో అత్యంత విజ్ఞతతో కూడుకున్న యోగి వేమన పద్యాలు ఉన్నాయి. వాటిని చదవండి.

> "స్వానుభవం లేక, పవిత్ర వాక్కులను వల్లె వేయడంవల్ల భయాలు తొలగవు. అలాగే చిత్రించిన జ్వాల వల్ల చీకట్లు తొలగిపోవు."
>
> "ఆరురుచులు వేరు వేరు. కాని రుచి ఒకటే, సత్యాన్ని తెలిపే సంప్రదాయాలు అనేకం. కాని సత్యం ఒకటే, సన్యాసులు వారిలో వారు బేధిస్తుంటారు. కాని వారు ఎవరి కోసమైతే ధ్యానం చేస్తుంటారో అతను ఒకడే."
>
> "బట్టతలలు, జడలు కట్టిన వెంట్రుకలు, బూడిద పూసుకోవడాలు, మననం చేసుకోవడం, మతపరమైన దుస్తులు ధరించడం మాత్రమే సరిపోదు. పవిత్రమైన హృదయం లేని వారు సన్యాసులు కాలేరు." ఇలాంటి భావాలు, బోధనలు సాధారణ ప్రజల ఆలోచనలలో భాగమైనాయి.

**కీలకపదాలు:**

1) జానపద దేవతలు    2) జాతర
3) ఉర్సు    4) పీరి    5) బోనం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) గ్రామ దేవతలను పూజించడంలో సర్వసాధారణంగా కనిపించే అంశాలు ఏమిటి?
2) ప్రజలు గ్రామాల నుండి పట్టణాలకు వెళ్లి స్థిరపడినప్పుడు వారు గ్రామ దేవతలను పూజించడం కొనసాగిస్తున్నారా? ఎలా కొనసాగిస్తున్నారు?
3) గ్రామ దేవతలను పూజించే విధానంలో మార్పులు వస్తున్నాయని మీరు భావిస్తున్నారా? మీరు ఎలాంటి మార్పులను చూస్తున్నారు?
4) తెలంగాణ పటం నందు ప్రధాన జాతరలు, ఉర్సు, ఉత్సవాలు జరిగే ప్రదేశాలను గుర్తించండి?
5) ప్రక్క పేజీలోని "కులం, మతం ....... ప్రార్థిస్తారు" పేరాను చదివి, వ్యాఖ్యానించండి.
6) మీ ప్రాంతంలో నివసించే వివిధ మతాలకు చెందిన వారిని కలిసి, కింది వివరాలను సేకరించండి.

M4K2J6

| క్ర.సం. | పేరు | ఆచరించే మతం | పూజించే దేవుడు | జరుపుకునే పండుగలు |
|---|---|---|---|---|
| | | | | |

**ప్రాజెక్టు పని:**

1) మీ ప్రాంతంలోని ఏదైనా ఒక జాతర గురించి మీ తాత, నానమ్మల నుంచి సమాచారం సేకరించండి. ఒక నివేదిక తయారుచేయండి.
2) మీ ప్రాంతానికి చెందిన జానపద దేవతల గురించి కథలు సేకరించండి. వాటి గురించి చిన్న పుస్తకం తయారుచేయండి.

SCERT, TELANGANA

పాఠం 21

# దైవసంబంధ భక్తి మార్గాలు

E8P8B3

దేవతారాధనలో భాగంగా పూజాదికర్మలు చేయడం, భజన గీతాలను, కీర్తనలను, ఖవ్వాలీలను పాడడం మీరు చూసే ఉంటారు. కొందరు భక్తులు మౌనంగా దైవనామ జపం చేస్తూ ఉండడం, కొందరు భక్తిభావావేశంలో మునిగి కన్నీరు కార్చడం కూడా చూసే ఉంటారు. ఇంతటి గాఢమయిన భక్తిభావన లేదా దేవునిమీద ప్రేమ, ఎనిమిదవ శతాబ్దంనుంచి రూపొందిన వివిధ రకాల భక్తి సూఫి ఉద్యమాల వారసత్వం. ఆరో తరగతిలో విష్ణుభక్తిపరమయిన (ఆళ్వార్ల), శివభక్తిపరమయిన (నయనార్ల) కీర్తనలను గురించి మీరు చదివారు. రాజులు, సామంతులు దేవాలయాలు నిర్మించసాగారు. వాటి పోషణార్థం భూములు, ఇతర బహుమానాలు దానమిచ్చారు. గుడులలో పూజాధికాలు ఖర్చుతో కూడుకున్నవై సంక్లిష్టంగా మారాయి. శిక్షణపొందిన పూజారులు మాత్రమే విగ్రహాలకు పూజలు చేసేవారు. కొన్ని కులాల వారిని దేవాలయాలకు రానిచ్చేవారు కాదు. ఈ సాంప్రదాయాలపట్ల అసమానతల పట్ల వ్యతిరేకత ప్రారంభమైనది. భగవంతునిపై భక్తి భావనలో కొత్త కొత్త ఆలోచనలు వచ్చాయి. వాటిని తెలుసుకోవడానికి ఈ పాఠ్యాంశాన్ని చదువుదాం.

### తాత్వికత – భక్తి:

అత్యంత ప్రభావవంతమైన భారతీయ తత్వవేత్తలలో ఒకరైన శంకరాచార్యులు సా.శ. 8వ శతాబ్దంలో కేరళలో జన్మించారు. ఈయన అద్వైత సిద్ధాంతాన్ని బోధించాడు. జీవాత్మ, పరమాత్మ ఒక్కటేనని, అదే పరమసత్యమని ప్రవచించాడు. బ్రహ్మం మాత్రమే ఈ లోకంలో పరమ సత్యమని బోధించాడు. ఈ పరమసత్యానికి రూపం లేదని, దీనికి మరేది ఆపాదించలేమని ఆయన బోధించాడు. ప్రాపంచిక సుఖాలను త్యజించాలని, బ్రహ్మ నిజస్వరూపాన్ని తెలుసుకోవడానికి, మోక్షాన్ని సాధించడానికి జ్ఞానమార్గం అనుసరించడమే మార్గమని ప్రవచించాడు.

పదకొండో శతాబ్దిలో దక్షిణ దేశంలో పుట్టిన రామానుజుల మీద ఆళ్వారుల ప్రభావం గాఢంగా పడింది. ముక్తికి విష్ణువుమీద గాఢమయిన భక్తి ఉత్తమ సాధనమని ఆయన విశ్వసించాడు. విష్ణువు దయతలచి, తనతో సాయుజ్యానందం పొందడానికి భక్తుడికి సహాయపడతాడు. రామానుజులు కూడా చాలావరకు నిమ్నకులాలవారికి ఆలయార్చనలో స్థానం కల్పించాడు. ఈయన ప్రవచించినది విశిష్టాద్వైత సిద్ధాంతం. జీవాత్మ పరమాత్మలో కలిసినా దానికొక విశిష్టత (ప్రత్యేకత) ఉంటుందని ఈ సిద్ధాంతం చెబుతుంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో, నూతన భక్తి ఉద్యమ ఆవిర్భావానికి, రామానుజుల సిద్ధాంతం గొప్ప ప్రేరణనిచ్చింది.

### బసవన్న – వీరశైవం:

భక్తి ఉద్యమానికీ, గుళ్ళల్లో అర్చనకూ మధ్యగల సంబంధం గురించి ఇంతకుముందు తెలుసుకున్నాం. ఇపుడు మనం వీరశైవం అనే మరొక భక్తి ఉద్యమాన్ని చూద్దాం. దీనికి ఆరంభకులు బసవన్న, ఆయన సహచరులు అల్లమ ప్రభువు, అక్కమహాదేవి. ఈ ఉద్యమం 12వ శతాబ్దంలో, కర్ణాటకలో మొదలయింది. వారు కులము, స్త్రీలపట్ల మన ప్రవర్తన తీరు గురించి, మానవులందరి పట్ల సమానత్వ భావనల గురించి బలంగా ప్రాతినిధ్యం చేసారు.

SCERT, TELANGANA

బసవన్న చెప్పిన వచనాలు కొన్ని ఇలా ఉంటాయి :

*ధనవంతులు*
*శివునికి గుడి కడతారు.*
*పేద వాడిని,*
*నేనేం చేస్తాను?*
*నా కాళ్ళు స్తంభాలు*
*నా దేహం దేవాలయం*
*శిరస్సు,*
*ఆలయపు బంగారు శిఖరం*
*విను, ఓ నదీ సంగమదేవా,*
*కూలిపోతాయి ఆలయాలు*
*నిలిచి ఉంటాయి జంగమాలు ఎప్పటికి.*

- బసవన్న వ్యక్తం చేసిన ప్రధాన భావాలు ఏవి?
- బసవన్న దేవునికి అర్పిస్తున్న ఆలయం ఏది?

**మహారాష్ట్ర భక్తసాధువులు:**

13వ శతాబ్దంనుంచి 17వ శతాబ్ది వరకు మహారాష్ట్రలో చాలామంది భక్తకవులు వర్ధిల్లారు. సరళమయిన మరాఠీ భాషలో వారు రాసిన పాటలు ప్రజలను ప్రభావితులను చేశాయి. మహారాష్ట్ర భక్తకవులలో ముఖ్యులు జ్ఞానేశ్వర్, నామదేవ్, ఏకనాథ్, తుకారాం మాత్రమేకాక సక్కుబాయి వంటి భక్తురాళ్లు, "అంటరాని" మహర్ కులస్థుడయిన చోఖామేళుడి కుటుంబం వాళ్లు కూడా ప్రసిద్ధులు. ఈ భక్తి సాంప్రదాయం పండరిపురాలయంలోని విఠలుడి (మరో రూపంలో ఉన్న విష్ణువు) మీద మాత్రమే కాక సమస్త జనుల హృదయాల్లో నివసించే ఇష్టదైవం మీద కూడా దృష్టిని కేంద్రీకరింపజేసింది.

అన్ని రకాల కర్మలను, ధర్మనిష్ఠ తాలూకు బాహ్య ప్రదర్శనను, పుట్టుకతోనే ఆధారపడిన సామాజిక భేదాలను ఈ భక్తకవులు తిరస్కరించారు. నిజానికి, వారు సన్యాసాన్ని కూడా తిరస్కరించి కుటుంబజీవనం చేస్తూ ఇతర వ్యక్తుల మాదిరిగానే, బతకడానికి కావలసినది సంపాదించుకొంటూ అవసరంలో ఉన్న తోటివాళ్లకు అణకువగా సేవచేస్తూ ఉండటమే మేలని తలచారు. ఇతరుల బాధను పంచుకోవడంలో భక్తి ఉందనివారు నొక్కిచెప్పడంవల్ల ఒక కొత్త మానవతాభావం వెలువడింది. ప్రఖ్యాత గుజరాతీ భక్తుడు నర్సీ మెహతా "ఇతరుల బాధను అర్థంచేసుకొనేవాళ్లే వైష్ణవులు" అన్నారు.

సంత్ తుకారం రచించిన ఒక అభంగ్‌లోని (ఒక రకమైన మరాఠీ భక్తి గీతం) భావం ఈ కింది విధంగా ఉంటుంది:

*విపరీతంగా అసహ్యించబడ్డ వానిని*
*దెబ్బలు తిన్నవాణ్ణిచూసి*
*వేట్లు పడ్డవాణ్ణి చూసి*
*తానే అతనిగా ఊహించుకొని ఆ బాధలు పడ్డట్లు*
*తలచేవాణ్ణి గుర్తుంచుకో,*
*అతడు సాధువని.*
*అతనికి దేవుడు తోడుగా ఉన్నాడు,*
*వదిలేసిన ప్రతి వ్యక్తిని అక్కున జేర్చుకొంటాడతడు*
*బానిసలని ప్రతి ఒక్కణ్ణీ.*
*తన కొడుకులా చూసుకొంటాడు*
*బానిసను.*
*ఇలాంటి వ్యక్తిని మనిషి*
*రూపుదాల్చిన దేవుడని,*
*తూకా అంటాడు.*
*ఎన్నిసార్లు చెప్పడానికైనా నేను అలసిపోను*

- పేదలు, బాధాతప్తుల స్నేహితులనే నిజమైన భక్తులని తుకారాం అన్నాడని నీవు ఎందుకు భావిస్తున్నావు?

*చోఖామేళ కొడుకు రచించిన అభంగంలోని భావం ఈ కింది విధంగా ఉంటుంది:*

SCERT, TELANGANA



చిత్రం-21.1 అగ్నిచుట్టూ కూర్చున్న సన్యాసులు

మమ్మల్ని నిమ్నకులంలోని వాడిని చేసింది నువ్వు
ఆ యథార్థానికి ఎదురుగా ఎందుకు నిలుచోవు, మహాప్రభో!
భుక్తశేషాన్నం తినడమే కదా, మా బతుకంతా!
నువ్వు దీనికి సిగ్గుపడాలి
మా ఇంట్లో తిన్నావు కదా,
దాన్నెలా కాదనగలవు నువ్వు?
నాకెందుకిచ్చావు ఈ జన్మమని
అడుగుతున్నాడు, చోఖా (కొడుకు) కర్మమేలుడు,

- ఈ అభంగ్‌లలో సామాజిక వ్యవస్థ గురించి వ్యక్తపరిచిన భావాలను చర్చించండి.

**నాథపంథీలు, సిద్ధులు, యోగులు :**

ఆచారానుసారంగా వస్తున్న కొన్ని మతవిధులనూ, సామాజిక వ్యవస్థనూ ఈ కాలంలో ఏర్పడిన బృందాలు కొందరు సరళమయిన తార్కిక వాదాలతో విమర్శించడం మొదలుపెట్టారు. వారిలో నాథపంథీలు, సిద్ధాచారులు, యోగులు ఉన్నారు. వాళ్ళు ప్రపంచాన్ని వదిలేయమంటారు. నిరాకార పరమ సత్యాన్ని ధ్యానించడంలోను, దానితో ఐక్యంకావడంలోను ముక్తికి మార్గం ఉందంటారు. దీన్ని సాధించడానికి యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం వంటివాటిని సాధన చేస్తూ బౌద్ధిక అంశాలపై గాఢమయిన శిక్షణ పొందాలని బోధించారు. ఈ బృందాల వారి బోధలు ముఖ్యంగా "నిమ్న" కులాలవారిలో వ్యాపించాయి. ఆచారానుగతమయిన మతాన్ని గురించి వీరు చేసిన విమర్శ, ఉత్తర భారతదేశంలో భక్తిపరమయిన మతం ప్రబలంకావడానికి దారి తీసింది.

**ఇస్లామ్ - సూఫీతత్వం :**

భక్తసాధువులకూ సూఫీలకూ మధ్య చాలా విషయాలలో సారూప్యత ఉండేది. అందువల్ల ఒకరిభావాలనొకరు అందిపుచ్చుకున్నారు. సూఫీలు ముస్లిం మార్మిక సాధువులు. వారు బాహ్యమయిన మతనిష్ఠను వ్యతిరేకించారు. దేవుడిమీద ప్రేమ, భక్తి, సమస్త మానవులమీదా దయ, కరుణ ఉండాలని నొక్కిచెప్పారు.

ఏకేశ్వరోపాసనను కచ్చితంగా పాటించాలని, అంటే ఒకే దేవుడికి విధేయులై ఉండాలని ఇస్లామ్ ప్రబోధించింది. విగ్రహారాధనను తిరస్కరించింది. ఆరాధనాపరమయిన కర్మలను చాలావరకు సరళీకరించి సామూహిక ప్రార్థనలను విధించింది. అదే సమయంలో ముస్లిం పండితులు 'షరియత్' అనే పవిత్ర న్యాయాన్ని రూపొందించారు. ముస్లిం మతపండితులు విధించిన విస్తృత కర్మలనూ, ప్రవర్తన నియమావళినీ సూఫీలు తరచుగా తిరస్కరిస్తూ వచ్చారు. ప్రపంచాన్ని మరచిపోయి, ప్రియుడు తన ప్రియురాలి కోసం తపించిపోయినట్లు వారు దేవుడిలో ఐక్యాన్ని కోరారు. భక్తకవులలాగే సూఫీలు కూడా తమ అనుభూతులను వ్యక్తంచేస్తూ కవితలు రాశారు. వివిధ సంఘటనలతో, నీతికథలతో సంపన్నమయిన వచన సాహిత్యం అభివృద్ధి చెందింది. ఘజిలీ, రూమీ, సాదీ మధ్య ఆసియా ప్రాంతపు గొప్ప సూఫీలు. నాథపంథీయులు, సిద్ధులు, యోగుల మాదిరిగానే సూఫీలు కూడా, ప్రపంచాన్ని వేరే విధంగా చూడటానికి హృదయానికి శిక్షణ ఇవ్వవచ్చునని

SCERT, TELANGANA



*చిత్రం 21.2 పరమానందంలో మార్మిక సాధువులు*

విశ్వసించారు. ఈ శిక్షణకు వారు జిక్ర్ (ఒక నామాన్నిగాని, సూత్రాన్నిగాని జపించడం) ధ్యానం, సామ (పాడటం), రక్స్ (నృత్యం చేయడం), నీతికథలను చర్చించడం, ప్రాణాయామం మొదలైనవాటిని ఒక గురువు లేదా పీర్ మార్గదర్శకత్వంలో సాధనచేసే సవివర విధానాలను రూపొందించారు. ఆ విధంగా సూఫీ గురువుల పరంపర (సిల్‌సిలా) ఏర్పడింది. వారిలో ఒక్కొక్కరు, బోధనలోను, సాధనాపరమయిన కర్మలోను కొద్దికొద్దిగా భిన్నమయిన పద్ధతిని (తరీకాను) పాటిస్తూవచ్చారు.

పదకొండో శతాబ్దం తర్వాత మధ్య ఆసియానుంచి వచ్చిన చాలా మంది సూఫీలు హిందుస్థాన్‌లో స్థిరపడ్డారు. ఢిల్లీ సుల్తానుల పాలన మొదలయిన తరవాత, భారత ఉపఖండమంతటా అనేకమయిన సూఫీ ప్రధాన కేంద్రాలు ఏర్పడి ఈ ప్రక్రియ బలపడింది. అత్యంత ప్రభావవంతమయిన వ్యవస్థల్లో చిస్తీ పరంపర ఒకటి. ఇందులో బోధకులు చాలామంది వచ్చారు. వారిలో అజ్మీరులోని క్వాజా మొయినుద్దీన్ చిస్తీ, ఢిల్లీలో కుత్బుద్దీన్ బక్తియార్ కాకీ, పంజాబులో బాబాఫరీద్, ఢిల్లీలో క్వాజా నిజాముద్దీన్ ఔలియా, గుల్బర్గాలో బందనవాజ్, గిసుదరాజ్ ముఖ్యులు.

సూఫీ గురువులు తమ ఖాన్‌కాహ్‌లలో (ధర్మశాలల్లో) సమావేశాలు జరిపేవారు. రాజవంశీయులు, జమీందార్లు, సాధారణ ప్రజలు వంటివారితో సహా అన్ని తీరుల భక్తులూ ఈ ధర్మశాలలకు వచ్చేవారు. ఆధ్యాత్మిక విషయాలను వాళ్లు చర్చించేవాళ్లు. తమతమ లౌకిక సమస్యలను పరిష్కరించుకోడానికి సాధువుల దీవెనలను కోరేవారు లేదా కేవలం సంగీత, నృత్య కార్యక్రమాలకు హాజరయ్యేవారు.

సూఫీ గురువులకు అలౌకిక శక్తులు ఉంటాయనీ, వారు తమ రోగాలనూ, ఇబ్బందులనూ తొలగిస్తారనీ ప్రజలు ఆపాదించేవారు. సూఫీ సాధువుల గోరీలు (సమాధి; దర్గా) యాత్రాస్థలాలుగా మారి అన్ని మతాల వాళ్లూ వేలాదిగా అక్కడికి వస్తూండేవాళ్లు.

- మీరు ఎప్పుడైనా ఒక దర్గాకు వెళ్లి ఉంటే దానిని గురించి మీ స్నేహితులకు వివరించండి. అక్కడ వాళ్లు 'పీర్'ను ఎలా గౌరవిస్తారో, ఎలా ప్రార్థన చేస్తారో చెప్పండి.

### భారతదేశంలో కొత్త మతవిశ్వాసాల అభివృద్ధి:

పదమూడో శతాబ్ది తరవాత ఉత్తర భారతదేశంలో భక్తి ఉద్యమపు కొత్త తరంగం పైకి లేచింది. ఇస్లామ్, హిందుమతం, సూఫీతత్త్వం, ఇతర భక్తిశాఖలవారు,

SCERT TELANGANA

నాథపంథీలు, సిద్ధులు, యోగులు – ఒకరివల్ల ఒకరు ప్రభావితులయిన కాలమది. కొత్త పట్టణాలు, రాజ్యాలు ఈ కాలంలో పుట్టుకువస్తూండటం గమనించాం. ప్రజలు కొత్త వృత్తులను చేపడుతున్నారు. తాము నిర్వహించగల, కొత్త పాత్రలను అన్వేషిస్తున్నారు. అటువంటివాళ్లు – ముఖ్యంగా వృత్తిపనివారు, రైతులు, వర్తకులు, కార్మికులు – ఈ కొత్త సాధువుల బోధలను ఆలకించడానికి గుమిగూడి తాము విన్నవాటిని వ్యాప్తిచేసేవారు. కబీర్, బాబా గురునానక్ వంటివాళ్లు కొందరు చాదస్తపు ఆచారాలను, నమ్మకాలను తిరస్కరించారు.

బమ్మెర పోతన, అన్నమాచార్య, చైతన్య మహాప్రభు, తులసీదాసు, సూరదాసు వంటివాళ్లు అప్పటి విశ్వాసాలనూ, సాధనలనూ స్వీకరిస్తూనే వాటిని అందరికీ అందుబాటులోకి తేవాలని అభిలషించారు.

వరంగల్లు దగ్గరున్న బమ్మెర గ్రామంలో నివసించిన పోతన ప్రసిద్ధమయిన మహాభాగవతాన్ని తెనిగించాడు. పోతనను 'సహజకవి' అని అంటారు. ఆయన తన సహజ భక్తితత్త్వపరమయిన భావాలను వెల్లడించడానికే కాని తన పాండిత్య ప్రదర్శనకోసమో, చాతుర్యం కనబరుచుకోడానికో కవిత్వం రాయలేదు.

తాళ్లపాక అన్నమాచార్య (సా.శ.1408 –1503) ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాగ్గేయకారుడు. ఈయన పదకవితా పితామహుడుగా ప్రసిద్ధిచెందాడు. అన్నమయ్య తిరుపతి వెంకటేశ్వర స్వామి వైభవాన్ని కీర్తనల రూపంలో రాయడానికి, పాడటానికే తన జీవితాన్ని అంకితం చేశాడు. అతని కీర్తనలు చాలా వరకు ఆశువుగా గ్రాంథిక భాషలో కాకుండా వాడుక భాషలో, తెలుగు నుడికారాలతో ఉంటాయి. అన్నమయ్య శ్రీ వెంకటేశ్వరస్వామిపై ముప్పై రెండు వేల కీర్తనలు రాశాడని "అన్నమాచార్య చరిత్రము" ద్వారా తెలుస్తుంది.

ఆయన కీర్తనలలో నైతికత, ధర్మం, నిజాయితీ, వంటి అంశాలు ప్రధానంశంగా ఉంటాయి. ఆ కాలంలో అంటరానితనం వంటి సాంఘిక దురాచారాలను వ్యతిరేకించిన వారిలో అన్నమయ్య మొదటివాడు. "బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే", "ఏ కులజుడైననేమి ఎవ్వడైననేమి" వంటి సంకీర్తనలో భగవంతునికి, మానవునికి మధ్య గల సంబంధం విషయంలో రంగు, కులం, ఆర్థిక స్థోమత వంటి వ్యత్యాసాలేవి లేవంటూ ఎంతో సుందరమైన శక్తివంతమైన పదజాలాన్ని ఉపయోగించాడు.

*తందనాన ఆహి – తందనాన పురె*
*తందనాన భళా – తందనాన*
*బ్రహ్మమొక్కటె పరబ్రహ్మమొక్కటె పర*
*బ్రహ్మమొక్కటె పరబ్రహ్మమొక్కటె...*
*నిండార రాజు నిద్రించు నిద్రయునొకటే*
*అండనే బంటు నిద్ర అదియునొకటె...*
*మెండైన బ్రాహ్మణుడు–మెట్టుభూమియొకటే*
*చండాలుడుండేటి సరిభూమియొకటే....*

–అన్నమాచార్య కీర్తన

## చైతన్య మహాప్రభు (1486–1534) :

చైతన్య మహాప్రభు తూర్పు భారతదేశానికి చెందిన (ప్రస్తుత బంగ్లాదేశ్, పశ్చిమబెంగాల్) వైష్ణవ సాధువు, సంఘసంస్కర్త. ఈయన భగవద్గీత, భాగవత, పురాణాల ఆధారంగా భక్తి యోగాన్ని ప్రవచించాడు. సామూహికంగా భజనలు చేయడం, భక్తితో నాట్యం చేయడాన్ని వ్యాప్తిచేశాడు. ఈయన కృష్ణుని పూజించి హరే కృష్ణ మంత్రాన్ని బహుళ ప్రచారంలోకి తెచ్చాడు.

## కంచర్ల గోపన్న (1620–1680):

17వ శతాబ్దానికి చెందిన భక్త రామదాసుగా ప్రసిద్ధుడైన కంచర్ల గోపన్న (1620–1680) శ్రీరాముని భక్తుడు. ఈయన కర్ణాటక సంగీతంలో అనేక కీర్తనలను

SCERT, TELANGANA

స్వరకల్పన చేసినాడు. తెలుగు భాషలో ప్రముఖ వాగ్గేయకారుడు (స్వయంగా రచించి గానం చేసే వ్యక్తులు). భద్రాచలంలో గల ప్రసిద్ధి చెందిన శిథిలమైన శ్రీరాముని దేవాలయాన్ని పునరుద్ధరించాడు. రామదాసు కీర్తనల పేర ఈయన అనేక భక్తి గీతాలను రచించాడు. దాశరథి శతకం రచించి 108 పద్యాలను శ్రీరామునికి అంకితం చేశాడు.

*ఏ తీరుగ నను దయ చూచెదవో, ఇన వంశోత్తమ రామా*

*నా తరమా భవ సాగరమీదను, నళిన దళేక్షణ రామా*

*శ్రీరఘు నందన సీతా రమణా, శ్రితజన పోషక రామా*

*కారుణ్యాలయ భక్త వరద నిను, కన్నది కానుపు రామా...*

– రామదాసు కీర్తన

- వాగ్గేయకారులను, వారి కీర్తనలను కొన్ని తెలపండి.

తులసీదాసు, భగవంతుణ్ణి రామాకృతిలో భావనచేశాడు. అతడు తన రామచరితమానస కావ్యాన్ని (తూర్పు ఉత్తరప్రదేశ్‌లో వాడుకలో ఉన్న) అవధి భాషలో రాశాడు. ఈ గ్రంథం భక్తిభావప్రకటనపరంగాను, సాహిత్యపరంగాను కూడా ప్రాముఖ్యత కలిగిఉంది. ఆయనకు సమకాలికుడు (పదిహేనో శతాబ్ది చివరికాలపువాడు), అస్సాంవాసి అయిన శంకరదేవుడు విష్ణుభక్తిని ఉద్ఘాటిస్తూ అస్సామీ భాషలో కావ్యాలూ, నాటకాలూ రాశాడు. 'నామ్‌ఘర్' అనే పేరుతో ఆయన భగవన్నామ జపధ్యానాలకోసం మందిరాలను ఏర్పాటుచేసే సంప్రదాయాన్ని నెలకొలిపాడు. ఇప్పటికీ ఆ సంప్రదాయం కొనసాగుతూ ఉంది.

దాదు దయాళు, రవిదాసు, మీరాబాయి వంటి భక్తులు ఆ సంప్రదాయంలోని వాళ్లే. మీరాబాయి రాజపుత్ర స్త్రీ; మేవారు రాజకుటుంబం వారి కోడలు; పదహారో శతాబ్దిలో జీవించింది. "అంటరానివాళ్లు" అని చెప్పే కులంలో పుట్టి



*చిత్రం-21.3 మీరాబాయి*

గొప్ప సాధువుగా ప్రసిద్ధుడయిన రవిదాసుకు మీరాబాయి శిష్యురాలు అయింది. ఈమె కృష్ణభక్తురాలు. తన ప్రగాఢ భక్తిని వ్యక్తీకరిస్తూ ఈమె లెక్కలేనన్ని భజనగీతాలు రాసింది. అవి రాజస్థాన్‌లోను, గుజరాత్‌లోను జనబాహుళ్యంలో వ్యాప్తమయ్యాయి.

చాలామంది భక్త సాధువుల రచనల్లోని విశిష్టమయిన లక్షణమేమిటంటే, వారు ప్రాంతీయ భాషల్లో రాయడం, అవి పాడటానికి వీలుగా ఉండటం. దాంతో అవి చాలా జనరంజకాలయ్యాయి. ఒక తరంవారి నుంచి మరొక తరంవారికి మౌఖికంగా చేరుతూ వచ్చాయి. సాధారణంగా నిరుపేదలూ, నిరాధారులూ అయిన సముదాయాల వాళ్ళు, స్త్రీలు ఈ పాటలను వినిపిస్తూ వచ్చారు; వాటిలో తరుచుగా, తమ తమ అనుభవాలను కూడా కలుపుతూ ఉండేవారు. ఆ విధంగా ఇప్పుడు మనకు లభ్యమవుతున్న పాటల రచనలో ఆ సాధుసజ్జనులపాలు ఎంత ఉందో తరతరాలుగా వాటిని పాడుతూ వస్తున్న జనుల పాలు

SCERT, TELANGANA

కూడా అంతే ఉంది. సజీవమయిన మన ప్రజా సంస్కృతిలో అవి అంతర్భాగమయిపోయాయి.

- మీరు ఎప్పుడైనా మీ మాతృభాషలో భజన పాటలు విన్నారా? వాటిని ఎవరు సంకలనం చేశారు? వాటిలో కొన్నింటిని రాసి వాటి భావాన్ని తరగతి గదిలో చర్చించండి.

**కబీరు – సన్నిహిత పరిశీలన :**

పదిహేనో శతాబ్దికీ పదహారో శతాబ్దికీ మధ్యకాలంలో జీవించిన భక్తసాధువు కబీరు గొప్ప ప్రభావశాలి. ముస్లిం నేతపనివాళ్ల కుటుంబంలో పెరిగాడీయన. కాశీ (వారణాసి) నగరంలోనో, దానికి దగ్గరలోనో నివసిస్తూ ఉండేవాడు. ఈయన జీవితాన్ని గురించి మనకు లభించిన విశ్వసనీయమయిన సమాచారం తక్కువ. ఈయన రచించినట్లుగా వినవచ్చే, సంచార భజనబృందగాయకులు పాడుతూ వచ్చే సాఖీలు, పదాల ద్వారా ఆయన భావాలను మనం తెలుసుకోగలుగుతాం. వీటిలో కొన్ని తర్వాత కాలపు గురుగ్రంథ సాహిబ్‌లోను, పంచవాణిలోను, బీజక్‌లోను చేరి మనకి అందుబాటులో ఉన్నాయి.

కబీరు బోధనలు ప్రధాన మతసంప్రదాయాల సంపూర్ణ, తీవ్ర తిరస్కరణమీద ఆధారపడ్డాయి. ఆయన బోధనలు హిందు, ఇస్లామ్ మతపరమయిన అన్ని రకాల బాహ్య ఆరాధనలను, పూజారి వర్గాల ప్రాధాన్యాన్నీ, వర్ణవ్యవస్థను బహిరంగంగా ఎగతాళిచేశాయి. అతడు తన కవితా భాష, సాధారణ ప్రజలు అర్థంచేసుకోగల హిందీ వాడుక భాషలో చెబుతూండేవాడు. పరమదేవుడు రూపంలేని వాడని కబీరు విశ్వసించాడు. భక్తి ఒక్కటే ముక్తిమార్గమని ప్రచారం చేశాడు. కబీరు అనుచరులలో హిందువులు, ముస్లిములు కూడా ఉన్నారు.




*చిత్రం: 21.4 వర్ణచిత్రం-మగ్గంమీద నేతపనిచేస్తున్న కబీర్*

వాటిలోని ఒక గీతంలో భావం ఈ కింది విధంగా ఉంటుంది:

**దైవాన్వేషణలో...**

*అన్ని జీవుల్లోనూ ఉండే ఓ అల్లా – రామ్,*
*దయ ఉంచు నీ దాసులమీద, శ్రీ ప్రభూ!*
*నేలమీద తలకొట్టుకొంటావెందుకు?*
*ఈ శరీరానికి నీళ్ళలో స్నానం చేయిస్తావెందుకు?*
*నువ్వు చంపుతావు, పైగా చెప్పుకొంటావు, 'అణుకువగలవాణ్ణి' అని,*
*కాని దాచిపెట్టుకొంటావు నీ దుర్గుణాల్ని.*
*ఇరవై నాలుగుసార్లు బ్రాహ్మణులు, ఏకాదశులకు, ఉపవాసముంటాడు.*
*కాజీ పాటిస్తాడు రంజాన్ నెలను*
*నాకు తెలియకడుగుతున్నాను,*
*తక్కిన పదకొండు నెలలనూ*
*పక్కకు పెడతాడెందుకు?*
*ఆధ్యాత్మిక ఫలాన్ని అన్వేషించడానికా పన్నెండో నెల?*
*హరి తూర్పున ఉన్నాడంటారు*
*అల్లా పడమర ఉన్నాడంటారు*
*నీ హృదయంలో వెదుకు ఆయనకోసం,*
*నీ హృదయాంతర హృదయంలో,*
*అక్కడుంటాడు, రహీమ్ – రాముడు.*

SCERT TELANGANA



*చిత్రం: 21.5 యుక్తవయసుగల గురునానక్, కొందరు సత్పురుషులతో చర్చిస్తున్నారు*

## గురునానక్ - సన్నిహిత పరిశీలన :

మనకు కబీరుకంటె గురునానక్‌ను గురించి (సా.శ.1469-1539) ఎక్కువ తెలుసు. ఈయన తల్వాండి (పాకిస్తానులో నాన్‌కనా సాహిబ్)లో పుట్టి విస్తృతంగా పర్యటించి కర్తార్‌పుర్‌లో ఒక కేంద్రాన్ని (డేరా బాబా నానక్, రావీనది ఒడ్డున) స్థాపించారు. పూర్వపు మతవిశ్వాసంతోను, కులంతోను, స్త్రీ పురుష భేదంతోను నిమిత్తం లేకుండా ఆయన అనుచరులు ఒకే వంటశాల (లంగర్) లో కలిసి భోజనం చేసేవారు. ఆ విధంగా గురునానక్ ఏర్పరచిన పవిత్ర స్థలానికి ధర్మశాల అన్న పేరు వచ్చింది.

గురునానక్ అనుయాయుల సంఖ్య పదహారో శతాబ్దిలో, ఆయన వారసుల కాలంలో పెరుగుతూ వచ్చింది. వాళ్లలో అన్ని కులాలవాళ్లూ ఉన్నారు; కాని వర్తకులు, వ్యవసాయదారులు, వృత్తిపనివాళ్లు ఎక్కువ. దీనికి కారణం గురునానక్, తన అనుయాయులు గృహస్థులయి ఉండాలనీ, వస్తూత్పాదకమయిన, ఉపయోగకరమయిన వృత్తులను అవలంబించాలనీ చెప్పటమే. ఉమ్మడి నిధికి అనుయాయులు విరాళాలు ఇవ్వాలని చెప్పాడు.

ఈ ఉద్యమంమీద మొదటినుంచి గురునానక్ అభిప్రాయాల ప్రభావం విస్తృతంగా ఉంది. ఏకేశ్వరోపాసన ప్రాముఖ్యాన్ని ఆయన నొక్కి చెప్పాడు. మోక్షం పొందడానికి వర్ణ, మత, స్త్రీపురుష భేదాలతో నిమిత్తం లేదని ఉద్ఘాటించాడు. ఆయన అభిప్రాయంలో మోక్షమనేది, సమాజంపట్ల దృఢమయిన నిబద్ధతతో క్రియాశీలకమయిన జీవితాన్ని గడపడమే కాని నిశ్చలానందస్థితి కాదు. ఆయన బోధలకు సారభూతమయిన మూడు మాటలను - నామ్, దాన్, ఇస్నాన్ - అనేవాటిని ఆయనే చెప్పాడు. అంటే, సరయిన ఆరాధన, ఇతరుల సంక్షేమం, మంచి నడవడిక అని అర్థం. ఆయన బోధలనిప్పుడు, నామ్-జప్నా, *కీర్త్-కర్నా; వంద్-ఛక్నా* అనే మాటలతో గుర్తుంచుకుంటారు. సరైన విశ్వాసం, ఆరాధన, నిజాయితీతో కూడిన జీవితం, ఇతరులకు సహాయపడడం ముఖ్యమని ఇవి నొక్కిచెప్పాయి. సమానత్వంపై గురునానక్ వ్యక్తపరచిన భావనలు సామాజిక, రాజకీయ ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. గురునానక్ అనుయాయుల చరిత్రకూ మరియు కబీరు, రవిదాసు, దాదు వంటి మధ్యయుగపు మతగురువుల అనుయాయుల చరిత్రకూ మధ్య తేడాను కొంతవరకు ఇది వివరిస్తుంది.

**కీలకపదాలు:**

| | | | |
|---|---|---|---|
| 1) అద్వైతం | 2) మోక్షం | 3) అళ్వారులు | 4) నయనార్‌లు |
| 5) భక్తి | 6) యోగాసన | 7) బిజాక్ | 8) అభంగ్ |

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

1) నాథపంథీల, సిద్ధుల, యోగుల విశ్వాసాలను, ఆచారాలను వివరించండి.

2) కబీర్ చెప్పిన ప్రధాన భావాలు ఏమిటి? వీటిని ఆయన ఏ విధంగా చెప్పాడు?

3) సూఫీల ప్రధాన విశ్వాసాలు, ఆచారాలు ఏమిటి?

4) చాలా మంది బోధకులు, అప్పటికి వ్యాప్తిలో ఉన్న మతవిశ్వాసాలను, సాధనలను ఎందుకు తిరస్కరించారు?

5) గురునానక్ ప్రధాన బోధలు ఏవి?

6) కులాన్ని గురించి వీరశైవుల్లోగాని, మహారాష్ట్ర సాధువుల్లోగాని ఉన్న వైఖరిని చర్చించండి.

7) సాధారణ ప్రజలు మీరాబాయిని ఎందుకు జ్ఞాపకం పెట్టుకొన్నారని మీరు భావిస్తున్నారు.

8) 'కబీరు' సన్నిహిత పరిశీలన ఉపశీర్షికలో రెండవ పేరా చదివి, వ్యాఖ్యానించండి.

9) మీ ప్రాంతంలో జరుపుకునే ఒక సామూహిక ఉత్సవం గురించి రాయండి.

## ప్రాజెక్టు పని:

1) మీ పరిసరాల్లో ఏవయినా దర్గాలుగానీ, గురుద్వారాలుగానీ, భక్తిసంప్రదాయ సాధువులతో సంబంధమున్న దేవాలయాలుగానీ ఉన్నాయేమో కనుక్కోండి. వీటిలో దేన్నయినా సందర్శించి మీరక్కడ ఏం విన్నారో, ఏం చూశారో వివరించండి.

2) ఈ పాఠంలో ఉదాహరించిన రచనలను రచించిన భక్తకవుల్లో ఏ ఒక్కరు రాసినవాటిని గురించి అయినా ఇంకా ఎక్కువ తెలుసుకోండి; ఇతర రచనలను రాసిపెట్టుకోండి. వాటిని పాడేవారో, లేదో, పాడితే ఎలా పాడేవారో, కవులు దేన్ని గురించి రాశారో తెలుసుకోండి.

SCERT, TELANGANA

పాఠం 22

# రాజులు - కట్టడాలు

N5D7P2

చిత్రం.22.1 లో కుతుబ్‌మినార్‌లోని మొదటి అంతస్తులోని వసారాను చూడండి. కుతుబుద్దీన్ ఐబక్ దీన్ని సుమారు సా.శ. 1199 సంవత్సరంలో కట్టించాడు. ఈ వసారా కింద క్షేత్రగణిత నమూనాలో చెక్కిన ధనురాకారపు కమానులను గమనించండి. ఈ వసారా కింద ఉన్న రెండు వరసల్లో శాసనాలను చూశారా? ఇవి అరబ్బీ భాషలో ఉన్నాయి. ఈ పైభాగం కోణాకారంలో వంగి ఉన్నది. శాసనాన్ని ఇలాంటి చోట్ల ఉంచాలంటే ఖచ్చితమైన పనితనం అవసరం. ఎంతో నైపుణ్యం కలిగిన శిల్పులు మాత్రమే ఈ నిర్మాణం చేయగలరు. 800 సంవత్సరాల క్రితం కొన్ని కట్టడాలు మాత్రమే రాళ్ళతోను, ఇటుకలతోను నిర్మించారని గుర్తుంచుకోండి. 13వ శతాబ్దంనాటి సందర్శకులపై కుతుబ్‌మినార్ వంటి కట్టడాలు ఎలాంటి ప్రభావాన్ని చూపిఉంటాయి?

సా.శ. 8 నుండి 18వ శతాబ్దం మధ్యలో రాజులు, వారి అధికారులు రెండు రకాల కట్టడాలను నిర్మించారు: 1) కోటలు, రాజభవంతులు, సమాధులు: ఇవి రక్షణనిచ్చేవిగా, సురక్షితమైనవిగా, సేద తీరడానికి వైభవం కలిగిన ప్రదేశాలుగా నిర్మించినవి. ఈ ప్రపంచంలో వీటి తరవాతే ఏవైనా. 2) ప్రజలకు ఉపయోగపడే కట్టడాలు: అవి దేవాలయాలు, మసీదులు, చెరువులు, బావులు, వాహనశాలలు, బజార్లు. ప్రజల సౌకర్యం కోసం ఇలాంటి కట్టడాలను కట్టించడంవల్ల, వాటిని ఉపయోగించడంవల్ల రాజులకు గొప్ప పేరు ప్రతిష్ఠలు వస్తాయని నమ్మేవారు. రాజులతో పాటు వ్యాపారస్థులు, ఇతరులు కూడా ఇలాంటి నిర్మాణపు పనులను చేపట్టేవారు. వీటిలో దేవాలయాలు, మసీదులు, చెరువులు, బావులు, బిడారాలు, బజార్లు ముఖ్యమైనవి. ఈ నిర్మాణాలద్వారా రాజులు ప్రజల మన్ననలను పొందేవారు. గొప్ప శిల్ప నైపుణ్యం కలిగిన భవంతులు, వర్తకుల హవేలీలు సా.శ. 18వ శతాబ్దంనాటివి మాత్రమే నేటికీ మనుగడలో ఉన్నాయి.




*చిత్రం-22.1 : కుతుబ్ మినార్ ఐదు అంతస్తుల కట్టడం. మీరు చూస్తున్న రెండు వరసల శాసనాలు మొదటి వసారా కింద ఉన్నాయి. దీని మొదటి అంతస్తును కుత్బుద్దీన్ ఐబక్, మిగతాదాన్ని ఇల్‌టుట్‌మిష్ సా.శ. 1229లో నిర్మించారు. కాలగమనంలో ఇది పిడుగులు, భూకంపాల తాకిడికి గురికాగా తరువాత రాజులు మరమ్మతులు చేయించారు.*

SCERT, TELANGANA



చిత్రం-22.2ఎ ఢిల్లీలోని ఖువ్వత్-అల్-ఇస్లామ్ మసీదు



చిత్రం-22.2బి కమాను నిర్మాణంలో ఉపయోగించిన కార్బెల్డ్ సాంకేతిక పరిజ్ఞానం

**నిర్మాణాలు - నిర్మాణ నైపుణ్యాలు :**

పురాతన కట్టడాలు ఆనాటి నిర్మాణాలలో ఉపయోగించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుపుతాయి. ఉదా: పై కప్పును పరిశీలించండి. రాతితో గాని, కొయ్యతో గాని చేసిన దూలాలను నాలుగు గోడలమీద అమర్చి పైకప్పు వేయవచ్చు. అయితే విశాలమైన ఉన్నత నిర్మాణాలను వేయాలంటే మాత్రం కష్టమైనపని అవుతుంది. దీనికి అధునాతనమైన నైపుణ్యం అవసరం.

సా.శ. 7-10 శతాబ్దాల మధ్యకాలంలో భవంతులలో అనేక గదులు, తలుపులు, కిటికీలు అదనంగా అమర్చడం ప్రారంభించారు. రెండు నిలువు స్తంభాలపైన అడ్డంగా దూలాలను ఉంచి పై కప్పు, ద్వారాలు, కిటికీలను అమర్చేవారు. ఇలాంటి కట్టడాన్ని 'ట్రాబీట్' లేదా 'కార్బెల్డ్' అని పిలిచేవారు. సా.శ. 8-13 శతాబ్దాల మధ్య కాలంలో ట్రాబీట్ విధానాన్ని దేవాలయాలు, మసీదులు, సమాధులు, భవంతులకు, వాటికి అనుబంధంగా ఉన్న దిగుడు బావుల నిర్మాణానికి కూడా ఉపయోగించారు.

- మీకు దగ్గరలో ఉన్న పురాతన దేవాలయాలను, మసీదులను సందర్శించి ట్రాబీట్ కట్టడం విధానం ఉందేమో పరిశీలించండి.

- ఇలాంటి పద్ధతిలో పై కప్పును నిర్మించేటప్పుడు స్తంభాలు ఒకదానికొకటి దగ్గరగానే ఉంటాయి. మరి విశాలమైన వెడల్పు గదులను నిర్మించడం కుదరదు కదా. ఎందుకనో మీరు చెప్పగలరా?


**11వ శతాబ్దం ఆరంభంలో దేవాలయాల నిర్మాణం :**

కందరీయ మహాదేవ శివాలయాన్ని క్రీ.శ.999లో ఛందేల రాజైన ధంగదేవుడు నిర్మించాడు. చిత్రం 22.3 (బి) దేవాలయ నిర్మాణ ప్రణాళికను తెలుపుతుంది. అందంగా అలంకరించబడిన తోరణ ప్రవేశద్వారం తరవాత విశాలమైన మహామండపం ఉంది. దీన్నే నాట్య మండపం అంటారు. దీని వెనక ఉన్న గర్భగృహంలో దేవుని విగ్రహం



చిత్రం-22.3ఎ. కందరీయ మహాదేవ శివాలయం

SCERT, TELANGANA




ప్రతిష్ఠించి ఉంటుంది. ఈ గర్భగృహంలో రాజులు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, పూజారులు మాత్రమే ప్రవేశించి పూజలు చేసేవారు. ఖజురహో రాజప్రసాద సముదాయంలో కేవలం రాజులకు మాత్రమే ప్రత్యేకించి దేవాలయాలు ఉండేవి. సామాన్యులకు ఇందులో ప్రవేశం లేదు.


*చిత్రం-22.3బి. కందరీయ మహాదేవ శివాలయం గ్రౌండ్ ప్లాన్*

ఈ దేవాలయాలు విస్తృతంగా మలచిన శిల్పాలతో అలంకరించబడి ఉన్నవి.

తంజావూరులోని రాజరాజేశ్వర దేవాలయం ఆ కాలంలోని దేవాలయాన్నిటిలోనూ ఎత్తైన శిఖరం కలిగినది. నాడు ఇలాంటి నిర్మాణాలు చేపట్టడం అంత తేలిక కాదు. ఎందుకంటే ఆ రోజుల్లో అంత పెద్ద బరువులనెత్తే యంత్రాలు లేవు, 90 టన్నుల రాతిని శిఖరంపైకి చేర్చడం మనుషులవల్ల కాదు. అందువల్ల శిల్పులు శిఖరంపైకి వాలుగా ఉన్న మార్గాన్ని నిర్మించి, రెండు చక్రాల బండిని చేసి దానికి ఈ రాతిని పెట్టి దొర్లించుకుంటూ శిఖర పైభాగానికి చేర్చారు. ఈ మార్గం దేవాలయ శిఖరానికి 4 కి.మీ. దూరం నుండి మొదలైంది. నిటారుగా ఉంటే దొర్లించడం కష్టం కాబట్టి బాగా వాలుగా ఉండేందుకు ఇలా చేశారు. దేవాలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఈ మార్గాన్ని తొలగించారు.



*చిత్రం-22.4 తంజావూరులోని బృహదీశ్వరాలయం*



*చిత్రం-22.5ఎ ట్రూ ఆర్చ్. ఆర్చ్ మధ్యభాగంలోని కీలకమైన రాయి ఆ కట్టడపు మొత్తం బరువును ఆర్చ్ ఆధార పీఠానికి మార్చేటట్లు అమర్చిఉంది.*



*చిత్రం-22.5బి "ట్రూ ఆర్చ్" (14వ శతాబ్దం) అలాయ్-దర్వాజ ఖువ్వత్-అల్-ఇస్లామ్ మసీదు, ఢిల్లీ*

**నూతన నిర్మాణ విధానము :**

రెండు సాంకేతికపరమైన అందమైన శైలులను మనం 12వ శతాబ్దంలో గమనించవచ్చు.

1) తలుపులమీదా, కిటికీలమీదా ఉంచిన మొత్తం నిర్మాణపు బరువును ఒక్కొక్కప్పుడు కమానులమీద మోపారు. ఇదే నిర్మాణ విధానం సొరంగాల పైకప్పులకు, గుమ్మటం పై కప్పులకు కూడా ఉపయోగించేవారు. ఇటువంటి కట్టడాన్ని 'ఆర్కుయేట్' అని అంటారు.

SCERT, TELANGANA

- *చిత్రం 22.2ఎ, 22.2బి ని చిత్రం 22.5ఎ, 22.5బిలతో పోల్చిచూడండి.*

2) ఆనాటి నిర్మాణాలలో కట్టుబడి సున్నంను ఎక్కువగా ఉపయోగించేవారు. ఇది చాలా నాణ్యమైనది. దీనిలో గులకరాళ్ళ పలుకులను కలపడంతో ఇది బలమైన కాంక్రీటుగా మారుతుంది. ఎంత పెద్ద కట్టడమైనా దీనితో సులభంగా, త్వరగా కట్టవచ్చు. సున్నపురాయి మిశ్రమాన్ని, కమానులకు, గోళాకారపు పైకప్పులకు సా.శ.1190 తరవాత భవనాలలో విరివిగా ఉపయోగించారు. చిత్రం 22.6లో ఉన్న నిర్మాణాన్ని పరిశీలించండి.

- పనివాళ్లు ఏంచేస్తున్నారు? ఇక్కడ చూపించిన పనిముట్లను, రాళ్ళు మోయడానికి ఉపయోగించిన విధానాలను గురించి వివరించండి.



***చిత్రం-22.6 ఆగ్రా కోటలోని వాటర్-గేట్ నిర్మాణ సమయంలోని చిత్రం : అక్బర్‌నామా (సా.శ.1590-95)***

- ఇలాంటి కొత్త సాంకేతిక విధానాలు విశాలమైన పెద్ద గదులూ, ఎత్తైన భవనాలూ కట్టడానికి ఉపయోగించవచ్చని భావిస్తున్నారా?


**దేవాలయాలు, మసీదులు, చెరువుల నిర్మాణం :**

దేవాలయాలను, మసీదులను చాలా అందంగా నిర్మించేవారు. అవి పవిత్ర పూజా ప్రదేశాలు కాబట్టి వీటిని పోషించేవారి శక్తిని, సంపదను, భక్తిని ప్రదర్శించడానికి కూడా ఇవి ఉపయోగపడేవి. రాజరాజేశ్వర దేవాలయాన్నే ఉదాహరణగా తీసుకుందాం. ఈ దేవాలయాన్ని రాజరాజదేవుడనే రాజు తమ కులదైవమైన రాజరాజేశ్వరున్ని కొలవడానికి కట్టించాడని ఇక్కడి శాసనం తెలుపుతోంది. ఇక్కడ రాజుపేరు, దేవునిపేరు ఒకటిగానే ఉండడం గమనించండి. దేవుని పేరు శుభప్రదమయినది కాబట్టి రాజుకు ఆ పేరు పెట్టారు (తల్లిదండ్రులు). దేవుని ప్రతిరూపంలా కనబడాలని రాజు కోరుకునేవారు. దేవాలయంలో జరిపే పూజా కార్యక్రమాల ద్వారా రాజరాజదేవుడు మరొక దేవుడిని అనగా రాజేశ్వరుడిని గౌరవించేవారు.

అలాగే కాకతీయ రాజధాని ఓరుగల్లును గుర్తుకుతెచ్చుకోండి. ఓరుగల్లులోని స్వయంభూ శివాలయం ఓరుగల్లు కోట మధ్యలో ఉండేలా నిర్మించారు. తాము స్వతంత్ర రాజులమని, తమ అధికారాన్ని, గొప్పతనాన్ని చాటడానికి కాకతీయులు దీనిని కట్టించారు.

పెద్ద పెద్ద దేవాలయాలన్నీ రాజులు కట్టించినవే. గుడిలోని ఇతర చిన్న విగ్రహాలన్నీ దేవుళ్ళు, దేవతలవి. వీటిని రాజపరివారం, సామంతులు నిర్మించారు. ఈ దేవాలయాలన్నీ కూడా ఒక చిన్న ప్రపంచాన్ని తలపిస్తాయి. రాజులు, సామంతులు, ప్రజలు వారి దేవతలను కొలిచి పూజిస్తుంటే ఈ భూమిపై భగవంతుడు ఆశించే ధర్మపరిపాలన తెచ్చినట్లు ఉండేది.

దేవతలకు వైభవంగా పూజలు జరగడానికి రాజులు, ఇతర పరివారం మాన్యాలు, బంగారం, ఆభరణాలను




**చిత్రం-22.7 నూతన రాజధాని అయిన షాజహానాబాద్‌లో 1650-56లో షాజహాన్ నిర్మించిన జామి మసీదు**

దానంగా ఇచ్చేవారు. క్రీ.శ. 12వ శతాబ్దినాటికి దేవాలయాలు పెద్ద వ్యవస్థలుగా ఆవిర్భవించి వందల కొద్ది వృత్తికళాకారులైన నర్తకులు, సంగీత విద్వాంసులు, పూజారులు, నిర్వాహకులు, సేవకులు మొదలయిన వారికి ఉపాధి కల్పించాయి. ఈ దేవాలయాలు గ్రామాల్లో కొన్ని సందర్భాలలో పన్నులు కూడా వసూలు చేసి, వ్యాపారస్థులకు ధనాన్ని అప్పుగా ఇచ్చేవి. అనేక జాతరలు, సంతలు, ఉత్సవాలను జరిపేవి. ఇక్కడ వస్తువుల అమ్మకాలు, కొనుగోళ్ళు జరిగేవి. ఈ దేవాలయాల చుట్టూ అనేక శైవ, వైష్ణవ మఠాలు వెలిశాయి. ఈ విధంగా దేవాలయాలు ఒక గొప్ప రాజకీయ, ఆర్థిక కేంద్రాలుగా ఆవిర్భవించాయి. రాజులు, పాలకులు తమ తమ పేర్లు దేవాలయాలతో పాటు చిరకాలం ఉండటం కోసం పట్టాభిషేకాల వంటి కార్యక్రమాలను దేవాలయాలలో జరుపుకొని వాటికి గొప్ప దానాలుచేసి, కానుకలను సమర్పించి దేవాలయాల నిర్మాణానికి, అభివృద్ధికి తోడ్పడేవారు.


ముస్లిం సుల్తానులు, పాదుషాలు తాము భగవంతుని అవతారమని చెప్పుకోలేదు కానీ సుల్తానును భగవంతుని నీడలా పర్షియన్ చరిత్ర వర్ణించింది. ఢిల్లీ మసీదులోని శాసనం భగవంతుడే అల్లాఉద్దీన్‌ను రాజుగా నియమించాడని, గతంలో గొప్ప న్యాయరూపకర్తలుగా పేరొందిన మోసెస్, సాల్మన్‌లకున్న గుణాలన్నీ ఇతనికీ ఉన్నాయని, ఎంతో కష్టాల్లో ఉన్న ప్రపంచాన్ని శాంతియుతంగా తీర్చిదిద్దాడని పేర్కొంటున్నది. దేవుడు

స్వయంగా అరాచకత్వం నుండి రాజ్యాన్ని రక్షించి క్రమమైన న్యాయపాలనా విధానాన్ని ప్రవేశపెట్టాడు.

కొత్త రాజవంశం అధికారంలోకి రాగానే ఆ రాజులు రాజ్యాధికారం తమ నైతిక హక్కుగా భావించేవారు. కొత్త ఆరాధన స్థలాలను నిర్మించి తాము దేవుడికి చాలా సన్నిహితులమని చెప్పుకునేవారు. ముఖ్యంగా ఆకస్మిక రాజకీయ మార్పులు జరిగే సమయాల్లో ఇలా చెప్పుకొనేవారు. పాలకులు కూడా పండితులకు, సాధువులకు భూరి దానాలిచ్చి వారి రాజధానులు, నగరాలను సాంస్కృతిక కేంద్రాలుగా తీర్చిదిద్దేవారు. దీనితో వారికి వారి పాలనకు పేరు ప్రఖ్యాతులు లభించేవి.

రాజుల ధర్మ పాలనావిధానాలనుబట్టి దేశంలో అన్ని వనరులు సమృద్ధిగా ఉండేవని, తద్వారా స్వర్గంనుంచి సకాల వర్షాలు కురుస్తాయని ప్రజలు నమ్మేవారు. ఆ కాలంలో చెరువులు, జలాశయాల ద్వారా విలువైన నీటిని సరఫరా చేయడాన్ని గొప్పగా ప్రశంసించేవారు. ఢిల్లీ-ఇ-కుహనా వెలుపల పెద్ద జలాశయాన్ని కట్టించడం ద్వారా ఇల్-టుట్‌మిష్ అనే సుల్తానును ప్రజలందరూ గౌరవించారు. దీనినే 'హౌజ్-ఇ-సుల్తాని' లేదా "రాజుగారి జలాశయం" అని పిలిచేవారు.

సామాన్య ప్రజల వాడుక కోసం పాలకులు చిన్నా పెద్దా చెరువులనూ, జలాశయాలను నిర్మించేవారు.



**చిత్రం-22.8 అమృత్‌సర్‌లోని హర్మిందర్ సాహిబ్ (స్వర్ణ దేవాలయం) చుట్టూగల పవిత్ర సరస్సు**

SCERT TELANGANA

- మీరు గ్రామదేవతల గుడులను గురించి, పెద్ద పెద్ద దేవాలయాలను గురించి, మసీదులను గురించి చదివారు కదా, ఆ గ్రామ దేవతల గుడులూ, దేవాలయాలు, మసీదులు చాలా భిన్నంగా ఉన్నాయని నీకు ఎందుకు అనిపిస్తుంది?

## దేవాలయాలు ఎందుకు ధ్వంసం చేయబడ్డాయి?

రాజులు తమ భక్తిని, సంపదను, అధికారాన్ని కనబరుచుకోడానికి దేవాలయాలను కట్టించేవారు. అందుకే ఒకరాజు మరొక రాజ్యంమీద దండెత్తినప్పుడు ఈ దేవాలయాలపైనే గురిపెట్టేవాడు. సా.శ. 9వ శతాబ్దం ప్రారంభంలో పాండ్య రాజైన శ్రీమార శ్రీవల్లభుడు శ్రీలంకమీద దాడి చేసి సేన-1(సా.శ. 831-851) అనే రాజును ఓడించాడు. బౌద్ధసన్యాసి, చరిత్రకారుడయిన ధమ్మకిత్తి ఈవిధంగా రాశాడు: "అతను విలువైన వాటినన్నింటినీ తొలగించాడు. రత్నభవనంలోని, పూర్తిగా బంగారంతో చేసిన బుద్ధ విగ్రహాన్నీ, బౌద్ధారామాలలో ఉన్న బంగారు ప్రతిమలను దోచుకొని వెళ్ళాడు." ఈవిధంగా సింహళ రాజుకు తగిలిన ఎదురుదెబ్బకి ప్రతీకారంగా, తరవాత సింహళ రాజైన సేన-2 తన సేనానిని పాండ్యరాజధాని అయిన మధురమీదకు దండెత్తమని ఆదేశించాడు. ఈ దండయాత్రను కేవలం బుద్ధుని బంగారు విగ్రహాన్ని తిరిగి తేవడానికే చేశారని బౌద్ధ భిక్షువు రాశాడు.

ఇదేవిధంగా పదకొండో శతాబ్ద ప్రారంభంలో చోళరాజైన రాజేంద్ర-1 తన రాజధానిలో ఒక శివాలయాన్ని నిర్మించి ఓడిపోయిన రాజుల దగ్గరినుంచి తను తీసుకొన్న లేదా బహుమతిగా పొందిన విగ్రహాలతో దానిని నింపాడు. వాటిలో కొన్ని: 1) నిలబడిన సూర్యుడి శిల్పం చాళుక్యుల దగ్గరినుండి, 2) గణేశ, దుర్గాదేవి విగ్రహాలు, నంది విగ్రహం తూర్పుచాళుక్యుల దగ్గరినుండి, 3) భైరవుని ప్రతిరూపం (శివుని రూపాలలో ఒకటి) భైరవి విగ్రహాలను ఒరిస్సాలోని కళింగరాజుల దగ్గరినుండి, 4) కాళీమాత విగ్రహం బెంగాల్‌లోని పాలవంశీయుల దగ్గరినుండి తెచ్చారు.

గజనీ మహమూద్ చోళ రాజేంద్ర-1 రాజుకు సమకాలికుడు. భారత ఉపఖండంమీద దండెత్తినప్పుడు ఓడిపోయిన రాజుల దేవాలయాలను కొల్లగొట్టి సంపదను, విగ్రహాలను దోచుకున్నాడు. గజనీ మహమూద్ ఆనాడు గొప్ప పేరుపొందిన రాజు కాడు. కాని సోమనాథ్ దేవాలయం వంటి పెద్ద దేవాలయాలను ధ్వంసం చేసి ఇస్లాం నాయకుడిగా ప్రసిద్ధి పొందాడు. దాదాపు మధ్యయుగంలోని రాజులందరూ తమ రాజకీయ శక్తిని, సైన్యాన్ని ఉపయోగించి ఓడిపోయిన రాజుల పవిత్ర స్థలాల మీద దాడిచేసి దోచుకున్నారు.

- రాజేంద్ర-1, గజనీ మహమూద్ కాలంనాటి వారి విధానాల గురించి మీరేమి అనుకుంటున్నారు? ఈ ఇద్దరు రాజుల చర్యలలోని తేడాలేమిటి?

## విజయనగర రాజుల శైలి :

యావత్ దక్షిణ భారతదేశానికి ప్రధాన రాజధానిగా విజయనగర పట్టణాన్ని విజయనగర రాజులు అభివృద్ధి



*చిత్రం-22.9 హంపిలోని విరూపాక్ష దేవాలయం*

SCERT TELANGANA



*చిత్రం-22.10(ఎ) పద్మమహల్*



*చిత్రం-22.10(బి) రాణుల స్నానవాటిక*

చేశారు. వీరు ప్రాచీన భవన నిర్మాణ సంప్రదాయాలను వీరి నిర్మాణాలలో ప్రతిబింబింపజేశారు. వీరు శ్రీ విరూపాక్ష, రామచంద్ర, కృష్ణ, విఠలాలయాలను తమిళనాడులోని చోళ, పాండ్య, చక్రవర్తుల విధానాలను అనుసరించి అభివృద్ధిచేశారు. గోపురాలు, విమానాలు వీరి శిల్పకళలో భాగాలే. రాయలవారు గోపురాల విషయంలో ప్రత్యేకశ్రద్ధ కనబరిచారు. ఇంతవరకు ఎవరూ కట్టనంత ఎత్తులో వాటిని నిర్మించారు.

మొదటి అంతస్తును గట్టి నల్లసేనపు (గ్రానైట్) రాయితో మిగిలిన అంతస్తులను గట్టి ఇటుకతో, సున్నంతో నిర్మించారు. తమ దర్పానికి తగినట్లుగా రాజ గోపురాలను చాలా ఎత్తుగాను, మధ్యలోనున్న గర్భాలయాలపైన ఉన్న గోపురాలను చిన్నవిగాను నిర్మించారు. చాలా దూరంనుండి ఈ ఎత్తైన గోపురాన్ని చూడగానే ఇక్కడ గుడి ఉందని దీనివల్ల తెలుస్తుంది. ఇవి సామ్రాజ్యాధికారానికి ప్రతీకలుగా ఉండడమే కాకుండా ఈ నిర్మాణానికి తోడ్పడిన వనరులకు, సాంకేతిక నైపుణ్యాలకు నిదర్శనాలుగా కూడా ఉన్నాయి. విశేషమైన ఇతర నిర్మాణాలలో ముఖ్యమైన మండపాలను, వసారాలను చాలా పొడవుగా స్తంభాలతో కూడి ఉండేటట్లు గర్భగుడి చుట్టూ నిర్మితమయ్యాయి. విరూపాక్ష దేవాలయాన్ని జాగ్రత్తగా పరిశీలిద్దాం.

విరూపాక్ష దేవాలయం అనేక శతాబ్దాలక్రితం నిర్మించినది. అయితే మొదటి విగ్రహ స్థాపన సా.శ. 9-10 శతాబ్దాల మధ్య జరిగిందని శాసనాలు తెలుపుతున్నాయి. విజయనగర రాజ్యస్థాపన తరవాత ఈ దేవాలయాన్ని బాగా పెద్దదిగా చేశారు. మూలవిరాట్టుకు ఎదురుగా ఉన్న విశాలమైన గదిని కృష్ణదేవరాయలు సింహాసనాన్ని అధిష్ఠించిన సందర్భంగా కట్టించారు. ఈ గది అందంగా అలంకారాలు చెక్కి ఉన్న స్తంభాలతో కూడి ఉంది. తూర్పుగోపుర నిర్మాణం వారి కళాపోషణను తెలియజేస్తుంది. ఈ చుట్టుపక్కల అదనపు కట్టడాలతో, గర్భాలయం, మధ్యలో కొద్ది స్థలంలోనే ఆక్రమించిందని చెప్పవచ్చు.

ఈ దేవాలయాలలోని విశాలమైన గదులను రకరకాలైన కార్యక్రమాలకు ఉపయోగించేవారు. కొన్నిచోట్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి సంగీత, నృత్య, నాటికల వంటి కార్యక్రమాలను జరిపేవారు. కొన్నిచోట్ల ఇతర మండపాలను దేవతల కళ్యాణోత్సవాలను ఉపయోగించేవారు. ఇంకా కొన్ని మండపాలలో మూలవిరాట్ ప్రతిరూపాలను ప్రతిష్ఠించేవారు.

విజయనగర రాజులు తమ దేవాలయాలను ఇతర దేవాలయాల పద్ధతిలోనే నిర్మించి లౌకిక కార్యక్రమాలకోసం రాజమందిరాలను నిర్మించారు. వీటి నిర్మాణంలో సుల్తానుల సాంకేతిక పరిజ్ఞానాన్ని, వారి పద్ధతులను పాటించారు. ప్రసిద్ధి చెందిన పద్మమహల్ (బ్రిటిష్ వాళ్ళు, సందర్శకులు దాన్ని ఇలా పిలిచేవారు), రాణుల స్నానఘట్టం, గజశాల

SCERT TELANGANA

దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు. భవంతుల నిర్మాణంలో కమాన్లు, గుండ్రని పైకప్పులను మనం చూడవచ్చు. ఇవన్నీ సున్నంతో తాపడం చేసిన పుష్పాలు, పక్షుల ఆకారాలతో అలంకరించి ఉన్నాయి. ఈ రాజప్రాసాదాలలో రాజులు నివసించడం ద్వారా అవి వారి సంపదకు చిహ్నంగా ఉంటూ వారి సంపదకు, సుఖమయమైన నగరజీవనానికి నిదర్శనాలనే భావనను కలిగించేవి. అయితే ఇవన్నీ కూడా సుల్తానుల భవంతులలాగే ఉన్నాయని భావించకూడదు. ఇందులో దక్షిణ భారతదేశ శిల్ప సంప్రదాయాలు, సుల్తానుల కాలంనాటి కమానులు, గోళాకారపు పైకప్పులు మిళితమై ఉన్నాయి. ఈ విధమైన సమ్మేళనానికి రాజు తన సభను నిర్వహించే పద్మమహల్‌ను ఉదాహరణగా చెప్పవచ్చు.



చిత్రం-22.10(సి) గజశాల

- విశాల సామ్రాజ్యం కలిగిన చక్రవర్తులు వివిధ శైలులలో నిర్మించిన భవంతులను ఎందుకు ఉపయోగించేవారని అనుకుంటున్నారు?

విజయనగర రాజుల గొప్ప కట్టడాలలో చెప్పుకోదగినది మహానవమి దిబ్బ. 11 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 55 అడుగుల ఎత్తులో నిర్మించిన వేదిక. ఇది 5 అంతస్తుల భవంతి కంటే పొడువైనది. 200 సంవత్సరాలలో కనీసం మూడుసార్లైనా దీని ఎత్తును పెంచి ఉంటారు. ఈ వేదిక అంచుల్లో రకరకాలైన శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ వేదికమీద ఎటువంటి భవంతీ నిర్మించలేదు. ఈ వేదిక మీద చెక్క స్తంభాలతో నిర్మించిన పందిరి ఉంది. ఈ వేదికపైనే విజయనగర రాజులు నవరాత్రి పూజ, దసరా దర్బారును నిర్వహించేవారు. ఈ సందర్భంలోనే సామంతరాజులు, నాయకులు, ఇతర అధికారులు చక్రవర్తికి కానుకలను చెల్లించేవారు. ఐరోపా నుండి విదేశీరాయబారులు, ఇతర సుల్తానులు ఈ ఉత్సవాలకు హాజరయ్యేవారు.

### ఉద్యానవనాలు, సమాధులు, కోటలు:

మొగలుల కాలంలో శిల్పకళ చాలా ప్రసిద్ధి చెందింది. మొగలు చక్రవర్తులు సాహిత్య, సంగీత, నృత్య, శిల్పకళలలో స్వయంగా శ్రద్ధవహించారు. బాబరు తన స్వీయచరిత్రలో తోటలమీద తనకున్న మక్కువను వివరించాడు. ఉద్యానవనాలను దీర్ఘచతురస్రాకారంలో కృత్రిమ కాలువల ద్వారా నాలుగు భాగాలుగా విభజించి ఉండి చుట్టూ వాటికి ప్రాకారపు గోడలు ఉండాలని బాబరు వర్ణించాడు.

కాబట్టి నాలుగు సమానభాగాలుగా ఏర్పడి ఉంటాయి. ఈ ఉద్యానవనాలనే చార్‌బాగ్ అంటారు. ఈ ఉద్యానవన నిర్మాణాలు అక్బరుతో మొదలైనప్పటికీ జహంగీర్, షాజహాన్ వంటి చక్రవర్తులు కాశ్మీర్, ఢిల్లీ, ఆగ్రాలలో అందమైన ఉద్యానవనాలను నిర్మించారు.




చిత్రం-22.10(డి) మహానవమి దిబ్బ

SCERT, TELANGANA



**చిత్రం-22.11 బాబర్ కాబూల్‌లోని చార్‌బాగ్‌లో పనిచేస్తున్న పనివాళ్లను పర్యవేక్షిస్తున్నాడు. దారులమధ్య ఖండించుకున్న కాలువలను చూపుతున్న దృశ్యం**




***చిత్రం-22.12 హుమాయూన్ సమాధి. ఆనాటి నీటి కాలువలను గమనించండి.***

అక్బరు కాలంలో అనేక కొత్త కట్టడాలను నిర్మించారు. అక్బర్ నిర్మించిన సమాధులు మధ్యఆసియా వాడయిన తైమూరు కట్టడాలను పోలి ఉన్నాయి. మొగలుల నిర్మాణాలలో మధ్య గోపురాలమీద నిర్మించిన గోళాకారపు పైకప్పులను, ఎత్తైన, పొడవైన ముఖద్వారాలను ముఖ్య లక్షణాలుగా చెప్పుకోవచ్చు. హుమయూన్ సమాధిమీద ఇలాంటివి చూడవచ్చు. ఇది విశాల చార్‌బాగ్ ఉద్యానవనం మధ్యలో సంప్రదాయబద్ధంగా నిర్మితమయింది. దీనినే 'అష్ట బిహిష్ట్' (8 స్వర్గాలు) అని పిలుస్తారు: మధ్య పెద్దగది ఉండి చుట్టూ 8 గదులు ఉంటాయి. ఈ కట్టడాన్ని ఎర్రరాతితో కట్టి అంచులకు పాలరాతిని తాపడం చేశారు.

షాజహాను కాలంలో అనేక శిల్ప, వాస్తురీతులతో మిళితం చేసిన కొత్త భవనాలను నిర్మించారు (దివాన్-ఇ-ఖాస్ లేదా దివాన్-ఇ-ఆమ్). ఈ రాజప్రాసాదాన్నే చిహిల్ సుతున్ లేదా నలభై స్తంభాల విశాలమైన గది అని కూడా పిలుస్తారు. ఇతని పాలనలోనే ఢిల్లీ ఆగ్రాలలో పెద్ద పెద్ద నిర్మాణాలు చేయబడినాయి. ప్రభుత్వాధికారులు, సందర్శకుల కోసం నిర్మించిన రాజప్రాసాదం ప్రణాళికాబద్ధంగా నిర్మించాడు.

షాజహాన్ సందర్శకుల కోసం నిర్మించిన విశాలమైన గది మసీదును పోలి ఉంటుంది. రాజ సింహాసనం కింద ఉన్న స్తంభాన్ని పవిత్రమైన 'కిబ్లా'గా భావిస్తారు. ముస్లిములు ప్రార్థన సమయంలో మక్కావైపు చూస్తారు కాబట్టి రాజసభ జరిగేటప్పుడు అందరూ అదేదిశలో తిరిగి ఉంటారు. రాజు భూమి మీద భగవంతుని ప్రతినిధి అని తెలపడానికే ఇలా కట్టి ఉంటారని తలచవచ్చు. ఇదే వారి వాస్తుశిల్పకళలోని విశేషమైన లక్షణంగా చెప్పవచ్చు.



***చిత్రం-22.13 ఆగ్రాలోని నదీముఖ ఉద్యానవనంలో పునర్నిర్మాణంలో ఉన్న భాగపు చిత్రపటం. ప్రముఖుల, ఉద్యానవన భవనాలు యమునానదీ తీరానికి రెండువైపులా నిర్మితమయి ఉన్నాయి. దీనికి ఎడమవైపున తాజ్‌హమహల్ ఉంది.***

SCERT, TELANGANA




చిత్రం-22.14 ఆగ్రాలోని తాజ్‌మహల్

ఢిల్లీలోని ఎర్రకోటలో షాజహాన్ నూతనంగా నిర్మించిన న్యాయస్థానం రాజ న్యాయానికీ, సామ్రాజ్య ఆస్థానానికీ మధ్యగల సంబంధాలను నొక్కి వక్కాణిస్తుంది. వసారాలో రాజసింహాసనం వెనక వైపు దైవసంబంధిత పీట్రాడ్యురా చిత్రాలు, గ్రీకు దేవుడైన ఆర్ఫియస్ వేణువును వాయిస్తున్నట్టుగా ఉంది. క్రూరమైన జంతువులు కూడా విభేదాలు మాని శాంతియుతంగా కలిసి ఉండేలా ఆర్ఫియస్ సంగీతం చేసిందని నమ్మకం. షాజహాన్ కొలువుకూటం, రాజు చేసే న్యాయం పేదలనూ, ధనికులనూ సమానంగా పరిగణిస్తుందనీ వాళ్ళు శాంతియుతంగా జీవించాలని తెలిపేలాగ నిర్మాణమయి ఉంది.

షాజహాన్ పరిపాలనా కాలంలో రాజధాని నగరమైన ఆగ్రాలో ప్రముఖులు వారి గృహాలను యమున నది ఒడ్డుపైన నిర్మించుకున్నారు. ఈ గృహాలు చార్‌బాగ్ మధ్యలో ఉండేవిధంగా నిర్మాణమయ్యాయి. చరిత్రకారులు ఈ చార్‌బాగ్‌ను నదీముఖ ఉద్యానవనంగా వర్ణించారు. ఇందులోని నివాస స్థలాలు చార్‌బాగ్ మధ్యలో కాకుండా నదీ తీరానికి దగ్గరగా ఉద్యానవనానికి చివరన నిర్మించబడ్డాయి.

ప్రపంచ ఖ్యాతి చెందిన తాజ్‌మహల్‌ను షాజహాన్ యమునానదికి ఎదురుగా ఉన్న ఉద్యానవనంలో నిర్మించాడు. ఇక్కడ నది అంచున ఎత్తైన వేదికపై పాలరాతితో నిర్మించిన సమాధి ఉంది. ఇదే నేటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తాజ్‌మహల్. చార్‌బాగ్ నమూనా ఉద్యానవనం దీనికి దక్షిణాన ఉంది. ఉన్నత వంశీయులు నదికి వెళ్ళే దారిమీద నియంత్రణ సాధించడానికి ఇలాంటి నిర్మాణ విధానాన్ని ఎన్నుకొని ఉంటారు. ఢిల్లీలో కొత్తగా కట్టిన షాజహానాబాద్ నగరంలో కూడా నిర్మించిన రాజభవనం నదికి అభిముఖంగా ఉంది. షాజహాన్ పెద్ద కుమారుడైన దారాషుకో వంటి ఉన్నతులకు మాత్రమే నది అందుబాటులో ఉండేది. మిగిలిన వారందరూ తమ ఇళ్ళను యమునా నదికి దూరంగా ఉన్న నగరంలో కట్టుకున్నారు.

- మీరు వెదురు కర్రలను తాళ్ళతో కట్టి ఉన్న పరంజా మీద భూమి నుండి 50 మీటర్ల ఎత్తులో నిలబడి పని చేస్తున్నారు. కుతుబ్‌మినార్‌లోని మొదటి అంతస్తులో ఒక శాసనాన్ని ఉంచాలి. దీన్ని ఎలా పెడతారో వివరించండి.




చిత్రం-22.15 జోదాబాయి రాజమందిరం ఫతేపూర్ సిక్రి పైకప్పును అలంకరించిన స్తంభాలతో ఉంది. ఇది గుజరాత్ నిర్మాణ సంస్కృతిని తెలియజేస్తుంది.

SCERT, TELANGANA

దాదాపు ఇదే సమయంలో గోల్కొండ పాలకులైన కుతుబ్‌షాహీలు కూడా మొఘలుల మాదిరిగా హైదరాబాద్‌లో హుస్సేన్‌సాగర్ చెరువు, గోల్కొండ కోట, ఫౌంటేన్‌లు, నీటి మార్గాలతో కూడిన ఎన్నో ఉద్యానవనాలు, సుందరమైన సమాధుల వంటి విస్తృతమైన భవన నిర్మాణ కార్యకలాపాలను చేపట్టారు. ఈ కట్టడాలలో పర్షియన్, మొఘలు, దక్కన్‌ల నిర్మాణశైలులు మిళితమై ఉన్నాయి. ప్రసిద్ధ కట్టడాలైన చార్మినార్, మక్కా మసీదులను వీరే నిర్మించారు.


*చిత్రం-22.16(ఎ) హయత్ భక్షీ బేగమ్ సమాధి*


*చిత్రం-22.16 కుతుబ్‌షాహి సమాధుల దృశ్యం*


*చిత్రం- 22.16(బి)*
*కుతుబ్‌షాహి సమాధుల నిర్మాణ శైలి*

**కీలకపదాలు :**

1) శాసనాలు 2) స్మారక కట్టడాలు 3) రాజవంశం
4) నిర్మాణ శిల్పకళ 5) పట్టాభిషేక మహోత్సవం

## మీ అభ్యసనాన్ని మెరుగుపరుచుకోండి

J1V4D2

1) నిర్మాణక్రమంలో ట్రాబీట్ సూత్రానికీ, ఆర్క్యుయేట్ సూత్రానికీ గల భేదమేమిటి?
2) శిఖరం అంటే ఏమిటి?
3) మొగలుల ఉద్యానవనంలోని చార్‌బాగ్ ముఖ్య లక్షణాలు ఏవి?
4) రాజు ప్రాముఖ్యాన్ని దేవాలయం ఎలా తెలుపుతుంది?
5) పేజి నెం 198 లోని 2వ పేరాను చదివి, వ్యాఖ్యానించండి.
6) మీ గ్రామంలోగానీ పట్టణంలోగానీ ఎవరిదైనా విగ్రహంగానీ లేదా వారి జ్ఞాపకార్థం కట్టిన భవంతిగానీ ఉందా? దాన్ని ఎందుకు పెట్టారు? దానివల్ల ప్రయోజనం ఏమిటి?
7) మీ ప్రాంతంలోని ఏదైనా ఒక పార్కునుగానీ, ఉద్యానవనాన్నిగానీ సందర్శించి మొగలుల కాలంనాటి ఉద్యానవనాలకూ వీటికీ గల పోలికలను, తేడాలను గుర్తించండి.
8) భారతదేశ పటంలో ఈ కింది ప్రదేశాలను గుర్తించండి.

అ. ఢిల్లీ ఆ. ఆగ్రా ఇ. అమృత్‌సర్ ఈ. తంజావూర్ ఉ. హంపి ఊ. యమునా నది

# విద్యా ప్రమాణాలు (Academic Standards)

**పుస్తకంలో ఇచ్చిన విషయాన్ని విద్యార్థులు అవగాహన చేసుకోదానికి తగినంత సమయం వెచ్చించాలి. మధ్యమధ్యలో ప్రశ్నలు వేయడం ఇందుకు దోహదపడతాయి. హేతువు, కారణకార్యాలు, సమర్థన, మానసిక పటం/భావనల పటం, పరిశీలన, విశ్లేషణ, ఆలోచన, ఊహ, సమాలోచన, వ్యాఖ్యానం వంటి వాటికి సంబందించి ఈ ప్రశ్నలు ఉండాలి. ప్రతి అధ్యాయంలోను అంశాలవారిగా కీలక భావనలను చర్చించారు. కీలక పదాలను కూడా ఇచ్చారు.**

### 1) విషయావగాహన (Conceptual Understanding) (AS1):

ప్రశ్నించడం, చర్చించడం, సమాలోచన, కేస్ స్టడీల ద్వారా ఉదాహరణలు, వ్యాఖ్యానించడం, పరిశీలించడం, వంటి వాటి ద్వారా కీలక భావనలను నేర్చుకోవడాన్ని ప్రోత్సహించవచ్చు.

### 2) పాఠ్యాంశాన్ని (ఇచ్చిన) చదివి, అర్థం చేసుకుని, వ్యాఖ్యానించడం (Reading the text(given), Understanding and Interpretation) (AS2):

రైతులు, కర్మాగారాలలోని కార్మికులకు సంబంధించి కొన్ని కేస్‌స్టడీలు, పాఠ్యపుస్తకంలో ఉపయోగించిన కొన్ని చిత్రాలు వంటివి నేరుగా భావనను తెలియజేయవు. ముఖ్య భావనలను విద్యార్థులు అర్థం చేసుకోటానికి, చిత్రాలను వ్యాఖ్యానించటానికి తగినంత సమయం కేటాయించాలి.

### 3) సమాచార నైపుణ్యాలు (Information Skills) (AS3):

సామాజిక శాస్త్రంలోని వివిధ అంశాల అధ్యయనానికి కేవలం పాఠ్యపుస్తకాలు సరిపోవు. ఉదాహరణకు పట్టణ ప్రాంతంలో ఉంటున్న విద్యార్థులు తమ ప్రజా ప్రతినిధుల గురించి, గ్రామీణ ప్రాంతంలో ఉంటున్న విద్యార్థులు తమ ప్రాంతంలో సాగునీటి సౌకర్యాలు, చెరువుల గురించి సమాచారం సేకరించవచ్చు. విద్యార్థులు సేకరించిన సమాచారం పాఠ్యపుస్తకంలో ఉన్న దానితో పూర్తిగా సరిపోలక పోవచ్చు, దీనిని వివరించాలి. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు సేకరించిన సమాచారాన్ని తెలియజేయడం కూడా ఒక ముఖ్యమైన నైపుణ్యం. ఉదాహరణకు ఒక చెరువు గురించి సమాచారం సేకరించి ఉంటే దాని లిఖిత నివేదికతోపాటు ఒక చిత్రమో, పటమో జతపరచాలనుకోవచ్చు లేదా సమాచారాన్ని పోస్టర్లు, బొమ్మల రూపంలో ప్రదర్శించవచ్చు. సమాచార సేకరణ, రికార్డులు/పట్టికలలో క్రోడీకరించటం, విశ్లేషణ, నిర్ధారణ వంటివి సమాచార నైపుణ్యాల కిందికి వస్తాయి. ప్రాజెక్టు పనులు నిర్వహించగలగాలి.

### 4) సమకాలీన అంశాలపై (సామాజిక, సాంఘిక) ప్రతిస్పందన - ప్రశ్నించడం (Reflection on contemporary issues and questioning) (AS4):

విద్యార్థులు తమ తమ జీవన విధానాలను వివిధ కాలాలలోని, వివిధ ప్రాంతాలలోని ప్రజల జీవన విధానాలతో సరిపోల్చి, భేదాలకు గల పలు కారణాలను సూచించుటను, నిర్ధారించుటను మరియు వానిపై వ్యాఖ్యానించునట్లుగా ప్రోత్సహించాలి.

### 5) పట నైపుణ్యాలు (Mapping Skills) (AS5):

పాఠ్య పుస్తకంలో అనేక రకాల పటాలు, చిత్రాలు ఉన్నాయి. ఒక ప్రదేశానికి సంబంధించి నైరూప్య ప్రతిబింబమైన పటాల అధ్యయన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ముఖ్యం. ఈ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడంలో అనేక దశలు ఉన్నాయి. తరగతి గది పటం తయారు చేయడం, పటంలో దూరం, ఎత్తులను చూపించే విధానాన్ని అర్థం చేసుకోవడం. ఈ పాఠ్యపుస్తకంలో బొమ్మలు, పోస్టర్లు ఫోటోలను ఉపయోగించాం. పుస్తకాన్ని అందంగా తీర్చిదిద్దడం కోసం కాకుండా వీటికి, పాఠ్యాంశానికీ సంబంధం ఉంది. కొన్ని సార్లు వీటికి సంభందించి కొన్ని కృత్యాలు కూడా ఉన్నాయి. ఉదా: బొమ్మకి శీర్షిక రాయటం, భవన నిర్మాణ చిత్రాలను చదవటం మొదలైనవి.

### 6) ప్రశంస, సున్నితత్వం (Appreciation and sensitivity) (AS6) :


భాష సంస్కృతి, కులం, మతం, లింగబేధం వంటి విషయాల్లో మన దేశంలో ఎంతో వైవిధ్యత ఉంది. సాంఘిక శాస్త్రం ఈ భిన్నత్వాన్ని పరగణనలోకి తీసుకోవాలని, ఈ తేడాల పట్ల సున్నితంగా ఉండాలని విద్యార్థులను ప్రోత్సహిస్తుంది.

SCERT, TELANGANA

# అనుబంధం

ఈ అదనపు సమాచారము మరియు పటాలను అవసరమైన సందర్భంలో ఉపయోగించండి.

ప్రపంచ రాజకీయ పటం




SCERT TELANGANA

# భారతదేశ నైసర్గిక స్వరూప పటం





SCERT TELANGANA

# ప్రపంచ అవుట్‌లైన్ పటం




SCERT, TELANGANA

## తెలంగాణ రాజకీయ పటం



SCERT TELANGANA

# తెలంగాణ రాష్ట్ర చిహ్నాలు

| క్ర.సం | రాష్ట్ర చిహ్నం | సాధారణ నామము | తెలుగు పేరు |
|---|---|---|---|
| 1. | రాష్ట్ర జంతువు | జింక | జింక |
| 2. | రాష్ట్ర పక్షి | ఇండియన్ రోలర్ | పాలపిట్ట |
| 3. | రాష్ట్ర చెట్టు | జమ్మి చెట్టు | జమ్మి చెట్టు |
| 4. | రాష్ట్ర పుష్పం | తంగేడు పుష్పము | తంగేడు పువ్వు |


రాష్ట్ర జంతువు


రాష్ట్ర పక్షి


రాష్ట్ర చెట్టు


రాష్ట్ర పుష్పం


రాజ ముద్ర

# భారతదేశ జాతీయ చిహ్నాలు

**జాతీయ జెండా :**
రూపకర్త –
శ్రీ పింగళి వెంకయ్య



**జాతీయ రాజ ముద్ర :**
సార్‌నాథ్ వద్ద ఉన్న అశోకుని ధర్మ స్థూపములోని మూడు సింహాల గుర్తు నుండి తీసుకొనబడినది.





**జాతీయ వృక్షం :**
మర్రి చెట్టు

**జాతీయ పుష్పము :**
తామరపువ్వు



**జాతీయ భాష :**
హిందీ






**జాతీయ ఫలము :**
మామిడిపండు



**జాతీయ నది :**
గంగ

**జాతీయ జంతువు :**
రాయల్ బెంగాల్ పులి



**జాతీయ గీతం :**
శ్రీ రవీంద్రనాథ్ ఠాగూర్‌చే రచించబడినది.

జన
గణ
మన...





**జాతీయ పక్షి :**
నెమలి

**జాతీయ జలచర జంతువు :** డాల్ఫిన్






**జాతీయ ప్రార్థన:** వందేమాతరం శ్రీ బంకిం చంద్ర ఛటర్జీచే రచించబడినది.

**జాతీయ క్యాలెండరు :** శక సంవత్సరం ఆధారితము (చైత్ర మాసం నుండి ఫల్గుణ మాసం వరకు).ప్రపంచ దేశముల వలనే గ్రెగరియన్ క్యాలెండరును అధికార క్యాలెండరుగా ఉపయోగిస్తాము.

Indian National Calendar (Saka calendar)

| S. No. | Month | Length | Start date (Gregorian calendar) | Ritu | Season |
|---|---|---|---|---|---|
| 1 | Chaitra | 30/31 | March 22 | Vasanta | Spring |
| 2 | Vaishākh | 31 | April 21 | | |
| 3 | Jyaishtha | 31 | May 22 | Grishma | Summer |
| 4 | Āshādha | 31 | June 22 | | |
| 5 | Shrāvana | 31 | July 23 | Varsha | Monsoon |
| 6 | Bhādrapad | 31 | August 23 | | |
| 7 | Āshwin | 30 | September 23 | Sharat | Autumn |
| 8 | Kārtik | 30 | October 23 | | |
| 9 | Agrahayana | 30 | November 22 | Hemant | Winter |
| 10 | Paush | 30 | December 22 | | |
| 11 | Māgh | 30 | January 21 | Sishira | Cold & dewy season |
| 12 | Phālgun | 30 | February 20 | | |



**జాతీయ వారసత్వ జంతువు :** ఏనుగు

**భారత ప్రామాణిక కాలము :**
82 1/2 డిగ్రీల తూర్పు రేఖాంశ ఆధారితము. గ్రీన్విచ్ ప్రామాణిక కాలము కన్నా మనదేశ కాలము 5 గం.30ని.లు. ముందు ఉంటుంది.



SCERT TELANGANA

## శాతవాహన రాజుల కాలక్రమ పట్టిక
**(230 క్రీ.పూ. - 225 క్రీ.శ.)**

| | |
|---|---|
| శ్రీముఖుడు | క్రీ.పూ.271 – క్రీ.పూ.248 |
| కృష్ణుడు | క్రీ.పూ.248 – క్రీ.పూ.230 |
| శాతకర్ణి – I | క్రీ.పూ.230 – క్రీ.పూ.220 |
| శాతకర్ణి – II | క్రీ.పూ.184 – క్రీ.పూ.128 |
| హాలుడు | క్రీ.శ.42 – క్రీ.శ.51 |
| గౌతమీపుత్ర శాతకర్ణి | క్రీ.శ.62 – క్రీ.శ.86 |
| వశిష్ఠపుత్ర పులోమావి | క్రీ.శ.86 – క్రీ.శ.114 |
| శివశ్రీ శాతకర్ణి | క్రీ.శ.114 – క్రీ.శ.128 |
| యజ్ఞశ్రీ శాతకర్ణి | క్రీ.శ.128 – క్రీ.శ.157 |

## చోళ రాజుల కాలక్రమ పట్టిక
**(900 క్రీ.శ. - 1279 క్రీ.శ.)**

| | |
|---|---|
| విజయాలయుడు | క్రీ.శ.850 – క్రీ.శ.871 |
| ఆదిత్యచోళుడు | క్రీ.శ.871 – క్రీ.శ.905 |
| పరాంతక – I | క్రీ.శ.905 – క్రీ.శ.907 |
| రాజరాజ – I | క్రీ.శ.985 – క్రీ.శ.1016 |
| రాజరాజచోళుడు | క్రీ.శ.1016 – క్రీ.శ.1044 |
| రాజాధిరాజ | క్రీ.శ.1044 – క్రీ.శ.1052 |
| వీరరాజేంద్రుడు | క్రీ.శ.1064 – క్రీ.శ.1069 |
| కుళుత్తోంగ చోళుడు | క్రీ.శ.1070 – క్రీ.శ.1121 |
| రాజరాజ – II | క్రీ.శ.1173 – క్రీ.శ.1178 |
| కుళుత్తోంగ చోళ –III | క్రీ.శ.1178 – క్రీ.శ.1219 |
| రాజేంద్ర– III | క్రీ.శ.1256 – క్రీ.శ.1270 |

## తెలంగాణ రాష్ట్ర వివరాలు

- ❖ విస్తీర్ణం : 1,12,077 చ.కి.మీ
- ❖ అక్షాంశాలు : $15^{0}46'$ – $19^{0}47'$
- ❖ రేఖాంశాలు : $77^{0}16'$ – $81^{0}43'$
- ❖ దేశము : భారతదేశము
- ❖ ప్రాంతము : దక్షిణ భారతం
- ❖ అవతరణ దినము : 2 జూన్, 2014
- ❖ రాజధాని : హైదరాబాద్
- ❖ జిల్లాల సంఖ్య : 31

(ఆదిలాబాద్, కొమ్రంభీమ్, భద్రాద్రి, జయశంకర్, జోగులాంబ, హైదరాబాద్, జగిత్యాల, జనగామ, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, నల్గొండ, నాగర్‌కర్నూల్, నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, పెద్దపల్లి, రాజన్న, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్ పట్టణం, వరంగల్ గ్రామీణం, యాదాద్రి. )

- ❖ రాష్ట్ర భాష : తెలుగు, ఉర్దూ
- ❖ శాసనసభ స్థానాల సంఖ్య : 119
- ❖ శాసనమండలి స్థానాల సంఖ్య : 40
- ❖ లోక్‌సభ స్థానాల సంఖ్య : 17
- ❖ రాజ్యసభ స్థానాల సంఖ్య : 7
- ❖ ముఖ్య నదులు : గోదావరి, కృష్ణా, మంజీర, మూసి
- ❖ జిల్లా ప్రజాపరిషత్‌ల సంఖ్య : 9
- ❖ మండల ప్రజాపరిషత్‌ల సంఖ్య : 443
- ❖ మున్సిపల్ కార్పొరేషన్‌ల సంఖ్య : 6
- ❖ మున్సిపాలిటీల సంఖ్య : 38
- ❖ రెవెన్యూ మండలాల సంఖ్య : 464
- ❖ గ్రామ పంచాయతీల సంఖ్య : 8,778
- ❖ మొత్తం జనాభా (2011 జనాభా లెక్కల ప్రకారం) : 351.94 లక్షలు
- ❖ పురుషుల సంఖ్య : 177.04 లక్షలు
- ❖ స్త్రీల సంఖ్య : 174.90 లక్షలు
- ❖ లింగ నిష్పత్తి (ప్రతి 1000 మంది పురుషులకు స్త్రీల సంఖ్య) : 988
- ❖ జనసాంద్రత ( 1 చ.కి.మీ.) : 307
- ❖ అక్షరాస్యతా రేటు : 66.46%
- ❖ పురుషుల అక్షరాస్యతా రేటు : 74.95%
- ❖ స్త్రీల అక్షరాస్యతా రేటు : 57.92%

SCERT, TELANGANA

# ఆశించిన అభ్యసన ఫలితాలు

## సాంఘికశాస్త్రం

7వ తరగతి

## విద్యార్థులు ఇవన్నీ నేర్చుకుంటారు.....

- వరదల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన నివారణ చర్యల గురించి వివరిస్తారు.
- వైపరీత్యాలు ఏర్పడటానికి గల కారణాలను వివరిస్తారు.
- కాకతీయులు, మొఘలులు, విజయనగర రాజుల సైనిక వ్యూహాలు, పరిపాలన గురించి వివరిస్తారు.
- వివిధ దేవాలయాలు, సమాధులు మరియు మసీదుల నిర్మాణానికి అవలంబించిన వివిధ అభివృద్ధి రీతులు మరియు సాంకేతికతను గురించి వివరిస్తారు.
- వివిధ మత ఉద్యమాల ఆవిర్భావానికి దారితీసిన కారణాలు విశ్లేషిస్తారు.
- తమ స్వంత నియోజక వర్గం యొక్క ప్రదేశమును రాష్ట్రపటంలో గుర్తిసార్తు.
- పటాలను వర్గీకరించి, వాటి ఉపయోగాలను వివరిస్తారు.
- ఎత్తైన ప్రాంతంలో పల్లపు ప్రాంతాలలో నివసించే ప్రజల జీవన విధానంలోని వ్యత్యాసాలను పట్టికగా తయారు చేస్తారు.
- జల చక్రాన్ని వివరిస్తారు.
- చేపలు పట్టేవారి జీవన స్థితిగతులపై ప్రతిస్పందిస్తారు.
- ఐరోపాలో ప్రవహించే నదుల వివరాలు సేకరించి పట్టిక రూపొందిస్తారు.
- ఆఫ్రికాలోని ఎడారులను ఆఫ్రికా పటంలో గుర్తించి, వాటి గురించి వివరిస్తారు.
- బాలకార్మిక వ్యవస్థపై కరపత్రాన్ని తయారు చేస్తారు.
- పారిశ్రామికీకరణ వల్ల ఉత్పత్తి రంగంలో వచ్చిన మార్పులను విశ్లేషిస్తారు.
- 1857 తిరుగుబాటుకు గల కారణాలను వివరిస్తారు.
- రాష్ట్ర శాసన సభలో చట్టాల తయారీ విధానాన్ని వివరిస్తారు.
- ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికుల స్థితిగతులను వివరిస్తారు.
- దేవాలయాల విధ్వంసంపై ప్రతిస్పందిస్తారు.

విద్య మా హక్కు
సర్వశిక్షా అభియాన్

పాఠశాల విద్యా శాఖ,
తెలంగాణ ప్రభుత్వం

एन सी ई आर टी
NCERT

SCERT TELANGANA

# ఈ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోటానికి











SCERT, TELANGANA